


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 198

గురువారం 9-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సఫారీతో సవాల్‌కు సై

నేడు వైజాగ్‌లో దక్షిణాఫ్రికా జట్టుతో భారత మహిళల జట్టు 'ఢీ' -16లో



బంగారం @ 1,26,600

మరో రూ.2,600 పెరుగుదల..
రూ.1,57,000కు చేరిన వెండి -17లో

adani

గౌరవనీయ ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీగారికి

నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించినందుకు మా కృతజ్ఞతలు

8 అక్టోబర్ 2025 నాటికి ఈ విజన్‌ని వాస్తవంలోకి తీసుకురావడంలో మాకు సహాయం చేసినందుకు మహారాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రజలు, అలాగే (వారితో పాటు) మా పార్ట్‌నర్స్ ఇంకా టీంల మార్గదర్శకత్వం మరియు మద్దతుకు కూడా మేము కృతజ్ఞులం. అదానీ గ్రూప్‌లో మహారాష్ట్ర ఇంకా మన దేశ అభివృద్ధి ప్రయాణంలో భాగస్తులైనందుకు గర్వంగా ఉంది.

భారతదేశం స్ఫూర్తిదాయకం. ప్రపంచం మెచ్చుకుంటుంది.





“ డ్యాన్స్‌ను 'కాస్త సరదా కోసం' అన్నట్లుగానే పరిగణిస్తాం. నృత్యానికి, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉందని చెబుతున్నాయి అధ్యయనాలు. 'నృత్యం వల్ల యువకులతో పాటు వృద్ధులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది' అంటుంది 'న్యూరోసైన్స్ అండ్ బయోబిహేవియరల్ రివ్యూస్‌లో ప్రచురితమైన ఒక అధ్యయన పత్రం. నృత్య శిక్షణ తీసుకున్న ఆరునెలల్లోనే కొందరిలో సానుకూల మార్పు రావడాన్ని కూడా ఈ అధ్యయన పత్రంలో ప్రస్తావించారు. ”



● అసామాన్యురాలు



మల్లమ్మ మాట పల్లె పదాల మూట

తెలంగాణలో గంగవ్వ ఎలాగో కర్నాటకలో మల్లమ్మ అలాగ. కన్నడ భాషలోని పల్లె పలుకుబడిలో వర్తమాన విషయాలపై మల్లమ్మ చేసే వ్యంగ్య వ్యాఖ్యానానికి చాలామంది ఫాలోయెర్స్ ఉన్నారు. ఆమె 'మల్లమ్మ టాక్స్' యూట్యూబ్ చానల్‌కు 50 వేల మంది సబ్‌స్క్రయిబర్స్. అందుకే ఆమెకు కన్నడ బిగ్‌బాస్‌లో పిలుపు వచ్చింది. మారుమూల పల్లెల్లో ఉన్నామని చిన్నబుచ్చుకోక గంగవ్వలా, మల్లమ్మలా ఎవరైనా వెలగొచ్చు.

కిచ్చా సుదీప్ హోస్ట్ చేస్తోన్న 'కన్నడ బిగ్‌బాస్ 12'వ సీజన్ ప్రారంభమైంది. అన్ని బిగ్‌బాస్ షోలకు ఉన్నట్టే అక్కడా దానికి ఒక క్రేజ్ ఉంది. ప్రతిసారీ హౌస్‌లోకి వచ్చేవారు ఎవరా అనే కుతూహలం ఉంటుంది. ఈసారి హౌస్‌లోని అభ్యర్థుల్లో పాపులర్ వ్యక్తులు చాలా మందే ఉన్నారు. అయితే వారందరిని మించి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న వ్యక్తి ఒకరు ఉన్నారు. ఆమే మల్లమ్మ అలియాస్ 'మటిన మల్లి' (మాటల రాణి– ఆమెను అభిమానంగా పిలుచుకునే పేరు). బిగ్‌బాస్‌లో అందరికంటే ఎక్కువ వయసు మల్లమ్మదే. 70 ఏళ్లు. మల్లమ్మ సరళమైన జీవనశైలి, హాస్యం, గ్రామీణ జీవితంపై ఆమె చేసే కంటెంట్ సోషల్ మీడియాలో ఆమెను వైరల్‌గా మార్చాయి. ఇక్కడ బిగ్‌బాస్‌లో ఎలాగైతే తెలంగాణ గంగవ్వకు చోటు లభించిందో ఆమెకు అలా అక్కడ చోటు లభించింది. బిగ్‌బాస్‌లో పాల్గొన్న గంగవ్వ ఆ షో పుణ్యమా అని సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోగలిగింది. మరి మల్లమ్మకు ఏం ప్రయోజనం కలుగుతుందో చూడాలి.

కథలు చెప్పే మల్లమ్మ

ఉత్తర కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా సురపుర గ్రామానికి చెందిన మల్లమ్మ మంచి మాటకారి. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్. ఆమె వీడియోలకు లక్షల్లో వీక్షకులున్నారు. ఆమె సోషల్ మీడియా ప్రయాణం విచిత్రంగా మొదలైంది. ఆమె గతంలో బెంగళూరులోని ఓ ఫ్యాషన్ డిజైన్ కంపెనీలో పని చేసింది. ఆమె మంచి టైలర్. ఆ సమయంలో స్టోర్ యజమానులను ఇంటర్వ్యూ చేసి ఆ వీడియోలను అప్‌లోడ్ చేసింది. అవి పాపులర్ కావడంతో ఇతర అంశాలపైనా దృష్టి సారించి, మరిన్ని వీడియోలు చేసింది. పల్లెటూరి పనులు, వంటలు, షాపుల్లో పల్లెజనం బేరసారాలు చేసే తీరు, జాతరలు ఇవన్నీ యథాతథంగా ఎలా ఉంటాయో ఆమె చూపడం వల్ల ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఇన్‌స్టాగ్రామ్‌కు 1.83 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. మల్లమ్మ అప్పుడప్పుడూ సరదా కథల్ని కూడా తన వీడియోల్లో పంచుకుంటోంది. ఇంత పాపులారిటీ ఉండటం వల్ల సహజంగానే బిగ్‌బాస్ షోకు ఆహ్వానం అందింది. హోస్ట్ సుదీప్‌తో ఆమె మాట్లాడుతూ బిగ్‌బాస్ హౌస్ నియమాల గురించి తనకేమీ తెలియదని అన్నారు. 'మల్లమ్మ ఎప్పుడూ తనంతట తానుగా జీవితాన్ని గడిపే వ్యక్తి' అని సుదీప్ అన్నారు. మల్లమ్మకు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

ప్రశంసలతోపాటు వివాదాలు

మల్లమ్మ చేసిన వీడియోలకు అనేక ప్రశంసలు వచ్చాయి. ఒక్క వీడియో మాత్రం తీవ్రమైన విమర్శలు మూటగట్టుకుంది. ఒక తెలుగు సినిమాలోని పాట గురించి ఆమె మాట్లాడిన మాటలతో అనేకమంది తీవ్ర విమర్శలు చేశారు. దీంతో తన అకౌంట్‌ను మూసివేయాలని అనుకున్నట్లు ప్రకటించింది. అయితే అలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఆమె అభిమానులు ఆమెను ఒప్పించారు. అలా ఆమె వీడియోల్లో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. విక్కీ కౌశల్ 'తౌబా తౌబా' డ్యాన్స్, ఉర్ఫీ జావేద్ డ్రెస్సింగ్ స్టైల్, ఉత్తర భారతదేశ వంటలు, వైరల్ రీల్స్.. ఇలా అన్నింటి గురించి ఆమె వీడియోలు చేసింది. అయితే ప్రస్తుతం కన్నడ బిగ్‌బాస్ షో తాత్కాలిక కష్టాల్లో పడింది. పర్యావరణ అనుమతులు లేవని పోలీసులు బిగ్‌బాస్ హౌస్‌ను మంగళవారం సాయంత్రం సీజ్ చేసి కంటెస్టెంట్‌లను ఒక రిసార్ట్‌కు తరలించారు. బిగ్‌బాస్ హౌస్‌లో నుంచి బయటకు వచ్చే మురుగు నీరు, వ్యర్థ పదార్థాల గురించి తగిన జాగ్రత్తలు తీసుకోలేదని నిర్వాహకుల మీద అధికారులు చర్యలు చేపట్టారు. ఎంతో సంతోషంగా హౌస్‌లో అడుగు పెట్టిన మల్లమ్మ ప్రస్తుతం రిసార్ట్‌కు చేరింది. అయితే సమస్య అతి త్వరలో సద్దుమణిగి షో కొనసాగుతుందనే అభిమానులు ఆశిస్తున్నారు.

గ్రామీణ ‘మహిళా చిత్రం’



చిత్రీకరించిన సినిమాను ఎడిటింగ్ చేస్తూ...

బాల్య వివాహాల సంకెళ్లలో చిక్కుకుని, కష్టాల పాలైన అజ్మీర్ గ్రామీణ మహిళలు చిన్న సినిమాలను రూపొందిస్తున్నారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా ఈ గ్రామీణ మహిళలు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకొని, మహిళా కార్మికుల దయనీయ జీవితాలు, గృహహింసపై అవగాహన కల్పించే ప్రయత్నం చేయడమే కాదు, చాలా వరకు విజయం సాధించారు కూడా.

వీరు తమ ఆలోచనలను సినిమా రూపకంగా గ్రామీణుల ముందుకు తీసుకువచ్చి, సరికొత్త జీవన విధానం గురించి అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ రంగంలో నైపుణ్యం సాధించిన ఈ మహిళలు ట్రైనర్లుగా మారి మారుతున్న గ్రామీణ భారతానికి ఉదాహరణగా నిలుస్తున్నారు.

రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో అత్యంత సామాన్యంగా ఉండే రెండంతస్తుల భవనం అది. అక్కడ ప్రతి ఉదయం ఒక నిశ్శబ్ద విప్లవం మేలుకొంటుంది. అన్ని వయసుల మహిళలు అక్కడ కనిపిస్తారు. వారంతా బాల్యవివాహాల సంకెళ్ల బందీలే. నేడు ఆ మహిళలు బాలికలకు సాధికారత కల్పించడానికి మహిళా జన అధికార్ సమితి కార్యాలయంలోకి అడుగుపెడుతున్నారు. వీరంతా కెమెరాలు తీసుకొని షూటింగ్‌లకు వెళుతున్నారు. మరికొందరు తమ సినిమాలను ఎడిట్ చేయడానికి కంప్యూటర్ స్క్రీన్‌ల ముందు ఉంటున్నారు. అంతా కలిసి, వారు నూతన భవిష్యత్తుకు ఒక్కొక్క ఫ్రేమ్‌ని స్క్రిప్ట్ చేస్తున్నారు.

డిజిటల్ అక్షరాస్యత

మహిళా జన అధికార్ సమితి ఆఫీసులో 30 మందికి పైగా మహిళలు చిత్ర నిర్మాణం, ఎడిటింగ్ నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు. వారి కుటుంబాలలో కెమెరా పట్టుకొని ప్రపంచంపై దృష్టి సారించిన మొదటి వ్యక్తులు వీరే. పాతికేళ్ల క్రితం భూమి హక్కుల కోసం, కులవివక్ష, బాల్య వివాహాలు, పరువు హత్యలకు వ్యతిరేకంగా పోరాడిన మహిళల నేతృత్వంలోని అట్టడుగు వర్గాల నుంచి ఈ మహిళా జన అధికార్ సమితి పుట్టుకు వచ్చింది. నేడు అక్కడి మూడు జిల్లాలలో ఈ సమితి తన ఉనికిని కొనసాగిస్తోంది. డిజిటల్ అక్షరాస్యత, నాయకత్వ కార్యక్రమాలు, లింగ సమానత్వం, గృహహింసపై దృష్టి సారించింది. మహిళల ఆందోళనలను వ్యక్తపరచడానికి, వారి జీవితాలలో, సమాజాలలో సానుకూల మార్పును తీసుకు రావడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది.

> డిజిటల్ యుగానికి అనుగుణంగా గ్రామీణ మహిళలకు నైపుణ్యాలను అందించడానికి ఎమ్‌జెఎఎస్ చేస్తున్న ప్రయత్నాల్లో ఈ ఫిల్మ్ మేకింగ్ కోర్సు ఒక భాగం. మొదట అన్వాద్ ఫిల్మ్స్ వీరికి శిక్షణ ఇచ్చింది. ఇప్పుడు డిజిటల్ రంగంలో అగ్రగామిగా ఉన్న పీర్ నేతృత్వంలోని మోడల్ విజయవంతం అయ్యింది. వీరి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలు ఇతరులకు ట్రైనింగ్ ఇస్తున్నారు.

గ్రామీణ మహిళ చేతిలో కంప్యూటర్ స్క్రీన్...

మహిళా జన అధికార్ సమితి ఆఫీసులోకి వెళ్లి చూస్తే – ఎడిట్ రూమ్‌లో 19 ఏళ్ల మంజు రావత్ దీక్షగా తన డెస్క్‌టాప్‌పైన సినిమాను ఎడిట్ చేస్తూ కనిపిస్తుంది. రెండేళ్ల క్రితం ఈ ఎన్జీవోలో చేరినప్పుడు ఆమె ఏకైక లక్ష్యం డిజిటల్ అక్షరాస్యత పొందడం. అయితే స్క్రిప్ట్, ఇంటర్వ్యూ, కెమెరా వర్క్‌తో సహా మహిళలకు ఫిల్మ్ మేకింగ్ నేర్పించాలని సంస్థ తీసుకున్న నిర్ణయం ఆమెలో ఆసక్తిని కలిగించింది. 'కంప్యూటర్‌ను ఎలా ఉపయోగించాలో నేర్చుకోవడానికి మొదట మా ఇంటి నుండి బయటకు వచ్చినప్పుడు, అందరూ నన్ను చూసి నవ్వారు. నా కుటుంబంతో పాటు ఇరుగు పొరుగువాళ్ల 'ఆమె ఎలా తిరుగుతుందో చూడండి' అనేవారు. కానీ, వారి మాటలను పట్టించుకోలేదు' అని చెబుతుంది. నాలుగేళ్ల వయసులోనే 20 ఏళ్ల వాడితో ముడిపెట్టిన ఛాందస కుటుంబం నుండి వచ్చిన రావత్ ఇప్పుడు తన లాంటి మహిళల సమస్యలపైన దృష్టి సారిస్తూ షార్ట్ ఫిలింలు తీసింది. రావత్ చెల్లెలు సంజు వయసు 19 ఏళ్లు. ఆమె, అజేసర్ గ్రామంలోని దినసరి కార్మికుల జీవితాలను చిత్రీకరించింది.

సవాళ్లను ఎదిరిస్తూ..

24 ఏళ్ల భగవతీ దేవికి 15 ఏళ్ల వయసులోనే పెళ్లయ్యింది. ఆమె తన గ్రామం భవానీ నుండి అజ్మీర్‌కు ప్రతిరోజూ 30 కి.మీ దూరం ప్రయాణించే భగవతీ దేవి ముసుగు ధరించే ఆచారం పైన, తగిన ధ్రువపత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాల నుండి మినహాయించిన సంచార జాతి ఘుమంతు తెగపై సినిమాలు నిర్మించింది.

ఈ కోర్సు నేర్చుకుంటున్న మహిళలందరూ ఒక్కొక్కరు ఒక్కో సినిమా తీశారు. వీరంతా పురుషుల నుంచి, కుటుంబాల నుంచి తీవ్రమైన అణచివేతను ఎదుర్కొన్నవారే. ఈ యేడాది మొదట్లో 23 ఏళ్ల సంత్రా చౌరాసియా, భగవతీ దేవి, మరో ఇద్దరు కిషన్‌గఢ్‌లో ఒక పెళ్లిని చిత్రీకరించారు. ఇది వారి మొదటి ప్రొఫెషనల్ ప్రాజెక్ట్. వీరు తీసిన సినిమాలను చూసిన స్థానిక మహిళలు సంతోషిస్తుండగా పురుషులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ''ఎన్ని సవాళ్లు ఉన్నప్పటికీ మేమంతా ఒక్కటిగా నడుస్తాం. ఏ అమ్మాయి అయినా మా డిజిటల్ క్లాసులకు రాలేకపోతే మేమే వారి ఇంటికి వెళ్లి వెంటబెట్టుకు వస్తాం. కుటుంబ ఒత్తిడి కారణంగా ఎవరూ ఈ డిజిటల్ చదువు మానేయకుండా చూసుకోవాలని మేమంతా నిర్ణయించుకున్నాం'' అని 22 ఏళ్ల మేరీ చెబుతోంది.

''గతంలో మా కాలనీలో ఎడిటింగ్ నేర్చుకోవడానికి ఇంటినుండి బయటకు వెళ్లే ఏకైక వ్యక్తిని నేనే. ఇప్పుడు చాలామంది మహిళలు నాతో చేరారు. ఇది మా సమష్టి విజయం' అని 21 ఏళ్ల ట్రైనర్ సమీరా బాను గర్వంగా చెబుతుంది.

స్థానికంగా మహిళలు ఎదుర్కొంటున్న రకరకాల సమస్యలపైన సినిమాలు తీస్తూ, వాటిని గ్రామంలో ప్రదర్శిస్తూ అవగాహన తీసుకువస్తున్నారు. మహిళాభివృద్ధికి ఏ విధంగా తోడ్పాటును అందించాలో తమ సినిమాల ద్వారా చూపుతున్నారు.

● బ్యూటిప్

ట్యాన్‌ను తరిమేస్తుంది

మూడు స్పూన్ల ముల్తాని మట్టిలో రెండు టీస్పూన్ల రోజ్‌వాటర్, మూడు టీస్పూన్ల పాలు పోసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్లలోకి పోకుండా ముఖానికి పూతలా వేయాలి. అరగంట తరువాత నీటితో కడిగేయాలి. వారానికి రెండు మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ట్యాన్ క్రమంగా పోతుంది. చర్మానికి విటమిన్ ఏ, తేమ అంది ఆరోగ్యంగా ఉంటుంది.





నైనా చౌహాన్, అనుశ్రీ శ్రీవాస్తవ, షీబా నాజ్

● ఎంపవర్‌మెంట్

తొంబై శాతానికి పైగా మహిళలే!

చిన్న పట్టణాలకు చెందిన ముగ్గురు మహిళలు మన దేశ బీమా రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. సంకల్పబలం కలిగిన ఆ మహిళలు... నైనా చౌహాన్, అనుశ్రీ శ్రీవాస్తవ, షీబా నాజ్.

ఈ ముగ్గురు మహిళలు మన దేశంలో తొలిసారి డిస్కౌంట్ ఆధారిత బీమా స్టార్టప్ 'షీల్డ్‌ష్యూర్ ఇన్సూరెన్స్' ప్రారంభించారు. థానే ప్రధానకేంద్రంగా ప్రారంభమైన ఈ స్టార్టప్‌కు నైనా చౌహాన్ ఫౌండర్, అనుశ్రీ శ్రీవాస్తవ కో ఫౌండర్, షీబా నాజ్ సీవోవో.

'ప్రతి భారతీయ కుటుంబానికి బీమాను అందుబాటులోకి తీసుకురావాలి' అనే లక్ష్యంతో స్టార్టప్ ప్రారంభించారు.

'మిగిలిన కంపెనీలతో పోల్చితే షీల్డ్‌ష్యూర్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది మహిళా సాధికారత పట్ల దాని బలమైన నిబద్ధత' అంటుంది కోఫౌండర్ అనుశ్రీ శ్రీవాస్తవ. 'షీల్డ్‌ష్యూర్'లో తొంబైశాతం మందికి పైగా ఉద్యోగులు మహిళలే కావడం విశేషం. క్షేత్రస్థాయిలో కూడా ఎక్కువమంది మహిళలే ఉండేలా చూసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

'మా లక్ష్యం బీమాను అందుబాటులోకి తీసుకు రావడమే కాకుండా భారతదేశం అంతటా మహిళలకు ఆర్థికస్వాతంత్ర్యాన్ని సృష్టించడం' అంటుంది ఫౌండర్ నైనా చౌహాన్.

ప్రతి బీమా పాలసీపై 5 శాతం నుండి 25 శాతం డిస్కౌంట్ కూపన్‌లను అందిస్తోంది షీల్డ్ ష్యూర్.

● సెల్ఫ్ మేడ్

ఒకప్పుడు... రోడ్డు పక్కన చిన్న సెలూన్ ఇప్పుడు... లగ్జరీ కారులో టూర్!

ఖరీదైన కార్లలో తిరిగే రమేష్ బాబు పేదరిక నేపథ్యం నుంచి వచ్చాడు. బెంగళూరుకు చెందిన రమేష్ తండ్రి బార్బర్‌గా పనిచేసేవాడు. రమేష్ ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. కుటుంబ భారాన్ని భుజాల కెత్తుకున్న తల్లి ఇండ్లలో పనిచేసేది. కుటుంబానికి ఆర్థిక ఆసరా కోసం చిన్న వయసు నుంచే న్యూస్‌ప్లేపర్లు అమ్మడం, పాలపాకెట్లు అమ్మడం లాంటి పనులు చేసేవాడు రమేష్.



హైస్కూల్ చదువు పూర్తయిన తరువాత పైచదువుల కోసం రోడ్డు పక్కన చిన్న సెలూన్ నడిపే వాడు. తాను పొదుపు చేసిన డబ్బుతో 1993లో మారుతి వ్యాన్ కొన్నాడు. అది తన జీవితానికి టర్నింగ్ పాయింట్ అయింది. ఈ వ్యాన్‌ను అద్దెలకు తిప్పేవాడు.

ఒక్కో మెట్టు ఎక్కుతూ 'రమేష్ టూర్స్ అండ్ ట్రావెల్స్' పేరుతో కార్ రెంటల్ కంపెనీ ప్రారంభించే స్థాయికి చేరుకున్నాడు.

రోల్స్–రాయిస్ ఘోస్ట్, బీఎండబ్ల్యూ, ల్యాండ్ రోవర్ డిఫెండర్... మొదలైన వాటితో తన కంపెనీని లగ్జరీ కార్ రెంటల్ సర్వీసెస్ స్థాయికి తీసుకువెళ్లాడు. ప్రస్తుతం కంపెనీ 400 వాహనాలను ఆపరేట్ చేస్తోంది. మన దేశానికి సంబంధించి లగ్జరీ ట్యాక్సీ సెగ్మెంట్‌లో రమేష్ బాబు మార్గదర్శిగా నిలిచాడు.

తాజాగా... రమేష్‌బాబు తన కంపెనీలోకి 3.2 కోట్ల విలువైన రేంజ్ రోవర్ వోగ్ లాంగ్ వీల్‌బేస్ తీసుకువచ్చాడు. రేంజ్‌రోవర్‌కు సంబంధించిన ఫోటోలను కంపెనీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేశారు. ఈ ఫోటోలలో తన కుటుంబ సభ్యులతో కనిపిస్తాడు రమేష్‌బాబు.

● మన(సు)లో మాట

మాన్పించబోయి బానిసనై పోయా!

నా వయస్సు 38. మా ఆయన పెద్ద బిజినెస్ మేన్. అనుభవించడానికి అన్నీ ఉన్నాయి. కానీ నేను ఎవరికీ చెప్పుకోలేని ఒక విష వలయంలో ఇరుక్కుపోయాను. మావారికి మొదటి నుంచి 'డ్రింక్ అలవాటుంది. ఆయన చేత ఆ అలవాటు మార్పించాలని ఎంతో ప్రయత్నించాను. 'బిజినెస్‌లో ఇలాంటివి తప్పవు. నాకోసం తాగకపోయినా, కంపెనీ కోసం తప్పదు' అని నా నోరు మూయించేవారు. పోనుపోను పగలు కూడా మందు పుచ్చుకుని ఆఫీసుకు పోవడం మొదలు పెట్టారు. ఎప్పుడూ ఫ్రెండ్స్, బిజినెస్ మీటింగ్స్, కేంప్స్ అని, ఏ తెల్లవారు జామునో ఇంటికి ఒళ్ళు తెలియని స్థితిలో వచ్చేవారు. బయట తాగొద్దు, అంతగా తాగాలని ఉంటే ఇంట్లోనే తీసుకోమని అంటే ఆయన నేను కూడా కంపెనీ ఇస్తే అలాగే చేస్తానన్నారు. ఆయన్ను కాపాడుకోవాలనే ఆరాటంలో రోజూ రాత్రి ఆయనతోపాటు కూర్చుని ఒక స్పూన్ విస్కీలో, ఒక బాటిల్ సోడా కలుపుకుని కంపెనీ ఇచ్చేదాన్ని. నేను, పోను నాకు తెలియకుండానే ఆయనతో సమానంగా డ్రింక్ తీసుకునే స్థాయికి వెళ్ళాను. ఒక హాఫ్ బాటిల్ ఒక రాత్రికి మా ఇద్దరికి సరిపోవడం లేదు. చివరకు ఆయన ఊర్లో లేకపోయినా, నేనొక్కదాన్నే ఇంట్లో తాగే పరిస్థితికి వచ్చాను. పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. ఇప్పటి వరకూ వారి కంటపడకుండా నెట్టుకుంటూ వచ్చాను. రేపు వారికి వారి తల్లి తాగుబోతని తెలిస్తే నా గతేమిటి! నేను ఈ వ్యసనం నుంచి బయట పడే మార్గం చెప్పండి.

– శకుంతల, విశాఖపట్నం

నిర్భయంగా మీ సమస్యను బయటపెట్టినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. విస్కీ ప్రవాహంలో కొట్టుకుపోతున్న మీవారిని రక్షించే దానికి మీ చేతినందించి, ఆయన్ను బయటకు లాగబోయి చివరకు మీరు కూడా ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. సరదా కోసం డ్రింక్ మొదలు పెట్టి అది ఒక సమస్యగా మారేవారు కొందరైతే, సహాయం చేసి మాన్పిద్దామని అందులో దిగి, ఇంకో కొత్త సమస్యను మీరు కొని తెచ్చుకున్నారు. ఒకసారి రుచి మరిగితే, నరనరాలు దానికోసం పరితపించి తనకు బానిసగా మార్చుకునే శక్తి ఉంది మద్యానికి. ఇంటికి పెద్ద దిక్కయిన మీరిద్దరూ ఈ వ్యసనానికి బానిసలయితే, చివరకు ఈ పరిస్థితి ఎటు వెళ్తుందో ఎంతటి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందో చెప్పలేము. ఆయన్ని మాన్పించడమేమో గాని, ముందు మీరు దీంట్లోంచి బయట పడటం, మీకుటుంబ శ్రేయస్సు దృష్ట్యా చాలా అవసరం. మీకు సిన్సియర్‌గా మారాలని ఉంటే తప్పకుండా మీ అలవాటును మాన్పించవచ్చు. ఆధునిక మానసిక వైద్య శాస్త్రంలో మద్యం అలవాటు మాన్పించేందుకు పవర్‌ఫుల్ మందులు, ఇతర మానసిక చికిత్సా పద్ధతులు ఉన్నాయి. 'తాగాలి'అనే తపన తగ్గించేందుకు 'యాంటి క్రేవింగ్ మెడిసిన్స్ మద్యం పైన అవర్షన్ కల్గించేందుకు 'డిటెరెంట్స్' అనే మందులు, ఈ అలవాటు నుండి బయటపడేందుకు అద్భుతంగా పని చేస్తున్నాయి. మీరు హాస్పిటల్లో సుమారు 2–3 వారాలు ఉండాల్సి వస్తుంది. మీ వారికి నచ్చచెప్పి మీరు వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ కండి. మీరు మారితే మిమ్మల్ని చూసి ఆయన కూడా వైద్యం చేయించుకోవడానికి ఇష్టపడవచ్చు. మీరే మానేస్తే ఆయన్ను బలవంతంగానైనా ఒప్పించేందుకు మీకు నైతిక బలం వస్తుంది. మీరు వెంటనే సైకియాట్రిస్ట్‌ని కలిసి మీ సమస్యను వివరించండి. మీ సమస్యను కాన్ఫిడెన్షియల్‌గా ఉంచి సరియైన వైద్యం చేస్తారు. ఆల్ ది బెస్ట్



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● పర్యావరణహిత



ప్రాజెక్ట్ ముంబై

పార్కులో ఆ పిల్లలు కూర్చున్న బెంచీ ఎంత అందంగా ఉందో చూడండి. అందమైన ఆ బొమ్మలతో పిల్లలు ఎంత సంతోషంగా ఆడుకుంటున్నారో చూడండి. పార్క్‌లో ఆహా అనిపించే అందమైన చెత్త బుట్టలు, వీక్షకుల చేత 'ఆహా' 'ఓహో' అనిపిస్తున్న ఈ అందమైన వస్తువుల పూర్వ రూపం... ప్లాస్టిక్ వ్యర్థాలు!

ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకురావడానికి ముంబైలోని స్వచ్ఛంద సంస్థ 'ప్రాజెక్ట్ ముంబై' ది ముంబై ప్లాస్టిక్ రీసైక్లోథాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చిన్నగా మొదలైన ఈ కార్యక్రమం ఉద్యమస్థాయికి చేరింది. వేలాదిమంది సాధారణ పౌరులు ఈ ఉద్యమంలో భాగం అవుతున్నారు.

'ప్రాజెక్ట్ ముంబై'కి చెందిన స్వచ్ఛంద సేవకులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తారు. విద్యార్థుల కోసం పాఠశాలలు, కాలేజీలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది ప్రాజెక్ట్ ముంబై. పౌరుల నేతృత్వంలో ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడానికి ఏర్పడిన అతి పెద్ద సంస్థగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది ప్రాజెక్ట్ ముంబై. ఇప్పటి వరకు 500 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్ వినియోగంలోకి తీసుకు వచ్చింది.

బులియన్

(బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 8న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	బంగారం (24 క్యారెట్లు)	1,25,500	బంగారం (24 క్యారెట్లు)	1,23,170	బంగారం (24 క్యారెట్లు)	1,25,500	బంగారం (24 క్యారెట్లు)	1,27,000	బంగారం (24 క్యారెట్లు)	1,24,200
బంగారం (22 క్యారెట్లు)	1,18,530	బంగారం (22 క్యారెట్లు)	1,12,900	బంగారం (22 క్యారెట్లు)	1,12,900	బంగారం (22 క్యారెట్లు)	1,16,280	బంగారం (22 క్యారెట్లు)	1,16,840	బంగారం (22 క్యారెట్లు)	1,13,850
వెండి	1,64,000	వెండి	1,58,000	వెండి	1,67,000	వెండి	1,58,000	వెండి	1,58,000	వెండి	1,67,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 198

గురువారం 9-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కెమిస్ట్రీలో ముగ్గురికి నోబెల్

మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధికి గుర్తింపు

- లోహ సేంద్రియ చట్రాలను (మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్) అభివృద్ధి చేసినందుకు రసాయన శాస్త్రంలో ముగ్గురు సైంటిస్టులకు నోబెల్ బహుమతి లభించింది. నూతన రూపంలో మాలిక్యులర్ ఆర్కిటెక్చర్‌ను వారు రూపొందించారు. 2025 సంవత్సరానికి గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం.యాఘీలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి అందజేయనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. - 6లో



న్యూస్‌రీల్

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిగా నవీన్‌యాదవ్ పేరును ప్రకటించింది. అనేక ఊహాగానాలు వినిపించినా చివరకు యువ నాయకుడు నవీన్ యాదవ్ వైపే అధిష్టానం మొగ్గు చూపింది.

- వివరాలు 7లో

ఎఫ్‌టీఏతో వృద్ధికి అద్భుత అవకాశాలు



భారత్–యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో భారత్‌లో వృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ చెప్పారు. ప్రగతికి ఇదొక లాంచ్‌ప్యాడ్ అని వెల్లడించారు.

- వివరాలు 6లో

మరో రెండ్రోజులు మోస్తరు వర్షాలు



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతున్నందున వర్షాలకు అనుకూల వాతావరణం ఉంటుంది.

- వివరాలు 18లో

రెండు దగ్గు మందులపై నిషేధం

- రాష్ట్రంలో ప్రమాదకరమైన రెండు దగ్గు మందులను ప్రభుత్వం నిషేధించింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో పలువురు చిన్నారుల మరణానికి కారణమైన రెండు దగ్గు మందులను ఉపయోగించకూడదని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ప్రజలకు స్పష్టం చేసింది. -18లో

గుడ్లు & చికెన్ ధరలు : హైదరాబాద్ జోన్

12 గుడ్ల రిటైల్ ధర ₹72

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 110 | బ్రాయిలర్ స్కిన్‌తో 191 | రిటైల్ లైవ్ బర్డ్ 132 | స్కిన్ లెస్ 218

నేడే నోటిఫికేషన్లు

తొలిదశ మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు జారీ

- జిల్లాల వారీగా ఎక్కడికక్కడ విడుదల చేయనున్న అధికారులు
- వెనువెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- మొదటి దశలో 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్
- ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడత జరిగే మండల, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవో, రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీపై అప్పటికప్పుడు స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో, ముందుగా నిర్ణయించిన ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్లు జారీ చేసేందుకు ఆటంకం లేకుండా పోయింది. దీంతో గురువారం.. తొలిదశలో ఎన్నికలు జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు జిల్లాల వారీగా అధికారులు ఎక్కడికక్కడ నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. మొత్తం 31 జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లాలు మినహాయించి) ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఖాళీల వివరాలతో అధికారులు ఇప్పటికే గెజిట్ విడుదల చేశారు. ఒక్కో దశకు ఆయా తేదీలకు అనుగుణంగా ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఆయా స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. ఈ ఎన్నికల నోటీసులు జారీ చేసిన రోజు కలిపితే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు మూడురోజుల పాటు అవకాశం ఉంటుంది.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి: మొదటి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియ గురించి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మిగతా 2వ పేజీలో ▶

నిలిపివేతకు హైకోర్టు నో

- స్థానిక ఎన్నికలపై మధ్యంతర ఉత్తర్వులకు విముఖత
- అందరి వాదనలు విన్న తర్వాతే ఆదేశాలిస్తామన్న ధర్మాసనం
- ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించిన చీఫ్ జస్టిస్
- ట్రిపుల్ టెస్ట్‌కు విరుద్ధంగా జీవో ఎలా ఇస్తారు?
- రాష్ట్రమంతటా 42% బీసీ రిజర్వేషన్ సబబేనా? అని అడిగిన సీజే
- విచారణ నేటికి వాయిదా

2లో



ఎస్‌ఎల్‌బీసీ కాంట్రాక్ట్ రద్దు!



సర్కారుకు స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగాల నిర్మాణంపై ప్రాజెక్టు నిర్మాణ సంస్థ అయిన జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌తో 2005 ఆగస్టు 25న చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సీ) రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆస్తులతో పోల్చితే అప్పులు మించిపోయి దివాలా తీయడంతో జయప్రకాశ్ అసోసియేట్స్ సంస్థ వ్యాపార దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ)ను చేపడుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) అలహాబాద్ బెంచ్ 2024 జూన్ 3న ఉత్తర్వులు జారీ చేసింది. దివాలా ప్రక్రియ కాలంలో జేపీ అసోసియేట్స్ కంపెనీ వ్యవహారాల పర్యవేక్షణకు రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్పీ) అనే థర్డ్ పార్టీ ఏజెన్సీని ఎన్సీఎల్టీ నియమించింది. సొరంగం–1 నిర్మాణ విషయంలో కంపెనీ పనితీరుపై ఆర్పీ హామీ ఇవ్వడానికి ఇష్టపడకపోయినా, హామీ ఇచ్చే పరిస్థితిలో లేకున్నా.. ఎన్సీఎల్టీ అనుమతితో ఒప్పందాన్ని రద్దు చేసుకొని మిగిలిన పనుల పూర్తికి మళ్లీ టెండర్లు నిర్వహించాలని ఎస్‌ఎల్‌ఎస్‌సీ సిఫారసు చేసింది. పనితీరుపై ఆర్పీ రాతపూర్వకంగా హామీ ఇస్తే పలు షరతులతో జయ ప్రకాశ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలోనే మిగిలిన పనులు జరిపించాలని మరో ప్రత్యామ్నాయాన్ని ఎస్‌ఎల్‌ఎస్‌సీ సూచించింది. సొరంగాల నిర్మాణం పనులను ముందుకు తీసుకెళ్లే మిగతా 8వ పేజీలో ▶

- పనితీరుపై రాతపూర్వక హామీ ఇస్తే షరతులతో 'జేపీ'కొనసాగింపు
- ఇప్పటికే రెండుసార్లు అంచనాల పెంపు.. ఇకపై మళ్లీ పెంచరాదు
- సర్కారుకు సూచించిన నీటిపారుదల శాఖ స్టాండింగ్ కమిటీ
- 24 గంటల్లో బిల్లులిస్తే కొత్త టెక్నాలజీతో పనులు చేస్తాం
- సర్కారుకు జేపీ అసోసియేట్స్ సైతం షరతులు
- తదుపరి మంత్రివర్గ సమావేశంలో సిఫారసులపై సర్కారు నిర్ణయం



మహేశ్‌గౌడ్‌తో భేటీ అయిన పొన్నం, అడ్లూరి, వాకిటి శ్రీహరి, సంపత్‌కుమార్

అడ్లూరికి పొన్నం సారీ

- లక్ష్మణ్ తన సోదర సమానుడని వ్యాఖ్య
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇంట్లో భేటీ

సాక్షి, హైదరాబాద్

వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఇద్దరు మంత్రుల మధ్య నెలకొన్న వివాదానికి తెరపడింది. ఒక కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తనను అవమానపరిచే విధంగా మాట్లాడారని తీవ్ర ఆగ్రహానికి గురైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ అంశాన్ని ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం వద్దే తేల్చుకుంటానని మంగళవారం అల్టిమేటం ఇచ్చారు. అడ్లూరికి మాదిగ సంఘాలు మద్దతు ప్రకటించడంతో వివాదం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల మధ్య నెలకొన్న ఈ వివాదం స్థానిక ఎన్నికల వేళ.. ప్రతిపక్ష పార్టీలకు అస్త్రంగా మారే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తన నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైరల్ అయిన పొన్నం ప్రభాకర్ మాటలపై చర్చించారు. మాటల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా తాను అడ్లూరి లక్ష్మణ్‌ను ఎలాంటి కామెంట్ చేయలేదని, కొందరు తాను అనని మాటలను వైరల్ చేశారని పొన్నం వివరణ ఇచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా అడ్లూరితో తనకున్న సాన్నిహిత్యం, కరీంనగర్ జిల్లా నుంచి తాము ఎదిగిన తీరును పొన్నం వివరించారు. తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు కొందరు కావాలని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారని సమాచారం. తాను మిగతా 8వ పేజీలో ▶

జేఈఈ సిలబస్ మార్చాల్సిందే..

కేంద్ర విద్యాశాఖకు రాష్ట్రాల సూచన

- ప్రస్తుత విధానం విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని ఆందోళన
- అడ్వాన్స్‌డ్ మరీ కఠినంగా ఉంటోందని వెల్లడి
- ప్రశ్నలు సరళంగా ఉండాలని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ) సిలబస్‌లో మార్పులు తేవాలని కేంద్ర విద్యా శాఖకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏటా చేపట్టే ఈ పరీక్ష విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నాయి. పరీక్షా విధానం విద్యార్థుల్లో అనారోగ్యకరమైన పోటీకి దారితీస్తోందని తెలిపాయి. అనేక మంది కుంగుబాటుకు లోనవుతున్నారని స్పష్టం చేశాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఇంటర్ వరకూ బట్టీ విధానంలో బోధన జరుగుతోందని, విద్యార్థులకు 90% పైగానే మార్కులు వస్తున్నాయని పలు రాష్ట్రాలు తెలిపాయి. అయినప్పటికీ జేఈఈలో చాలామంది అర్హత సాధించలేని పరిస్థితి ఏర్పడిందని కేంద్రం దృష్టికి తెచ్చాయి. ఎన్‌టీఏ పరీక్షకు, అకడమిక్ విద్యకు పొంతన లేని విధంగా ఉందని తెలిపాయి. ఇది పూర్తిగా కార్పొరేట్ విద్యా సంస్థల ఆధిపత్యానికి, ఫీజులు దండుకోవడానికి దారితీస్తోందనే అభిప్రాయం వ్యక్తం చేశాయి. జేఈఈ నిర్వహణపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మార్పులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని కేంద్రం కోరిన నేపథ్యంలో.. రాష్ట్రాల నుంచి తాజాగా ప్రతిపాదనలు వచ్చాయి.

ఇలా అయితే కష్టం: ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లో చాలా మంది జేఈఈ ర్యాంకుల్లో వెనుకబడుతున్నారు. సరైన అధ్యాపకులు లేకపోవడం, మౌలిక వసతులు ఉండని పరిస్థితి కాలేజీల్లో మిగతా 8వ పేజీలో ▶



కప్పు టీ కన్నా చౌకగా డేటా!

భారత్‌లో డిజిటల్ విప్లవానికి నిదర్శనం

- దేశంలో వ్యాపారాలకు అనువైన పాలసీలు
- మరింత వేగవంతంగా సంస్కరణలు
- సెమీకండక్టర్లు, మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీకి అపార అవకాశాలు
- పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ


17లో

కాంగ్రెస్ నిర్వాకాలతో భారీ మూల్యం

- ఉగ్రవాదంపై పోరును బలహీనపర్చింది
- వారిపై సైనిక చర్య చేపట్టకుండా అడ్డుకున్నదెవరు?
- నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

6లో

భారత్‌తో యుద్ధం తప్పదు!



- ఈసారి యుద్ధంలో మంచి ఫలితాలు సాధిస్తాం
- పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలు

- భారత్‌తో త్వరలో యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. ఈసారి యుద్ధం జరిగితే పాకిస్తాన్ గతంకంటే మంచి ఫలితాలు సాధిస్తుందని తెలిపారు. 'ఆరు నెలల క్రితంకంటే ఇప్పుడు పాకిస్తాన్‌కు ఎక్కువమంది మద్దతుదారులు, మిత్రులు ఉన్నారు. గత మే నెలలో చోటుచేసుకున్న ఘర్షణ సమయంతో పోల్చితే భారత్ ఇప్పుడు మద్దతుదారులను కోల్పోయింది' అని పేర్కొన్నారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



కచ్చితంగా యుద్ధం చేసి కోలుకోని దెబ్బతీస్తాం!

అంతా వారే చేశారట!

- నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ఏపీ సర్కారు కనికట్టు
- చిన్న చిన్న వారిపై కేసులతో చేతులు దులుపుకుంటున్న వైనం..
- రిమాండ్ రిపోర్ట్‌లో కనిపించని సూత్రధారులు, పాత్రధారులు
- ప్రభుత్వ పెద్దల దిశా నిర్దేశంతోనే తూతూ మంత్రంగా రిమాండ్ రిపోర్ట్
- నకిలీ మద్యం తయారీ, సరఫరా అంతా తామేనన్న ఏ2 అద్దేపల్లి
- దాన్నే ప్రజలకు విక్రయించామని, భారీ లాభాలొచ్చాయని ఒప్పుకోలు
- 12 మంది నిందితుల్లో ముగ్గురిని కోర్టులో హాజరు పరిచిన అధికారులు



2024లో చంద్రబాబు నుంచి తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా బీ–ఫాం తీసుకుంటున్న జయచంద్రారెడ్డితో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నకిలీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకాల కేసులో కీలక సూత్రధారులు, పాత్రధారులను తప్పించి కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీని మొదలుపెట్టిన టీడీపీ నేతలు భారీగా లాభాలు వస్తుండటంతో ప్రభుత్వ పెద్దల అండతో విజయవాడలోని ఇబ్రహీంపట్నాన్ని మరో అడ్డాగా మార్చారు. నకిలీ మద్యం తయారీ, సరఫరా, మిగతా 14వ పేజీలో ▶

నకిలీ మద్యం తయారీ రాకెట్ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం పక్కా పథకం రచించింది. వేల కోట్ల రూపాయల దందాకు తెరలేపడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఏమాత్రం లేదనేలా వ్యవహారాన్ని రక్తి కట్టిస్తోంది. నకిలీ మద్యం తయారీ యంత్రాలు, స్పిరిట్, రసాయనాలు, వివిధ బ్రాండ్లను పోలిన లేబుల్స్, వేలాది లీటర్ల నకిలీ మద్యం.. వేల సంఖ్యలో సీసాలు, మూతలు పట్టుబడితే ఇదేదో చిన్న వ్యవహారం అనేలా చిన్న చిన్న వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకోజూస్తోంది. లేబుళ్లు సరఫరా చేశారని, సీసాల మూతలు సరఫరా చేశారని.. ఈ కేసులో ఇదే పెద్ద నేరం అన్నట్లు కలరింగ్ ఇస్తోంది. తూతూ మంత్రంగా కేసు నమోదు చేయడం ద్వారా సూత్రధారులు, పాత్రధారులను తప్పించేలా పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తోంది. ప్రభుత్వం ఇలా చేస్తోందని చెప్పడానికి నిందితుల రిమాండ్ రిపోర్టే నిదర్శనం.



బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

8 మంది ఆహుతి

- ఏపీ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో పెను విషాదం
- మంటల్లో కాలిపోయి ఇద్దరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- సూరేకారం, గంధకం అంటుకోవడంతో క్షణాల్లో వ్యాపించిన అగ్ని కీలలు
- విస్ఫోటనం ధాటికి 10–15 అడుగుల దూరం ఎగిరిపడ్డ శరీరాలు
- కాలుతున్న శరీరాలతో నీటి కోసం పరుగులు తీసిన క్షతగాత్రులు

- వివరాలు 14లో

క్లుప్తంగా...

రాజకీయం కోసమే హైకోర్టు వద్ద హైడ్రామా

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాజకీయం కోసమే కాంగ్రెస్ మంత్రులు హైకోర్టు వద్దకు వెళ్లి హైడ్రామా చేస్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు ఓసీ మంత్రులు వ్యతిరేకమా అని ప్రశ్నిస్తూ బీసీ, ఓసీల మధ్య కాంగ్రెస్ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం తమ రాజకీయ అవసరాల కోసం బీసీలను బలిపశువులుగా చేయొద్దని హితవు పలికారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు బాల రాజు యాదవ్, పల్లె రవికుమార్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. 'బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి గవర్నర్ వద్ద అసెంబ్లీ తీర్మానం పెండింగులో ఉన్నా జీవో ఇచ్చారు. ఇదే విషయాన్ని బుధవారం జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత కోర్టు కొట్టివేస్తే డబ్బులు ఖర్చు చేసి ఎన్నికల్లో పోరాడిన వారి పరిస్థితి ఏమిటి. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియలో బీఆర్‌ఎస్ పాల్గొని పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు' అని శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు.

బీసీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగింది

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో బీసీలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విచారణ ముగిసిన అనంతరం హైకోర్టు వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా 60 బీసీ సంఘాల నేతలు ఇంప్లీడ్ అయ్యామని, బీసీ రిజర్వేషన్ల కోసం సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్న బీసీ సంఘాల నేతల తరఫున గురువారం కూడా తమ వాదనలు వినాలని హైకోర్టుకు విన్నవిస్తామన్నారు. 80 ఏళ్లుగా బీసీలకు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లు దక్కనీయకుండా చేశారని, చట్టబద్ధంగా బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లకు అడ్డు తగిలి చరిత్రలో బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులుగా మారొద్దని జాజుల కోరారు.

స్థానిక ఎన్నికల్లో రజకులకు తగిన సీట్లు కేటాయించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు చాకలి ఎస్సీ సాధన సమితి విజ్ఞప్తి



రాంచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న రజక సమితి నేతలు

సాక్షి, హైదరాబాద్: సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రజకులకు ఎన్నికల్లో 6 శాతం సీట్లు కేటాయించాలని చాకలి ఎస్సీ సాధన సమితి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు విజ్ఞప్తి చేసింది. రజకులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరింది. బుధవారం ఈ మేరకు బీజేపీ కార్యాలయంలో రాంచందర్‌రావుకు సమితి అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి, నీలం వెంకన్న, ముదిగొండ వెంకట ప్పయ్య, కొండల్‌రావు వినతిపత్రం అంద జేశారు. రాష్ట్రంలో మొత్తం 13,003 సర్పంచ్ స్థానాలకు రజక జనాభా ప్రకారం 780 సీట్లు బీజేపీ పక్షాన తమకు కేటాయించాలని కోరారు. మొత్తం 5,773 ఎంపీటీసీ స్థానాల్లో రజకులకు 346 సీట్లు కేటాయించాలని విన్నవించారు. మొత్తం 565 జెడ్పీటీసీ స్థానాలకుగాను రజకులకు 33 సీట్లు ఇవ్వాలన్నారు. సీట్ల కేటాయింపులో రజకులకు బీజేపీ తగిన ప్రాధాన్యం ఇస్తుందని రాంచందర్‌రావు హామీ ఇచ్చారన్నారు.

సాక్షి
మీకు సాక్షి
దినపత్రిక అందడంలో
ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి
బదులుగా ఇతర దినపత్రికలు
వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు
ఉ. 7.00 గం.ల నుంచి
రా. 8.00 గం.ల లోపు
తెలుపగలరు. వెంటనే తగిన
చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం.
1800 425 9899

నిలిపివేతకు హైకోర్టు నో

స్థానిక ఎన్నికలపై మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు విముఖత

- అందరి వాదనలు విన్న తర్వాతే ఆదేశాలిస్తామన్న ధర్మాసనం
- ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించిన చీఫ్ జస్టిస్
- ట్రిపుల్ టెస్ట్‌కు విరుద్ధంగా జీవో ఎలా ఇస్తారు?
- రాష్ట్రమంతటా 42% బీసీ రిజర్వేషన్ సబబేనా? అని అడిగిన సీజే
- తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు విముఖత వ్యక్తం చేసింది. గురువారం అందరి వాదనలూ వింటామని, ఆ తర్వాతే ఎలాంటి ఆదేశాలైనా జారీ చేస్తామని తేల్చిచెప్పింది. అయితే ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. 'బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిటీ ఇచ్చిన నివేదికపై గెజిట్ ప్రచురించారా? గవర్నర్ వద్దకు పంపింది పంచాయతీ రాజ్ బిల్లు మాత్రమేనా? మున్సిపల్ చట్ట సవరణ బిల్లు కూడా ఉందా? సుప్రీంకోర్టు పేర్కొన్న ట్రిపుల్ టెస్ట్‌కు విరుద్ధంగా జీవో ఎలా జారీ చేస్తారు? రాష్ట్రంలో బీసీల జనాభా ఒక్కోచోట ఒక్కోలా ఉంటుంది కదా.. అంతటా ఒకేలా 42 శాతం రిజర్వేషన్లు సబబేనా?' అని అడిగింది. కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన సర్కార్.. మరికొన్నింటిపై వాదనలు వినిపించింది. షెడ్యూల్ జారీ చేసిన తర్వాత ఎన్నికల కమిషన్ విధుల్లో జోక్యం చేసుకోవద్దని కోరింది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9 చట్ట విరుద్ధమని, కొట్టివేయాలని పిటిషనర్లు వాదించారు. ప్రభుత్వం తరఫున తనతో పాటు న్యాయవాది రవివర్మ కుమార్ వాదనలు వినిపిస్తారని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం తదుపరి విచారణ గురువారం మధ్యాహ్నం 2:15 గంటలకు చేపడతామని స్పష్టం చేసింది.

న్యాయవాదులపై చీఫ్ జస్టిస్ అసహనం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైంది. ఈ పిటిషన్లలో కాంగ్రెస్‌తో పాటు కొందరు బీసీ నాయకులు కలిపి మొత్తం 28 మంది ఇంప్లీడయ్యారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విచారణ ప్రారంభమవగానే న్యాయవాదులంతా ఒకేసారి వాదనలకు సిద్ధం కావడంతో సీజే అసహనం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సీరియస్ అంశమని, ఇలా అందరూ ఒకేసారి మాట్లాడితే ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం కష్టమని అన్నారు. ఓపిక లేకుండా వ్యవహరిస్తే ఎలా అని సున్నితంగా మందలించారు. కాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కె.వివేక్‌రెడ్డి, బి.మయూర్‌రెడ్డి, జె.ప్రభాకర్ సహా పలువురు వాదనలు వినిపించారు.

రిజర్వేషన్ల పరిధి 50 శాతం దాటొద్దు..

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు రాజ్యాంగ విరుద్ధం. ప్రత్యేక కమిషన్, శాస్త్రీయ గణాంకాలు, 50 శాతం పరిధి .. ఇవీ (ట్రిపుల్ టెస్ట్) రిజర్వేషన్లకు సంబంధించి 2021లో సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలు. ఈ ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై చట్టం చేయలేదు. 50 శాతం రిజర్వేషన్ల పరిధి దాటడం రాజ్యాంగ విరుద్ధం. మరాఠా రిజర్వేషన్ల అంశంలోనూ 50 శాతం పరిధిపై పునఃపరిశీలన అవసరం లేదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. చట్టవిరుద్ధంగా ఎన్నికల షెడ్యూలే కాదు.. నోటిఫికేషన్ ఇచ్చినా రద్దు చేయవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. రిజర్వేషన్ల పెంపు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపాలిటీల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటేందుకు వీల్లేదు. చట్టపరమైన అంశాలను, రాజ్యాంగ నిబంధనలను పరిశీలించకుండా జీవో విడుదల చేశారు. జీవో 9తో పాటు రిజర్వేషన్లకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవో 41ని కొట్టివేయాలి..' అని వివేక్‌రెడ్డి వాదించారు.

35 శాతానికి పెంపును ఇదే హైకోర్టు కొట్టివేసింది..

'మేం పంచాయతీ ఎన్నికలను నిలిపివేయాలని కోరడం లేదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎన్నికలు నిర్వహించాలని మాత్రమే కోరుతున్నాం. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 28ఏ ప్రకారం కూడా పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దు. చట్ట సవరణ చేయకుండా జీవో ద్వారా రిజర్వేషన్ల పెంపు చెల్లదు. బీసీ రిజర్వేషన్లు 35 శాతానికి పెంచుతూ 2018లో జీవో ఇస్తే ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది..' అని మయూర్‌రెడ్డి వాదించారు. మరో ఇద్దరు న్యాయవాదులు కూడా వాదనలు విన్పించారు. ఇలా మా వాదనలు వినాలంటే మా వాదనలు వినాలని న్యాయవాదులు ఇబ్బంది పెట్టడంతో సీజే అసహనం వ్యక్తం చేశారు. 'మా ఓపికను పరీక్షించొద్దు' అంటూ వ్యాఖ్యానించారు.

రిజర్వేషన్ల పెంపును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. 'రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో బిల్లు పెట్టడాన్ని ఎవరూ చాలెంజ్ చేయలేదు. 50 శాతానికి మించొద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. సామాజిక పరంగా ఎక్కువ జనాభా ఉన్న బలహీన వర్గాలకు లబ్ధి చేకూర్చడం కోసమే సర్కార్ జీవో తెచ్చింది. ఇది విధానపరమైన నిర్ణయం. ప్రభుత్వానికి ఆ అధికారముంది. చట్టాన్ని సవాల్ చేయకుండా జీవోను నిలిపి వేయమనడం సమంజసం కాదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాక 50 శాతం పరిధి దాటింది. 2018లో ఎలాంటి ప్రక్రియ లేకుండా రిజర్వేషన్లు పెంచారు. కానీ ఇప్పుడు గణాంకాల సేకరణ, కమిషన్ నివేదిక ఆధారంగానే సర్కార్ పెంచింది. సర్కార్ నిర్ణయాన్ని అన్ని పక్షాలు స్వాగతించాయి. 50 శాతం దాటొద్దన్నప్పుడు ఇక ప్రక్రియంతా ఎందుకు? లక్ష మంది ఎన్యూమరేటర్లు సర్వే చేశారు. కులగణన కోసం టీచర్లు, ప్రొఫెసర్లు కృషి చేశారు. ప్రభుత్వం ఎంతో శ్రమించి విశ్లేషణాత్మక, గణాంక, సాంకేతిక వివరాలు సేకరించింది. అన్ని అంశాలు పరిశీలించిన కమిషన్ బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచవచ్చని సిఫార్సు చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లులు నెల రోజులకు పైగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలు, మండలాల వారీగా లెక్క చూసి రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదు. రాష్ట్రమంతటా 42 శాతం అమలు చేస్తారు. కమిషన్ వేయడం విధాన నిర్ణయం. పిటిషన్లపై పూర్తి అంశాలతో కౌంటర్ వేస్తాం. అప్పటివరకు ఎలాంటి ఆదేశాలివ్వొద్దు..' అని సింఘ్వీ కోరారు. అనంతరం ఏజీ విజ్ఞప్తి మేరకు ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

'42 శాతం రిజర్వేషన్ల'తోనే స్థానిక ఎన్నికలకు వెళ్తాం

రిజర్వేషన్లపై ఏ పార్టీ స్టాండ్ ఏంటో అందరికీ తెలుసు: పొన్నం, వాకిటి

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తామని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. బుధవారం హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల పెంపుపై జరిగిన వాదనల అనంతరం వారు గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపై ప్రభుత్వం తరఫున వాదనలు బలంగా వినిపించామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న తొలిరాష్ట్రంగా ఎన్నికలకు వెళ్తున్నట్లు చెప్పారు. శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ 42 శాతం రిజర్వేషన్లకు స్పష్టంగా మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. కోర్టులో అఫిడవిట్లు ఉండవని, ఇంప్లీడ్ కావాలని కోరినట్లు తెలిపారు. ఎంపైరికల్ డేటాకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ వేసి, సబ్ కమిటీ వేసుకొని 42% రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి సభలో ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు కోర్టులో బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఇంప్లీడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని రోజులుగా రిజర్వేషన్ల ప్రక్రియ లో ఎలాంటి మార్పులు వచ్చాయో, కాంగ్రెస్ ఏం స్టాండ్ తీసుకుందో ప్రజలందరికీ తెలుసని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి వాదన వినిపించామని, అదే తరహాలో హైకోర్టులో రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలియజేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా న్యాయంగా రావాల్సిన వాటాపై కొట్లాడుతున్నామన్నారు.

రిజర్వేషన్లపై విచారణ.. హైకోర్టుకు మంత్రులు



హైకోర్టు వెలుపల న్యాయవాదులతో మంత్రులు వాకిటి, పొన్నం

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల జీవోపై విచారణ సందర్భంగా పలువురు మంత్రులు హైకోర్టుకు వచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. వాదనల అనంతరం మంత్రులు ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డితో భేటీ అయ్యారు. విచారణపై జరిగిన తీరుపై చర్చించారు. ఈ పిటిషన్ల విచారణ సందర్భంగా ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నేడే నోటిఫికేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గురువారం ఉదయం నుంచి నోటిఫికేషన్ల జారీ, ఇతర అంశాలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు, చేసిన సన్నాహాల గురించి ఆరా తీశారు. అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఈసీ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ, నోటిఫికేషన్ల జారీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్లు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల అధికారులకు పునఃశ్చరణ శిక్షణ పూర్తిచేశామన్నారు.

మొదటి దశ ఎంపీటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ఇలా..

ఎన్నికల నోటిఫికేషన్ జారీ	అక్టోబర్ 9న
నామినేషన్ల స్వీకరణ	అక్టోబర్ 9 నుంచి
నామినేషన్ల దాఖలుకు చివరిరోజు	అక్టోబర్ 11
నామినేషన్ల పరిశీలన	అక్టోబర్ 12న
చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితా వెల్లడి	అక్టోబర్ 12న
అప్పీల్‌కు చివరి తేదీ	అక్టోబర్ 13న
అప్పీళ్ల పరిష్కారం చివరి తేదీ	అక్టోబర్ 14
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ	అక్టోబర్ 15 (మధ్యాహ్నం 3 గంటలు)
పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రకటన	అక్టోబర్ 15న
ఎన్నికల తేదీ	అక్టోబర్ 23న (ఉదయం 7 నుంచి సాయంత్రం 5 దాకా)
రీ పోలింగ్ ఏమైనా ఉంటే	ఎస్ఈసీ నిర్ణయించిన మేరకు..
ఓట్లలెక్కింపు	నవంబర్ 11
ఫలితాల ప్రకటన	ఓట్ల లెక్కింపు ముగియగానే..

మొత్తం ఎన్నికలు జరిగే స్థానాలివే..

జిల్లా పరిషత్‌లు	: 31
మండలాలు	: 565
జెడ్పీటీసీ స్థానాలు	: 565
ఎంపీటీసీ స్థానాలు	: 5,749
ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లు	: 31,300
ఎంపీటీసీ/జెడ్పీటీసీ పోలింగ్ ప్రాంతాలు	: 15,302
మొత్తం గ్రామ పంచాయతీలు	: 12,733
మొత్తం వార్డులు	: 1,12,288
పోలింగ్ స్టేషన్లు	: 1,12,474

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ఓటర్లు

పురుషులు	: 81,65,894
మహిళలు	: 85,36,770
ఇతరులు	: 504
మొత్తం	: 16,70,3168

5 దశల్లో స్థానిక సమరం

ఐదు దశల్లో జరిగే మండల, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలకు గాను..తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు (మొదటి విడత అక్టోబర్ 23న, రెండో విడత అక్టోబర్ 30న) జరగనున్నాయి. ఆ తర్వాత మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు..సర్పంచ్, వార్డు సభ్యులకు (మొదటి దశ అక్టోబర్ 31న, రెండోదశ నవంబర్ 4న, మూడోదశ నవంబర్ 8న) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గత నెల 29న విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 9న మొదటి దశ మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీతో మొదలయ్యే స్థానిక ఎన్నికల ప్రక్రియ నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాల వెల్లడితో ముగియనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఓట్ల కౌంటింగ్ నవంబర్ 11న (రెండు దఫాలకు కలిపి) జరగనుండగా.. సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ఎప్పటికప్పుడు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. హైకోర్టు స్టే ఉత్తర్వులకారణంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు, 25 గ్రామపంచాయతీలు, 230 వార్డులకు ఎన్నికలు జరగడం లేదు.కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని కుర్మపల్లి, రామచంద్రాపూర్ పంచాయతీలు, వీటిలోని 16 వార్డులకు కూడా ఎన్నికలు నిర్వహించడం లేదు.

ఏర్పాట్లు పూర్తి

31 జిల్లాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి దశ ఎన్నికలకు నోటిఫికేషన్ల జారీకి జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి దశలో మొత్తం 53 రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 292 మండలాల పరిధిలో ఉన్న 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీలకు మండల కార్యాలయాల్లో, జెడ్పీటీసీల కోసం జిల్లా పరిషత్‌కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరించనున్నారు. మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ల జారీ, నామినేషన్లు స్వీకరణ, ఎన్నికల కోడ్ అమలు, భద్రతా ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్లు.. జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

తొలిదశలో ఏయే జిల్లాలు, ఏయే రెవెన్యూ డివిజన్లలో ఎన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు..

జిల్లాలు	రెవెన్యూ డివిజన్లు	మండలాలు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
కామారెడ్డి	2	14	136	14
ఖమ్మం	1	10	149	10
నిజామాబాద్	2	18	177	18
జోగులాంబ గద్వాల	1	5	69	5
మహబూబ్‌నగర్	1	8	89	8
నాగర్‌కర్నూల్	2	10	115	10
నారాయణపేట	1	8	82	8
వనపర్తి	1	8	71	8
హనుమకొండ	2	6	67	6
జనగామ	2	6	70	6
జయశంకర్ భూపాలపల్లి	2	6	58	6
ములుగు	1	5	30	5
భద్రాద్రి కొత్తగూడెం	2	11	113	11
వికారాబాద్	2	11	115	11
రంగారెడ్డి	3	10	110	10
మెదక్	1	10	99	10
సంగారెడ్డి	2	12	129	12
సిద్దిపేట	3	15	125	15
నల్లగొండ	2	18	196	18
యాదాద్రి భువనగిరి	1	10	84	10
సూర్యాపేట	1	11	112	11
వరంగల్	2	5	64	5
మహబూబాబాద్	2	9	104	9
ఆదిలాబాద్	1	10	80	10
కొమురంభీమ్ ఆసిఫాబాద్	2	8	71	8
నిర్మల్	1	9	75	9
మంచిర్యాల	2	9	62	9
కరీంనగర్	1	6	70	6
పెద్దపల్లి	2	7	68	7
జగిత్యాల	3	10	108	10
రాజన్న సిరిసిల్ల	2	7	65	7

కాంగ్రెస్‌లో 'స్థానిక' కోలాహలం

డీసీసీలతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో వాకిటి,పొన్నం, ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది. గురువారం నోటిఫికేషన్‌తోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అధికారులు నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్ని జిల్లాల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులతో మాట్లాడారు. అంతకు ముందు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలతో చర్చించిన మహేశ్‌గౌడ్.. గురువారం నుంచి చేపట్టే కార్యాచరణపై దృష్టి సారించారు. జిల్లాల్లో ఎన్నికల వాతావరణం మొదలు కాగా, పార్టీ తరఫున మరింత ఉత్సాహంతో నామినేషన్ల పర్వంలోకి దిగాలని నిర్ణయించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు తలమునకలై ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ డీసీసీ అధ్యక్షులు కూడా అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎంపీటీసీ అభ్యర్థులు ఎవరనే విషయంలో స్థానిక ఎమ్మెల్యే నిర్ణయం ఫైనల్ కానుండడంతో మొదట ఎంపీటీసీల నామినేషన్లు దాఖలు చేయనున్నారు. జెడ్పీటీసీల విషయంలో కూడా ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలకు ఓ స్పష్టత ఉన్న నేపథ్యంలో ఆశావహులతో తొలుత నామినేషన్లు వేయించి, తర్వాత బీఫారాలు ఇప్పించాలని పార్టీ భావిస్తోంది.

బీసీ రిజర్వేషన్ల కేసును గెలుస్తాం: మహేశ్‌గౌడ్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై హైకోర్టులో ప్రభుత్వం తరఫున న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. గురువారం నుంచి యథావిధిగా స్థానిక నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుందన్నారు. బుధవారం హైకోర్టులో వాదనల అనంతరం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కేసును కచ్చితంగా గెలుస్తామనే ధీమాతో ఉన్నట్టు చెప్పారు.

'స్థానికం'తో పూర్వవైభవం

ఆ దిశగా బీఆర్‌ఎస్ వ్యూహాలు

- స్థానిక ఎన్నికలే అందుకు మంచి మార్గమని నిర్ణయం
- అభ్యర్థుల ఎంపికపై జాగ్రత్తగా అడుగులు
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ప్రచార బాధ్యత



సాక్షి, హైదరాబాద్: గత లోక్‌సభ ఎన్నికల్లో పరాభవాన్ని ఎదుర్కొన్న ప్రతి పక్ష బీఆర్‌ఎస్ పార్టీ.. గురువారం నుంచి ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి పూర్వ వైభవం సాధించాలని భావిస్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మలుచుకొనేందుకు ప్రచార వ్యూహాలు సిద్ధంచేసింది. గ్రామ, మండల స్థాయిలో స్థానిక కేడర్‌తో చర్చించి రిజర్వేషన్లకు అనుగుణంగా పారదర్శకంగా అభ్యర్థులను ఎంపిక చేసి జాబితాను ప్రకటించాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలను అధిష్టానం ఆదేశించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, సమన్వయ బాధ్యతలపై ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కోసం కష్టపడే వారికి అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని నిర్ణయించారు.

త్వరలో జెడ్పీటీసీ అభ్యర్థుల జాబితా..

జెడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను త్వరగా సమర్పించాలని నాయకులకు కేటీఆర్ సూచించారు. ఈ జాబితా ఆధారంగా మండల, జిల్లా పరిషత్ పదవులను సాధించేలా పార్టీ కసరత్తు చేస్తోంది. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితర నేతలకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల ప్రచారం, సమన్వయ బాధ్యతలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ '420 వాగ్దానాలు'అమలు కాలేదని ప్రజల్లో బలంగా ప్రచారం నిర్వహించాలని, అదే సమయంలో బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను హైలైట్ చేయాలని ఆదేశించారు.

జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి

10న జూబ్లీహిల్స్‌పై రాష్ట్ర ఎన్నికల కమిటీ భేటీ

- సాక్షితో బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికలకు పార్టీ పూర్తి స్థాయిలో సన్నద్ధమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. స్థానిక ఎన్నికలకు బీజేపీ సన్నద్ధతపై రాంచందర్‌రావు బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. మొదటి దశ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కూడా దాదాపు పూర్తయిందని చెప్పారు. జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలు, పరిశీలకులు ఇప్పటికే చేరుకుని అభ్యర్థుల ఎంపిక పూర్తిచేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. వికారాబాద్, నారాయణపేట, పెద్దపల్లి వంటి జిల్లాలు మినహా మిగతా చోట్ల స్పష్టత వచ్చిందని చెప్పారు. ఇప్పటికే ఈ స్థానాలకు పోటీచేసే ఆశావహుల పేర్లతో జాబితాలు సిద్ధం చేశామని తెలిపారు. జెడ్పీటీసీ అభ్య ర్థుల పేర్లు దాదాపుగా ఖరారయ్యాయని, వీరికి బీఫామ్‌లు అందజేస్తామని తెలియజేశారు. జిల్లాలవారీగా ఎంపీటీసీ స్థానాలకు పోటీచేస్తున్న వారు పెద్దసంఖ్యలో ఉండడంతో, వారిలో కొందరి పేర్లను ఖరారుచేసినట్టు అక్కడి నాయకత్వాలు తెలియజేశాయని పేర్కొన్నారు. జెడ్పీటీసీ అభ్యర్థుల పేర్లను రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటిస్తామని, ఎంపీటీసీ అభ్యర్థుల పేర్లను జిల్లాస్థాయిలో ఇన్‌చార్జిలు, పరిశీలకులు ప్రకటిస్తారని చెప్పారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశమై జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చిస్తుందని వెల్లడించారు. రెండుమూడు రోజుల్లో బిహార్ ఎన్నికల అభ్యర్థులతో పాటు ప్రకటించే అవకాశాలున్నాయని తెలిపారు.

నామినేషన్లకు ముహూర్తాలివే

హనుమకొండ కల్చరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లు వేసే అభ్యర్థులు ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్నారు. శుభ ముహూర్తాల్లో నామినేషన్లు వేయాలని పురోహితులు సూచిస్తున్నారు. అక్టోబర్ 9న గ్రహ స్థితులు (గురు, శుక్రుడు ప్రసన్నత) నామినేషన్లకు అనుకూలంగా ఉన్నా యని అంటున్నారు. '9న ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు (హస్తా నక్షత్రం, కృతికా యోగం) దరఖాస్తులు నింపాలి. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 3.40 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు నామినేషన్లు వేయవచ్చు. అక్టోబర్ 10న నామినేషన్లు వేయడానికి అను కూలంగా లేదు. అక్టోబర్ 11 ఉదయం 10.10 నుంచి 10.55 గంటల వరకు శుభ సమయం ఉంది. మేష, వృషభ, మిథున, కర్కాటక, కన్య, తుల, ధనుస్సు రాశుల వారికి రాజకీయంగా అనుకూల గ్రహస్థితులు ఉన్నాయి. సింహ, వృశ్చిక, మకర, మీన రాశుల వారికి రాజకీయ యోగ్యత కొంత ప్రతి కూలంగా ఉన్నట్లు గ్రహచారాలు సూచిస్తున్నాయి' అని పురోహితులు చెప్పారు.

రూ.300 కోట్ల ఫీజు నిధులు దీపావళి నాటికి విడుదల

- ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలకు సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి హామీ
- సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కాలేజీ యాజమాన్యాల స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి దీపావళి పండుగ కల్లా రూ.300 కోట్లు చెల్లిస్తామని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలకు హామీ ఇచ్చారు. ఈనెల 13 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు యాజమాన్యాల సంఘం ప్రకటించడంతో ఆయన జోక్యం చేసుకున్నారు. ఈమేరకు హామీ ఇవ్వడంతో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘం సమ్మెను దీపావళి పండుగ వరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులోగా నిధులు విడుదల చేయకుంటే సమ్మె చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించింది. ఈనెల 23 తర్వాత ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నట్లు సంఘం వెల్లడించింది.

ఇకపై పదవులకు దూరం..!

- సీపీఐ నేత అజీజ్ పాషా

సాక్షి, న్యూఢిల్లీ: సుదీర్ఘకాలం పాటు కమ్యూనిస్టు పార్టీకి అనేక సేవలందించిన కేంద్ర కమిటీ నాయకుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఇకపై పదవులకు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. 80 ఏళ్ల తర్వాత కూడా పదవులపై ఆశ పడటం సరైంది కాదన్నారు. పదవులకు దూరంగా ఉంటూ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తానంటూ 'సాక్షి'కి తెలిపారు. యువతరానికి పార్టీ పెద్ద పీట వేస్తూ వారికి పదవులను కట్టబెట్టాలని సూచించారు.



పంట నష్టంపై కేంద్ర బృందం ఆరా

- మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పర్యటన

కామారెడ్డి క్రైం/మెదక్‌జోన్: నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం పర్యటించింది.

- కామారెడ్డి జిల్లాలోని భిక్కనూర్, బీబీపేట మండలాలతోపాటు, జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో వరద బీభత్సానికి దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, విద్యుత్ సౌకర్యాలు, చెరువులు, కుంటలు, పంట నష్టాన్ని పరిశీలించింది. అనంతరం కలెక్టరేట్‌లో వరదలతో కలిగిన నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో గత ఆగస్టు 26 నుంచి 28 వరకు మూడు రోజుల వ్యవధిలోనే జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం బృందం సభ్యులు లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో పర్యటించారు. పంట నష్టం, ధ్వంసమైన మౌలిక వసతులు, దెబ్బతిన్న పోచారం ప్రాజెక్టును సందర్శించారు. కేంద్ర బృందంలో హోం ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ పీకే రాయ్, ఎక్స్‌పెండిచర్స్ సెంట్రల్ ఫైనాన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి అధికారి శ్రీనివాస్ బైరి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారి శశివర్ధన్ రెడ్డి ఉన్నారు.



మెదక్ జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- మెదక్, హవేళిఘణాపూర్, రామాయంపేట, నిజాంపేట, పాపన్నపేట మండలాల్లో నష్టాన్ని కేంద్ర బృందం పరిశీలించింది. వరదలతో ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులు, వాగులపై నిర్మించిన బ్రిడ్జిలు, పంటలపై ఇసుక మేటలను కలెక్టర్ రాహుల్‌రాజ్ బృందానికి చూపించారు. కేంద్ర బృందంలో డాక్టర్ పొన్నుస్వామి, వినోద్‌కుమార్, అభిషేక్‌కుమార్, ఎస్ఎస్ పింటు ఉన్నారు.

సురవరం జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తాం

- సంస్మరణ సభలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తకాలను ముద్రించి.. పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మంత్రి జూపల్లితోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాల్‌నర్సింహ, సురవరం సతీమణి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి ఆలోచనలు, జీవన విధానాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కొల్లాపూర్‌లో సురవరం కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ పాలమూరు జిల్లాలోని ఏదైనా ప్రాజెక్టు, రహదారికి సురవరం సుధాకర్‌రెడ్డి పేరు పెట్టాలని కోరారు.



మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

- వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: మొక్కజొన్న రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి పదే పదే మీకు గుర్తు చేయాల్సి రావడం చాలా బాధాకరం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. పంట కోతకు వచ్చి మక్కలను మార్కెట్లలోకి తరలిస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో రైతుల శ్రమను దళారులు దోచుకుంటున్నారు. క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధరతోపాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో మీరు చెల్లిస్తామన్న రూ.330 బోనస్ ను రైతులకు అందించడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు క్వింటాల్ మక్కలను రూ.1,600కే ప్రైవేటులో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.



గెస్ట్ లెక్చరర్లకు వేతనాలేవి?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తు న్న గెస్ట్ లెక్చరర్లకు 9 నెలలుగా పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దసరా పండుగ పూట గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.







పరిసరాల వల్ల మనం పొందే సంతోషం కన్నా, మనలోంచి మనం పొందే సంతోషం గొప్పది.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
గురువారం, 9 అక్టోబర్ 2025

తాలిబన్‌లతో సఖ్యత!

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరన్న నానుడి దౌత్యానికి కూడా వర్తిస్తుంది. పైకి ఏం చెబుతున్నా, ఇతరేతర ప్రత్యామ్నాయాల సాధ్యాసాధ్యాలను పరిశీలించటమనే ప్రక్రియ దౌత్యంలో నిరంతరం కొనసాగుతుంటుంది. పర్యవసానంగా ఒక్కోసారి అనూహ్య పరిణామాలు కూడా చోటుచేసుకోవచ్చు. తాలిబన్‌ల ఆధ్వర్యంలోని అఫ్గానిస్తాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ గురువారం అయిదు రోజుల భారత సందర్శనకు రావటం అటువంటిదే. ఇది దక్షిణ, మధ్య ఆసియా భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామం. ప్రపంచ దేశాల్లో రష్యా మినహా మరే దేశమూ ఇంతవరకూ అఫ్గాన్ ప్రభుత్వాన్ని లాంఛనంగా గుర్తించలేదు. మన దేశం తొలిసారి ఆ దిశగా అడుగులేస్తున్నది. అమీర్ ఖాన్ రానున్న సందర్భంగా తాలిబన్‌ను ప్రాంతీయ బృందంలోని భాగస్వామిగా గుర్తించటానికి భారత్ సిద్ధపడింది. తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించటం ఇక లాంఛన ప్రాయం. భద్రతా మండలి ఉగ్రవాదులుగా గుర్తించి ఆంక్షలు విధించిన వారిలో అమీర్ ఖాన్ ఒకరు. దానికింద ఆయన తారసపడితే అరెస్టు చేయాల్సి ఉంటుంది. భారత్ చొరవతో ఈ విషయంలో తాత్కాలికంగా మినహాయింపు లభించింది.

తొలిసారి 1996లో అఫ్గాన్ తాలిబన్‌ల వశమైనప్పుడు మనకు ఎన్ని విధాల సమస్యలొచ్చాయో ఎవరూ మరిచిపోరు. సోవియెట్ దురాక్రమణను ప్రతిఘటించి పాలనాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబన్‌లు అనేకమంది మిలిటెంట్లను కశ్మీర్‌కు తరలించారు. పర్యవసానంగా అక్కడ నెత్తురుటేర్లు పారాయి. కేంద్రంలో వాజ్‌పేయి నాయకత్వాన తొలి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక 1999లో ఉగ్రవాదులు ఖాట్మండు నుంచి న్యూఢిల్లీ వచ్చే విమానాన్ని హైజాక్ చేసి అఫ్గాన్‌లోని కాందహార్‌కు తరలించారు. ముగ్గురు ఉగ్రవాదుల్ని విడిపించుకున్నారు. ఈ చర్య వెనక నేరుగా తాలిబన్‌లు లేకపోయినా ఉగ్రవాదులు సురక్షితంగా వెళ్లటానికి సహకరించారు. తాలిబన్‌లతో చర్చలుగానీ, గుర్తింపుగానీ ఉండబోదని అప్పట్లో మన దేశం ప్రకటించింది. ఇంటా, బయటా వారు సాగిస్తున్న అరాచకాలను తీవ్రంగా ఖండించేది.

ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా 2001లో అఫ్గాన్‌ను దురాక్రమించాక ఏర్పడిన ప్రభుత్వాలకు మన దేశం మద్దతుగా నిలిచింది. 2021లో తాలిబన్‌ల పునరాగమనంతో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వం పడిపోయేవరకూ మన దేశం పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టింది. రూ. 25,000 కోట్ల వ్యయంతో పార్లమెంటు భవనాన్నీ, సల్మా ఆనకట్టనూ, ఒక జాతీయ రహదారినీ నిర్మించింది. విద్యుదుత్పాదన ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితరాల్లో పాలుపంచుకుంది. ఇవన్నీ తాలిబన్‌లలో సద్భావన కలిగించటంతో పాటు పాకిస్తాన్‌తో వచ్చిన విభేదాలు కూడా వారిని భారత్‌వైపు మొగ్గేలా చేశాయి. పాక్–అఫ్గాన్ దీర్ఘకాల సంబంధాలూ, ఉజ్బెకిస్తాన్ ద్వారా సన్నిహితం కావటానికి పాక్ చేస్తున్న ప్రయత్నాలూ, చైనా వరస మంతనాలూ మన దేశంలో కూడా పునరాలోచన కలిగించాయి. మనం ముందడుగు వేయనట్టయితే ఏదోనాటికి తాలిబన్–పాకిస్తాన్ సంబంధాలు మెరుగుపడి, చైనా పలుకుబడి పెరిగి అది మన భద్రతకు ముప్పు కలిగించే అవకాశం కూడా ఉంటుంది. పైగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా కీలకమైన అఫ్గాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తమకు అప్పగించాలని కోరుతున్నారు. ఇది కూడా మన భద్రతను ప్రశ్నార్థకం చేసే పరిణామం. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోబట్టే తాలిబన్‌లతో సత్సంబంధాలకు మన దేశం సిద్ధపడింది.

ఏ దేశానికైనా స్వీయ ప్రయోజనాలు, భద్రత అత్యంత కీలకం. ఆ తర్వాతే మిగిలినవన్నీ. గత నాలుగేళ్లుగా మన దేశం వేలాది టన్నుల గోధుమలు, వందల టన్నుల మందులు, వ్యాక్సిన్లు, భారీ మొత్తంలో పురుగుమందులు, అత్యవసర సరుకులు పంపింది. ఇటీవల భూకంపం వచ్చినప్పుడు టెంట్లు, మందులు, దుప్పట్లు, జనరేటర్లు అందించింది. కాబూల్‌లో పూర్తిస్థాయి దౌత్య కార్యాలయం కాకపోయినా సాంకేతిక కార్యాలయాన్ని తెరిచింది. తాలిబన్ ప్రభుత్వం ఢిల్లీలో రాయబార కార్యాలయం ప్రారంభించుకోవటానికి అనుమతినిచ్చింది. ఈ అనుకూల వాతావరణంలో అఫ్గాన్‌తో సత్సంబంధాలకు ప్రయత్నించటం అనేక విధాల శుభ పరిణామం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: బ.తదియ రా.2.53 వరకు, తదుపరి చవితి,
నక్షత్రం: భరణి రా.12.36 వరకు, తదుపరి కృత్తిక,
వర్జ్యం: ప.11.11 నుండి 12.41 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.10 నుండి 9.57 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.17 వరకు,
అమృత ఘడియలు: రా.8.05 నుండి 9.36 వరకు, అట్ల తదియ.

సూర్యోదయం: 5.55
సూర్యాస్తమయం: 5.41
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రజాభీష్టాన్ని పట్టించుకోవాలి!

విశ్లేషణ



అజయ్ కె. మెహ్రా

స్వతంత్ర భారతదేశం పలు పునర్విభజనలతో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పడటాన్ని చూసింది. ఈ మార్పులు దేశంలోని బహుళ సాంస్కృతిక, బహుళ జాతుల సంక్లిష్టతలను ప్రతిబింబింపజేశాయి. లద్దాఖ్‌లో ప్రస్తుతం కనిపిస్తున్న అశాంతి, సార్వభౌమాధికారాన్ని పంచుకునేందుకు చేస్తున్న సాధారణ వక్కాణింపు కాదు. వారు స్వతంత్ర ప్రతిపత్తిని ఆకాంక్షిస్తున్నారు. జమ్ము–కశ్మీర్‌ను విభజించిన తర్వాత, 2019లో లద్దాఖ్‌కు కేంద్ర పాలిత ప్రాంత (యూటీ) హోదా కల్పించారు. అయితే, తమ హక్కుల పరిరక్షణను కోరుతూ లద్దాఖీయులు 2021 డిసెంబర్‌లో తిరిగి వీధులకెక్కారు.

లద్దాఖ్ ఎందుకు కీలకం?

లద్దాఖ్ ఒక శీతల ఎడారి. దాని గణనీయమైన ప్రాంతం చైనా, పాకిస్తాన్‌ల ఆక్రమణలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రణరంగం సియాచిన్ హిమనదం ఈ ప్రాంతం లోనిదే. వ్యూహపరంగా లద్దాఖ్‌కు ఉన్న ప్రాధాన్యం, పొరుగునున్న రెండు శత్రు దేశాల ఉనికి వల్ల భారత్ అప్రమత్తంగా మెలగుతూ, అక్కడ సత్పరిపాలనకు బాధ్యత వహించవలసి ఉంది. ఉపాధి అవకాశాలను తగినంతగా పెంపొందించే విధంగా దాని ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందకపోతే, ఆ ప్రాంత పౌరుల్లో అసంతృప్తి, అశాంతి కొనసాగుతూనే ఉంటాయి. వాస్తవాధీన రేఖ వెంబడి భారతదేశపు భద్రతను, వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవడంలో అది విఘాతంగా పరిణమించవచ్చు.

అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేయటడంలో లద్దాఖ్ నైసర్గిక స్వరూపం అధికారులకు సవాల్‌గా పరిణమిస్తోంది. లద్దాఖ్ ఇంత సంక్లిష్టమైనదిగా మారడానికి చారిత్రక కారణాలున్నాయి. డోగ్రా రాజు గులాబ్ సింగ్‌కు చెందిన సేనాపతి జోరావర్ సింగ్ 1834–35లో ఈ ప్రాంతాన్ని జయించారు. జమ్ము–కశ్మీర్ అంశం వివాదంగా మారినపుడు, ఆ పెద్ద వివాదంలో లద్దాఖ్ చిక్కుకుంది. భారత సైన్యం 1947లో ప్రతిదాడులు చేపట్టి, ద్రాస్, కార్గిల్, లేహ్‌ల నుంచి చొరబాటుదారులను తరిమేయడంతో, జమ్ము–కశ్మీర్‌లోని మూడు పాలిత విభాగాల్లో లద్దాఖ్ ఒకటిగా రూపుదాల్చింది.

నిరసనలకు కారణాలు

లద్దాఖ్ చాలా కాలం అభివృద్ధికి నోచుకోలేదు. పేలవమైన ఆరోగ్య సేవలతో మరణాల రేటు అధికంగా ఉంటూ వచ్చింది. ఉపాధి అవకాశాలు వ్యవసాయానికి, ప్రభుత్వ రంగానికి, చాలా కాలం తర్వాత టూరిజానికి పరిమితమయ్యాయి.



లద్దాఖీయుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్న విద్యావేత్త, గాంధేయవాది సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయడంతో ఆయన ప్రభావం మరింతగా పెరిగింది.

◆ తమను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యులులో చేర్చాలనీ, రాష్ట్ర హోదా కల్పించాలనీ లద్దాఖీయులు కోరుతున్నారు. లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్, రెండు పార్లమెంట్ సీట్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

దాంతో ప్రభుత్వంపై లద్దాఖ్‌కు పేచీ తలెత్తింది. తమ సొంత ప్రతినిధుల చేతిలో అధికారం ఉంటేనే, తమ ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. అందుకే, 2024 ఫిబ్రవరిలో నిరసనలు తలెత్తడం ఆశ్చర్యం కలిగించలేదు. అవి లేహ్, కార్గిల్‌లను ఏకం చేశాయి. ఇంజినీర్, విద్యావేత్త, గాంధేయవాది అయిన సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వ పాత్రను ధరించారు. వాంగ్‌చుక్ నూతన తరహా పాఠశాలలను స్ఫూర్తిగా తీసుకుని హిందీ సినిమా '3 ఇడియట్స్' రూపొందడంతో, ఆయన ఇదివరకే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయన నిరాహార దీక్షకు కూర్చుని, శ్రేయోభిలాషుల సలహా మేరకు, 21 రోజుల తర్వాత దాన్ని విరమించుకున్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని ఇసుమంత కూడా మార్చుకోలేదు.

ఆయన గత నెలలోనూ నిరవధిక నిరాహార దీక్షకు కూర్చున్నారు. లేహ్‌లో హింసాయుత ఘటనలు చోటుచేసుకోవడంతో, మళ్ళీ విరమించుకున్నారు. తదనంతరం, ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసి, జోధ్‌పూర్ జైలుకు తరలించారు. చర్చలతో ఈ సమస్యకు ఒక పరిష్కారం లభించవచ్చు. కానీ, ఆ ప్రక్రియలో వాంగ్‌చుక్‌కు పాత్ర కల్పించడం ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుగా కనిపిస్తోంది.

కాల్పుల్లో నలుగురు నిరసనకారులు మరణించిన ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని వాంగ్‌చుక్ కోరుతున్నారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ హోదా, లద్దాఖ్‌కు పూర్తి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలనే డిమాండ్ల విషయంలో లేహ్ అపెక్స్ బాడీకి, కార్గిల్ డెమొక్రాటిక్ అలయన్స్‌కు తన మద్దతును పునరుద్ఘాటించారు.

రాష్ట్ర హోదా వచ్చేనా?

జమ్ము–కశ్మీర్ రాష్ట్రంలో భాగంగా ఉన్నపుడు లద్దాఖ్ నుంచి శాసన సభలో నలుగురు సభ్యులు, ఒక లోక్‌సభ సభ్యుడు ఉండేవారు. ఈ ప్రాతినిధ్యం తగినంతగా లేదనే భావన అప్పుడూ ఉంది. ఈ ప్రాంతం, ప్రజల పట్ల అధికారులు వివక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రజాస్వామిక, ప్రాతినిధ్య పరిపాలనను పటిష్ఠపరచేందుకు లేహ్‌కు (1995లో), కార్గిల్‌కు (2003లో) లద్దాఖ్ స్వయం ప్రతిపత్తి పర్వత ప్రాంత అభివృద్ధి మండళ్ళను జమ్ము–కశ్మీర్ ప్రభుత్వం ఎట్టకేలకు ఏర్పాటు చేసింది. కానీ, ఇది క్షేత్ర స్థాయిలో పరిస్థితులలో మార్పు వచ్చేందుకు తోడ్పడలేకపోయింది.

2019 ఆగస్టు 5న, 370వ అధికరణాన్ని రద్దు చేయడంతో కేంద్రపాలిత ప్రాంత హోదా డిమాండ్ నెరవేరిందికానీ, అవకాశాలను అది పరిమితం చేసింది. పాలనా యంత్రాంగంలోకి తీసుకునేందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటిదేమీ లేకపోవడం వల్ల కేంద్ర పాలిత హోదా ఎక్కువ ఉద్యోగావకాశాలను చూపలేకపోయింది.

దాదాపు 3 లక్షల జనాభా కలిగిన లద్దాఖ్ వ్యవస్థాగతంగా బలహీనంగా ఉంది. యూటీ అనిపించుకున్నా వనరులపై హక్కులు ఉండవు కనుక, అది రాష్ట్ర హోదాను కోరుకుంటోంది. అధికార కేంద్రీకరణకు మొగ్గు చూపే బీజేపీ కేంద్రంలో గద్దెపై ఉండటం వల్ల, రాష్ట్ర హోదా మంజూరు కుదిరే పని కాదని చెప్పవచ్చు.

వ్యాపార వర్గాలకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టులు కట్టబెడుతుందనీ, బయటి ప్రాంతాల కార్మికులు ఉన్న కొద్దిపాటి అవకాశాలను ఎగరేసుకుపోతారనీ ఈ ప్రాంతంలో భయాందోళనలు ఉన్నాయి. అందుకే, తమను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యులులో చేర్చాలనీ, రాష్ట్ర హోదా కల్పించాలనీ అడుగుతున్నారు. లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్, రెండు పార్లమెంట్ సీట్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి, ఉద్యోగావకాశాలు, రాజకీయ ప్రాతినిధ్య పెంపునకు పురిగొల్పే విధంగా ప్రత్యేక రాజ్యాంగపరమైన హక్కులు కల్పించాలని లద్దాఖ్ ప్రజానీకం చేస్తున్న డిమాండ్ న్యాయబద్ధమైనదే!

వ్యాసకర్త 'సెంటర్ ఫర్ మల్టీ లెవెల్ ఫెడరలిజం'లో విజిటింగ్ సీనియర్ ఫెలో ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

మానసిక ఆరోగ్యానికి మనమేం చేస్తున్నాం?

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బా రెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న 'మానసిక ఆరోగ్య దినోత్సవా'న్ని జరుపుకొంటున్నాము. మానసిక ఆరోగ్య ప్రాముఖ్యాన్ని గుర్తించి 'వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్' (డబ్ల్యూఎఫ్ఎమ్‌హెచ్) 1992 నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాలలో మానసిక ఆరోగ్యంపై అపోహలు తొలగించి అవగాహన పెంచడానికి వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'విపత్తులు, ఆపత్కాలంలో మానసిక ఆరోగ్య సేవల లభ్యత' అనేది ఈ ఏడాది నినాదం.

'శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా, సామాజికంగా కూడా దృఢంగా ఉండటం' సంపూర్ణ ఆరోగ్యం అనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్వచనం. మనిషి తన ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రించుకోగలిగి, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, సరైన నిర్ణయాలు తీసుకోగలగాలి. డబ్ల్యూహెచ్‌ఓ అంచనా ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 97 కోట్లకు పైగా ప్రజలు, రకరకాల మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నారు. మన దేశంలో ప్రతి ఆరుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక ఇబ్బందికి గురవుతున్నవారే! డిప్రెషన్, ఆందోళన, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎక్కువమంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, తొక్కిసలాటల్లో వందలాది మరణాలు సంభవించడం, కోవిడ్ లాంటి సందర్భాలలో అచటి ప్రజలు మరింత మానసిక క్షోభకు గురవుతారని పరి శోధనల్లో తేలిన విషయం. కోవిడ్ ప్రపంచానికి ఒక పెద్దపాఠం నేర్పింది. చావు భయంతోపాటు, లాక్‌డౌన్ ప్రభావం, ఉద్యోగాలు పోయి ఆర్థిక ఇబ్బందులు, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఒంటరిగా ఉండటం లాంటివన్నీ మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపాయి. ఒక అంచనా ప్రకారం, కోవిడ్‌లో మానసిక రుగ్మతలు కనీసం 25 శాతం పెరిగాయి. యువతలో మొబైల్ అడిక్షన్, డిప్రెషన్, గ్యాంబ్లింగ్ సమస్యలు అధికమయ్యాయి.




రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్–గాజా యుద్ధాల వల్ల అక్కడి ప్రజలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సర్వేలు తెల్పుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ వంటి చోట్ల ఆ మధ్య సంభవించిన మేఘ విస్ఫోటనం వల్ల వచ్చిన వరదలు, ఆస్తి, ప్రాణనష్టంతో అనేకమంది మానసిక వేదనకు గురయ్యారు. దాదాపు 140 కోట్లకు పైగా జనాభా గల మన దేశంలో కనీసం 20 వేల మంది అర్హులైన మానసిక వైద్య నిపుణులు కూడా లేరంటే ఆశ్చర్యమే! మానసిక ఆరోగ్యానికి హెల్త్ బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం ఒక శాతం కన్నా తక్కువే!

ఈ సమస్యల నుండి బయటపడాలంటే, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో, మానసిక ఆరోగ్య సేవలను అనుసంధానించాలి. కళాశాలల్లో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెంటల్ హెల్త్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. విపత్తులలో పనిచేసే సిబ్బందికి 'సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్'లో శిక్షణ ఇప్పించాలి. హెల్ప్‌లైన్‌లు, టెలిమానస్ లాంటి సర్వీసులు మరింతగా పెంచాలి. ఆపద సమయాల్లో మన మిచ్చే ఓదార్పు, భరోసా, భవిష్యత్తులో వారు మరిన్ని మానసిక రుగ్మతలకు లోనుకాకుండా నివారిస్తుంది. మానసిక వైద్యుల కొరత ఉన్న మన దేశంలో, ఇలాంటివి ఎదుర్కొనేందుకు ఆశా, హెల్త్ వర్కర్లు; ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ కార్యకర్తలు; టీచర్లు, మత ప్రతినిధులు లాంటి వారికి, 'సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్'లో తగిన శిక్షణ నివ్వాలి. అప్పుడే 2047 నాటికి మనం పరిపూర్ణ 'వికసిత్ భారత్'ని సాధించగలుగుతాం.

వ్యాసకర్త మానసిక వైద్య నిపుణులు । 93481 14948
(రేపు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం)

సోషల్ టాక్

పట్టింపు ఉండాలి!



మీలో భావోద్వేగాలు లేవంటే మీకు నిజంగా దేనిపైనా పట్టింపు లేదని! మీరు దేనినైనా అమితంగా ఇష్టపడుతున్నప్పుడు, మీరు భావోద్వేగాలకు లోనవుతారు. ఆటల్లోనైనా, జీవితంలోనైనా భావోద్వేగాలు ఉండటం నిజంగా మంచి విషయం.
– అలెగ్జాండర్ జ్వెరెవ్, జర్మన్ టెన్నిస్ ప్లేయర్

లేని కష్టాలు!



నాతో పనుండి వచ్చేవారిలో 80 శాతం మంది నన్ను మోసం చేసేవారే! డబ్బు తీసుకుని పారిపోతారు. అబద్ధాలు చెబుతారు. లేని కష్టాలు చెప్పుకొంటారు. కానీ వారిలో మంచి విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటినే నేను రాయటానికి ఎంచుకుంటాను.
– సుధామూర్తి రచయిత్రి – రాజ్యసభ సభ్యురాలు

దేశభక్తులేనా?



తల్లితండ్రులు, జీవిత భాగస్వాములు, పిల్లలు, ఇళ్లు, గ్రామాలు, పని ప్రదేశాల పట్ల అనురాగం చూపనివారు తమ దేశాన్నీ, తోటి మనుషులనూ ప్రేమించలేరు. వారు ఎప్పటికీ దేశభక్తులు కాలేరు. అలాంటి వారిని సమాజం ఎడంగా ఉంచాలి. లేదా సమాజమే వారికి ఎడంగా ఉండాలి.
– కిమ్ జోంగ్–ఉన్, ఉత్తర కొరియా సుప్రీం లీడర్

సాహస యాత్ర



జీవితంలో నేను దారి తప్పినట్లు అనిపించినప్పుడల్లా ఇంట్లో మ్యాప్ ముందేసుకుని కూర్చుంటాను. ఆ మ్యాప్‌ను చూసినప్పుడు జీవితం ఒక పెద్ద సాహస యాత్ర అనీ ; నేను చేయటానికి ఇంకా చాలా ఉన్నాయి కనుక 'తప్పిన దారి' గురించి ఆలోచించటం అనవసరం అనీ స్థిమితపడతాను.
– ఏంజెలీనా జోలీ, హాలీవుడ్ నటి

దొరికే చోటు



ఆనందం భౌతిక సంపదలలో దొరకదు. మనం పెంచుకునే ప్రేమపూర్వక సంబంధాలలో లభిస్తుంది. జీవితాన్ని ఆస్వాదించటానికి, ఆశీర్వాదాలు పొందటానికి మనుషుల పట్ల కృతజ్ఞత కీలకం.
– ప్రిన్స్ ఆండ్రూ, డ్యూక్ ఆఫ్ యార్క్

గెలుపు భారం



వైఫల్యాలను నుంచి నేర్చుకున్నట్లుగానే, విజయాన్ని తట్టుకోవటం కూడా మీరు నేర్చుకోవాలి. ఓడిపోయినప్పుడు మీపై ఉండే ఒత్తిడి కంటే కూడా, విజయం సాధించినప్పుడు ఆ విజయ పరంపరను కొనసాగించాలని మీపై పడే ఒత్తిడే ఎక్కువ భారమైనది.
– సౌరవ్ గంగూలీ, క్రికెటర్

గ్రామసభలా? జీఎస్టీ సభలా?

ఇన్ బాక్స్

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ తాత చెప్పిన 'స్వరాజ్యం' అనేది కేవలం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే కాదు. ఆయన స్వరాజ్య భావనలో ప్రధానంగా గ్రామ స్వయంపాలన ఉంది. భారతదేశం 'గ్రామాలు ఆధారంగా ఉన్న గణతంత్రం'గా ఉండాలి. ప్రతి గ్రామం స్వయంపాలనతో, ప్రజల భాగస్వామ్యంతో, సత్యం, అహింస, సమానత్వం మీద ఆధారపడి నడవాలి.

గ్రామీణ భారతదేశం అభివృద్ధికి మూలాధారం గ్రామ సభలు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామసభకు చట్టబద్ధమైన రూపమిచ్చారు. ఆర్టికల్ 243ఎ ప్రకారం గ్రామ అభివృద్ధి పథకాలు, నిధుల వినియోగంపై గ్రామసభకు నిర్ణయాధికారముంది. గ్రామ ప్రజల అవసరాలు, సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు అన్నీ ప్రజలే నిర్ణయించుకునే వేదికే గ్రామ సభ. నిజమైన ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేసి రాజకీయ నాయకుల్ని ఎన్నుకోవడం కాదు. నిత్యం పాలనలో ప్రజల పాత్ర ఉండాలి. ప్రతి గ్రామానికి చెందిన పద్దెనిమిది ఏళ్ల పైబడిన ఓటర్లందరూ గ్రామ సభ సభ్యులే. ప్రభుత్వ పథకాలు, నిధులు ఎలా వినియోగించాలి అనే నిర్ణయాన్ని గ్రామ సభ తీసుకోవాలి. అవినీతి నిరోధానికి, పారదర్శకతకు గ్రామ సభ ఒక సాధనం. వార్షిక బడ్జెట్, అభివృద్ధి ప్రణాళికలు, పేదల ఎంపిక వంటి అంశాలు గ్రామ సభలోనే చర్చించి నిర్ణయించాలి.



అయితే, గత కొన్నేళ్లుగా గ్రామ సభల ప్రాధాన్యత తగ్గిపోయి, వాటిని కేవలం ప్రభుత్వ పథకాల ప్రదర్శన, పన్నుల ప్రచారం, ప్రత్యేకించి జీఎస్టీ లాంటి ఆర్థిక విధానాల ప్రమోషన్‌కి వేదికగా మారుస్తున్నారు. జీఎస్టీ గురించి గ్రామాల్లో అవగాహన కల్పించడం ముఖ్యమే కానీ, అది గ్రామ సభ ప్రధాన ఉద్దేశం కారాదు. గ్రామ సభలో కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారం కన్నా జీఎస్టీ గణాంకాలు, కాగితాలు చదివే ప్రచార ఆర్భాటంగా మారిపోతోంది.


గ్రామ సభలో ముఖ్యంగా మొదట ప్రజా అవసరాలు (నీరు, రహదారి, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం) చర్చించి, తర్వాతే ప్రభుత్వ పథకాల సమాచారం ఇవ్వాలి. జీఎస్టీ డిజిటల్ పేమెంట్స్, పన్ను అవగాహన వంటివి ప్రత్యేక శిక్షణ శిబిరాల రూపంలో ఉండాలి. గ్రామ సభను నిజమైన ప్రజాస్వామ్య పాఠశాలగా మార్చాలి. కేవలం జీఎస్టీ లేదా ప్రభుత్వ ప్రచార యంత్రంగా మార్చేస్తే ప్రజాస్వామ్యం బలహీనమవుతుంది. గ్రామ ప్రజల స్వరమే అసలైన శక్తి. ప్రజల చురుకైన భాగస్వామ్యం, పారదర్శకత, నిధుల సక్రమ వినియోగం, సమానత్వం, అహింసా భావనతో ఉన్నప్పుడు మాత్రమే గ్రామ సభలు గాంధీ స్వరాజ్యం దిశగా నడిపిస్తాయి.

– డా॥ ఎ. భాగ్యరాజ్ । సామాజిక వ్యాఖ్యాత

డేటా పాయింట్

కేన్సర్... పారాహుషార్!

మన దేశంలో 1990తో పోలిస్తే 2023లో కేన్సర్ కేసులు, మరణాల సంఖ్య పెరిగిందని 'ద లాన్సెట్' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం చెబుతోంది. ప్రతి లక్ష జనాభాకు ఆ సంఖ్యలు ఇలా ఉన్నాయి:



కాలాతీతుడు

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

హుతంచ దత్తం సకలం నితాంతం ఫలంతు భావానుగుణం దదాతి కాలస్తు భావాఖ్యనదీ నియంతా యో భావ కాలాతిగత స్సధన్యః

అగ్నిహోత్రంలో మంత్రపూర్వకంగా హోమం చేస్తూ హవిస్సును స్వాహా పూర్వకంగా వేస్తారు. ఆ సమయంలో యజమానికి మనస్సులో ఎలాంటి భావం ఉంటే ఆ భావానికి తగిన ఫలితం లభిస్తుంది. అలాగే ఏదైనా ఇతరులకు దానం చేసేటప్పుడు ఎలాంటి భావం మనసులో ఉంటుందో ఆ భావానుగుణమైన ఫలితం లభిస్తుంది. ఇంతకూ ఈ మనసులో భావాలను నియమించేది కాలం. అదే నియంత. ఈ భావ కాలాలకు రెంటికీ అతీతుడయిన మనిషి ధన్యుడు. సత్కర్మానుష్ఠానం వల్ల సత్ఫలితం, దుష్కర్మానుష్ఠానం వల్ల దుష్ఫలితం కలగటం తథ్యం. ఒకప్పుడు సత్కర్మ చేసినా దుష్ఫలితం రావటం ఎందుకని అంటే అది మనసులోని సంకల్ప దోషమని చెప్పాలి. అంటే భావదోషం. 'సర్వం కాలికం' అన్నట్లు ఏదైనా కాల ప్రభావం తప్పదు. ఆ యా కాలానుగుణమైన బుద్ధులు పుట్టి, ఫలితాన్నిస్తాయి. అందుకనే కాలస్వరూపుడైన భగవంతుణ్ణి సత్కార్యాచరణకై బుద్ధిని ప్రచోదన చేయమని ప్రార్థిస్తాం.

భగవంతుడు కాలరూపుడైనా, కాలాతీతుడు. దేశ కాలాలు దేవుణ్ణి నియంత్రించలేవు. సామాన్యులయిన మానవులను మాత్రం కాలం కట్టి పడేస్తుంది. 'కాలో జగత్భక్షకః' అన్నారు. కాలాన్ని ఎదుర్కొని నిలవాలంటే కష్టనష్టాలను లెక్కచేయని ధైర్యం కావాలి. అట్టి ధృతిమంతుడైన సత్పురుషుడు జ్ఞాన గంగా స్నానం చేసిన పుణ్యాత్ముడు, మహాత్ముడు. భావాలనే నదిలోని కెరటాలు అలాంటి జ్ఞానిని ఏమీ చేయలేవు. భావ వైశాల్య విధానాలను బట్టి ఫలితాలుంటాయి. జ్ఞానులకు మనశ్శుద్ధి ఉంటుంది కనుక సద్భావాలే కలుగుతాయి. భగవంతుని లాగానే జ్ఞాని కూడా భావాలకు, కాలానికి అతీతుడు. మనస్సుకు, కాలానికి అందని అతీత శక్తి భగవత్తత్వం. ఆ తత్త్వాన్ని తెలుసుకొన్న జ్ఞానులు కూడా తత్తుల్యులవుతారు. జ్ఞాన సంపద శాశ్వతమైంది కనుక దానిని కూడబెట్టాలి.

Prestige®

కుకింగ్ ని ఇష్టపడేవారు,
ప్రెస్టీజ్ ని ఎలా కాదనగలరు.

సొంతం చేసుకోవాలనిపించే ఆవిష్కరణలు,
ధరలు చూస్తే మాత్రం
పండగ చేసుకుంటారు

శుభ్ బచత్ (తగ్గించిన GST ధరలు) మరియు శుభ్ ఉత్సవ్ ఆఫర్లతో
వేడుకలను రెట్టింపు చేసుకోండి

75 Years of Prestige



కొనండి*
స్వచ్ఛ్ ట్రై-ప్లై 3లీ కుక్కర్
MRP: ₹3 810.00
(GST తగ్గింపు తర్వాత ధర)

ప్రెస్టీజ్
శుభ
ఉత్సవం
సెప్టెంబర్ 10 – అక్టోబర్ 31, 2025

₹1 530.00 విలువైన
స్వచ్ఛ్ ట్రై-ప్లై కుక్కర్‌తో
స్టెయిన్‌లెస్ స్టీల్
కడాయి 24 సె.మీ
ఉచితంగా*



కొనండి
ట్రై-ప్లై 3 పీస్ కుక్‌వేర్ సెట్*
(కడాయి, ఫ్రై పాన్, సాస్ పాన్)
MRP: ₹4 990.00
(GST తగ్గింపు తర్వాత ధర)




మరియు
పొందండి
₹3 440.00 విలువైన
స్వచ్ఛ్ ట్రై-ప్లై కుక్కర్ 2లీ
ఉచితంగా*



కొనండి
మ్యాజిక్ బేస్ ప్రీమియం
స్టెయిన్‌లెస్ స్టీల్ క్యాసరోల్ 24cm
MRP: ₹6 080.00
(GST తగ్గింపు తర్వాత ధర)





మరియు పొందండి
₹2 870.00 విలువైన
డీలక్స్ అల్ఫా
స్వచ్ఛ్ కుక్కర్ 3 లీ
ఉచితంగా*

కొనండి
స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లాటినా
3 పీస్ కుక్‌వేర్ సెట్*
(కడాయి, ఫ్రై పాన్, సాస్ పాన్)
MRP: ₹3 730.00
(GST తగ్గింపు తర్వాత ధర)





మరియు పొందండి
₹2 380.00 విలువైన
స్టెయిన్‌లెస్ స్టీల్
పాపులర్ స్వచ్ఛ్
కుక్కర్ 3 లీ
ఉచితంగా*

అన్ని ధరల తగ్గింపుల కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి

CUSTOMER CARE NO
080-60004411

Scan to find
Prestige
Xclusive
stores

Shop Online on
shop.ttkprestige.com

ttk

సవరించిన GST రేట్లు సెప్టెంబర్ 22 నుండి అమలులోకి వస్తాయి.
*నిబంధనలు మరియు షరతులు: ఒక యూనిట్ కి పేర్కొన్న ధరలు అన్ని పన్నులతో కలిపిన MRP ఇవ్వబడినది. MRP పై మాత్రమే డిస్కౌంట్లు వర్తిస్తాయి మరియు రెండు ఆఫర్‌లను కలిపకూడదు. ప్రతి ఆఫర్ ఒకే యూనిట్ కొనుగోలుపై మాత్రమే చెల్లుబాటు అవుతుంది, అర్హత ఉన్న కొనుగోలుకు ఒక ఉచిత యూనిట్ అందించబడుతుంది. ఎంపిక చేసిన స్టోర్‌లలో, ఎంపిక చేసిన మోడళ్లపై ఆఫర్‌లు వర్తిస్తాయి మరియు స్టాక్‌లు ఉన్నంత వరకు మాత్రమే. స్వచ్ఛ్ ట్రై-ప్లై 3L కుక్కర్ యొక్క ఒక యూనిట్ కొనుగోలుపై, కస్టమర్ యొక్క ఒక SS కడాయి 24cm ఉచితంగా అందుకుంటారు. ట్రై-ప్లై 3-పీస్ కుక్‌వేర్ సెట్‌లో ఫ్రై పాన్ 24cm, కడాయి 24cm SS లిడ్‌తో మరియు సాస్‌పాన్ 16cm ఉంటాయి, అయితే SS ప్లాటినా 3-పీస్ కుక్‌వేర్ సెట్‌లో ఫ్రై పాన్ 22cm, కడాయి 22cm గ్లాస్ లిడ్‌తో మరియు సాస్ పాన్ 16cm గ్లాస్ లిడ్‌తో ఉంటాయి. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టీటీకే ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబంధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ కి విజిట్ చేయండి.

Prestige Xclusive

Alwal: Ph: 9849776540; **Attapur:** Ph: 9246118777; **Alkapuri X Road,** Ph: 9100014635; **Balanagar:** Ph: 9866993073; **Balapur:** Ph: 8008857035; **Beeramguda:** Beside Khaman, Ph: 9000300266, 040-35179032; **Begumpet:** Ph: 7702864300, 040-40125929; **Bandlaguda (Nagole):** Ph: 7330648666; **Boduppal:** Ph: 9849776541; **Bowinpally:** Ph: 9866025388; B N Reddy Nagar, Ph: 7207001355; **Bachupally:** Ph: 9848288300; **Champapet:** Ph: 9703075111; **Dammaiguda:** Ph: 9052490634; **Dilsukhnagar:** Ph: 9246114922; Dr. A. S. Rao Nagar, Ph: 9291333300; 03, Dr .A. S. Rao Nagar, Ph: 8125065333; **Esi Erragadda:** Ph: 040-23702269, 9441252567; **Gajularamaram:** Ph: 78421 91923; **Habsiguda:** Ph: 040-402274716, 9502250985; **Hayathnagar**, Ph: 09440980890, **Hydernagar:** Ph: 9381095556; **Narayanaguda:** Ph: 7799343774; **Khairatabad:** Ph: 9502652070; **Khajaguda:** Ph: 9390527577; **Kondapur:** Ph: 8885552184; **Kompally:** Ph: 9697433444; Kphb Colony, Ph: 040-48523222; **Kukatpally** (Near Ushamullapudi Kaman), Ph: 040-2316216, 9441252567; **Kushaiguda:** Ph: 9440579551; Lb Nagar: Ph: 9000103111; **Lingampally:** Ph: 8688542107; **Madinaguda:** Near Bata, Ph: 040-48513308; **Madinaguda:** (Opp To Madinaguda Church), Ph: 9989233466; **Malkajgiri:** R K Nagar, Ph: 040-42100136; **Malakpet:** Ph: 9100014638; Maredpally Picket, Ph: 9849499537; Manikonda, Ph: 9849028192; **Narsingi:** Ph: 9849112557; **Nallagandla:** Ph: 7382191923; Neredmet 'X' Road, Ph: 8500522294; **Nizampet:** Ph: 7416059699; **Old Alwal:** Ph: 9849664049; **Paradise Circle,** Ph: 9542970857; Pragathinagar, Ph: 9177345689; **Ramanthapur:** Ph: 9014373123; **Rampally X Road,** Ph: 8328311762; **Sri Krishnanagar:** Ph: 040-40062169, 9441252567; **Santoshnagar:** Ph: 9100442430; Suncity, Ph: 7416642333; **Suchitra:** Ph: 8790590846; **Shamshabad:** Ph: 9676899277; **Tirumalgiri:** Ph: 040-274806; **Tolichowki:** Ph: 8885552183; **Uppal:** Ph: 7330993030; **Vidyanagar:** Ph: 7601032934; **Vanasthalipuram:** Ph: 9030670622, 9052757075; **Quthbullapur:** Ph: 7997635855; **Yapral:** 09550364551.

Also Available At: Amberpet: Vardhaman Kitchen World, Ph: 9912142260; **Ameerpet:** Sri Vinayaka Steel Palace, Ph: 9390233996; **Chintalbasti:** Sri Laxmi Venkateswara Steel, Ph: 23393720; Sri Laxmi Narasimhaswamy, Ph: 9949912904; **Chilakalguda:** Vasavi Steel Palace, Ph: 9849640935; **Dilsuknagar:** Metro Home Needs, Ph: 9395393970; Sanjay Steel Bazar, Ph: 9885591931; **Gachibowli:** Sharth City Mall-Kitchen Hub, Ph: 7331199941; **Jntu:** Home Store, Ph: 8106827623; **Kphb:** Shiv Home World, Ph: 91336 04440; Sreepirgal Electronics, Ph: 9703388988; Chandra Prabhu Home Appliances, Ph: 9032309832; **Nallkunta:** Vishal Shopping Centre, Ph: 9949003162; **Sanathnagar:** Agromech Industries, Ph: 92462 22812; **For Distribution Enquires Contact: Anil.Br, Ph: 9866390002; Franchise Enquires Solicited, Contact: Sanandan Jalali, Ph: 7204457541.**

భారత్‌తో యుద్ధం తప్పదు!

ఈసారి యుద్ధంలో మంచి ఫలితాలు సాధిస్తాం ● పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలు

ఇస్లామాబాద్: భారత్‌తో త్వరలో యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. ఈసారి యుద్ధం జరిగితే పాకిస్తాన్ గతంకంటే మంచి ఫలితాలు సాధిస్తుందని తెలిపారు. మంగళవారం సమా టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌తో యుద్ధం జరిగే అవకాశాలు నిజంగానే ఉన్నాయి. పరిస్థితిని ఉద్రిక్తం చేయటం నా ఉద్దేశం కాదు. కానీ ప్రమాదం ఉన్నమాట నిజం. నేను దానిని తోసిపుచ్చలేను. ఒకవేళ యుద్ధమే వస్తే.. దేవుడి దయవల్ల మనం గతంకంటే మంచి ఫలితాలు సాధిస్తాం. గత ఆరు నెలల క్రితంకంటే ఇప్పుడు పాకిస్తాన్‌కు ఎక్కువ మంది మద్దతుదారులు, మిత్రులు ఉన్నారు. గత మే నెలలో చోటుచేసుకున్న ఘర్షణ సమయంతో పోల్చితే భారత్ ఇప్పుడు మద్దతుదారులను కోల్పోయింది'అని పేర్కొన్నారు.

భారత్ ఒకేదేశం కాదు

మధ్యయుగంలో మొఘల్ పాలకుడు ఔరంగజేబు పాలనలో తప్ప భారత్ ఎప్పుడూ ఒకేదేశంగా లేదని ఖవాజా చెప్పుకొచ్చారు. కానీ, అల్లా దయతో ఏర్పడిన పాకిస్తాన్ ఒకే ఐక్య రాజ్యంగా ఉంటూ అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా ఇటీవలి సైనిక ఘర్షణ సమయంలో ఐక్యంగా నిలబడిందని పేర్కొన్నారు. ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండాలంటే ఉగ్రవాదానికి మద్దతిచ్చే చర్యలను మానుకోవాలని ఇటీవల భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించిన విషయం తెలిసిందే. భారత్ వాయుసేన అధిపతి కూడా గత శుక్రవారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ఇచ్చిన ఎఫ్–16 సహా పాకిస్తాన్‌కు చెందిన 12 యుద్ధ విమానాలను కూల్చివేశామని తెలిపారు. అదేరోజు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్ తన పౌరులను రక్షించుకునేందుకు ఏ దేశ సరిహద్దునైనా దాటి వెళ్లగలదని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఖవాజా యుద్ధం వస్తుందని ఊహించినట్లు అంచనా వేస్తున్నారు.

ట్రంప్ అండతోనే..

ఆపరేషన్ సిందూర్ తర్వాత తాను బెదిరించటం వల్లే రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు పదేపదే ప్రకటించుకుంటున్నారు. అంతటితో ఆగకుండా పాకిస్తాన్ ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్‌ను తన అధికారిక నివాసం వైట్‌హౌస్‌కు లంచ్‌కు కూడా పిలిచాడు. ఆ తర్వాత కూడా పాక్ ప్రధాని, సైన్యాధ్యక్షుడు ట్రంప్‌ను కలిశారు. దీంతో మళ్లీ భారత్‌తో యుద్ధం జరిగితే ట్రంప్ తమకు సాయం చేస్తారని



ఖవాజా పరోక్షంగా చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఇటీవల సౌదీ అరేబియాతో పాక్ సైన్య సహకార ఒప్పందం చేసుకుంది. అందువల్లే యుద్ధం జరిగితే మంచి ఫలితాలు సాధిస్తామని ఖవాజా ప్రగల్భాలు పలికారని రక్షణరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

అమిత్ షా మరో మీర్ జాఫర్

మోదీకి ద్రోహం చేసి ప్రధానమంత్రి అవుతారేమో!

- ఆయనే అసలైన ప్రధాని అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు



కోల్‌కతా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. అమిత్ షా చర్యలు 'యాక్టింగ్ ప్రధానమంత్రి'లాగా ఉన్నాయని మండిపడ్డారు. ఆయనే అసలైన ప్రధానమంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మమతా బెనర్జీ బుధవారం కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు. అమిత్ షా ఏదో ఒకనాడు మరో 'మీర్ జాఫర్' అయ్యే ప్రమాదం ఉందన్నారు. అమిత్ షాను అవసరానికి మించి విశ్వసించవద్దని ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. 18వ శతాబ్దంలో ప్లాసీ యుద్ధంలో బ్రిటిష్ వాళ్లతో చేతులు కలిపి బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాకు ద్రోహం చేసిన మీర్ జాఫర్ ఉదంతాన్ని ఆమె ప్రస్తావించారు. సిరాజుద్దౌలాను గద్దెదించిన తర్వాత బ్రిటిష్ వాళ్ల అండతో మీర్ జాఫర్ పాలకుడయ్యాడని గుర్తుచేశారు. అమిత్ షా సైతం అదే తరహాలో నరేంద్ర మోదీకి ద్రోహం చేసి, ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు పరోక్షంగా వెల్లడించారు. అమిత్ షా పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను మమతా బెనర్జీ తప్పుపట్టారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి బీజేపీ అధిష్టానం కుట్రలు సాగిస్తోందని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ముసుగులో లక్షలాది ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇదంతా అమిత్ షా ఆడుతున్న ఆట అంటూ ధ్వజమెత్తారు. దేశాన్ని బీజేపీ నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. అధికారం శాశ్వతం కాదన్న సంగతి తెలుసుకోవాలని బీజేపీకి హితవు పలికారు.

కాలిఫోర్నియా రాష్ట్ర సెలవుగా దీపావళి

బిల్లుపై గవర్నర్ గావిన్ సంతకం

న్యూయార్క్: అమెరికాలో దీపావళిని అధికారిక రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ మేరకు కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ మంగళవారం అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్‌రా ప్రవేశపెట్టిన బిల్లుపై సంతకం చేసి, దీపావళిని రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించారు. అక్టోబర్ 2024లో దీపావళిని అధికారిక రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించిన పెన్సిల్వేనియా మొదటి రాష్ట్రంగా నిలవగా, ఈ సంవత్సరం కనెక్టికట్ ఆ తర్వాతి స్థానంలో ఉంది. న్యూయార్క్ నగరంలో పబ్లిక్ పాఠశాలలకు దీపావళిని సెలవుగా ప్రకటించారు. 'భారతీయ అమెరికన్లు మరింత సాంస్కృతిక సమ్మిళితం, గుర్తింపు దిశగా సాగుతున్న ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. ఈ గుర్తింపు దీపావళి జీవకళనే కాదు, యునైటెడ్ స్టేట్స్‌లో భారతీయ అమెరికన్ల శాశ్వత ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తుంది'.. ఇండియాస్పోరా వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎంఆర్ రంగస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్లు సహ రూపకర్త అయిన అసెంబ్లీ సభ్యురాలు డాక్టర్ దర్శనా పటేల్‌ను అభినందించారు.

కాంగ్రెస్ నిర్వాకాలతో భారీ మూల్యం

- ఉగ్రవాదంపై పోరాటాన్ని బలహీనపర్చింది
- ఉగ్రవాదులను బలోపేతం చేసింది
- ముష్కరులపై సైనిక చర్య చేపట్టకుండా అడ్డుకున్నదెవరు?
- దేశ ప్రజలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలి
- ప్రధాని నరేంద్ర మోదీ డిమాండ్
- నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభం



దేశమంతటా అభివృద్ధి జాడలు

వికసిత్ భారత్‌కు గతి(వేగం), ప్రగతి(అభివృద్ధి) అత్యంత కీలకమని ప్రధాఉద్ఘాటించారు. గత 11 ఏళ్లుగా మన దేశం వికసిత్‌ని భారత్ దిశగా ప్రయాణం సాగిస్తోందన్నారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు. వందే భారత్ రైళ్లు ప్రవేశపెట్టామని, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును వేగవంతం చేశామని అన్నారు. జాతీయ రహదారులు, వంతెనలు, సొరంగాలు నిర్మించామని, నగరాలను అనుసంధానించామని వివరించారు. దేశంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జాడలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో 2014లో 74 ఎయిర్‌పోర్టులు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 160కి చేరిందని చెప్పారు. 'ఉడాన్' పథకంతో గత పదేళ్లలో లక్షలాది మంది తొలిసారిగా విమాన ప్రయాణం చేశారని, కలలు నెరవేర్చుకున్నారని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్ మనదేనని స్పష్టం చేశారు. మరికొన్నేళ్లలో మనదేశం విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌ఓ) హబ్‌గా మారబోతోందని తేల్చిచెప్పారు. ముంబైలో చారిత్రక భవనాలు దెబ్బతినకుండా 33.5 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ మెట్రో మార్గం నిర్మించిన ఇంజనీర్లు, కార్మికులను ప్రధాని అభినందించారు.

నవీ ముంబై: విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదంపై పోరాటాన్ని బలహీనపర్చిందని మండిపడ్డారు. ముంబైలో 26/11 దాడులకు పాల్పడిన పాకిస్తాన్ ఉగ్రవాదులపై సైనిక చర్య చేపట్టకుండా అడ్డుకున్నదెవరో దేశ ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ పార్టీ నిర్వాకాల వల్ల దేశం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రవాద దాడి అనంతరం ముష్కరులపై సైనిక చర్యకు ఒక దేశం అడ్డుపడినట్లు కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ సీనియర్ నేత చెప్పారని గుర్తుచేశారు. ప్రధాని మోదీ బుధవారం మహారాష్ట్రలో నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించారు. ముంబై మెట్రో రైలు నెట్‌వర్క్‌లో ఆక్వా లైన్‌తోపాటు మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ఆర్థిక రాజధానిగా, గొప్ప మెట్రోనగరంగా ప్రఖ్యాతి గాంచిన ముంబైని ఉగ్రవాదులు ఎప్పటినుంచో టార్గెట్ చేశారని చెప్పారు. 2008లో భీకర దాడులు జరిగాయని అన్నారు. అప్పట్లో పాక్ ఉగ్రవాదుల భరతంపట్టాలని ప్రజలంతా కోరుకున్నారని, మన సైనిక దళాలు సైతం అందుకు సిద్ధమయ్యాయని తెలిపారు. కానీ, మరో దేశం అడ్డుకోవడంతో సైనిక చర్య ఆగినట్లు కేంద్ర హోంమంత్రే చెప్పారని వెల్లడించారు. కేంద్ర హోంశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యలను మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. పాకిస్తాన్‌పై భారత్ యుద్ధం చేయొద్దంటూ అప్పట్లో అమెరికా కోరుకుందని చిదంబరం పేర్కొన్నారు.

పౌరుల భద్రతే ముఖ్యం

ఉగ్రవాదంపై పోరాటాన్ని బలహీనపర్చడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదులను బలోపేతం చేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు. దేశ భద్రతపై రాజీపడిందని ఆక్షేపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ఉగ్రవాద దాడులకు తగిన రీతిలో బదులిస్తున్నామని, ముష్కరుల భూభాగంలోకి చొరబడి మరీ బుద్ధి చెప్తున్నామని వివరించారు. దేశంతోపాటు పౌరుల భద్రత కంటే తమకు ఇంకేదీ ముఖ్యం కాదన్నారు.

వికసిత్ భారత్‌కు ప్రతీక

పద్మం ఆకారంలో నిర్మించిన నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వికసిత్ భారత్‌కు ఒక ప్రతీక అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రూ.19,650 కోట్లతో 1,160 హెక్టార్లలో ఈ ఎయిర్‌పోర్ట్ మొదటి దశను నిర్మించారు. దేశంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా ఇది రికార్డుకెక్కింది. డిసెంబర్‌లో ఇక్కడి నుంచి విమానాల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. విమానాశ్రయ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, అదానీ గ్రూప్ చైర్‌పర్సన్ గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ముంబై మెట్రో లైన్–3 తుది దశను ప్రధానమంత్రి ప్రారంభించారు.

జుబీన్‌గార్గ్ మృతి కేసు
బంధువైన డీఎస్పీ అరెస్టు

గువాహటి: ప్రముఖ అస్సామీ సింగర్ జుబీన్ గార్గ్ అనుమానాస్పద మృతి కేసులో ఆయన సమీప బంధువు, పోలీస్ డీఎస్పీ సందీపన్ గార్గ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదుచేసినట్లు సీఐడీ డీజీపీ మున్నా ప్రసాద్ గుప్తా తెలిపారు. సందీపన్‌ను కామరూప మెట్రోపాలిటన్ జిల్లా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) ముందు హాజరు పర్చగా, ఆయనకు న్యాయమూర్తి 7 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు మున్నాప్రసాద్ వెల్లడించారు. సందీపన్‌తో ఈ కేసులో అరెస్టయినవారి సంఖ్య ఐదుకు చేరింది. ఇప్పటికే నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ చీఫ్ ఆర్గనైజర్ శ్యామ్ కాను మహంత, జుబీన్ మేనేజర్ సిద్ధార్థ్ శర్మతోపాటు జుబీన్ మ్యూజిక్ బ్యాండ్ సభ్యులు శేఖర్‌జ్యోతి గోస్వామి, అమృత్‌ప్రభ మహంతను అరెస్టు చేశారు. జుబీన్ సింగపూర్‌లో గత నెల 19న సముద్రంలో మునిగి మరణించిన సమయంలో ఈ ఐదుగురు అక్కడే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2022లో అస్సాం పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన సందీపన్‌గార్గ్.. ఈడబ్ల్యూఎస్ కోటాలో డీఎస్పీగా ఎంపికయ్యారు.

కెమిస్ట్రీలో ముగ్గురికి నోబెల్


కిటాగవా


ఒమర్ యాఘీ


రిచర్డ్ రాబ్సన్

- రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటన
- మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధికి గుర్తింపు

స్టాక్‌హోమ్: లోహ సేంద్రియ చట్రాలను(మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్) అభివృద్ధి చేసినందుకు రసాయన శాస్త్రంలో ముగ్గురు సైంటిస్టులకు నోబెల్ బహుమతి లభించింది. నూతన రూపంలో మాలిక్యులర్ ఆర్కిటెక్చర్‌ను వారు రూపొందించారు. 2025 సంవత్సరానికి గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం.యాఘీలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి అందజేయనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సెక్రెటరీ జనరల్ హన్స్ ఎలెగ్రెన్ బుధవారం స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో ప్రకటించారు. కిటాగవా(74) జపాన్‌లోని క్యోటో యూనివర్సిటీ, రాబ్సన్(88) ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, యాఘీ(60) అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పనిచేస్తున్నారు. ముగ్గురు శాస్త్రవేత్తలు భారీ కుహరాలతో కూడిన మాలిక్యులర్ నిర్మాణాలను సృష్టించారని, వీటిద్వారా కార్బన్ డయాక్సైడ్, మీథేన్ వంటి వాయువులు స్వేచ్ఛగా లోపలికి, బయటకు ప్రవహిస్తాయని నోబెల్ కమిటీ వెల్లడించింది. ఈ మాలిక్యులర్ నిర్మాణాలు, లోహ సేంద్రియ చట్రాలు ఎడారిలో గాలి నుంచి నీటిని సేకరించడానికి, కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించడానికి, విషపూరిత వాయువులు లేదా ఉత్ప్రేరక రసాయన ప్రతిచర్యలను నిల్వ చేయడానికి తోడ్పడుతాయని తెలియజేసింది. ముగ్గురు సైంటిస్టులు వేర్వేరుగానే పనిచేశారు. స్థిరమైన మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధికి ఈ ముగ్గురి కృషి దోహదపడింది. 1989 నుంచి వారి పరిశోధనలు కొనసాగుతున్నాయి. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ ఇంటి నిర్మాణంలో కలప చట్రంతో పోల్చవచ్చు. ఈ నిర్మాణాలు వాయువులను లోపలికి పీల్చుకుంటాయి. అక్కడే నిల్వ చేసుకోగలవు. వాతావరణంలోని ప్రమాదకరమైన వాయువులను బంధించడానికి ఉపయోగపడగలవు. ఎడారుల్లో గాలి నుంచి నీటిని సులువుగా సంగ్రహించవచ్చు. ముగ్గురు సైంటిస్టులు తయారుచేసిన మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్‌ను నోబెల్ కమిటీ సభ్యుడు ఓలాఫ్ రామ్‌స్ట్రామ్ హ్యారీ పోటర్ సినిమాల్లోని హ్యాండ్‌బ్యాగ్‌తో పోల్చారు. ఈ సంచి పైకి చూడడానికి చాలా చిన్నగా ఉంటుంది, లోపల మాత్రం చాలా పెద్ది. 1901 నుంచి 2024 దాకా రసాయన శాస్త్రంలో 116 నోబెల్ ప్రైజ్‌లు ప్రకటించారు. 195 మంది సైంటిస్టులు ఈ బహుమతులు అందుకున్నారు. 2024లో ముగ్గురు శాస్త్రవేత్తలు డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్ జాన్ జంపర్‌కు ఉమ్మడిగా నోబెల్ లభించింది. 2025 సంవత్సరానికి గాను సాహిత్యంలో నోబెల్ విజేత పేరును నోబెల్ కమిటీ గురువారం ప్రకటించనుంది. నోబెల్ శాంతి బహుమతి విజేత పేరును శుక్రవారం వెల్లడిస్తారు. ఆర్థిక శాస్త్రంలో విజేతను సోమవారం ప్రకటించబోతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీన నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తారు.





ముంబైలో దీపావళి వేడుకలో పాల్గొన్న కీర్ స్టార్మర్, యశ్ రాజ్ ఫిల్మ్ స్టూడియోలో సౌండ్ మిక్సింగ్ డెస్క్ వద్ద, నటి రాణి ముఖర్జీతో కీర్ స్టార్మర్ కరచాలనం

ఎఫ్‌టీఏతో వృద్ధికి అద్భుత అవకాశాలు

- భారత్ సంకల్పానికి చోదకశక్తి
- బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ వెల్లడి
- 2 రోజుల పర్యటన కోసం భారత్‌కు
- నేడు ప్రధాని మోదీతో భేటీ

ముంబై: భారత్–యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తో భారత్‌లో వృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ చెప్పారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారత్ సంకల్పానికి ఇదొక చోదకశక్తిగా పని చేస్తుందని అన్నారు. ప్రగతికి ఇదొక లాంచ్‌ప్యాడ్ అని వెల్లడించారు. రెండు రోజుల భారత పర్యటన నిమిత్తం కీర్ స్టార్మర్ బుధవారం ముంబైకి చేరుకున్నారు. ఆయన వెంట 125 మంది ప్రతినిధులు సైతం వచ్చారు. వీరిలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు ఉన్నారు. రోల్స్ రాయిస్, బ్రిటిష్ టెలికాం, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బ్రిటిష్ ఎయిర్‌వేస్, బ్రిటిష్ ఫిలిం ఇనిస్టిట్యూట్, బ్రిటిష్ ఫిలిం కార్పొరేషన్, పైన్‌వుడ్ స్టూడియోస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు సైతం ఉండడం విశేషం. బ్రిటిష్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్టార్మర్ ఇండియాలో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది జూలైలో భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నామని స్టార్మర్ గుర్తుచేశారు. ఈ ప్రయాణం ఇక్కడితోనే ఆగదని, ఒప్పందం అంటే కేవలం ఒక కాగితం ముక్క కాదని వ్యాఖ్యానించారు. ఒప్పందం దేశ అభివృద్ధికి లాంచ్‌ప్యాడ్‌గా పనిచేస్తుందన్నారు. భారత్‌తో తమ వాణిజ్యం మరింత వేగవంతం, సులభతరం అవుతుందన్నారు. ఈ మేరకు స్టార్మర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

బ్రిటన్‌కు తిరిగొస్తున్న బాలీవుడ్

ముంబైలోని సబర్బన్ అంధేరీలో ఉన్న యశ్‌రాజ్ ఫిలింస్ స్టూడియోను కీర్ స్టార్మర్ సందర్శించారు. యశ్‌రాజ్ సంస్థ సీఈఓ అక్షయ్ విధానీ, చైర్‌పర్సన్ ఆదిత్య చోప్రా, ఆయన భార్య రాణి ముఖర్జీ తదితరులు స్టార్మర్‌ను కలిశారు. భారత సినీ నిర్మాణ సంస్థలు యూకేలో సినిమాలను చిత్రీకరించబోతున్నాయని, దీనివల్ల పెట్టుబడులు వస్తాయని, తమ దేశంలో ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్టార్మర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సినీ నిర్మాణానికి యూకే ఒక ప్రపంచ స్థాయి వేదిక అని చెప్పారు. ''బాలీవుడ్ మళ్లీ బ్రిటన్‌కు తిరిగివస్తోంది. వచ్చే ఏడాది మూడు బాలీవుడ్ చిత్రాలు బ్రిటన్‌లో నిర్మాణం కానున్నాయి. దీనివల్ల మా దేశానికి లబ్ధి చేకూరుతుంది. ఇది కూడా వాణిజ్య ఒప్పందం లాంటిదే. సినిమాల చిత్రీకరణ వల్ల రెండు దేశాల మధ్య సాంస్కృతి సంబంధాలు బలపడతాయి'' అని స్టార్మర్ తెలిపారు.

ఫుట్‌బాల్ మైదానానికి స్టార్మర్

బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ ముంబైలోని కూపరేజ్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించారు. ఆయన వెంట ప్రముఖ సాకర్ ఆటగాడు మైఖైల్ ఓవెన్ కూడా ఉన్నారు. యువ క్రీడాకారులతో, కోచ్‌లతో వారు ముచ్చటించారు.

స్టార్మర్ పర్యటన చరిత్రాత్మకం: మోదీ

భారత పర్యటనకు వచ్చిన కీర్ స్టార్మర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. ఆయన పర్యటన చరిత్రాత్మకమని ఉద్ఘాటించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. గురువారం స్టార్మర్‌తో జరిగే సమావేశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని వెల్లడించారు.

దళితులు ఏ స్థాయిలో ఉన్నా ఆగని దాడులు: ఖర్గే

బెంగళూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దళిత పౌరులకు గౌరవం దక్కడం లేదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మామూలు వ్యక్తికైనా, ఉన్నత పదవిలో ఉన్న వారికైనా ఇదే పరిస్థితి ఉందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఇటీవల ఓ లాయర్ కోర్టు రూంలోనే బూటు విసిరేందుకు యత్నించిన ఘటనను ఉదహరించారు. ఆ లాయర్‌ను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకోగా, 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు'అంటూ అతడు కేకలు వేశాడు. దీనిని ప్రస్తావిస్తూ ఖర్గే..మనుస్మృతి, సనాతన ధర్మం పేరుతో ప్రజల హక్కుల్ని కాలరాయాలనుకునే వారిని, సమాజంలో శాంతికి భగ్నం కలిగించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు.

దగ్గు సిరప్ వివాదం.. కాంచీపురం యూనిట్ మూసివేత

చెన్నై/కాంచీపురం: మధ్యప్రదేశ్‌లో 20 మంది వరకు చిన్నారుల మృతికి కారణమని భావిస్తున్న దగ్గు మందు తయారీ ప్లాంట్‌ను తమిళనాడు ప్రభుత్వం మూసివేసింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో సిరప్ కోల్డ్రిఫ్ తాగిన చిన్నారులు కిడ్నీలు ఫెయిలై మృత్యువాత పడుతున్నారన్న ఆరోపణలతో ఈ సిరప్ విక్రయాలపై తమిళనాడు ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీనే నిషేధం విధించింది. మార్కెట్‌లో ఉన్న స్టాక్‌ను తొలగించాలని స్పష్టం చేసింది. సిరప్‌లో ప్రమాదకర రసాయనా లున్నాయంటూ పరీక్షలు జరిపిన రాష్ట్ర ఔషధ విభాగం ప్రకటించింది. తక్షణమే కోల్డ్రిఫ్ ఉత్పత్తిని నిలిపివేయాలని కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ మందును మధ్యప్రదేశ్, కేరళ కూడా నిషేధించాయి. కోల్డ్రిఫ్ సిరప్ విక్రయాలను నిలిపివేయాలంటూ పుదుచ్చేరి, ఒడిశా ప్రభుత్వాలను కూడా అప్రమత్తం చేసింది. కోల్డ్రిఫ్‌లో ప్రమాదకర డైఇథిలీన్ గ్లైకాల్ 48.6 శాతం కనిపించడంపై వివరణ ఇవ్వాలని కంపెనీకి రెండో సారి నోటీసు ఇచ్చామని మంత్రి మా సుబ్రమణియన్ చెప్పారు. ఇప్పటికే ఇదే విషయంలో ఈ నెల 3న మొదటి నోటీసు పంపించామన్నారు. కంపెనీ వివరణ ఎలా ఉన్నా చట్టపరమైన క్రిమినల్ చర్యలు మాత్రం తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు నోటీసులకు స్పందించని ఆ కంపెనీ పూర్తిస్థాయి మూసివేతకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు.

చెన్నైలో మధ్యప్రదేశ్ సిట్

కోల్డ్రిఫ్ మరణాలపై దర్యాప్తునకు ఏర్పాటైన మధ్యప్రదేశ్ సిట్ బృందం చెన్నైకి చేరుకుంది. చెన్నైలోని ఫార్మా కంపెనీ కార్యాలయానికి వెళ్లి, అవసరమైన పత్రాలను సేకరించింది. అదేవిధంగా, కాంచీపురంలోని సీల్ వేసిన కంపెనీ యూనిట్‌ను పరిశీలించింది. అవసరమైన వివరాలను తెల్సుకుంది.

బిహార్‌లో 25 మంది పేర్లను ఖరారు చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై మహాఘట్‌బంధన్ పక్షాలతో చర్చలు కొనసాగిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం బుధవారం 25 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. ఇందిరాభవన్‌లో జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) భేటీలో పార్టీ చీఫ్ ఖర్గే, అగ్ర నేత సోనియా గాంధీలతోపాటు వర్చువల్‌గా రాహుల్ గాంధీ కూడా పాల్గొని, చర్చలు జరిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్ కూడా ఇందులో పాలుపంచుకున్నారు. కాంగ్రెస్‌కు పట్టున్నవి, ఇప్పటికే మిత్ర పక్షాల పొత్తులో తేలిన సీట్లకు అభ్యర్థుల ఎంపికపై ప్రధానంగా చర్చ జరిగిందని బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ రామ్ చెప్పారు. కూటమిలో ఏ పార్టీకి ఎన్ని సీట్లనే విషయం ఉమ్మడిగా ప్రకటిస్తామని చెప్పారు.

40 సీట్లివ్వకుంటే ఎన్డీయేతో కటీఫ్

జన్ సురాజ్ పార్టీతో పొత్తుకు చిరాగ్ పాశ్వాన్ సంకేతాలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీయే కూటమిలో సీట్ల పంపిణీ వ్యవహారం విభేదాలను తీవ్రతరం చేసింది. అసెంబ్లీలోని 243 సీట్లకు గాను చెరో 100 చోట్ల పోటీ చేయాలనే విషయంలో ప్రధానమైన బీజేపీ, జేడీయూల మధ్య అంగీకారం కుదిరింది. ఇప్పటి వరకు బాగానే ఉన్నా..కూటమిలో భాగంగా ఉన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జనశక్తి (రాంవిలాస్ పాశ్వాన్)తోనే అసలు చిక్కుమొదలైంది. ఆ పార్టీ 40 సీట్లు డిమాండ్ చేస్తుండగా, బీజేపీ, జేడీయూలు మాత్రం 25 వరకు కేటాయించేందుకు ముందుకువచ్చాయి. అయితే, తాము గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు చోట్లా విజయం సాధించి నూటికి నూరు శాతం ఫలితాలను సాధించామంటూ ఆ పార్టీ వాదిస్తోంది. ఆ మేరకు, 40 సీట్లు ఇవ్వాల్సిందేనంటూ గట్టిగా కోరుతోంది. ఆ పార్టీ కోరుతున్న కొన్ని సీట్లలో బీజేపీ సిట్టింగ్‌లు ఉండటంతో కాషాయ పార్టీ వెనుకాడుతోంది. దీనిపై జరుగుతున్న చర్చల్లో ఏ విషయమూ కొలిక్కి రావడం లేదు. తొందరగా తేల్చని పక్షంలో తాము ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీతో పొత్తుకు సైతం వెనుకాడబోమనే సంకేతాలను ఆ పార్టీ పంపించింది. 'బిహార్ ముందు..బిహారీలే ముందు' నినాదంతో యువతను ఆకట్టుకునేలా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు చిరాగ్ పాశ్వాన్. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ 20 వేల నుంచి 25 వేల వరకు ఓట్లను ప్రభావితం చేయగల సత్తా ఉన్న పార్టీ మిత్ర పక్షంగా ఉండటంపై ప్రశాంత్ కిశోర్ కూడా ఆసక్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే 'అన్ని దారులు తెరిచే ఉన్నాయి'అంటూ రెండు పార్టీల నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పొత్తు అంశానికి మరింత బలం చేకూరుస్తున్నాయి.



బాల్యం 'కిడ్నాప్' అవుతోంది


చిన్నారులపై ఏటా పెరుగుతున్న నేరాలు

- 2023లో దేశంలో 1,77,335 కేసులు నమోదు
- 2022తో పోలిస్తే ఏపీలో తగ్గిన తగ్గిన కేసులు
- ఛార్జిషీటు నమోదు రేటులో ఏపీ టాప్-2
- ఎన్‌సీఆర్‌బీ - 2023 నివేదికలో వెల్లడి

దేశంలో చిన్నారులపై నేరాలు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయిగానీ తగ్గడం లేదు. 2021లో 1.49 లక్షల నుంచి 2022లో 1.62 లక్షలకు, 2023లో 1,77,335కి పెరిగాయి. 2023లో మొత్తం బాధితుల సంఖ్య 1,86,521. 28 రాష్ట్రాల్లో.. 10వేలకుపైగా బాధితులు ఉన్న రాష్ట్రాలు 6 ఉండటం గమనార్హం. మొత్తం కేసుల్లో కిడ్నాపులు / అపహరణలే అత్యధికం కావడం ఆందోళనకరం. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో 2022తో పోలిస్తే కేసులు పెరగ్గా, ఆంధ్రప్రదేశ్‌లో తగ్గాయి. అత్యధిక నేరాలు జరిగిన టాప్ –15 రాష్ట్రాల జాబితాలో కూడా ఏపీ లేకపోవడం గమనార్హం.


- సాక్షి, స్పెషల్ డెస్క్

ఆ మూడు రాష్ట్రాలు.. మొత్తం కేసుల సంఖ్యలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, యూపీల్లోనే మూడొంతులకు పైగా నమోదయ్యాయి.




మధ్యప్రదేశ్‌లో అత్యధికం

2022తో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో చిన్నారులపై నేరాల సంఖ్య తగ్గింది, తెలంగాణలో పెరిగింది. 2023లో మొత్తం కేసుల సంఖ్య పరంగా చూస్తే.. ఆంధ్రప్రదేశ్.. అత్యధిక నేరాలు జరిగిన టాప్-15 రాష్ట్రాల జాబితాలో కూడా లేదు. తెలంగాణ టాప్-15 జాబితాలో ఉంది.



బాల నేరస్థులు


దేశంలో 18 ఏళ్లలోపు వారు చేసే నేరాల సంఖ్య 2022లో 30,555 కాగా, 2023లో 31,365కి పెరిగింది.



ఛార్జిషీట్ రేటు

చిన్నారులపై నేరాలకు సంబంధించి ఛార్జిషీటింగ్‌లో దేశ సగటు 64.3 శాతం. అత్యధిక ఛార్జిషీటింగ్ రేటు ఉన్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో ఇది 72.6 శాతం. 28 రాష్ట్రాల్లో.. 13 చోట్ల ఈ రేటు 70 శాతంలోపే ఉండటం ఆందోళనకరం.

అత్యధిక ఛార్జిషీటింగ్ రేటు ఉన్న రాష్ట్రాలు




కిడ్నాపులు / అపహరణలు

దేశంలో చిన్నారులపై జరిగే నేరాల్లో.. కిడ్నాపులే అత్యధికం కావడం ఆందోళన కలిగించే అంశం. 2022లో ఈ తరహా కేసులు మొత్తం 1,07,588 నమోదు కాగా.. 2023లో ఈ సంఖ్య 1,13,564కి పెరిగింది. 2023లో బాల్య వివాహాల కోసం బాలికల కిడ్నాపుల కేసులు 14,637 నమోదయ్యాయి.

లైంగిక నేరాలు

2019 నుంచి చూస్తే పోక్సో కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.



జూబ్లీహిల్స్‌ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్

- అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ
- సీనియర్లు పోటీపడినా యువనేత వైపు మొగ్గిన అధిష్టానం
- కుల, యువ ఓట్లు దక్కించుకోవచ్చనే వ్యూహం



సాక్షి, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిగా నవీన్‌యాదవ్ పేరును ప్రకటించింది. కొద్దిరోజులుగా అనేక ఊహాగానాలు వినిపించినా చివరకు యువ నాయకుడు నవీన్ యాదవ్ వైపే అధిష్టానం మొగ్గు చూపింది. ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) బుధవారం రాత్రి అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ ఉప ఎన్నిక అభ్యర్థిపై గత కొద్ది రోజులుగా పార్టీలో తీవ్రస్థాయిలో మంతనాలు జరిగాయి. పలువురు ఆశావహులు ఢిల్లీ స్థాయిలో గట్టి లాబీయింగ్ నడిపారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం పలు సర్వేలు, స్థానిక నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. చివరకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో నవీన్ యాదవ్ పేరును ఖరారు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

యువత, సామాజికవర్గం ఓట్లే లక్ష్యంగా..

నియోజకవర్గంలో యువ నాయకుడిగా, స్థానికంగా మంచి పట్టున్న నేతగా నవీన్ యాదవ్‌కు పేరుంది. ఆయన తండ్రి బంజారాహిల్స్ కార్పొరేటర్‌గా పనిచేయడం, నియోజకవర్గంలోని ఓటర్లతో తన కుటుంబానికి సత్సంబంధాలు ఉండటం ఆయనకు కలిసివచ్చే అంశాలుగా పార్టీ అధిష్టానం భావించింది. యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం, యువతలో మంచి ఆదరణ ఉండటంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని హైకమాండ్ అంచనా వేసింది. ఈ సమీకరణాలన్నింటినీ బేరీజు వేసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.

మేయర్‌పై కాంగ్రెస్ - ఎంఐఎంల మధ్య ఒప్పందం

బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిపై కాంగ్రెస్-ఎంఐఎంల మధ్య ఒప్పందం కుదిరిందని బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ చీకటి ఒప్పందం కారణంగానే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎంఐఎం మద్దతు తెలుపుతోందన్నారు. దీంతో ఆగమేఘాల మీద జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కబ్రస్తాన్‌లకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. బుధవారం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎంఐఎం అభ్యర్థే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కాబోతున్నారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో గతంలో పోటీచేసిన మజ్లిస్ పార్టీ ఇప్పుడు ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. పొరపాటున ఎంఐఎం అభ్యర్థి హైదరాబాద్ మేయర్ అయితే భైంసా మాదిరిగా ఇక్కడ పరిస్థితి మారుతుందని రఘునందన్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. భైంసాలో హిందువుల బస్తీలకు నీళ్లు కూడా వదలని పరిస్థితి ఉందని చెప్పారు.

నేడు వైఎస్ జగన్ అనకాపల్లి, విశాఖ జిల్లాల పర్యటన



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ (గురువారం) అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం (ఎన్ఏడీ జంక్షన్, వేపకుంట, పెందుర్తి, కొత్తూరు జంక్షన్, తాళ్ళపాలెం జంక్షన్ మీదుగా) వెళతారు. అక్కడ కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా నిర్మాణం నిలిపి వేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి విశాఖపట్నం కేజీహెచ్ (వయా తాళ్ళపాలెం జంక్షన్, కొత్తూరు జంక్షన్, పెందుర్తి, వేపకుంట, ఎన్ఏడీ జంక్షన్)కు చేరుకుంటారు. విషజ్వరాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులను పరామర్శిస్తారు. సాయంత్రం అక్కడి నుంచి తిరుగు పయనమవుతారు.

ప్రధాని మోదీకి వైఎస్ జగన్ శుభాకాంక్షలు

పాతికేళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. 'పాలనాధిపతిగా విశిష్ట సేవలందిస్తూ.. 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టినందుకు నరేంద్ర మోదీకి అభినందనలు. దేశ సేవలో ఆయన అంకితభావం, పట్టుదల, నిబద్ధతను ప్రతిబింబించే గొప్ప మైలురాయి ఇది. ఈ సందర్భంగా.. ఆయనకు మరింత శక్తి కలగాలని, మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

‘ఎస్‌ఎల్‌బీసీ’ కాంట్రాక్ట్ రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

అంశంపై నల్లగొండ సీఈ చేసిన పలు ప్రతిపాదనలపై గత నెల 12న నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అధ్యక్షతన సమావేశమైన స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ విస్తృతంగా చర్చించి ఈ మేరకు రెండు ప్రత్యామ్నాయాలను సర్కారుకు సూచించింది. ఒక వేళ ఒప్పందాన్ని రద్దు చేస్తే కొత్త నిర్మాణ సంస్థతో పనులు చేయిస్తే తీవ్ర జాప్యంతోపాటు పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా ఆర్థిక భారం సైతం పడనుందని తేల్చి చెప్పింది. అర్ధంతరంగా నిలిచిపోయిన సొరంగం నిర్మాణ పనులను చేపట్టే విషయంలో సాంకేతిక సమస్యలూ ఎదురవుతాయని స్పష్టం చేసింది. ఎస్‌ఎల్‌ఎస్సీ సిఫారసులను త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం చర్చించి కీలక నిర్ణయం తీసుకోనుంది.

మళ్లీ అంచనాలను పెంచొద్దు

ఒకవేళ జేపీ అసోసియేట్స్‌తోనే ఒకటో సొరంగం పనులు కొనసాగిస్తే రెండోసారి సవరించి అంచనాల మేరకు మిగులు పనుల వ్యయం రూ.1157.42 కోట్లకు మించకుండా సీలింగ్ విధించాలని స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. నవీకరించిన పనుల షెడ్యూల్ ప్రకారం పనుల గడువును 2028 జూన్ 30కి పెంచేందుకు ఓకే చెప్పింది. సీఈ, రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరుతో సంయుక్తంగా నిర్వహించే ఎస్క్రో అకౌంట్‌కే బిల్లులు చెల్లించాలని సూచించింది.

అత్యాధునిక టెక్నాలజీతో పనులు చేస్తాం ..: జేపీ అసోసియేట్స్

- ప్రాజెక్టులో భాగంగా రెండు సొరంగాలను తవ్వాల్సి ఉండగా, 7.13 కి.మీ.ల రెండో సొరంగం తవ్వకాలు పూర్తి కాగా, 2.8 కి.మీ.ల మేర లైనింగ్ పనులు జరగాల్సి ఉంది.
- 43.93 కి.మీ.ల తొలి సొరంగం పనులకుగాను రెండు వైపుల నుంచి మొత్తం 34.38 కి.మీ.ల మేర పనులు పూర్తయ్యాయి. మధ్యలో 9.541 కి.మీ.ల సొరంగం తవ్వకాలు జరగాల్సి ఉంది.
- గత ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలి కార్మికులు మృతిచెందడంతో పనులు నిలిచిపోయాయి.
- రెండోసారి సవరించిన అంచనాల ప్రకారం ఒకటో సొరంగానికి సంబంధించి రూ.1,157.42 కోట్లు, రెండో సొరంగానికి సంబంధించి రూ.57.08 కోట్లు విలువైన పనులు జరగాల్సి ఉంది.
- ఇప్పటివరకు టన్నెల్ బోరింగ్ మెషీన్ల(టీబీఎం)తో సొరంగాల తవ్వకాలు జరగగా, ఇటీవల జరిగిన ప్రమాద నేపథ్యంలో ఇతర అత్యాధునిక పద్ధతుల్లో ఇదే వ్యయంతో పనులు చేసేందుకు జేపీ అసోసియేట్స్ పలు షరతులతో సంసిద్ధత వ్యక్తం చేసింది.
- 2028 ఆగస్టు 30 వరకు గడువు పొడిగించడంతో పాటు బిల్లుల చెల్లింపు షెడ్యూల్‌లో మార్పులు చేయాలని, బిల్లులను సమర్పించిన 24 గంటల్లోనే గ్రీన్ చానల్ ద్వారా చెల్లింపులు జరపాలని, రూ.35.14 కోట్ల పెండింగ్ బిల్లులు, రూ.104 కోట్ల విద్యుత్ చార్జీలు చెల్లించాలనే షరతులను విధించింది.

అడ్లూరికి పొన్నం సారీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆ మాట అనకపోయినా పత్రికల్లో వచ్చిన దాని ప్రకారం లక్ష్మణ్ బాధ పడ్డారని తెలిసిందని, అందుకు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్టు తెలిపారు. కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గం, తామంతా కలిసి పెరిగినట్టు చెప్పారు. కాగా ఇద్దరు మంత్రులతో జరిగిన సమావేశంలో మరో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

30 ఏళ్ల స్నేహబంధం మాది : పొన్నం ప్రభాకర్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తనకు సోదరుని వంటివారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఇద్దరు మంత్రుల మధ్య సమన్వయం కుదిరిన అనంతరం పొన్నం మీడియాతో మాట్లాడారు. ‘కాంగ్రెస్ పార్టీలో మాకు 30 సంవత్సరాలుగా ఉన్న స్నేహబంధం రాజకీయాలకు మించినదే. మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం ఎప్పుడూ అలాగే కొనసాగింది. నేను ఆయనపై ఎటువంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదు. అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన వ్యక్తిగా, బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా, నాకు ఎవరిపైనా అలాంటి అభిప్రాయం ఉండదు. అయితే..రాజకీయ దురుద్దేశంతో కొంతమంది నా వ్యాఖ్యలను వక్రీకరించి, వాస్తవానికి భిన్నంగా ప్రచారం చేశారు. దాంతో ఏర్పడిన అపార్థాల వల్ల అన్న లాంటివారు అయిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మనసు నొచ్చుకుందని తెలిసి నేను తీవ్రంగా విచారిస్తున్నాను. ఆయన మనసు నొచ్చుకొని ఉంటే చింతిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో, రాహుల్‌గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం సాధనలో, ప్రజల అభ్యున్నతికై మేము ఇద్దరం కలిసికట్టుగా కృషి చేస్తాం’అని చెప్పారు.

గురుకుల భవనాలకు తాళాలు వేసే దుస్థితి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా వ్యవస్థలో దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ సంక్షేమ గురుకుల భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత విచారకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గురుకుల భవనాల అద్దె బకాయిలు నెలల తరబడి పేరుకు పోయినా, ప్రభుత్వం స్పందించకపోవడాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ‘గురుకుల విద్యా సంస్థల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థత, చేతకానితనానికి నిదర్శనం. విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి ఏడాది కాలంగా గురుకుల భవనాలకు అద్దె చెల్లించడం లేదు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన అత్యుత్తమ గురుకుల వ్యవస్థను కుప్పకూల్చి, కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేసే కుట్రకు రేవంత్ పాల్పడుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. 22 నెలల పాలనలో రూ.రెండున్నర లక్షల కోట్ల అప్పు తెచ్చిన రేవంత్ ప్రభుత్వం, గురుకుల భవనాల అద్దె కూడా కట్టకుండా ఎవరి జేబులు నింపుతున్నదో లెక్కలు చెప్పాలి. గురుకులాలు మూసివేస్తే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉద్యమించి సీఎం రేవంత్‌కు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్తాం’అని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో వ్యవసాయ సంక్షోభంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఈ బలవన్మరణాలకు సీఎం రేవంత్‌రెడ్డియే పూర్తి బాధ్యుడని కేటీఆర్ విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు తగ్గిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

జేఈఈ సిలబస్ మార్చాల్సిందే..

▶ మొదటి పేజీ తరువాయి

నెలకొంది. దీంతో ప్రైవేటు కాలేజీలకు వెళ్తేనే ర్యాంకులొస్తాయనే ఆలోచనల్లోకి విద్యార్థులు వెళ్తున్నారు. ఫలితంగా గత కొన్నేళ్ళుగా జేఈఈ పరీక్షను సీరియస్‌గా రాసే వారి సంఖ్య తగ్గుతోంది. గతంలో 16 లక్షల మంది దరఖాస్తు చేస్తే, 15.9 లక్షల మంది పరీక్ష రాసేవారు. మూడేళ్ళుగా 12 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నా, పరీక్ష రాసేవారి సంఖ్య 11 లక్షలకు మించడం లేదు. ప్రశ్నలు తికమకగా ఉంటున్నాయని, సుదీర్ఘంగా ఇస్తున్నారనే అభిప్రాయం విద్యార్థుల నుంచి వ్యక్తమవుతోంది. అడ్వాన్స్‌డ్ సాధించాలంటే తీవ్ర స్థాయిలో కసరత్తు చేయాల్సి వస్తోంది. ఈ దిశగా కాలేజీలు విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని, ఐఐటీల్లో సీట్లు వచ్చినా విద్యార్థులు కుంగుబాటుకు గురవుతున్నారని రాష్ట్రాలు తెలిపాయి.

సబ్జెక్టుల ప్రశ్నల్లో మార్పులు చేయాలి

ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్‌లో కొన్ని చాప్టర్ల నుంచి ఇచ్చే ప్రశ్నలను సరళతరం చేయాలని రాష్ట్రాలు కేంద్రానికి సూచించాయి. కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు తేలికగా అర్థం చేసుకుని, సులభంగా జవాబు ఇచ్చేలా ప్రశ్నలు ఉండాలని తెలిపాయి. మోడ్రన్ ఫిజిక్స్‌లో ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్, డీ బ్రోగ్లె వేవ్‌లెంత్, అటమిక్ మోడల్స్‌ను మార్చాలని సూచించాయి. ఫ్లూయిడ్ మెకానిక్స్, థర్మోడైనమెట్స్‌ను సరళతరం చేయా లని పేర్కొన్నాయి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ నైటిక్స్, థర్మోడైనమిక్స్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో కో-ఆర్డినేషన్ కాంపౌండ్స్, పీరియాడిక్ ప్రాపర్టీస్ నుంచి సరళంగా ప్రశ్నలి వ్వాలని సూచించాయి. ఆర్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ మెకానిజం, నేమ్ రియాక్షన్, స్టీరియో కెమిస్ట్రీ చాప్టర్లలో ప్రశ్నలను పరిశీలించాలని తెలిపాయి. మేథ్స్‌కు సంబంధించి కూడా ప్రశ్నలు విద్యార్థులు తేలికగా రాయగలిగేలా ఉండాలని రాష్ట్రాలు కోరాయి.



ఆర్టీఐ అవార్డుల కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆహ్వానిస్తున్న ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు

ఆర్టీఐ అవార్డుల ప్రదానం నేడు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నామని ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2025 సంవత్సరానికిగాను ఆర్టీఐ విజేతలకు గురువారం రవీంద్రభారతిలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డులు అందజేయనున్నారని ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. మొత్తం ఏడు కేటగిరీలుగా పురస్కారాలను అందజేయనున్నట్టు తెలిపారు.

అభ్యర్థులు స్థానిక ఓటరులై ఉండాలి

- ఎన్ని స్థానాల్లో అయినా నామినేషన్లు వేయొచ్చు
- ఒక్క స్థానంలోనే పోటీ చేయాలి
- సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి



సాక్షి, హైదరాబాద్: తొలిదశ స్థానిక ఎన్ని కలకు గురువారం నోటిఫికేషన్లు జారీ కానుండగా, వెనువెంటనే నామినేషన్లు స్వీకరించనున్నారు. అయితే నామినేషన్ల దాఖలు విషయంలో అభ్యర్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

- ➡ ఫారం-4 (అనుబంధం-3)లో ఉన్న నమూనాలో నామినేషన్ పత్రం ఉండాలి
- ➡ ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసేవారు సంబంధిత ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదై ఉండాలి
- ➡ పోటీ చేసే అభ్యర్థి, ప్రతిపాదించే వ్యక్తి ఇద్దరి పేర్లు మండల, జిల్లా పరిషత్ ఓటర్ల జాబితాల్లో ఉండాలి
- ➡ ఒక స్థానానికి ఒక అభ్యర్థిని వివిధ వ్యక్తులు ప్రతిపాదించవచ్చు
- ➡ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో ఒకటి కంటే ఎక్కువ స్థానాల్లో నామినేషన్ వేయొచ్చు కాని ఒక దాంట్లోనే పోటీ చేయాలి.
- ➡ ఒక ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానంలో పోటీ చేయొచ్చు
- ➡ రిటర్నింగ్ అధికారికి నిర్దేశిత ప్రదేశంలో నామినేషన్లు అందజేయాలి
- ➡ గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీ లేదా రిజర్వ్‌డ్ చిహ్నం కలిగి రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీ ద్వారా పోటీ చేస్తున్న అభ్యర్థి, నోటిఫికేషన్ ఫారమ్-2లో ఆ పార్టీ పేరు నమోదు చేయాలి. రాజకీయ పార్టీ నుంచి పొందిన అభ్యర్థిత్వ ధ్రువీకరణ ఫారమ్-బీ నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ సాయంత్రం 3 గంటల లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి
- ➡ రిజర్వ్ గుర్తు లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఎస్ఈసీ సూచించిన రిజర్వ్ కాని (ఫ్రీ) చిహ్నాల జాబితా నుంచి ప్రాధాన్యతా క్రమంలో మూడు చిహ్నాలను ఎంపిక చేసుకుని నామినేషన్ పత్రంలో సూచించాలి

నామినేషన్ ఫారానికి జత చేయాల్సిన డిక్లరేషన్లు

- ➡ ఎస్సీ, ఎస్టీ, బీసీ హోదాకు సంబంధించిన డిక్లరేషన్లు
- ➡ ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం రిజర్వ్ చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారం (అనుబంధం-3తో సంబంధిత కులం, తెగ, తరగతికి చెందినవారిగా ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- ➡ ఎస్సీ, ఎస్టీ, బీసీఅభ్యర్థులు పోటీకి డిపాజిట్ చేసే మొత్తంలో రాయితీకి అర్హులు
- ➡ రిటర్నింగ్ అధికారి ప్రతిరోజు తాను స్వీకరించిన నామినేషన్ల వివరాలను ఫారమ్-5లో ప్రచురించాలి.

సాక్షి హైదరాబాద్

గురువారం । 9 । అక్టోబర్ । 2025



ఇరకాటం!

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు క్లిష్టంగా మారాయి. కొత్త కండువా వేసుకుని తమ అనుచరులకు ప్రచారం చేయలేని పరిస్థితి నెలకొంది. -10లో



సీజన్‌లో నిండుగా.. సిటీలో 'పండు'గ

ప్రస్తుతం సీతాఫల్ (కస్టర్డ్ ఆపిల్) సీజన్ ప్రారంభమైంది. అక్టోబర్ నెలలో నగరంలోని రెస్టారెంట్ డెజర్ట్ మెనూలకు ఈ క్రీమీ ఫ్రూట్ కొత్త రుచులను అద్దుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటిపూట పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.







కోడ్ కూసింది!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో క్షేత్ర స్థాయిలో జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అప్రమత్తమైంది. జూబ్లీహిల్స్‌తో పాటు ఖైరతాబాద్ నియోజక వర్గంలోని ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను బల్దియా సిబ్బంది తొలగిస్తున్నారు. బుధవారం రాజకీయ నేపథ్యమున్న విగ్రహాలను దుస్తులతో మూసివేశారు. ఆయా కూడళ్లలోని పార్టీ జెండాలను సైతం తొలగించారు. ఇప్పటికే బస్టాప్‌లలో ఉన్న ఫ్లెక్సీలను, బస్తీల్లో ఉన్న రాజకీయ నేతల ఫ్లెక్సీలను కూడా జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. మరో వైపు గోడలపై రాసిన రాతలను చెరిపేసేందుకు రంగులను తీసుకొచ్చి సిబ్బంది శ్రమిస్తున్నారు. - ఫిలింనగర్

ఎన్నికల ప్రవర్తన నియమావళి.. 'జూబ్లీహిల్స్' వరకే

షేక్‌పేట తహసీల్దార్ ఆఫీస్‌లో ఆర్‌ఓ కార్యాలయం

- 13 నుంచి నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు
- ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు
- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రతినిధులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ప్రవర్తన నియమావళి)పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రవర్తన నియమావళికి లోబడే ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. నియమావళి ఉల్లంఘిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రాపర్టీలపై ఎలాంటి రాజకీయ ప్రకటనలు ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రైవేట్ ప్రాపర్టీ లపై ప్రచార ప్రకటనలు పెడితే అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే తొలగించిన ప్రదేశాలలో అనుమతి లేకుండా మళ్లీ ప్రచార ప్రకటనలు పెడితే బాధ్యులపై కేసులతో పాటు వాటిని తొలగించేందుకయ్యే ఖర్చును కూడా బాధ్యుల పార్టీ ఖాతాల్లో వేస్తామని తెలిపారు.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే ..

ఎన్నిక జరిగే అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్ర రాజధాని లేదా మెట్రోపాలిటన్ నగరాలు లేదా మున్సిపల్ కార్పొరేషన్లలో ఉంటే ఎన్నికల ప్రవర్తన నియామవళి కేవలం ఆ అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే వర్తిస్తుందన్న నిబంధనలను కేంద్ర ఎన్నికల సంఘం వెలువరించిందన్నారు. ఈ నిబంధనల ప్రకారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్ర రాజధానితో పాటు మెట్రోపాలిటన్ నగరంలో ఉన్నందున కేవలం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. షేక్‌పేట తహసీల్దార్ ఆఫీస్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేసినట్లు కర్ణన్ తెలిపారు. ఈ నెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణకు పటిష్ట భద్రత చర్యలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ఉప ఎన్నికలో ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని చెప్పారు. హైదరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీపీ అపూర్వ రావు, రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం, రాజకీయ పార్టీల తరఫున కె.నందేశ్ కుమార్ (బీఎస్పీ), కొల్లూరు పవన్ కుమార్, ఎల్.దీపక్ (బీజేపీ), విజయ్ మల్లంగి (ఆప్), ఎం. శ్రీనివాసరావు (సీపీఐఎం), పి.రాజేశ్ కుమార్, మహ్మద్ వాజీద్ హుస్సేన్, ఎ.రాఘవేందర్ (కాంగ్రెస్), ఎ. శ్రీనివాస్ గుప్తా, కె. మాధవ్, కిషోర్ గౌడ్ (బీఆర్‌ఎస్), ప్రశాంత్ రాజ్ యాదవ్ (టీడీపీ), సయ్యద్ ఖలీలుద్దీన్ (ఎంఐఎం) పాల్గొన్నారు.

ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో రాజకీయ ప్రచార ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సీపీఆర్వో విభాగంలో ఎంసీఎంసీ, మీడియా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

తుపాకీ విక్రయానికి పండ్ల వ్యాపారుల యత్నం

పట్టుకున్న సీసీఎస్ స్పెషల్ క్రైమ్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: ఝార్ఖండ్ నుంచి వలస వచ్చి నగరంలో పండ్ల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి తేలిగ్గా డబ్బు సంపాదించడానికి తుపాకీ విక్రయానికి యత్నించాడు. ఈ విషయంపై సమాచారం అందుకున్న సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అతడితో పాటు మరొకరిని పట్టుకున్నట్లు అదనపు సీపీ (నేరాలు) ఎం.శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. ఝార్ఖండ్‌కు చెందిన విజయ్ యాదవ్ నగరానికి వలసవచ్చి లింగంపల్లిలో నివసిస్తున్నాడు. వివిధ బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపుల వద్ద పండ్లు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించిన ఇతగాడు నాటు తుపాకుల్ని తీసుకువచ్చి విక్రయించాలని భావించాడు. మూడు నెలల క్రితం బీహార్ వెళ్లి అక్కడి సోను కుమార్ నుంచి రూ.58 వేలకు 0.7 ఎంఎం క్యాలిబర్ నాటు పిస్టల్ ఖరీదు చేసుకువచ్చాడు. దీన్ని నగరంలోని అసాంఘిక శక్తులకు అమ్మడానికి సహకరించాల్సిందిగా సంతోష్‌నగర్‌లో ఉంటున్న తోటి పండ్ల వ్యాపారి బుంటి కుమార్ యాదవ్‌ను కోరారు. కొన్ని రోజులుగా ఇతగాడు ఆ అక్రమ ఆయుధం అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడు. ఏసీపీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బి.బిక్షపతి నేతృత్వంలోని బృందం ఫలక్‌నుమా ప్రాంతంలో వలపన్ని బుంటి కుమార్‌ను పట్టుకుంది. విజయ్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి తుపాకీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించింది.

ఊహించినట్టే..

నవీన్ యాదవ్‌ను వరించిన కాంగ్రెస్ టికెట్

- బీసీ కార్డుతో పాటు స్థానికుడికే అవకాశం
- ఇప్పటికే అధికార కాంగ్రెస్ అభివృద్ధి మంత్రం

సాక్షి, సిటీబ్యూరో

ఊహించినట్టే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు ఖరారైంది. కాంగ్రెస్ అధిష్టానం బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వడంతో పాటు స్థానికుడికి అవకాశం కల్పించింది. అధికార పార్టీ కావడంతో పలువురు సీనియర్లు, హేమాహేమీలు పోటీ పడినప్పటికీ.. యువ నేత అభ్యర్థిత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చడంతో ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేసి.. ఎన్నికల బరి నుంచి తప్పించింది కాంగ్రెస్ అధిష్టానం. గత ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ అసెంబ్లీ లేదా సికింద్రాబాద్ ఎంపీ సీటు హామీతో కాంగ్రెస్‌లో చేరిన నవీన్ యాదవ్‌కు లైన్ క్లియర్ అయింది.

రెండుసార్లు పోటీ

- ఇప్పటికే జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి నవీన్ యాదవ్ రెండు పర్యాయాలు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పక్షాన పోటీ చేసి 41వేల 656 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు.
- ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ ఎన్నికల బరికి దూరం పాటించడంతో.. ఆ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 18వేల 817 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరినా.. పార్టీ టికెట్ దక్కలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే మృతితో ఉప ఎన్నిక అనివార్యం కావడంతో ఇప్పుడు అవకాశం దక్కినట్లయింది.

పేరు: వల్లాల నవీన్ యాదవ్

తండ్రి పేరు: వి.చిన్న శ్రీశైలం యాదవ్

వయసు: 42 సంవత్సరాలు


విద్యార్హతలు: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్

రాజకీయ అరంగేట్రం: మజ్లిస్

ఎన్నికల్లో పోటీ:

- 2014లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.
- 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు.
- 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిక.





మజ్లిస్ మద్దతు?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మజ్లిస్ దూరం పాటిస్తున్న కారణంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఉప ఎన్నికల్లో యువనేతను ఎన్నుకోవాలని పిలుపునివ్వడం, బీఆర్‌ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించడంతో కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లయింది. అధికార కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభివృద్ధి మంత్రంతో విజయావకాశాలను సుగమం చేసుకున్నా.. అభ్యర్థిత్వం ఖరారులో మాత్రం మజ్లిస్ పార్టీ జోక్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సీనియర్లను కాదని యువనేతకు అవకాశం కల్పించినట్లు కనిపిస్తోంది.

హస్తినకు చేరిన కాషాయ జాబితా

నేడో రేపో తేలనున్న అభ్యర్థిత్వం

- అధిష్టానం చేతిలో త్రిసభ్య కమిటీ నివేదిక
- బీజేపీ ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారతీయ జనతా పార్టీ నుంచి పోటీలో ఎవరు నిలువనున్నారనే అంశంపై నేడో రేపో స్పష్టత వచ్చే అవకాశముంది. బలమైన అభ్యర్థిని బరిలో నిలిపేందుకు నాలుగు రోజుల క్రితం ఆ పార్టీ అధిష్టానం త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ ముగ్గురు ఆశావహుల పేర్లను బుధవారం సాయంత్రం కేంద్ర నాయకత్వానికి నివేదించింది. 2023లో పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, ఆకుల విజయ పేర్లున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎవరు అభ్యర్థిగా నిలుస్తారనే అంశంపై హస్తినలో చర్చించి గురువారం లేదా శుక్రవారం అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆశావహుల్లో, వారి శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరిని సీటు వరిస్తుందో అని పార్టీ వర్గాలు లెక్కలేసుకుంటున్నాయి. మహిళ, బీసీ సామాజిక వర్గానికి సీటు కేటాయించాలని పార్టీ భావిస్తోందని కొందరు నేతలు పేర్కొంటున్నారు. మరోవైపు మహిళా నేతకే టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతోంది. ఈ లెక్కన చూస్తే ఆకుల విజయ, కీర్తిరెడ్డిల్లో ఒకరికి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. దీపక్‌రెడ్డికి ఇప్పటికే హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కేంద్ర మంత్రి అనుచరుడిగా గుర్తింపు ఉంది. చివరి క్షణంలో ఏదైనా జరగొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఒకటి రెండు రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది తేలనుంది.

7 రోజులు.. 10,652 కేసులు

రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: కాస్త ముందుకు వెళ్లి 'యూటర్న్' తీసుకోవాలంటే నిర్లక్ష్యం.. ఆ మార్గంలో సదరు దిశలో ప్రయాణించకూడదన్నా పట్టదు.. వీలున్నంత వరకు 'షార్ట్‌కట్'లో దూసుకుపోవాలన్న ధ్యాస.. ఆయా కారణాలతో నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఉల్లంఘన జరుగుతోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడటంతో పాటు వాహన చోదకుడితో పాటు ఎదుటి వారికీ ముప్పు వాటిల్లుతోంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఈ ఉల్లంఘనపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు సిటీ వ్యాప్తంగా ఉల్లంఘనలకు పాల్పడిన 10,652 మందిపై కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ చీఫ్ డి.జోయల్ డెవీస్ బుధవారం ప్రకటించారు. రహదారి భద్రతకు సంబంధించిన నిబంధనలు అనేకం ఉన్నాయి. పోలీసులు, నిపుణులు వీటిని మూడు రకాలుగా విభజిస్తారు. వాహన చోదకుడికి ముప్పుగా పరిణమించేవి, ఎదుటి వారికి ముప్పుగా పరిణమించేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వారికీ ముప్పుగా పరిణమించేవి. వీటిలో మూడో కోవకు చెందిన వాటినే ట్రాఫిక్ విభాగం అధికారులు ఎక్కువ తీవ్రంగా పరిగణిస్తారు. ఉల్లంఘనలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారిక 'ఎక్స్' హ్యాండిల్ లేదా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 90102 03626, ఈ-చలాన్ హెల్ప్ డెస్క్ 87126 61690కు సమాచారమివ్వాలని, ఫొటోలు, వీడియోలు పంపాలని సూచించారు.



'పోస్ట్' చేసే ముందు ఒక్క క్షణం!

డిజిటల్ అవేర్‌నెస్ చేపడుతున్న కొత్త కొత్వాల్

- మనోభావాలను దెబ్బతీయొద్దని హితవు
- తప్పుడు సమాచార ప్రచారం వద్దని హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ తన 'ఎక్స్' ఖాతా వేదికగా డిజిటల్ అవేర్‌నెస్‌కు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి హ్యాష్‌ట్యాగ్ పాస్ బిఫోర్ పోస్టు (పోస్టు చేసే ముందు ఒక్కక్షణం) అంటూ ప్రచారం చేస్తున్నారు. దీనికి సంబంధించి ఆయన బుధవారం కీలక సందేశాన్ని పోస్టు చేశారు. సోషల్‌మీడియా ప్రతి ఒక్కరినీ శక్తిమంతుల్ని చేసిందని, సమాచారాన్ని పంచుకోవడానికి, ఎదుటి వారిని ప్రేరేపించడానికి, ప్రభావితం చేయడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏదైనా ఓ విషయాన్ని లేదా సమాచారాన్ని సెండ్ (పంపడం)... షేర్ చేయడానికి ముందు ఒక్క క్షణం ఆగి మూడు విషయాలను ఆలోచించాలని సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ పోస్టు ఎవరినైనా బాధ పెడుతుందా..? ఇందులోని సమాచారం నిజమైనదేనా? సోషల్‌మీడియాలో ఓ వ్యక్తిని ఉద్దేశించి పెట్టే సమాచారం ఆయన ఎదురుగానూ వ్యాఖ్యానించగలవా? అనేవి సరి చూసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా షేర్ చేసిన కొన్ని అంశాలు ఎదుటి వారి కీర్తి ప్రతిష్టలు, వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తాయనే విషయం మరిచిపోవద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ రెస్పాన్సిబుల్‌గా ఉండాలని, ఏదైనా షేర్ చేసేముందు కచ్చితంగా ఆలోచించాలని సజ్జనర్ స్పష్టం చేశారు.

వారంలో 85 లక్షల వ్యూస్..

సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే సజ్జనర్ తన ఖాతాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. యువతకు సైతం దగ్గర కావాలనే ఉద్దేశంతో 'ఎక్స్'తో పాటు ఇన్‌స్టాగ్రాంలోనూ తనదైన పాత్రను పోషిస్తున్నారు. గతంలో హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్ పేరుతో ఓ ఉద్యమాన్నే నడిపి ప్రత్యేక చట్టం కావడానికి తన వంతు కృషి చేశారు. యువతను ఈయన సొంత ఇన్‌స్టాగ్రాం ఖాతాను గడిచిన వారం రోజుల్లో 85 లక్షల మంది వీక్షించారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఫొటోకు ఇన్‌స్టాగ్రాంలో 12 లక్షలు, 'ఎక్స్'లో 2 లక్షల వ్యూస్ వచ్చాయి. సజ్జనర్ 'ఎక్స్' ఖాతాకు వారం రోజుల్లో 15 లక్షల మంది రియాక్ట్ అయ్యారు. సోషల్‌మీడియా ద్వారా తన దృష్టికి వచ్చే ప్రతి అంశాన్ని నగర పోలీసు అధికారిక హ్యాండిల్స్‌కు ట్యాగ్ చేస్తున్న ఆయన ఆద్యంతం పర్యవేక్షిస్తున్నారు. చార్మినార్ వద్ద ఓ విదేశీ మహిళను వేధించిన వీడియో ఇటీవల వైరల్‌గా మారింది. దీన్ని క్షేత్రస్థాయి అధికారులకు పంపిన సజ్జనర్ పూర్తి స్థాయి విచారణ చేయించి మూడేళ్ల క్రితం నాటిదిగా నిర్ధారించారు.

ఆ గాలి కాలుష్యం

నగరంలో ప్రమాదకర స్థాయిలో వాయు నాణ్యత

- ఇటీవల వర్షాలతో రోడ్లపై పేరుకుపోయిన ఇసుక, మట్టి
- కళ్లల్లోకి దుమ్ము, ఇసుక రేణువులు
- శ్వాసకోశ వ్యాధులు వస్తాయంటున్న వైద్యులు
- వాహనదారులు, బస్సు ప్రయాణికులకు ఇబ్బందులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గాలి నాణ్యత ప్రమాదకర స్థితికి చేరింది. ఫలితంగా కన్ను, ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎన్నిరకాల కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ గాలి నాణ్యతను పెంచడంలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), ప్రభుత్వ అధికార యంత్రాంగం విఫలమవుతోంది. నగర దారులపై పాదచారులు, మోటారు సైకిల్, బస్సుల్లో ప్రయాణించే వారికి నరకప్రాయంగా మారుతోంది. కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి.

నిర్మాణ, పారిశ్రామిక ప్రాంతాల్లో అవస్థలు

ఇటీవల కురుస్తున్న వర్షాలతో నగరంలోని రహదారులు ఇసుక, మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్నాయి. ఉదయం సమయంలో కాస్త ఎండ కాయడంతో తడారిపోయి వాహనాలు వెళ్లినపుడు ఇసుక, మట్టి, ధూళి కణాలు సాధారణ ప్రయాణికుల కళ్లలో పడుతున్నాయి. ఎల్బీనగర్, కోకాపేట్, ఉప్పల్, మాదాపూర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో నిర్మాణ రంగం జోరుగా ఉన్న ప్రాంతాల్లో ఇది మరింత ప్రమాదకరంగా కనిపిస్తోంది. పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం వంటి పారిశ్రామిక వాడల్లోనూ వాయు కాలుష్యం గరిష్ట స్థాయిలను సూచిస్తోంది. సాధారణంగా పీఎం10 ధూళి కణాలు 0 నుంచి 50 ఉండాల్సి ఉండగా, నగరంలోని కోకాపేట్ ప్రాంతంలో బుధవారం 232గా నమోదయ్యింది. పీఎం2.5 సోమాజిగూడలో 200గా ఉంది. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. నిర్మాణ రంగం వృద్ధిలో ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోంది. పెద్ద సంఖ్యలో లారీలు మట్టి, ఇసుక, గ్రావెల్, సిమెంట్, ఇతరాలు తరలించే క్రమంలో కనీస నిబంధనలు పాటించడంలేదు. దీనిపై అటు జీహెచ్‌ఎంసీ, ఇటు కాలుష్య నియంత్రణ మండలి ఎవరూ పట్టించుకోవడం లేదు.

చర్యలు అంతంతే..

వాయు కాలుష్యానికి కారణమవుతున్న వ్యక్తులు, సంస్థలపై చర్యలు తీసుకోవడంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఉదారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లో అడపదడప తనిఖీలు చేపట్టడం, నోటీసులిస్తున్నారు. అరుదైన సందర్భాల్లో మూసివేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అనంతరం కొన్నాళ్లకు తిరిగి అదే పరిశ్రమ రీఓపెన్‌కు ఎన్‌ఓసీ జారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అధికారుల తీరుపై బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

పనిచేయని పరికరాలు..

వాయు నాణ్యత కొలతల కోసం కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన పరికరాలు కొన్ని చోట్ల పనిచేయడం లేదు. బుధవారం నాచారం, ఐఐటీహెచ్ కంది ప్రాంతాల్లో గాలి నాణ్యత నివేదికలే అందుబాటులో లేవు. నగరం నడిబొడ్డున ఉన్న సనత్‌నగర్‌లో పీఎం 10 వివరాలు నమోదు చేయలేదు.

శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు..

గాలిలో ధూళికణాల సంఖ్య పెరిగినపుడు సీఓపీడీ, క్రానిక్ బ్రాంకై టిస్, ఆస్తమా జబ్బుల ప్రభావం పెరుగుతుంది. ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారికి ఎక్కువ ఇబ్బంది. చల్లని కాలం, ఆపై గాలిలో నాణ్యత తగ్గితే శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి సైతం ఈ గాలి ప్రమాదమే. తొలుత జలుబు చేసి, అది న్యుమోనియాగా మారొచ్చు. ధూళి కణాలు కళ్లలో పడినా ఇబ్బందికరమే. మోటారు సైకిల్‌పై వెళ్లే సమయంలో కళ్లజోడు ధరించడం మంచిది.

– ప్రొ.టి. ప్రమోద్ కుమార్, పల్మనాలజిస్టు




గ్లెండేల్ అకాడమీ విద్యార్థులకు సీఎం అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బండ్లగూడ: సింగపూర్‌లో ఇటీవల జరిగిన గ్లోబల్ ఎక్సలెన్స్ డే(జీఈడీ) 2025లో మిడిల్ స్కూల్ విభాగంలో సన్‌సిటీలోని గ్లెండేల్ అకాడమీ విద్యార్థులు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించి సన్మానించారు. గ్రీన్ గ్లెన్ గార్డియన్స్ బృందంలో ఆరాధ్య దుద్దిళ్ల శ్రీపాదరావు(6వ తరగతి), నిగమా పెన్మెట్సా(6వ తరగతి), సయ్యద్ అలిజా జైఆమా(6వ తరగతి), రాహిని సమ్మిత వర్మ దంతులూరి(7వ తరగతి), జేడెన్ డి రోజారియో(7వ తరగతి) ఉన్నారు. ఈ బృందం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 11 పాఠశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థులతో పోటీ పడ్డారు. ది గుడ్ ఫుడ్ మూవ్‌మెంట్ అనే తమ ప్రాజెక్టును కైజెన్ (నిరంతర అభివృద్ధి) అనే అంశం కింద ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వారు సేంద్రియ వ్యవసాయం, స్థిరమైన వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను వివరించారు. రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల కలిగే హానికర ప్రభావాలు, పర్యావరణ పరమైన బాధ్యతాయుత పద్ధతుల అవసరం, పర్యావరణ అవగాహన పెంపు కోసం ప్రాక్టికల్ లెర్నింగ్ ప్రాముఖ్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలతో స్థిరమైన అభివృద్ధి పట్ల కట్టుబాటుతో తెలంగాణను ప్రపంచ వేదికపై నిలబెట్టిన ఈ విద్యార్థులు రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మీను సలూజా తదితరులు పాల్గొన్నారు.





ఇరకాటం!



పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వింత పరిస్థితి

- కండువా కప్పుకోలేరు.. ప్రచారానికి వెళ్లలేరు
- అనుచరులు, వారసుల గెలుపు కోసం పనిచేయలేని వైనం
- పదవిపై వేలాడుతున్న అనర్హత కత్తి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు క్లిష్టంగా మారాయి. పార్టీ మారామని చెప్పుకోలేని పరిస్థితి ఓవైపు.. కొత్త కండువా వేసుకుని తమ అనుచరులకు మద్దతుగా ప్రచారం చేయలేని పరిస్థితి మరోవైపు వీరిని ఇబ్బంది పెడుతోంది. పార్టీ ఫిరాయింపుల కేసు, స్పీకర్ విచారణ ఇరకాటంలోకి నెట్టాయి. సంస్థాగతంగా పట్టుకోసం తమ అనుచరులను జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా బరిలోకి దించేందుకు ఇప్పటికే అధిష్టానానికి పలు పేర్లను సిఫార్సు చేసినప్పటికీ.. అభ్యర్థుల గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం లేకుండాపోయింది. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన తర్వాత అధికార కాంగ్రెస్ గూటికి చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ వద్ద వీరిద్దరూ సీఎం సమక్షంలో కండువా కప్పుకొన్న ఫొటోలు మాత్రమే ఉన్నాయి. ఒకవేళ వీరు స్థానిక ఎన్నికల ప్రచారానికి వెళ్తే న్యాయస్థానంతో పాటు స్పీకర్‌కు నేరుగా సాక్ష్యం అందించిన వారవుతారనేది అక్షర సత్యం.

అభివృద్ధి కోసం అటుఇటు..!

చేవెళ్ల నియోజకవర్గంలో మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లితో పాటు వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని పలు గ్రామాలున్నాయి. జిల్లా పరిధిలో నాలుగు జెడ్పీటీసీ, 45 ఎంపీటీసీ, 109 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య రాజకీయ ప్రస్థానం తన సొంత మండలమైన నవాబుపేట నుంచి ప్రారంభమైంది. కాంగ్రెస్ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేశారు. అనంతరం 2014లో అదే పార్టీ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీఫాంపై పోటీ చేసి రెండోసారి గెలుపొందారు. 2024లో కూడా అదే పార్టీ నుంచి పోటీ చేసి తిరిగి అధికార కాంగ్రెస్ గూటికి చేరారు. నియోజకవర్గ అభివృద్ధి పేరుతో కారు దిగి.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిందిగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కోర్టును ఆశ్రయించడం, బంతి స్పీకర్ కోర్టులోకి నెట్టడం, విచారణకు హాజరు కావాల్సిందిగా కోరుతూ సదరు ఎమ్మెల్యేకు స్పీకర్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. నెత్తిన అనర్హత కత్తి వేలాడుతున్న నేపథ్యంలోనే విడుదలైన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఆయన్ను ఇబ్బందుల్లో పడేసింది.

జెడ్పీ పీఠం కోసం..

ఈసారి జిల్లా పరిషత్ పీఠాన్ని ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడం తన నియోజకవర్గంలోని షాబాద్ ఎస్సీ మహిళకు, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో షాబాద్ లేదా చేవెళ్ల నుంచి తన కోడలిని నిలబెట్టి జెడ్పీ చైర్‌పర్సన్ సీటు దక్కించుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్న ట్లు సమాచారం. కానీ కాంగ్రెస్ కండువా వేసుకుని నేరుగా ప్రచారం చేయలేని సంకటం ఎదురైంది.

ప్రకాశ్‌గౌడ్‌దీ ఇదే పరిస్థితి..

రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట మండలాల్లోని రాజేంద్రనగర్ మండలం పూర్తిగా జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వెళ్లింది. గండిపేటలో ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. ఇక్కడ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు లేవు. కేవలం శంషాబాద్ మండలంలోనే స్థానిక సంస్థలున్నాయి. ఇక్కడ 21 గ్రామ పంచాయతీలు, తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్ నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సైతం రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటి వరకు తనను నమ్ముకుని, వెంట వచ్చిన అనుచరులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. ఒకవేళ వీరికి అవకాశం వచ్చినా నేరుగా ప్రచారం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

కిడ్నాప్ చేసి...తుపాకీతో బెదిరించి..

- రూ.10 కోట్లు డిమాండ్
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ముగ్గురు

వెంగళరావునగర్ : రోడ్డుపై వెళుతున్న వ్యక్తిని ఆఫీసుకు తీసుకెళ్లి, అనంతరం కిడ్నాప్ చేసి తుపాకులతో బెదిరించి నగదు డిమాండ్ చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన మనోజ్‌కుమార్ బాచుపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న తన స్నేహితుడితో కలిసి ఎల్లారెడ్డిగూడలో నడిచి వెళుతుండగా వెంకటస్వరూప్ అనే వ్యక్తి అమీర్‌పేటలోని తన ఫ్లాట్‌కు రమ్మని మనోజ్‌కుమార్‌ను కారులో తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు మనోజ్‌కుమార్‌పై దాడిచేసి తుపాకులతో బెదిరించి ఎల్లారెడ్డిగూడలోని శివసాయి అపార్ట్‌మెంట్స్‌కు తీసుకెళ్ళారు. అక్కడ అతడిని బంధించి తమకు రూ.10 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అతడి భార్య, కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరించాడు. బాధితుడు తన భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గాలింపు చేపట్టగా వెంకటస్వరూప్ మరోసారి మనోజ్‌కుమార్ భార్యకు ఫోన్ చేసి మైత్రీవనం 1039 పిల్లర్ వద్దకు నగదు, తీసుకురావాలని చెప్పాడు. ఆమె పోలీసులతో కలిసి అక్కడికి వెళ్ళగా ముగ్గురు నిందితులు బైక్‌పై పారిపోగా మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధురానగర్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను మియాపూర్ పోలీసులకు అప్పగించారు.

నకిలీ గేమింగ్ యాప్‌తో మోసం

- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నకిలీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో అమాయకులను మోసం చేస్తున్న ఐదుగురు సైబర్ నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ శోభన్ కుమార్‌తో కలిసి సైబర్ క్రైమ్ డీసీపీ సాయి శ్రీ బుధవారం వివరాలు వెల్లడించారు. నవీన్‌కుమార్, సందీప్ కుమార్, పృథ్వీ రామరాజు, పవన్ వెంకట నాగభరద్వాజ్, రామాంజనేయులు ముఠాగా ఏర్పడి టెలిగ్రాం, వాట్సాప్ గ్రూప్‌లలో డాడ్జ్ బుక్777 అనే నకిలీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్లాట్‌ఫామ్‌లను నిర్వహించేవారు. బాధితులను నుంచే కాజేసే సొమ్మును నిర్వహించేందుకు అవసరమైన బ్యాంక్ ఖాతాల కోసం ఈ ముఠా నకిలీ పేర్లు, చిరునామా, ఆధార్ కార్డులతో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లలో 120కు పైగా బ్యాంక్ అకౌంట్లను తెరిచారు. గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ లాభాలను చూపించి, బాధితుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్మును వసూలు చేసేవారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ లావాదేవీల ఆధారంగా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వివిధ ఖాతాలలో ఉన్న రూ.14 లక్షల సొమ్ముతో పాటు రెండు ల్యాప్‌టాప్‌లు, 30 సెల్‌ఫోన్లు, చెక్ బుక్స్, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఆలిండియా బ్రాహ్మిణ్ సంఘం సెక్రటరీ జనరల్‌గా తెలుగు వ్యక్తి



రవికుమార్

సాక్షి, సిటీబ్యూరో: ఆలిండియా బ్రాహ్మిణ్ సంఘం నూతన సెక్రటరీ జనరల్‌గా తెలుగు వ్యక్తి 'ద్రోణంరాజు రవికుమార్' ఎన్నికయ్యారు. హరియాణా వేదికగా జరిగిన జాతీయ స్థాయి కమిటీ సమావేశాల్లో ఆలిండియా బ్రాహ్మిణ్‌కు సంబంధించి నూతన అధ్యక్షుడిగా రాజస్థాన్‌కు చెందిన ఎస్.డీ.శర్మ, సెక్రటరీ జనరల్‌గా ద్రోణంరాజు ఎంపికయ్యారు. 2028 వరకు వీరు నూతన బాధ్యతల్లో కొనసాగుతారని కమిటీ తెలిపింది. కాగా 12 ఏళ్ల తర్వాత తెలుగు వ్యక్తికి సెక్రటరీ జనరల్ పదవి దక్కడం గమనార్హం.

బ్యాంకు మాజీ ఉద్యోగికి టోకరా

రూ.12.99 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) పేరుతో ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్ పంపిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు మాజీ ఉద్యోగిని మోసం చేశారు. ఆయన ఫోన్ ద్వారా బ్యాంకు ఖాతాను యాక్సెస్ చేసి రూ.12.99 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బర్కత్‌పురకు చెందిన బాధితుడు ఈ నెల 4న ఫేస్‌బుక్‌లో ఓ ప్రకటన చూశాడు. పీఎన్‌బీ లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లోనూ అప్‌లోడ్ చేసే సౌకర్యం ఉందనేది దాని సారాంశం. దీనికి ఆకర్షితుడైన బాధితుడు తన సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో పీఎన్‌బీ లోగోను డీపీగా వినియోగించిన వాట్సాప్ నంబర్‌తో సైబర్ నేరగాడు బాధితుడితో మాట్లాడాడు. తనను సదరు బ్యాంకు ప్రతినిధిగా పరిచయం చేసుకుని, తాను పంపే లింక్ ద్వారా సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని చెప్పాడు. అంగీకరించిన బాధితుడు తనకు వాట్సాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేయడంతోనే దాని మాటున ఉన్న ఏపీకే ఫైల్ ఆయన ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయింది. దీని ద్వారా ఫోన్, అందులోని నెట్‌బ్యాంకింగ్, యూపీఐ ఖాతాలను సైబర్ నేరగాళ్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇలా వివిధ దఫాలుగా ఆయన పీఎన్‌బీ ఖాతాలో ఉన్న రూ.12,99,300 కాజేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తల్లిని వేధిస్తున్నాడని యువకుడి దారుణ హత్య



హత్యకు గురైన యాసర్



నిందితుడు ఆయాన్

రాజేంద్రనగర్: తల్లిని వేధిస్తుండటమేగాక తరచూ గొడవ పడుతుండటంతో ఆమె కుమారుడు తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తిని కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యాసిర్ (28) ఒక చానల్‌లో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మహిళ(40)తో సహజీవనం చేస్తున్నాడు. మహిళతో పాటు ఆమె నలుగురు సంతానాన్ని తన వద్దే ఉంచుకుని అందరూ కలిసి నివసిస్తున్నారు. గత కొన్నాళ్లుగా సదరు మహిళతో యాసిర్ తరుచూ ఘర్షణ పడుతున్నాడు. బుధవారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న సదరు మహిళ పెద్ద కుమారుడు ఆయాన్ (18) ఆగ్రహం పట్టలేక కత్తితో యాసిర్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. దీనిని గుర్తించిన స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు మధ్యలో ఆగిన బస్సు

గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీ చౌరస్తాలో బుధవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు నిలిచిపోవడంతో సీవీఆర్ న్యూస్ వైపు నుంచి వచ్చే వాహనాలతో పాటు జర్నలిస్టు కాలనీ వైపు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రోడ్ నెం. 45 జంక్షన్‌లోని బారికేడ్లను తొలగించి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్ళే వాహనాలను ముందుకు పంపించారు. బస్సును టోయింగ్ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అది కదలకపోవడంతో మెకానిక్‌ను తీసుకొచ్చి బస్సుకు రిపేర్ చేయించి తరలించారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ నర్సింగ్‌రావు ఘటనా స్థలానికి వచ్చి బస్సును పంపించే వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇఫ్లూలో ఉద్రిక్తత

లాలాపేట: ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో మంగళవారం రాత్రి ఓ వామపక్ష విద్యార్థి సంఘం నిర్వహించిన పాలస్తీనా సంఘీభావ ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. పాలస్తీనాకు అనుకూలంగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరువర్గాల నినాదాలతో ఇఫ్లూ క్యాంపస్ దద్దరిల్లింది. కొంతమంది విద్యార్థులు క్యాంటీన్ గోడలకు పాలస్తీనాకు మద్దతుగా పోస్టర్‌లు అంటించారు. దీంతో మరో విద్యార్థి సంస్థకు చెందిన విద్యార్థులు దాదాపు 30 మంది దీన్ని గమనించి ఆ పోస్టర్లను తొలగించారు. దీంతో రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయమై ఇఫ్లూ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన రెండు గ్రూపుల విద్యార్థులపై ఓయూ పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిహారంతో పాటు ఇంటి స్థలం



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో టీజీఐఐసీకి భూములు కోల్పోయిన రైతులకు పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు ఇస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, టీజీఐఐసీ అధికారుల సమక్షంలో బుధవారం భూనిర్వాసితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను సేకరించారు. పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వాలని బాధితులు కోరారు. పరిహారం తీసుకున్న వారి జాబితాలో కొంత మంది అనర్హులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్మినేడులో వెంచర్ ఏర్పాటు చేసి పరిహారంతో పాటు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ టీం సభ్యుడు శ్రావన్, ఎల్మినేడు భూ కమిటీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు



పహాడీషరీఫ్: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖాజా పాషా కోరారు. ఈ మేరకు బుధవారం పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కలిసి మెలసి ఉంటున్న ప్రజల నడుమ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు రాజాసింగ్ యత్నిస్తున్నారన్నారు. ఇప్పటికీ ఎన్నో మార్లు ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు అబ్దుల్ ఖదీర్, మహ్మద్ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



PLOT FOR SALE

- శ్రీశైలం హైవే ఫేసింగ్ ఫ్యూచర్ సిటీలో & రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర అన్ని సౌకర్యాలు అభివృద్ధి చేసిన విల్లా ప్రాజెక్ట్ వెంచెర్లలో ప్లాట్లు కలవు. 80% బ్యాంక్ లోన్, కంపెనీ సెల్ : 9515438614 [HA-1524]
- VJA, కంచికచర్ల, ఔటర్ రింగ్‌రోడ్ సమీపంలో AP CRDA, DTCP ప్లాట్స్ చ॥గ॥ 3,900 to 7,800 ఇళ్ళమధ్యలో ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ 1 సెంటు 1,45,000/- ✆ 63012 98734 [B-103]
- 400Sqyds 3500 per Sq.yd Good Investment Clear Title 33Kmts from Uppal Buvanagiri Anantharam. Ph : 78935 54057 [HA-35389]



BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్. 9100329739 [H-800539]

BUSINESS OFFER

- Part/Full Time Earn Extra Income Opportunity Online/ Offline For Multi National Company at your Area. Ph: 9246206576 [HA-16189]

PERSONAL CARE

CHANGE OF NAME

- I, Sri "Dudekula Hussaian" S/o Dudekula Gaffer (Correct Name). It is Wrongly Mentioned in my Aadhaar & Pan cards as "Dhudekala Vussen" (incorrect Name). I request the Authorities to Correct my Name as" Dudekula Hussaian"(Correct Name) in my Aadhaar & PAN Cards [SCA25008777]
- I, Prerna Kumari Naidu D/o, Late P G Naidu R/o Ground Floor Ft-2, Lalitha Enclave, Devinagar Road No. 4, RK Puram, Hyderabad, Telangana. 500056. have changed my name to Kanthuri Prerna Murthy. [DA-46299]
- I Lakshmi Priya Pabboju W/o Suresh Pabboju R/o 9-4-84/44, Flat No. 302, Bharati Trident, Plot No-44, Kakatiya Nagar, Nanal Nagar, Hyderabad - 500008 have changed my Name from Thangellapalli Laxmi to Lakshmi Priya Pabboju W/o Suresh Pabboju for all Purposes. [SSP25000182]
- I, Ponnamanda Love Kumari, W/o P. Paramjyothi, R/o Door No. 6-4-031, Ayyanna Nagar Yanam 533464, Changed my Name from Ponnamanda Miriam / Mariam to Ponnamanda Lova Kumari for will purposes. [UA-60695]

LOST

- I, Ramachandrula Lalitha Mahalakshmi W/o Late A. Rama bhadra Venkata Somayajulu. I Lost my Original Saledeed Document no. 15/2000 at SRO Kukatpally, while Travelling from HIG 6th Phase to KPHB by Bus. If any one found pls call to Ph. no 78932 83354. [H-1278280]

OLD AGE HOME

- వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783383]



- ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9573941114 [SCA25008779]
- 55 ఎకరాల మెగా ప్రాజెక్టు మార్కెటింగ్‌కు లీడర్స్ Marketing Team M&F కావలెను. Fixed Salary+ Incentive. మేనేజింగ్ పార్ట్‌నర్. 7095474747 [SCA25008781]
- ప్యారడైజ్, నాచారం, నల్లకుంట, కర్మన్‌ఘాట్ ఏరియాలకు ఆఫీస్ బాయ్స్ & హౌస్ కీపింగ్ కావలెను. 9 గం॥ డ్యూటీ 4 W/o ESI+PF. సంప్ర : 9032153413 [SCA25008785]
- వసుంధర Oldage Home లో పని చేయుటకు ఆయాలు, నర్సులు, హెల్పర్స్, భార్యభర్త కావలెను. రూం + భోజనం ఫ్రీ. నాగోల్ - సంప్ర : 99899 99876 [SCA25008798]
- స్పాట్ జాయినింగ్ SBI, HDFC, AXIS ఏజెన్సీలలో పనిచేయుటకు M/F స్టాఫ్ కా॥. Age : 18-35, 10th-PG, జీ : 15-25K. 6302235816 [SCA25008735]
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీగార్డ్స్, భార్యాభర్తలు కావలెను . ఫోన్ : 8985114453, 9391036931 [HA-16191]
- 30 to 70 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం, ఇన్సెంటివ్స్ 50 వేలు (టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్) Q: 10th + రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్, మ్యుచువల్ ఫండ్స్, మార్కెటింగ్, నో టార్గెట్ ✆ 90524 70111 [B-285]
- Wanted Security Guards to Work in Twin City Salary.17,500 for 8hrs + ESI & PF Benefits Age. Up to 35 Yr's Contact 9133377645/44/48 [SCA25008726]
- Wanted Tele Callers (Female) Work from Home Exp: (2yrs) in Tele Marketing Earn up to 35K/-pm 9908999827 [SCA25008153]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ — 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9010244403	కూకట్‌పల్లి	9912225476
అత్తాపూర్	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	9912225453

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ LXIII ఆఫ్ 1951 క్రింద స్థాపించబడినది)

హైదరాబాద్ బ్రాంచ్

Ref.No.AFC/Sarfaesi - Sec.13 (2) Notice(2025-26) తేది:07/10/2025

దిగువ వారికి,

రుణగ్రహీత: M/s. వేమ్ ఆటోమోటివ్స్ LLP సర్వేనం.17 & 18, కొండాపూర్ మెయిన్ రోడ్, హైదరాబాద్ -500084

డైరెక్టర్లు/ ప్రమోటర్లు:

1) శ్రీ రాజు యాదవ్ ఎర్రగుడ్ల తండ్రి మంత్యాల్ యాదవ్ ఎర్రగుడ్ల, నివాసం: ఇంటి.నం.2-72/1, ఫ్లాట్ నం.1, మేఘహిల్స్, మాదాపూర్, అయ్యప్ప సొసైటి రోడ్, శేరిలింగంపల్లి, SBI మాదాపూర్ బ్రాంచ్, కొత్తగూడ, కె.వి. రంగారెడ్డి, కొత్తగూడ - 500084.

2) శ్రీమతి ఎర్రగుడ్ల మాధవి భర్త శ్రీ రాజు యాదవ్ ఎర్రగుడ్ల, నివాసం: నివాసం: ఇంటి.నం.2-72/1, ఫ్లాట్ నం.1, మేఘహిల్స్, మదాపూర్, అయ్యప్ప సొసైటి రోడ్, శేరిలింగంపల్లి, SBI మాదాపూర్ బ్రాంచ్, కొత్తగూడ, కె.వి. రంగారెడ్డి, కొత్తగూడ - 500084.

హామీదారులు:

1) శ్రీ రాజు యాదవ్ ఎర్రగుడ్ల తండ్రి మంత్యాల్ యాదవ్ ఎర్రగుడ్ల నివాసం: ఇంటి.నం.2-72/1, ఫ్లాట్ నం.1, మేఘహిల్స్, మాదాపూర్, అయ్యప్ప సొసైటి రోడ్, శేరిలింగంపల్లి, SBI మాదాపూర్ బ్రాంచ్, కొత్తగూడ, కె.వి. రంగారెడ్డి, కొత్తగూడ - 500084.

2) శ్రీమతి ఎర్రగుడ్ల మాధవి భర్త శ్రీ రాజు యాదవ్ ఎర్రగుడ్ల, నివాసం: నివాసం: ఇంటి.నం.2-72/1, ఫ్లాట్ నం.1, మేఘహిల్స్, మదాపూర్, అయ్యప్ప సొసైటి రోడ్, శేరిలింగంపల్లి, SBI మాదాపూర్ బ్రాంచ్, కొత్తగూడ, కె.వి. రంగారెడ్డి, కొత్తగూడ - 500084.

3) శ్రీ ఇ. శ్రీనివాస్ యాదవ్ తండ్రి మంత్యాల్ యాదవ్ ఎర్రగుడ్ల ఎర్రగుడ్ల, నివాసం: ఫ్లాట్ నం. 408, 4వ అంతస్తు, ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నం. 75/76 & 77D రోడ్, ఐమేజ్ హాస్పిటల్ దగ్గర, విఠల్‌రావునగర్, గచ్చిబౌలి (గ్రా), శేరిలింగంపల్లి, రంగారెడ్డి - 500019.

4) శ్రీ వి.రాజేంద్ర రావు తండ్రి వి. జగపతి రావు, నివాసం: ఫ్లాట్ నం.202, G-2, C-బ్లాక్, శ్రీనిలయ అపార్ట్‌మెంట్స్, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034.

5) M/s. వేమ్ మోటర్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నం. 64, వేమ్ టవర్స్, కొండాపూర్ మెయిన్ రోడ్, హైదరాబాద్ - 500084.

మీరు, రుణగ్రహీత, M/s. వేమ్ ఆటోమోటివ్స్ LLP ద్వారా వినియోగించుకోబడిన రుణములకు సంబంధించిన, 30-06-2025 నాటికి మిగులు బకాయి మొత్తం రూ. 6,94,21,799/- (ఆరు కోట్ల తొంభై నాలుగు లక్షల ఇరవై ఒక్క వేల ఏడు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) తో 30-11-2024 వ NPA గా మారినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13 (2) క్రింద APSFC వారు ఇప్పటికే 16-07-2025 తేదీగల సవివరమైన డిమాండ్ నోటీసు జారీ చేశారు. అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూతో రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపినటువంటి నోటీసు ADDRESSEE LEFT అనే రిమార్కులతో అందజేయబడకుండా తిరిగి వచ్చినది.

60 రోజుల్లోగా పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించుటలో మీరు విఫలమైతే, చట్టంలోని సెక్షన్ 13 (4) క్రింద రుణగ్రహీతలు/ హామీదారులకు చెందిన సెక్యూరిటీలు (దిగువ వివరించబడిన) ను స్వాధీనం చేసుకునే తమ ఉద్దేశాన్ని APSFC వారు తెలియజేస్తున్నారు.

తనఖాదారు/ హామీదారు పేరు	కొలేటరల్ సెక్యూరిటీగా ఆఫరు చేసిన ఆస్తి వివరాలు
శ్రీమతి ఇ.మాధవి	ఆర్.ఆర్. జిల్లా, శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, గచ్చిబౌలి గ్రామం వద్దగల సర్వేనం.లు 4,5,6,8,9 & 10 లోని ఫ్లాట్‌నం.లు 75,76 & 77లో ఏలియన్స్ స్పేస్‌స్టేషన్‌గా ఉన్న ప్రస్తుత భవనంలో, 1982 చ.గజాల మొత్తం భూమిలో అవిభాజ్యవాటా భూమి 38.40 చ.గజాలతో పాటు కామన్ ఏరియాలు మరియు బాల్కనీ కలుపుకుని 1320 చ.అ.ల బిల్టప్ ఏరియా కలిగిన విస్తీర్ణపు నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నం. 406 యావత్తు సరిహద్దులు: ఉత్తరం:40 'అడుగుల రోడ్, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: కారిడార్.
శ్రీ ఇ. శ్రీనివాస్ యాదవ్	దీనికి జతపరిచిన ప్లాన్‌లో వివరించిన గ్రేటర్ క్లియరెన్స్ కొరకు రంగారెడ్డి జిల్లా, GHMC పరిధిలో, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామం వద్దగల ఏలియన్స్ స్పేస్‌స్టేషన్‌గా ఉన్న ప్రస్తుత భవనంలో, సర్వేనం.లు 4,5,6,8,9 & 10 లోని ఫ్లాట్ నం.లు 75,76,& 77 లో 4వ అంతస్తులో ఇంటి.నం. 1-89/A/20/G/407 గల, 38.40 చ.గజల. విస్తీర్ణపు దామాషా అవిభాజ్య వాటా భూమితో కలుపుకొని కామన్ ఏరియాతో పాటు 1320 చ.అ.ల బిల్టప్ ఏరియాతో ఫ్లాట్ నం. 407 యావత్తు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం:లిఫ్ట్ మరియు మెట్లు, తూర్పు: కారిడార్, పశ్చిమం: విక్రయదారుకు చెందిన ఖాళీ.
శ్రీ ఇ. శ్రీనివాస్ యాదవ్	దీనికి జతపరిచిన ప్లాన్‌లో వివరించిన గ్రేటర్ క్లియరెన్స్ కొరకు రంగారెడ్డి జిల్లా, GHMC పరిధిలో, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామం వద్దగల ఏలియన్స్ స్పేస్‌స్టేషన్‌గా ఉన్న ప్రస్తుత భవనంలో, సర్వేనం.లు 4,5,6,8,9 & 10 లోని ఫ్లాట్ నం.లు 75,76,& 77 లో 4వ అంతస్తులో ఇంటి.నం. 1-89/A/20/G/408 గల, 53.76 చ.గజల. విస్తీర్ణపు దామాషా అవిభాజ్య వాటా భూమితో కలుపుకొని కామన్ ఏరియాతో పాటు 1848 చ.అ.ల బిల్టప్ ఏరియాతో ఫ్లాట్ నం. 408 యావత్తు సరిహద్దులు: ఉత్తరం: మెట్లు మరియు ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: ఖాళీ.
శ్రీ ఇ. శ్రీనివాస్ యాదవ్	దీనికి జతపరిచిన ప్లాన్‌లో వివరించిన గ్రేటర్ క్లియరెన్స్ కొరకు రంగారెడ్డి జిల్లా, GHMC పరిధిలో, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి నగర్ గ్రామం వద్దగల ఏలియన్స్ స్పేస్‌స్టేషన్‌గా ఉన్న ప్రస్తుత భవనంలో, సర్వేనం.లు 4,5,6,8,9 & 10 లోని ఫ్లాట్ నం.లు 75,76,& 77 లో 4వ అంతస్తులో ఇంటి.నం. 1-89/A/20/G/ 409 గల, 55.88 చ.గజల. విస్తీర్ణపు దామాషా అవిభాజ్య వాటా భూమితో కలుపుకొని కామన్ ఏరియాతో పాటు 1924 చ.అ.ల బిల్టప్ ఏరియాతో ఫ్లాట్ నం. 409 యావత్తు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ మరియు మెట్లు, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: విక్రయదారుకు చెందిన ఖాళీ.
శ్రీ ఇ. రాజు యాదవ్	ఆర్.ఆర్. జిల్లా, GHMC శేరిలింగంపల్లి, శేరిలింగంపల్లి మండలం, మాదాపూర్ గ్రామం వద్దగల 200 చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగిన, 1155 చ.గజాలు లేదా 1965.58 చ.మీటర్ల విస్తీర్ణపు నం.1-98/90/5 గల ఇల్లు యావత్తు సరిహద్దులు: ఉత్తరం: ఇం.నం.1-88/2, దక్షిణం: 30 వెడల్పు రోడ్, తూర్పు: 1-81/2, పశ్చిమం: పొరుగువారి లాట్.
శ్రీ వి. రాజేంద్ర రావు మరియు శ్రీ ఇ. రాజు యాదవ్	ఆర్.ఆర్. జిల్లా, శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, గచ్చిబౌలి గ్రామం వద్దగల సర్వేనం. 91 (పార్ట్) కు ప్రక్కన, 215 చ.గజాలు లేదా 179. 74 చ.మీటర్లు విస్తీర్ణపు గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ కలిగిన నం 2-49 గల ఇల్లు యావత్తు సరిహద్దులు: ఉత్తరం: గచ్చిబౌలి మెయిన్ రోడ్, దక్షిణం : మరో ఇల్లు, తూర్పు: పొరుగు వారి ఇల్లు, పశ్చిమం: లేట్ భగవన్ సింగ్ ఇల్లు.
M/s. వేమ్ మోటర్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్	ఆర్.ఆర్. జిల్లా, శేరిలింగంపలి మండలం, కొండపూర్ గ్రామం వద్దగల 55 ఎక్స్‌ప్రెస్‌గా పిలువబడే భవనంలో, సర్వేనం. 64 లోని 1080 చ.అ. బిల్టప్ ఏరియాలో 581 చ.గజల. మొత్తంలో, 301 చ.గజల. UDS భూమి తో మూడవ అంతస్తులోని ఫ్లాట్ నం. 302 యావత్తు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ తూర్పు: ఖాళీ, పశ్చిమం:కారిడార్.

మీకు సూచించవలసినది ఏమనగా,

1) మరిన్ని మరియు పూర్తి వివరాల కొరకు మీ చిరునామాకు పంపిన మరియు కొరియర్/ పోస్టల్ అథారిటీస్ ద్వారా తిరిగి వచ్చిన ఒరిజినల్ నోటీస్ / కవర్‌ను దిగువ సంతకందారు నుండి పొందవలెను మరియు

2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యను నివారించుటకు పైన చూపిన నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా వడ్డీ మరియు వ్యయాలు మొత్తం వాటితో మిగిలిన బకాయి మొత్తాన్ని చెల్లించవలెను.

సం/- అధీకృత అధికారి

గ్రౌండ్ ఫ్లోర్ 5-9-194, చిరాగ్ అలీ లేన్, పి.బి.నం: 165, హైదరాబాద్ - 500001. ల్యాండ్ లైన్ : 23204106, సెల్ : 9866512504 ఇ-మెయిల్: hyd-general@tgsfc.in, https://esfc.telangana.gov.in

షేక్‌పేట పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా గోపాల్



షేక్‌పేట మండల పీఆర్‌టీయూ సభ్యులు

ఫిలింనగర్: హైదరాబాద్ జిల్లా షేక్‌పేట మండల పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలో షేక్‌పేట మండల కమిటీ అధ్యక్షుడిగా ఎం.గోపాల్, ప్రధాన కార్యదర్శిగా బి.పృథ్వీరాజ్, మండల మహిళా అధ్యక్షురాలిగా టి.భాగ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణతం చక్రారెడ్డి హాజరయ్యారు. సంఘాన్ని మండలం, జిల్లాలో అందరం కలిసి బలోపేతం చేయాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణం సీజ్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ నెంబర్-1/3 నాగార్జున సర్కిల్‌లో ఉన్న ఎంపీఎం స్క్వేర్ మాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న దుకాణాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ మాల్‌లో బనానా క్లబ్ పేరుతో కొనసాగుతున్న దుకాణం ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి నడిపిస్తున్నారని సమాచారం రావడంతో దీనిని సీజ్ చేసినట్లు డీసీ తెలిపారు.

హెచ్‌సీయూలో నిరసన



నిరసనలో పాల్గొన్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బేషరతుగా వెంటనే సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లోని 15వ ఫేజ్‌లో స్థానిక సమస్యలపై బుధవారం మాజీ కార్పొరేటర్ బాబూరావు కాలనీలో పర్యటించారు. సమస్యలను అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బండాబదల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గం విద్యార్థులు

రాయదుర్గం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం వీరిని పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి అభినందించారు. వీరు ఇటీవల జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి టోర్నమెంట్ జిల్లా సెలక్షన్స్-2025 పోటీలలో అండర్-17, అండర్-14 విభాగంలో పాల్గొన్నారు. ఈ పోటీలలో భానుతేజ అండర్-17లో బంగారు పతకం, అండర్-14లో చరణ్‌తేజ బంగారు పతకం సాధించారు. వరంగల్‌లో 10,11 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో ఇరువురు పాల్గొనున్నారు.

ఎఫ్‌డీడీఐ-హెచ్‌లో క్రీడోత్సవాలు

రాయదుర్గం: ఇబ్దిటా-2025 కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హెచ్ క్రీడోత్సవాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో సందడి నెలకొంది. బుధవారం ఎఫ్‌డీడీఐ-హెచ్ క్యాంపస్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్యాకల్టీ-స్టూడెంట్స్ మధ్య పోటీ నిర్వహించారు. ఇందులో ఫ్యాకల్టీ టీమ్ భారీ విజయాన్ని సాధించింది. 20 ఓవర్లలో ఫ్యాకల్టీ జట్టు 175 పరుగులు సాధించారు. ఈ సందర్భంగా ఈడీ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతి యేటా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ముప్పిడి రాంబాబు, హరిహరన్, డాక్టర్ వికాస్, గౌరబ్‌సింగ్, గోఫ్రాన్, వేణు, నరేష్, సార్థికా, మిశ్రాచ నిరంజన్, పింటూజీ, అంకణ్‌జీ, సుజిత్ రహమాన్, దిలీప్, అభినవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్లకు ముమ్మరంగా ఏర్పాట్లు

షేక్‌పేట మండలంలో జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం



గుర్తింపు కార్డులు తీసుకుంటున్న సిబ్బంది..

- ఎన్నికల విధులకు సిబ్బంది..
- సిబ్బందికి గుర్తింపు కార్డుల జారీ..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుండగా ఇందుకోసం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ విధులకు సంబంధించిన కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఎన్నికలకు సంబంధించిన స్టేషనరీతో పాటు ఫర్నిచర్, ఏసీలు, బీరువాలను అధికారులు తెప్పించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎన్నికల సిబ్బంది రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గుర్తింపు కార్డులను తీసుకున్నారు. షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు కావడంతో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన షేక్‌పేట మండల కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా ఎన్నికల సిబ్బందికి గుర్తింపు కార్డులు కూడా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే వీరందరికీ శిక్షణ పూర్తయ్యింది. నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లపై బంజారాహిల్స్ పోలీసులు కసరత్తు చేస్తున్నారు. నామినేషన్ కేంద్రానికి దారితీసే రహదారుల్లో పికెటింగ్‌ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, తనిఖీలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారితో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూట్‌మ్యాప్ కూడా పోలీసులు రూపొందించడం జరిగింది. నామినేషన్ల ప్రక్రియ కంటే ముందే ఇక్కడ పికెటింగ్‌లు ఏర్పాటుచేయాలని తలపెట్టారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటుకావడంతో ముందస్తు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.



షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయం

జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర సమాచారం..

మొత్తం ఓటర్లు	- 3,98,982
పురుషులు	- 2,07,367
మహిళలు	- 1,91,590
ఇతరులు	- 25
సర్వీసు ఓటర్లు	- 18
80 ఏళ్ల పైబడ్డ వారు	- 6,052
ఎన్ఆర్ఐ ఓటర్లు	- 95
దివ్యాంగులు	- 1891
మొత్తం పోలింగ్ బూత్‌లు	- 407
పోలింగ్ లోకేషన్లు	- 139
ఒక్కో పోలింగ్ బూత్‌లో సగటు ఓటర్లు	- 980 మంది
పోలింగ్ సిబ్బంది	- 2400
పోలింగ్ అధికారులు	- 1200
ప్రిసైడింగ్ అధికారులు	- 600 మంది
బూత్ లెవల్ అధికారులు	- 407
సూపర్‌వైజర్లు	- 38
కంట్రోల్ యూనిట్లు	- 826
బ్యాలెట్ యూనిట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్	- 1494
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	- 9
స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు	- 9
వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు	- 6
వీడియో వ్యూయింగ్ టీమ్‌లు	- 6
హెల్ప్ డెస్క్	- 1

ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 13 (సోమవారం)
నామినేషన్లు ఆఖరు తేదీ: అక్టోబర్ 21 (మంగళవారం)
నామినేషన్ల స్క్రూట్నీ అక్టోబర్ 22 (బుధవారం)
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 24 (శుక్రవారం)
పోలింగ్ తేదీ నవంబర్ 11 (మంగళవారం)
ఓట్ల లెక్కింపు నవంబర్ 14 ' (శుక్రవారం)
ఎన్నికల ప్రక్రియ పూర్తి నవంబర్ 16

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ పిలుపు



బాబా సైలానీనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, డివిజన్ ఎన్నికల పరిశీలకులు కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్‌లోని బాబా సైలానీనగర్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి ఢిల్లీ నేతల గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర సంక్షేమం గాలికి వదిలేశారని ఆరోపించారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలు కొనసాగించాలంటే ఆయన సతీమణి సునీతను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, సీనియర్ నాయకులు ధర్మ, పద్మయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి రూ. లక్ష కోట్లు ఖర్చుచేస్తాం

తీన్మార్ మల్లన్న

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీ ప్రభుత్వం రాగానే మొదటి సంవత్సరమే బీసీల అభివృద్ధి కోసం రూ.లక్ష కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫోరం వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కె.మురళీ మనహర్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓపెన్ టాక్ విత్ మల్లన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు మల్లన్న సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తెలంగాణ వచ్చిన 12 సంవత్సరాల్లో బీసీలకు రూ. 45 వేల కోట్లు కేటాయింపులు జరిగితే ఖర్చు చేసింది మాత్రం కేవలం రూ.24 వేల కోట్లు మాత్రమే అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న చిత్తశుద్ధి మొదట పాలకవర్గానికి ఉండాలన్నారు. నిజంగా ఉంటే తమిళనాడు తరహాలో ఢిల్లీలో పోరాడి రిజర్వేషన్లు సాధించే వారన్నారు. కార్యక్రమంలోఫోరం ప్రతినిధులు దేవళ్ళ సమ్మయ్య, కొండల్ రావు, నగేష్ భూషన్, జ్వలిత, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, తుల్జారామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతల ప్రలోభాలకు లొంగొద్దు



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌ఓ రజినీకాంత్‌రెడ్డి

వెంగళరావునగర్: రాజకీయ నేతల ప్రలోభాలకు లొంగవద్దని ఈ విషయంలో చాలా జాగురుకతతో వ్యవహరించాలని జూబ్లీహిల్స్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రజినీకాంత్‌రెడ్డి తెలియజేశారు. సర్కిల్-19 కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఆర్‌ఓ రజినీకాంత్‌రెడ్డి పలు సూచన చేశారు. ఓటరు ఐడీకార్డులు వచ్చిన తర్వాత బీఎల్‌ఓల ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వాటిని అందజేయాలన్నారు. ముందుగా ఓటర్లు అందజేసే ఫారం-6ను పూర్తిస్థాయిలో నింపేవిధంగా ఓటర్లకు అందజేసి త్వరితగతిన వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓలు ప్రసీద, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాందాస్‌జీ మహరాజ్ జయంతి





శ్రీగురు రాందాస్ జీ మహరాజ్‌కు పూజల్లో పాల్గొన్న నవీన్‌యాదవ్, మాగంటి సునీత

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని యాదగిరినగర్‌లో ఉన్న శ్రీగురు రాందాస్‌జీ మహరాజ్ 491 జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్‌యాదవ్ హాజరయ్యారు. రాందాస్‌జీ మహరాజ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయా నేతలు కోరుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలతో పాటుగా ఆలయ కమిటీ నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెంచిన బస్సు ఛార్జీలను తగ్గించే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడతామని పేర్కొన్నారు. ఛార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 9న నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బస్‌భవన్‌కు చేరుకొని వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు.

రేతిఫైల్ బస్టాండ్ నుంచి తలసాని..

ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సులో బస్‌భవన్ వరకు వెళ్తారు. అక్కడ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులతో కలిసి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేస్తారు.

నల్లగండ్ల చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల చెరువును హైడ్రా కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ బుధవారం పరిశీలించారు. నల్లగండ్ల ముదిరాజ్ సంఘం ఫిర్యాదుతో కమిషనర్ చెరువును పరిశీలించారు. ముఖ్యంగా చెరువు నీరు కలుషితం అవుతున్నాయని, చిన్న అలుగు, పెద్ద అలుగుల వద్ద నుంచి వరద ప్రవాహం, శ్మశాన వాటిక వైపు ఆక్రమణలు తొలగించాలని ఆయనను కోరారు. రంగనాథ్ చెరువు పరిసరాలను పరిశీలించి, వారంలో రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. అదే విధంగా చెరువు ఎఫ్‌టీఎల్‌లో మునిగిపోతున్న భూముల రైతులు కూడా హైడ్రా కమిషనర్‌ను కలిసి భూములకు టీడీఆర్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నల్లగండ్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రోజుల తరబడి తరలని చెత్తకుప్పలు



ఫిలింనగర్ ఎంజీ నగర్ నాలా వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలు..

ఫిలింనగర్: ఓపెన్ గార్బేజీ పాయింట్స్ వద్ద ప్రతీరోజూ తరలించాల్సిన వ్యర్థాలు తరలించకపోవడంతో బస్తీల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ముఖ్యంగా ఫిలింనగర్ 18 బస్తీల్లో చెత్తకుప్పల సమస్య విపరీతంగా ఉంది. ఫిలింనగర్‌లోని ఏ బస్తీలో చూసినా పెద్ద ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఎన్నిమార్లు స్థానికులు ఫిర్యాదులు చేసినా చెత్తను తరలించే వాహనాలు రావడం లేదని వారు మండిపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు పుస్తకాల ఆవిష్కరణ

హిమాయత్‌నగర్: డాక్టర్ ప్రశాంత్ తంబే(నాగ్‌పూర్) రచించిన భీంబాబా ది సూపర్ హీరో, భీంబాబా ది ఎటర్నల్ లైట్, మెట్టా అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సైఫాబాద్ సామ్రాట్ కాంప్లెక్స్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నియామకం



పీటర్ పాల్

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌కు చెందిన జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం ఉపాధ్యక్షుడు మాచర్ల పీటర్ పాల్ ఇండో ఇజ్రాయిల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్(ఐఐఎఫ్ఏ) హైదరాబాద్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియామితులయ్యారు. ఈ మేరకు ఐఐఎఫ్ఏ జాతీయ చైర్మన్ డా. ఆదంరాజ్ డెక్కపాటి, రాష్ట్ర ఐఐఎఫ్ఏ అధ్యక్షుడు డా. జేకే కెనడీ, రాష్ట్ర కార్యదర్శి డా. ఏఎస్. సామ్యూల్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీటర్‌పాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవిని అప్పజెప్పిన జాతీయ, రాష్ట్ర ఐఐఎఫ్ఏ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బొటానికల్ గార్డెన్‌లో వన్యప్రాణి వారోత్సవాలు



గచ్చిబౌలి: ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలను బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పాలపిట్ట పండుగ, ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను బాగస్వాములను చేశారు. చెట్లు, జంతువులు, పక్షులు, పాముల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, వన్యప్రాణి ఫొటోగ్రఫీ పోటీలను, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎకో టూరిజమ్ అసిస్టెంట్ డైరెక్టర్ శిరీష, డీఎం తనూజ, ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, అధికారులు సుమన్, వీరకిషోర్, నేచురలిస్ట్ అపరంజని, రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.4.60 లక్షల నగదు, మద్యం సీసాలు స్వాధీనం

పంజగుట్ట: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే శ్రీనగర్ కాలనీలో పంజగుట్ట పోలీసులు బుధవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక కారులో రూ.4.60 లక్షల నగదు లభ్యమైంది. సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. మరో కారులో 9 చివాస్ రీగల్ మద్యం బాటిల్స్ లభ్యమైనట్లు తెలిపారు.

మౌనికను ఆదర్శంగా తీసుకోవాలి



పల్లపు మౌనికను సత్కరిస్తున్న మౌనికను సన్మానిస్తున్న శేఖర్, గోగుల సతీష్

రహమత్‌నగర్: వడ్డెరులు చదుకుని ఉన్నతులుగా ఎదిగి, తమ జాతికి వన్నె తేవాలని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ ఆకాంక్షించారు. ములుగు జిల్లా వడ్డెర సామాజికవర్గానికి చెందిన పల్లపు మౌనిక డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల నాయకులు గోగుల సతీష్‌తో కలిసి బుధవారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ... అనాదిగా ఎదుగుదలకు దూరంగా ఉంటున్న వడ్డెర కులస్తులు ఇప్పుడిప్పుడే చదువుల్లో రాణిస్తూ ఎదగడం అభినందనీయమని అన్నారు. మౌనికకు ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు.

రెండో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి

బంజారాహిల్స్: భవనం రెండో అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్వాన్‌కు చెందిన మహ్మద్ అజ్మత్ (19) అల్లాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న యూనిక్ ఫ్యాబ్రికేషన్స్‌లో యూనస్‌ఖాన్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-10లోని జహీరానగర్‌లో అబ్దుల్లా అనే ఇంటి యజమాని సెకెండ్ ఫ్లోర్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా రక్షణ సౌకర్యాలు లేకపోవడంతో జారి కిందపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎండీ ఇబ్రహీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కాంట్రాక్టర్ యూనస్‌ఖాన్‌తో పాటు ఇంటి యజమాని అబ్దుల్లాపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు..

బంజారాహిల్స్: రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుణ్ణి జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో నివసించే నీలి శశిధర్ (32) డాక్టర్‌గా చెలామణి అవుతూ రహమత్‌నగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను గత కొంతకాలంగా నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్నాడు. ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ లాగా ప్రిస్క్రిప్షన్లు రాస్తూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోగులను చీటింగ్ చేస్తున్నట్లు కూడా గుర్తించారు. అంతేకాకుండా సమీపంలో శ్రీనివాస్ అనే వ్యక్తితో మెడికల్ షాపు కూడా తెరిపించాడు. శశిధర్ రాసిన మందులను శ్రీనివాస్ విక్రయించేవాడు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు నీలి శశిధర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లినిక్‌లో పెద్ద ఎత్తున మందులను, వైద్య సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

నమ్మి నగలు ఇస్తే మోసం

వెంగళరావునగర్: తోటి మహిళను నమ్మి నగలు ఇస్తే వాటిని తాకట్టు పెట్టుకుని మోసం చేసిన మరో మహిళపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురానగర్‌లోని దేవిరెడ్డి నిలయంలో నివసించే సురేష్ కుమార్ ప్రైవేట్ బ్యాంకులో పని చేస్తున్నాడు. నవ్యశ్రీ అనురాధ అనే మహిళ కూడా అదే బ్యాంకులో జాబ్ చేస్తోంది. ఇటీవల నవ్యశ్రీ అనురాధ తనకు అత్యవసరంగా నగదు కావాలని సురేష్ భార్య నాగమణిని వేడుకుంది. త్వరలోనే నగదు తిరిగి ఇస్తానని నమ్మించడంతో ఆమెకు నాగమణి 23 గ్రాములు ఉన్న రెండు బంగారు గాజులు ఇచ్చింది. దాంతో నవ్యశ్రీ అనూరాధ నగలను మరో బ్యాంకులో తాకట్టు పెట్టింది. విషయం తెలిసి తన బంగారు గాజులు ఇవ్వాలని అడగ్గా తప్పించుకుని తిరుగుతోంది. ఫోన్లు చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. తనను మోసం చేసిన నవ్యశ్రీ అనూరాధపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు నాగమణి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో జింకల సందడి



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జింకలు సందడి చేశాయి. స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్ళే కొత్త రోడ్డు పక్కన కనిపించాయి.

– రాయదుర్గం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

కోర్టుకు కేంద్రమంత్రి సంజయ్ గైర్హాజరు

సిటీ కోర్టులు: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి రోడ్డుపై ప్రచార సభ నిర్వహించారని అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్రమంత్రి బండి సంజయ్‌పై అప్పట్లో మిర్యాలగూడ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు సంజయ్ గైర్హాజరు కావడంతో ఆయన తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 18 వాయిదా వేస్తున్నట్లు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి తెలిపారు. ఈ కేసులో ఉన్న మరో ఆరుగురు విచారణకు హాజరయ్యారు. తదుపరి విచారణలో ఎగ్జామినేషన్ ఉంటుందని సంజయ్ తప్పకుండా హాజరుకావాలని న్యాయవాదికి కోర్టు సూచించింది.

ఎంపీ అనిల్ కుమార్ కూడా..

అప్పటి ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌పై 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నల్లకుంట పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ బుధవారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు అనిల్ కుమార్ గైర్హాజరు కావడంతో ఆయన తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి తెలిపారు.

విద్యాశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

– టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం నేతలు రాజ్‌కుమార్, భాస్కర్



నాయకులను సన్మానించిన రాజ్‌కుమార్, భాస్కర్

అబిడ్స్: విద్యాశాఖలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు టీఎన్జీఓస్ యూనియన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ తెలిపారు. విద్యాశాఖ పరిధిలోని అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వేగంగా పరిష్కారం అయ్యేవిధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. బుధవారం టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించి దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, భాస్కర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్ బాబు, శివరాజ్, నరేంద్ర ప్రసాద్, రాజేందర్, మధు, ప్రవీణ్, పవన్, వాసు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కళోపాసన'

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ కళల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందని హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ భిక్షు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి డ్యాన్స్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతరాన్ని ఉత్తేజపరిచేలా, కళాకారులను ఐక్యం చేసేలా రెండు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కళోపాసన పేరిట చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు రాబోయే రోజుల్లో పెద్దఎత్తున నిర్వహించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు శమంత పేరిట నిర్వహించిన నృత్యరూపకం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీనటి సంధ్యారాజు, కళాకారులు నిత్య, సాత్విక రెడ్డి, మనీష రంగుల, గౌతమ్ మహేశ్వర్, జి.వేద తదితరులు పాల్గొన్నారు.

సీసీఎంబీలో ఎస్‌ఏఏఈ కాన్ఫరెన్స్



లాలాపేట: సొసైటీ ఫర్ ఆల్టర్నేటివ్స్ టు యానిమల్ ఎక్స్‌పరిమెంట్స్–ఇండియా(ఎస్‌ఏఏఈ) అనే అంశంపై సీఎస్ఐఆర్–సీసీఎంబీలో మూడు రోజుల కాన్ఫరెన్స్ బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, ప్రిన్సిపాల్ సైంటిస్టు డా.బోకర కిరణ్‌కుమార్, చీఫ్ సైంటిస్ట్ డా. మొహమ్మద్ ఇద్రిస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రయోగాల్లో ఉపయోగించే జంతువుల స్థానంలో అనుసరించాల్సిన వినూత్న విధానాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా మానవశాస్త్రంపై పెరుగుతున్న ప్రాధాన్యత నేపథ్యం ప్రయోగాల కోసం జంతువుల వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయాలను అన్వేషించాలన్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీ ద్వారా పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల పరిశోధనల్లో చోటు చేసుకున్న పురోగతులపై చర్చించారు. ఈ కాన్ఫరెన్స్‌కు వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల నుంచి 180 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఐదు పురపాలికలకు ఒకే ఒక్కడు!

- ఆరు రోజులు.. ఐదు మున్సిపాలిటీల్లో విధులు
- టౌన్‌ప్లానింగ్ అధికారికి మోయలేని పనిభారం
- ఒరిజినల్ పోస్టింగ్ వనపర్తి.. మరో నాలుగింటికి ఇన్‌చార్జిగా..
- ఇలాగైతే పట్టణ ప్రణాళిక గాడిలో పడేనా?





శంషాబాద్: ఒకే ఒక్కడు.. ఉరుకులు పరుగులు.. వారంలో ఆరు రోజులు ఐదు మున్సిపాలిటీల్లో విధులు.. మోయలేని పనిభారం.. ఇదీ ఓ టౌన్‌ప్లానింగ్ అధికారి పరిస్థితి. ఐదు మున్సిపాలిటీల్లో ఆయన టౌన్‌ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధికి పురపాలికల్లో టౌన్‌ప్లానింగ్ అధికారే కీలకం. ఇంతటి కీలక పోస్టు నాలుగు మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉంది. ఈ మున్సిపాలిటీలు ఒకే ఒక్క ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ అధికారితో నెట్టుకొస్తున్నాయి. వారంలో ఆరురోజులపాటు ఐదు మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రణాళిక గాడి తప్పిందనడానికి ఇంతకన్నా నిదర్శన మేముంటుందని ఆయా పట్టణాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

జిల్లాలు దాటి...

ఏడాదిన్నర కిందటే ఆయనకు వనపర్తితోపాటు శంషాబాద్ టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని అమరచింత మున్సిపాలిటీకి సైతం ఆయననే ఉన్నతాధికారులు ఇన్‌చార్జిగా నియమించారు. ఇటీవల సదరు అధికారికి శంషాబాద్ సమీపంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆయన రెండు మున్సిపాలిటీల్లో రెండు రోజుల చొప్పున, ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కోరోజు చొప్పున విధులు చేపడుతున్నారు. ఇటీవల ఏసీబీ పట్టుబడ్డ టౌన్‌ప్లానింగ్ అధికారి స్థానంలో ఈయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

గాడి తప్పుతున్న పట్టణ ప్రణాళిక

పట్టణంలోని నిర్మాణాలు, పార్కులు, రహదారులు, ఎల్‌ఆర్ఎస్ సంబంధిత పనులు చక్కదిద్దడంలో టౌన్‌ప్లానింగ్ అధికారిదే కీలక పాత్ర. ఆ స్థానంలో పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో పట్టణ ప్రణాళిక గాడి తప్పుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారితో పాటు మరో ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, చైన్‌మెన్ ఉండాలి. ఆ పోస్టుల్లో కూడా సరైన నియామకాలు లేకపోవడంతో పట్టణాభివృద్ధి కుంటుపడుతోంది. అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎల్‌ఆర్ఎస్ వంటి ప్రక్రియలు కూడా నెమ్మదించే పరిస్థితులున్నాయి. పక్కపక్క స్థానాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించడమే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అలాంటిది పక్క జిల్లాలు దాటి ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాల్సి రావడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. మరోవైపు ఇన్‌చార్జీలతో కాలం నెట్టుకురాకుండా ఆయా పట్టణాలకు పూర్తిస్థాయి పట్టణ ప్రణాళికాధికారి నియామకంపై పురపాలక శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ మోసాలపై 'బాకీ కార్డు' ఉద్యమం

బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పాలకులు చేసిన మోసాలను తెలంగాణ ప్రజలకు వివరించి తద్వారా వారిని చైతన్యం చేసేందుకే బీఆర్ఎస్ బాకీ కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నామని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో బుధవారం బాకీ కార్డు ఉద్యమాన్ని పట్లోళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హామీలు అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ ఉందో తెలిసేలా కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గడపకూ తీసుకువెళ్లి వివరిస్తామన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, ఇలా అన్ని వర్గాల ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, సీనియర్ నాయకులు డి.రమేష్‌ముదిరాజ్, రాము యాదవ్, గుమ్మడి కుమార్, ముఖీత్‌చందా, మైసిరెడ్డి, భూదేవి, అరుణారెడ్డి, సరిత, పద్మ, భాగ్యమ్మ, పుష్పమ్మ, సుగుణమ్మ, లావణ్య, భగవాన్‌దాస్, బాలరాజుయాదవ్, ఆర్.కుమార్, మహేందర్‌ముదిరాజ్, ఉప్పల్ శ్రీను, సింహాద్రి, రాములు, భాస్కర్, సునీల్, బొంబాయి రవి, లయన్ కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివముదిరాజ్, కె.జగదీష్, గంజిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉద్దెంగడ్డలో ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న కార్తీక్‌రెడ్డి

'జీవితంలో మార్పు కోసం' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞానకేంద్రం: సినీనటుడు, ప్రముఖ రచయిత రమేష్ ధీరజ్ రచించిన 'జీవితంతో మార్పు కోసం' పుస్తకాన్ని బుధవారం ఇక్కడ ప్రముఖ కవి, రిటైర్డ్ గనుల శాఖ డైరెక్టర్ డాక్టర్ వీడీ రాజగోపాల్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మానవ విలువల గొప్పతనాన్ని తెలియజేయడానికి రచయిత చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి పుస్తకాలు సమాజాన్ని మేలుకోల్పడానికి ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ, ప్రముఖ కవయిత్రి డాక్టర్ పి. విజయలక్ష్మి పండిట్, డాక్టర్ జల్ది విద్యాధర్, డాక్టర్ రాధా కుసుమ, పద్మా శ్రీలత తదితరుల పాల్గొన్నారు.



'జీవితంలో మార్పు కోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజగోపాల్

'చౌమహల్లా'లో వారసత్వ వాత్సల్యం

తొమ్మిదో నిజాంను కలుసుకున్న అసఫ్ జాహీ వారసులు



సాక్షి, సిటీబ్యూరో: గత వైభవానికి సాక్ష్యంగా నిలిచే చారిత్రక చౌమహల్లా ప్యాలెస్ ఆవరణ అరుదైన, ఆత్మీయ ఘట్టానికి వేదికైంది. తరాలు మారినా చెక్కుచెదరని బంధాన్ని చాటుతూ అసఫ్ జాహ్ ఒకటి నుంచి ఆరు వరకు గల వంశానికి చెందిన సాహెబ్ జాదాలు (వారసులు) ప్రస్తుత తొమ్మిదవ నిజాం, వాలా షాన్ షాహ్‌జాదా అజ్మత్ జాహ్ బహదూర్‌ను గౌరవంగా బుధవారం కలుసుకున్నారు.

- నిజాం కుటుంబానికి ఆప్తమిత్రులైన నవాబ్ మీర్ జహీరుద్దీన్ అలీఖాన్ చొరవతో ఈ అపురూప సమావేశం జరిగింది. రాజ దర్బారు నిండుదనంలో, నిజాం కుటుంబ ఆచారాలు, గౌరవ మర్యాదలు పాటిస్తూ ఈ భేటీ కొనసాగింది. సాహెబ్ జాదాలు తమ ప్రియతమ నిజాం ఎదుట నిలబడి, హృదయపూర్వక భక్తి, అపారమైన గౌరవాన్ని ప్రదర్శించారు. అసఫ్ జాహీ పాలనలో తమ పూర్వీకులు అందించిన సేవలను, తమ కుటుంబాలకు నిజాం సంస్థానంతో ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. తరాలుగా నిలిచి ఉన్న తమ విధేయతను, అనురాగాన్ని మరోసారి నిరూపించారు.
- ఈ ఆత్మీయ సమావేశం కేవలం మాటలతో ముగియలేదు. ప్యాలెస్ వెనుక భాగంలో ఉన్న పచ్చిక మైదానంలో అత్యంత విలాసవంతమైన సాయంత్రపు అల్పాహారం(అస్రానా) ఏర్పాటు చేశారు.

దేశ విదేశీ వంటకాలతో కూడిన ఈ విందు... తరతరాలుగా అసఫ్ జాహీ కుటుంబం పాటిస్తున్న సంప్రదాయ ఉత్తమ ఆతిథ్యానికి ప్రతీకగా నిలిచింది.

ఆ'పాత'మధురం...

పాత రోజులను గుర్తు చేస్తూ సాగిన ఈ సాయంత్రం, ఆహూతులకు మధురానుభూతిని పంచింది. తనను కలుసుకునేందుకు వచ్చిన సాహెబ్‌జాదాలను చూసి వాలా షాన్ అజ్మత్ జాహ్ బహదూర్ సైతం అమితమైన సంతోషం వ్యక్తం చేశారు. ట్రస్టీలైన నవాబ్ ఎం.ఎ. ఫైజ్ ఖాన్, నవాబ్ మహ్మద్ ఫతే ఫైజ్ బిన్ జంగ్‌లతో కలిసి ఆయన వారసుల పట్ల కృతజ్ఞతలు తెలియజేయడంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. నిజానికి ఈ సమావేశం ఒక సాధారణ భేటీ కాదు. అది వారసత్వానికీ, వాత్సల్యానికీ మధ్య ఉన్న అనుబంధాన్ని, తరాలు మారినా తగ్గని రాజ కుటుంబ మర్యాదలను చాటి చెప్పిన ఒక ప్రత్యేక ఘట్టమని పలువురు వ్యాఖ్యానించారు.

తూముకుంటలో పర్యటించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం తూముకుంటలో పర్యటించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన ఆయన అక్కడి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. దేవరయాంజాల్‌లోని సర్వే నం.135, 136ల్లో రహదారికి ఆటంకాలు కలిగిస్తున్న వివాదంపై స్థానికులతో మాట్లాడారు. ఆ మార్గంలో కొత్తగా కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వస్తున్న నేపథ్యంలో రహదారిని వెంటనే పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. అక్కడి వరద కాలువపైనున్న ఆక్రమణలను ఆయన పరిశీలించారు. తుర్కవాణి కుంట నుంచి దేవరయాంజాల్ చెరువుకు వెళ్లే వరద కాలువ కబ్జా కావడంతో 4 కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

తగ్గని వానలు.. పెరిగిన ధరలు



- అమాంతం ఎగబాకిన కూరగాయల ధరలు
- కిలో టమాటో రూ.40, మిగతావి రూ.70-80 పైనే..
- చాలాచోట్ల చేలల్లోనే కూరగాయలు
- తగ్గిన రవాణా సౌకర్యం

సాక్షి,సిటీబ్యూరో: వరుస వర్షాలు కూరగాయల మార్కెట్లను కుదేలు చేస్తున్నాయి. నగర మార్కెట్లకు కూరగాయల దిగుమతులు భారీగా తగ్గాయి. దీంతో ధరలు పెరిగాయి. గత రెండు, మూడు రోజులుగా శివారు జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు కూరగాయల తోటలు నీట మునిగాయి. గ్రేటర్ శివారు జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా నగర మార్కెట్‌లకు కూరగాయల దిగుమతులు తగ్గాయి. గత రెండురోజులు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల వద్ద ఉన్న కూరగాయలతో నగరవాసుల అవసరాలు తీరాయి. ఆ తర్వాత కొద్దిమొత్తంలో ఉన్న కూరగాయలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. బీన్స్ కేజీ రూ. 120, బీరకాయ రూ.100, చిక్కుడు రూ. 80–100, టమాట రూ.40 ఉండగా, మిగతావాటి ధరలు రూ. 70–80 వరకు ఉనాయి.

డిమాండ్ ఎక్కువ.. దిగుమతులు తక్కువ

మంగళ, బుధవారాల్లో మార్కెట్‌కు కావల్సిన కూరగాయల దిగుమతులు ఆశించిన స్థాయిలో జరగలేదు. రోజూ వంద శాతం వివిధ రకాల కూరగాయలు దిగుమతి అవుతుండగా, గత నాలుగైదు రోజుల నుంచి 50–60 శాతం మాత్రమే కూరగాయల నగర హోల్‌సెల్ మార్కెట్‌లకు దిగుమతి అయినట్లు మార్కెటింగ్ శాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వానలతో బోయిన్‌పల్లి మార్కెట్‌కు శనివారం కేవలం 22 వేల క్వింటాళ్లు, గుడిమల్కాపూర్ మార్కెట్‌కు 5 వేల క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అయ్యాయి. అదే సాధారణ రోజుల్లో అయితే బోయిన్‌పల్లి మార్కెట్‌కు 32 వేల క్వింటాళ్లు, గుడిమల్కాపూర్‌కు 12 వేల క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు అందుబాటులో లేకపోవడంతో ధరలు భారీగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

సీజేఐపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ

– ఖండించిన పలు సంఘాల నాయకులు

కవాడిగూడ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్ బాబు, భారతీయ స్వయం సేవక్ సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ప్రొఫెసర్ అన్వర్ఖాన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి భారత దేశ ప్రజాస్వామ్యానికి మచ్చ లాంటిదని అన్నారు. రాకేష్ కిషోర్ అనే న్యాయవాది చెప్పు విసిరేందుకు ప్రయత్నించడం దారుణమని, ఈ ఘటన దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ చర్య వెనక ఎవరు ఉన్నారన్న విషయం నిజాయితీగా వెలికి తీయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించి నిందితుడైన రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో ఈ చర్య వెనక బీజేపీ ప్రభుత్వమే ఉందని భావించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరిగి రాములు, బీసీ వికాస సమితి అధ్యక్షుడు బాశెట్టి నర్సింగరావు, కోహెర్ లాజర్, సీహెచ్ దేవదాసు, నర్సింహా, వెంకటేష్, సంగం మహేష్, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కబ్జా ఫిర్యాదులపై కదిలిన హైడ్రా

తట్టిఖానా వాటర్ ట్యాంక్ ప్రాంతంలో స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా, జలమండలి అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–10లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా, జలమండలి, రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు ఆక్రమణకు పాల్పడుతున్నారని, కేసులు నమోదు చేసినా బేఖాతర్ చేస్తూ అందులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో జలమండలి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్‌రెడ్డి, హైడ్రా ఇన్‌స్పెక్టర్, షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు వచ్చి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఈ స్థలం తనదేనంటూ విజయభార్గవ్ అనే వ్యక్తి అక్కడికి చేరుకున్నాడు. అధికారులకు తెలియకుండానే వారి ఫొటోలు తీస్తుండటంతో బంజారాహిల్స్ ఎస్ఐ సంధ్య జోక్యం చేసుకొని ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అధికారులకు, ఆక్రమణదారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–10లో రెండు ఎకరాల 20 గుంటల స్థలాన్ని రెవెన్యూ అధికారులు జలమండలికే కేటాయించారు. ఇందులో ఎకరం భూమి జలమండలి ఆధీనంలోనే ఉండగా, మిగతా ఎకరం 20 గుంటల స్థలంపై పార్థసారథి, విజయభార్గవ్ అనే ఇద్దరు తండ్రీకొడుకులు వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో కబ్జా చేసినట్లు హైడ్రాకు పలు ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ ఆధీనంలో ఉన్న ఐదెకరాల స్థలాన్ని కూడా వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో పార్థసారథి, విజయభార్గవ్ కబ్జా చేస్తున్నారని రెవెన్యూ అధికారులు ఆరోపించారు. దీంతో వ్యవహారం ఠాణా దాకా వచ్చింది. జలమండలి జీఎం ప్రభాకర్, తట్టిఖానా వాటర్ సెక్షన్ మేనేజర్ రాంబాబు కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసు అధికారులకు వివరణ ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలి

– రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర డెమొక్రటిక్ ఫోరం చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో విపరీతమైన అవినీతి జరిగిందని, మతోన్మాద బీజేపీని అధికారంలోకి రానివ్వవద్దని తమ ఫోరం, వివిధ ప్రజా సంఘాలు కలిసి కాంగ్రెస్‌కు ఎన్నికల సమయంలో మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అప్రజాస్వామిక విధానాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబులను మించి పోతున్నారని ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నెలకు రూ.30 వేలు సంపాదించే ఒక సామాన్య వ్యక్తి తన జీతంలో మూడో వంతు పిల్లల చదువులకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రస్తుత పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఆపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత 8 నెలలుగా జీతాలు రావడంలేదని, వెంటనే వారికి వేతన బకాయిలు మొత్తం విడుదల చేయాలన్నారు. పెంచిన ఆర్టీసీ బస్సుల చార్జీలు వెంటనే తగ్గించాలని కోరారు. ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో రైతుల వద్ద నుంచి భూములు సేకరిస్తున్నారని, వాటికి సరైన పరిహారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాదగోని రవి, జానకిరాములు, ఆరెళ్ళ కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన దృశ్యం

మణికొండ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. ఇష్టారాజ్యంగా గదులను నిర్మించుకుని నివసిస్తున్న వారిని బయటకు రప్పించి వాటిని నేలమట్టం చేశారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ రెవెన్యూ, నెమలినగర్ కాలనీలో గతంలో ప్రభుత్వం పేదలకు 60 గజాల పట్టాలను కేటాయించింది. అవి పోను మరికొంత ప్రభుత్వ స్థలం మిగిలి ఉంది. దానిపై కన్ను వేసిన కొందరు కబ్జారాయుళ్లు గదులను నిర్మించి అమ్మకాలు చేపట్టారు. వాటిల్లో ప్రజలు వచ్చి ఉంటున్నారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టులను ఆశ్రయించారు. బుధవారం ఉదయం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ యంత్రాంగం కాలనీకి చేరుకుని ఐదు గృహాలు, రెండు ప్రహరీలను నేలమట్టం చేశారు. తమకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు ఉన్నాయని, తీర్పు వచ్చే వరకు ఆగాలని వారు వేడుకున్నా పట్టించుకోకుండా వారిని గృహాల్లోంచి బయటకు రప్పించి కూల్చి వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని, ఎప్పటికైనా కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. మరో మారు నిర్మాణం చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్ఐలు సురేష్, సుజీత్‌రెడ్డి, నార్సింగి పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి



సదస్సులో మాట్లాడుతున్న సాయిబాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దోపిడీకి వ్యతిరేకంగా నిర్మాణ రంగ కార్మికులు ఉద్యమించాలని సీడబ్ల్యూఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు సాయిబాబు పిలుపునిచ్చారు. నిర్మాణరంగ కార్మికుల పొట్టకొట్టే ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 4వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ... కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీ చేయడానికి ఉపయోగపడుతున్న నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ రంగ కార్మికుల పట్ల వివక్షత చూపుతున్నాయని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు నిధులను మెక్కడానికే ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు అనుకూలంగా జీఓ నం.12ను విడుదల చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుకట్ల శంకర్, గోపాల్‌రావు, రామ్మోహన్‌రావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, రాములు, జంగయ్య పాల్గొన్నారు.

పాలకులు ప్రజా సమస్యలను విస్మరించారు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకులు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపైన భౌతిక దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. నిర్బంధ చట్టాలను అమలుచేస్తూ జైల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడమంటే దేశం ఏమైపోతుందో అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరసన చేయకుండా ముందస్తుగా అరెస్టులు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, గోనె కుమార స్వామి, కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

10 నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు



లోగోను ఆవిష్కరిస్తున్న సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి తదితరులు

కవాడిగూడ: తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్, సండోజి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రంలో జరిగే మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డా. ఎంఏ కరీం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ లోగోను బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్‌కుమార్, ఏసీపీ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. ఆధునిక జీవన విధానానికి అలవాటు పడిన వారిలో మానసిక ఒత్తిడి ఏదో ఒక రూపంలో ఉంటుందన్నారు. అలాంటప్పుడు ధైర్యంగా ఉండి దానిని అధిగమించేందుకు యోగా, ధ్యానం, వ్యాయామంతో పాటు మానసిక వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సండోజి హెల్త్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ రాకేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఎండీ అంజద్‌అలీ, డా. కృష్ణగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, గురువారం, 9, అక్టోబర్, 2025





పట్నంలో.. గ్రామీణ భారత్

మహోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: చేనేత కార్మికులు, హస్తకళ కళాకారులు, ఇతర మహిళా సంఘాలు సృష్టించిన చేనేత–హస్తకళా ఉత్పత్తులను ఎలాంటి మధ్యవర్తులు లేకుండా వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా అమీర్ పేట్‌లోని కమ్మ సంఘం వేదికగా ఏర్పాటు చేసిన 'గ్రామీణ భారత్ మహోత్సవం' బుధవారం ప్రారంభమైంది. నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గ్రామీణ భారత్ మహోత్సవాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రారంభించారు. 15వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దాదాపు 21 రాష్ట్రాలకు చెందిన 53 స్టాల్స్‌లో చేనేత, హస్తకళాకారులు తమ ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారు. ఇందులో మన రాష్ట్రం నుంచి 14 స్టాల్స్ ఉన్నాయి.



యువ డిజైనర్లతో

ఫ్యాషన్ బ్రాండ్స్ భేటీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులను పలు ఫ్యాషన్ బ్రాండ్స్ ప్రతినిధులు బుధవారం కలిశారు. నగరానికి చెందిన ప్రముఖ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హామ్స్ టెక్ ఆధ్వర్యంలో నాగార్జునహిల్స్‌లో నిర్వహించిన కెరీర్ కనెక్ట్ కార్యక్రమానికి హాజరైన వందలాది విద్యార్థులకు దేశవ్యాప్తంగా పేరొందిన పలు ఫ్యాషన్ బ్రాండ్స్‌కు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. డిజైనర్లలో సృజనాత్మక శక్తిని, ఇప్పటి వరకూ చేసిన వర్క్‌ను బేరీజు వేసుకుని వారికి అవకాశాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ విధానంలో ఇప్పటికే పలువురు విద్యార్థులు అరవింద్ ఫ్యాషన్స్, షాపర్స్ స్టాప్, లేబొనెల్ ది స్టోరీ, సింఘానియా, ఐశారావు, మై పర్‌ఫెక్ట్ ఫిట్ తదితర బ్రాండ్లతో కలిసి పనిచేసేందుకు ఎంపికయ్యారని వివరించారు.





మామిడి, స్ట్రాబెర్రీ ఇలా ఏదైనా కావొచ్చు.. ప్రతి సీజనల్ పండుని పండుగలా ఎలా జరుపుకోవాలో నగరవాసులకు తెలుసు. ప్రస్తుతం సీతాఫల్(కస్టర్డ్ ఆపిల్) సీజన్ ప్రారంభమైంది. దాంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే అక్టోబర్ నెలలో నగరంలోని రెస్టారెంట్ డెజర్ట్ మెనూలకు ఈ క్రీమీ ఫ్రూట్ కొత్త రుచులను అద్దుతోంది.


- సాక్షి, సిటీబ్యూరో

సీతాఫల్.. వైరల్..

ఇటీవలే సీతాఫలం రుచి, దాని ఆకారంలో రుచికరమైన వంటకాన్ని ప్రముఖ భారతీయ పేస్ట్రీ చెఫ్ తేజస్వి చందేలా రూపొందించారు. ఈ వంటకం తయారీ వీడియో ఇన్‌స్టాగామ్ రీల్ ఆన్‌లైన్‌లో అద్భుతమైన ఆదరణ పొందింది. ఈ విషయంలో తనకు ఫ్రెంచ్ చెఫ్ సెడ్రిక్ గ్రోలెట్ ప్రేరణగా పేర్కొంది. అతడు పండ్లను పోలి ఉండే డెజర్ట్‌ల తయారీకి ప్రసిద్ధి చెందాడు.



- పలువురు హోమ్ మేడ్ సీతాఫల్ బర్ఫీ, హల్వా, ఖలాఖండ్ కూడా తయారు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లపై అందిస్తున్నారు.
- జూబ్లీహిల్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న నేచురల్ ఐస్‌క్రీమ్స్ కూడా చవులూరించే కస్టర్డ్ యాపిల్ రుచులకు కేరాఫ్. సీజనల్ స్పెషల్ సీతాఫల్ ఐస్ క్రీం ఇక్కడ ఫేమస్.
- బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.13లో ఉన్న లె టెసోరోలో ఓ ప్రత్యేక సీతాఫల్ రుచి అందుబాటులో ఉంది. సీతాఫల్ సోపుల్ జార్ పేరిట అందించే ఈ డిసర్ట్.. వావ్ అనిపిస్తుంది.
- జూబ్లీ హిల్స్‌లో రోడ్ నం.36లో ఉన్న కృష్ణపట్నం రెస్టారెంట్‌కి సీతాఫల్ లవర్స్ ఓ రౌండ్ కొట్టొచ్చు. ఇక్కడి కస్టర్డ్ యాపిల్ డిలైట్ కృష్ణపట్నం డిలైట్‌గా పేరొందింది.



- బంజారాహిల్స్‌లో ఉన్న సీతాఫల్ ఫ్రెష్ జ్యూస్ తన పేరులోనే ఈ ఫలాన్ని ఇముడ్చుకోవడంతో పాటు పలు రకాల మిల్క్ షేక్స్‌లోనూ మేళవిస్తోంది. సీతాఫలాన్ని ఇష్టపడేవారి కోసం మిల్క్ షేక్‌లతో సహా వివిధ రకాల కస్టర్డ్ యాపిల్ డెజర్ట్‌లను అందిస్తోంది.
- కొండాపూర్‌లోని తారా– సౌత్ ఇండియన్ కిచెన్ కూడా ఈ సీజనల్ ఫ్రూట్‌ని వడ్డిస్తోంది. ఈ సీజన్‌లో తారాస్ సీతాఫల్ రబ్డీని రుచి చూడటం సిటీలోని ఫుడ్ లవర్స్‌కి ఓ అలవాటు.

- జ్యూస్, ఐస్‌క్రీమ్స్, స్వీట్స్ నుంచి వంటకాల దాకా..
- సీజన్‌ను పురస్కరించుకుని వెరైటీల వెల్లువ
- రెస్టారెంట్స్, కేఫ్స్ మెనూల్లోనూ సీతాఫల్‌కి చోటు

సీజన్‌లో నిండుగా.. సిటీలో పండుగ

నగరంలో కస్టర్డ్ యాపిల్ రుచుల సందడి

సీతాఫలం సీజన్‌లో నేరుగా పండ్లను తీసుకోవడం మాత్రమే కాకుండా నగరవాసులు దానిని అనేక రూపాల్లో ఆస్వాదిస్తున్నారు. అన్ని పండ్ల మాదిరిగానే సీతాఫల్ జ్యూస్‌లు సరే.. అయితే.. కూలింగ్ మిల్క్‌షేక్‌ల నుంచి రుచికరమైన ఐస్‌క్రీముల వరకు, స్వీట్లు, పేస్ట్రీలు.. వివిధ రకాల వంటకాలలో ఇవి మేళవించడం విశేషం. వీటైనన్ని రూపాల్లో వెరైటీ డిష్‌లను తయారు చేసేందుకు ఉపయోగించ గల ఏకైక పండుగా సీతాఫలాన్ని చెప్పొచ్చు. ముఖ్యంగా సీతాఫల్ రబ్డీ అనేది సిటీ రెస్టారెంట్స్‌లో బాగా ఫేమస్. ఈ నేపథ్యంలో నగరంలో సీతాఫల్ రుచులు అందుబాటులో ఉన్న కొన్ని ప్రదేశాల గురించి..

- అబిడ్స్‌లోని సుల్తాన్ బజార్‌లో ఉన్న మయూర్ జ్యూస్ సెంటర్ సీతాఫలం రుచులకు ఫేమస్. ముఖ్యంగా నిండుగా గుజ్జుతో ఉన్న సీతాఫల్ జ్యూస్ ఇక్కడ క్రీమీగా రుచికరంగా ఉంటుందనేది ఫ్రూట్ లవర్స్ మాట.
- సికింద్రాబాద్, బండ్ల గూడ, టోలిచౌకిలలో ఉన్న నైస్ జ్యూస్ సెంటర్ కూడా సీతాఫల వెరైటీలకు పేరొందింది. భిన్న రకాల పండ్ల పేరిట మలాయ్‌లను అందించడంలో ప్రసిద్ధి చెందిన ఈ సెంటర్ సీతాఫల్ మలైని కూడా అందిస్తోంది.



ఆన్‌లైన్ ఒత్తిడికి విరుగుడుగా..

కేర్ నాట్ కంట్రోల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం(అక్టోబర్ 10)ని పురస్కరించుకుని యువజన మీడియా ప్లాట్‌ఫామ్ 'యువ' భాగస్వామ్యంతో 'స్నాప్ ఇంక్' ఆధ్వర్యంలో 'కేర్ నాట్ కంట్రోల్' పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోషల్ మీడియా, అభద్రత, ఒత్తిళ్లను దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ ప్రపంచాన్ని సురక్షితంగా మార్చడం టీనేజర్ల మధ్య ఆరోగ్యకరమైన సంభాషణలను పెంపొందించడమే ప్రధానంగా దీని ఉద్దేశ్యమన్నారు. భారతీయ స్నాప్‌చాటర్‌ల డిజిటల్ శ్రేయస్సుకు ఇది మద్దతు అందిస్తుందని వివరించారు. ఈ వీడియో ప్రచారం ఈ నెల 10 వరకూ కొనసాగుతుందన్నారు.

ఆచరణాత్మక

అనుభవం కోసం



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ – టెక్నాలజీ(ఎల్‌ఐఇటీ)కి చెందిన 23 మంది విద్యార్థుల బృందం మలేషియాలోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌కి ఎంపికై ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎల్‌ఐఇటీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ మలేషియా (ఐఐయూఎమ్) ప్రముఖ మలేషియా టెక్ సంస్థ డెల్లాయిడ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్ రియల్–టైమ్ సిస్టమ్స్‌లో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించిందని, 15 రోజుల పాటు విద్యార్థులు సీఎన్ఎన్ ఆధారిత ఆబ్జెక్ట్ డిటెక్షన్, రియల్–టైమ్ వెహికల్ ట్రాకింగ్ ఇంటెలిజెంట్ ఆటోమేషన్ సిస్టమ్స్ వంటి ప్రత్యక్ష ప్రాజెక్టులపై పనిచేసి అత్యాధునిక సాంకేతికతలు డీప్ లెర్నింగ్ వంటి అంశాలపై అవగాహన పెంచుకున్నారని ఎల్‌ఐఇటీ నిర్వాహకులు తెలిపారు. అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పరిశోధనలను బలోపేతం చేయడానికి, ఎల్‌ఐఇటీ, ఐఐయుఎమ్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించారు. ఎల్‌ఐఇటి జాయింట్ సెక్రటరీ సయ్యద్ తన్వీర్ అహ్మద్ హాజరయ్యారు.



- ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ స్పేస్ వీక్
- ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహణ
- ఈ నేపథ్యంలో హైదరాబాద్ స్పేస్ రీసెర్చ్‌పై కథనం

అంతరిక్ష వేదికపై.. హైదరాబాద్

సిటీకి అంతరిక్షంతో విడదీయరాని అనుబంధం ఉంది.. దేశం ఏ పరిశోధనలు చేసినా అందులో భాగస్వామ్యం అవుతోంది. కొంత కాలంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) పరిశోధనల్లో మన నగరం ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ప్రతిష్ఠాత్మక భారతీయ స్పేస్ ప్రాజెక్టుల్లో కీలక వీడి భాగాలను, సాంకేతికతను నగరంలోని పలు సంస్థలు అందిస్తుండటం విశేషం. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లు మొదలు అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ దేశాలకు పోటీగా నిర్వహిస్తున్న చంద్రయాన్‌లోనూ భాగ్యనగరం భాగస్వామ్యమవుతూ తన ప్రశస్తిని కొనసాగిస్తోంది. అయితే ప్రతి సంవత్సరం ఈనెల 10వ తేదీ వరకు 'ప్రపంచ అంతరిక్ష వారం' (వరల్డ్ స్పేస్ వీక్)ను అధికారికంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్యంగా స్పేస్ సైన్స్‌కు సంబంధించి అంతర్జాతీయ వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వరల్డ్ స్పేస్ వీక్‌ను 'లివింగ్ ఇన్ స్పేస్' థీమ్‌తో జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఒకసారి భారత అంతరిక్ష ప్రయాణంలో మన సిటీ ప్రస్థానాన్ని గుర్తుచేసుకోకుంటే ఎలా..?!

- సాక్షి, సిటి బ్యూరో

విద్యార్థులకు, యువ పరిశోధకులకు, ఔత్సాహిక నిపుణులకు శాస్త్ర సాంకేతికత, ఇంజనీరింగ్, అంతరిక్ష అన్వేషణ, ఇనోవేషన్‌తో పాటు సమగ్ర అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించడానికి వరల్డ్ స్పేస్ వీక్‌ను నిర్వహిస్తారు. సాంకేతికతతో పాటు పరిశోధన సాధనలు, ప్రయోజనాలు, మానవాళికి ఈ విజ్ఞాన ప్రాముఖ్యతను తెలియజేయడానికి జరుపుతారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు వరల్డ్ స్పేస్ వీక్‌ను జరుపుకుంటారు. 1957 అక్టోబర్ 4న మొదటి మానవ నిర్మిత ఉపగ్రహం స్పూత్నిక్ -1ను ప్రయోగించడం.. ఈ శాటిలైట్ 1967 అక్టోబర్ 10న చంద్రుడితో సహా ఇతర ఖగోళ ప్రాంతాల్లో అంతరిక్ష అన్వేషణ చేపట్టింది.





చంద్రయాన్ నుంచి పీఎస్ఎల్‌వీ వరకు..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో నగరానికి చెందిన సంస్థలు, పరిశోధన వేదికలు, పరిశ్రమలు తనదైన ముద్ర వేశాయి. పరికరాల తయారీ నుంచి ఉపగ్రహ డేటా విశ్లేషణ వరకు అనేక రంగాల్లో ఇక్కడి నుంచి నిపుణులు, సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా చంద్రయాన్–3 ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ చేసినప్పటికీ, ఆ విజయానికి వెనక ఉన్న ఇంజినీరింగ్ విజయాల్లో మన పాత్ర మరువలేనిది. ఈ మిషన్ విజయవంతం కావడంలో నగరానికి చెందిన అనేక సంస్థలు కీలకంగా పనిచేశాయి. శ్రీవేంకటేశ్వర ఏరోస్పేస్ ఆధ్వర్యంలో రాకెట్ స్ట్రక్చర్, విడిపోయే భాగాలు(సెపరేషన్ సిస్టమ్), నోజిల్స్, ల్యాండర్, రోవర్‌కు సంబంధించిన కీలక భాగాలను రూపొందించింది. నాగసాయి ప్రిసీసన్ ఇంజనీర్స్ సంస్థ, ల్యాండర్‌కు అవసరమైన లిథియం అయాన్ బ్యాటరీల రక్షణకు అల్యూమినియం ఆలాయ్ కేస్‌ను రూపొందించింది. అలాగే ఎమ్‌టీఏఆర్ టెక్నాలజీస్ సంస్థ లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్, హై సైకిల్ లైఫ్ వాల్వులు వంటి అనేక అత్యాధునిక భాగాలను తయారు చేసింది. నగరంలోని ప్రభుత్వ రంగ సంస్థ మిధాని.. క్రయోజెనిక్ ఇంజిన్లు, ప్రొపెల్లెంట్ ట్యాంకులు, రాకెట్ మోటార్ భాగాల తయారీలో ఉపయోగించే ప్రత్యేక లోహాలు, మిశ్రమాలను ఇస్రోకి సరఫరా చేసింది.

పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ..

అనంత్ టెక్నాలజీస్ సంస్థ పీఎస్ఎల్‌వీ–సీ52, పీఎస్ఎల్‌వీ–సీ56, జీఎస్ఎల్‌వీ–ఎఫ్14, ఇన్‌సాట్–3డీఎస్ వంటి అనేక ఉపగ్రహ ప్రయోగాలకు విమానాల ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టమ్స్, టెలిమెట్రీ ప్యాకేజులు, నావిగేషన్ మాడ్యూళ్లు, ఇనెర్షియల్ సెన్సింగ్ యూనిట్లు, పైరో కంట్రోల్ సిస్టమ్స్ వంటి అనేక భాగాలను రూపొందించి ఇచ్చింది. ఈ సంస్థ అనేక ఉపగ్రహాల అసెంబ్లీ, టెస్టింగ్, ఇంటిగ్రేషన్ ప్రక్రియల్లో భాగమవుతూ ఇస్రోకు అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోంది. ఇస్రో భాగస్వామ్యంతో 100కి పైగా ఉపగ్రహాలు, లాంచ్ వెహికిల్స్‌కు సిస్టమ్స్ సరఫరా చేసింది.

ఉపగ్రహ డేటా కేంద్రంగా.. ఎన్ఆర్ఎస్‌సీ

హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) ఉపగ్రహాల ద్వారా వచ్చే డేటాను విశ్లేషించి, వ్యవసాయం, నీటిపారుదల, విపత్తుల నిర్వహణ వంటి అనేక రంగాలకు ఉపయోగించేలా మారుస్తోంది. ఇది ఇస్రోకు భూమి పరిశీలన సంబంధిత సేవల్లో ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది.

పరిశోధన, స్టార్టప్‌లకు ప్రోత్సాహం..

ఇస్రో– ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సంయుక్తంగా 'ఏఐ ఫర్ స్పేస్' అనే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించి, విద్యార్థులు, స్టార్టప్‌లకు ఉపగ్రహ సాంకేతికతపై అన్వేషణకు అవకాశమిస్తోంది. ధృవ స్పేస్, స్కైరూట్ ఏరో స్పేస్ వంటి సంస్థలు హైదరాబాద్ ఆధారితంగా ఉపగ్రహ వ్యవస్థల అభివృద్ధిలో ముందున్నారు.



బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు.. 8 మంది ఆహుతి

కోనసీమ జిల్లా రాయవరం మండలంలో పెను విషాదం | దీపావళి ముంగిట బతుకులు బుగ్గి పాలు

సాక్షి, అమలాపురం/రాయవరం: దీపావళి ముంగిట పెను విషాదం చోటు చేసుకుంది. పండుగ రోజు అందరిలో ఆనందాలు విరజిమ్మాల్సిన మతాబులు ఎనిమిది ప్రాణాలను బలి తీసుకున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాల్లో తీరని చిచ్చు మిగిల్చాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పెను విస్ఫోటం చోటు చేసుకుంది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆరుగురు మృత్యువాత పడగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మంటల్లో కాలిపోయి మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారి పరిస్థితి విషమంగా ఉంది.



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

యజమానితో సహా..

మృతుల్లో బాణసంచా తయారీ కేంద్రం యజమాని, బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (65), పాట్నూరి వెంకటరమణ(55), అనపర్తి మండలం అనపర్తి సావరానికి చెందిన కుడుపూడి జ్యోతి (38), చిట్టూరి శ్యామల(38), పెంకే శేషారత్నం, రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పాకా అరుణ (35), ఒడిశా రాష్ట్రానికి చెందిన కె.సదానందం(52), వాసంశెట్టి విజయలక్ష్మి(51) ఉన్నారు. క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్లు సమాచారం.

చిచ్చుబుడ్డి దట్టిస్తుండగా..

చిచ్చుబుడ్డిని మెషీన్‌పై దట్టించే సమయంలో వెలువడిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న షాట్స్‌పై పడటంతో అంటుకుని పేలిపోయి నలువైపులా నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. దీంతో అక్కడ బాణసంచా తయారు చేస్తున్న వారు మంటల్లో చిక్కుకున్నారు. అప్పటి వరకు ఆరు బయట కూర్చున్న ఫైర్ వర్క్స్ యజమాని సత్యనారాయణమూర్తి కూలీలను రక్షించే ప్రయత్నంలో మృత్యువాత పడ్డారు. ఒంటిపై ఆభరణాల ఆధారంగా ఆయన్ను కుటుంబ సభ్యులు గుర్తించారు.

క్షణాల్లో అంతా బుగ్గి..

పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం క్షణాల్లో బుగ్గిగా మారింది. మండే గుణం ఉన్న సూరేకారం, బొగ్గు, గంధకం, వెలుగులు విరజిమ్మడానికి వినియోగించే అల్యూమినియం పౌడర్ అంటుకోవడంతో కళ్లు మూసి తెరిచేలోగా మంటలు ఎగిసిపడ్డాయి. తయారీ కేంద్రంతో పాటు సమీపంలో ఉన్న బాణసంచా విక్రయించే దుకాణంపై నిప్పురవ్వలు పడటంతో మంటల్లో చిక్కుకుంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో అక్కడ పని చేస్తున్నవారు తప్పించుకోలేకపోయారు. శరీరాలు ఎగిరి 10 – 15 అడుగుల దూరంలో పడ్డాయంటే పేలుడు తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. మంటల్లో శరీరం కాలిపోతుండగా నీటితో ఆర్పి ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు కార్మికులు పరుగులు తీశారు. ఆ ప్రాంతమంతా యుద్ధంలో బాంబు దాడికి గురైనట్లుగా మరుభూమిని తలపించింది. పేలుడు జరిగిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలో తమిళనాడులోని శివకాశి నుంచి తెప్పించిన మందుగుండు సామగ్రి దుకాణం ఉంది. ఇది కూడా అంటుకుని ఉంటే మరింత ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు.

బాణసంచా పేలుడు ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రాణనష్టం జరగడం బాధాకరం

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుపై ప్రధాని మోదీ

సాక్షి, అమరావతి: కోనసీమ జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు వల్ల ప్రాణ నష్టం చోటుచేసుకోవడం బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. బాధితులకు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ 14కు వాయిదా

- ఫోరెన్సిక్ ఆధారాలు అందాయన్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి అత్యంత కీలకమైన ఫోరెన్సిక్ ఆధారాలు (ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్) తమకు అందాయని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. బుధవారం జస్టిస్ బీవీ.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ముందు జరిగిన విచారణలో 'సీల్డ్ కవర్'వ్యవహారంపై వాడీవేడిగా వాదనలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..'ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి ఆధారాలు అందాయి. వాటిని పరిశీలించేందుకు సమయం కావాలి, విచారణను 16వ తేదీకి వాయిదా వేయాలి'అని కోరారు. అయితే దీనిపై ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది.

సీజేఐపై దాడి అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే రాజ్యాంగంపై దాడి అని, ఆయనపై దాడి చేసేందుకు ప్రయత్నించిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించడంతోపాటు అంబేడ్కర్ సర్కిల్‌లో కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించి రాకేశ్ కిశోర్ పోస్టర్‌ను చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తంచేశారు. చెన్నయ్య మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై దాడిని యావత్ భారత ప్రజలందరూ ఖండించాలని, రాకేశ్ కిశోర్‌ను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు.

సీజేఐపై దాడికి నిరసనగా సచివాలయంలో నిరసన



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ రాజ్యాంగంపై, లౌకికవాదులపై జరిగిన దాడిగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘాలు అభివర్ణించాయి. దాడిని నిరసిస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి సచివాలయంలోని బాహుబలి గేటు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సచివాలయ అధికారుల సంఘం అధ్యక్షుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ మతతత్వం ముసుగులో జరిగిన ఈ దాడిని అందరూ తీవ్రంగా ఖండించి భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. లేదంటే భారత రాజ్యాంగం మనందరికీ కల్పించిన ప్రాథమిక హక్కులను భవిష్యత్తులో కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్, బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.యాదగిరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రూప్ వన్ పరీక్ష రద్దు కోసం సర్కారు మెడలు వంచుతాం

గన్ పార్కులో కల్వకుంట్ల కవిత ధర్నా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ వన్ పరీక్షను రద్దు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయాన్ని ముట్టడించినా ప్రభుత్వంలో చలనం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల విమర్శించారు. గ్రూప్ వన్ పరీక్షను రద్దు చేసేంత వరకు ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లో నిరుద్యోగులకు మద్దతుగా కవిత బుధవారం ధర్నా చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటుంబాలకు బోనస్ ఉద్యోగాలు ఇచ్చుకోండి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరుద్యోగుల కాళ్లు పట్టుకొని ఓట్లు అడిగి చివరకు వారినే మోసం చేశారు. గ్రూప్ వన్ అవకతవకలపై ప్రొ.హరగోపాల్ స్పందించాలి. అవసరమైతే ఈ అంశంలో ఆయనను కలిసి మద్దతు కోరుతా. త్వరలో ఈ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాలను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తాం' అని కవిత ప్రకటించారు.

నకిలీ మద్యం తయారీ, సరఫరా నిజమే

- సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన ఉన్నతాధికారులు
- ములకలచెరువు ఘటనలో 21 మంది నిందితులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున నకిలీ లిక్కర్ తయారీ, సరఫరా, అమ్మకాలు నిజమేనని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో భారీగా బయటపడ్డ నకిలీ రాకెట్ ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో తయారైన నకిలీ మద్యం పెద్ద సంఖ్యలో బెల్ట్ షాపులకు సరఫరా జరిగిందని వివరించారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు, మంత్రులతో బుధవారం సీఎం నిర్వహించిన సమావేశంలో నకిలీ మద్యంకు సంబంధించిన అంశాలను వారు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో కల్తీ లిక్కర్ వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ములకలచెరువు ఘటనలో 21 మందిని నిందితులుగా గుర్తించామని, ఇందులో ఇప్పటివరకు 12 మందిని అరెస్టు చేశామని చెప్పారు. మిగతా నిందితులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఎ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ జరపుతున్నామని తెలిపారు. ములకలచెరువు కేసు ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జనార్దన్‌రావుకు చెందిన బార్, వ్యాపారాలపై తనిఖీలు జరిపామని, కల్తీ మద్యం నిల్వలను గుర్తించామని చెప్పారు. ఆయన సోదరుడు జగన్‌మోహన్‌రావుతో కలిసి నకిలీ మద్యం తయారు చేసి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి 12 మందిని నిందితులుగా గుర్తించామని వివరించారు.

టీడీపీ నేత జయచంద్రారెడ్డిపై కేసు?

- డైవర్షన్ డ్రామాలో మరో అంకం
- బెడిసి కొట్టిన కోవర్ట్ డ్రామా
- నేరం ఆయనపై తోసేసి పెద్దలు తప్పించుకునే యత్నం



జయచంద్రారెడ్డి



కొడాలి శ్రీనివాసరావు, కట్టా రాజు



గిరిధర్‌రెడ్డి

మదనపల్లె/ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువు వద్ద బట్టబయలైన నకిలీ మద్యం తయారీ రాకెట్ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడంలో భాగంగా సస్పెన్షన్‌కు గురైన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిపై ఎక్సైజ్ కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది. గురువారం అరెస్ట్ ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఘటనలో ఇప్పటికే 14 మందిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు.. తాజాగా ఇంకో ఏడుగురిపై కూడా (మొత్తం 21 మంది) కేసు నమోదు చేశామని చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ ఏడుగురు ఎవరన్నది వెల్లడించలేదు. వీరిలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి ఉన్నారని సమాచారం. ఏ–2 కట్టా రాజు, ఏ–12 గోడౌన్ అద్దె లీజు కలిగిన కొడాలి శ్రీనివాసరావులను కూడా అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తెలిపారు. మొత్తంగా నిందితుల్లో 12 మందిని అరెస్ట్ చేశామన్నారు. తాజాగా కాగా, నకిలీ మద్యం తయారీ మరక కడిగేసుకోవాలంటే జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు కేసు నమోదు చేయాలని.. తద్వారా తమ పార్టీ నేతను కూడా ఉపేక్షించలేదనే సంకేతాలు వెళతాయని టీడీపీ పెద్దలు భావించారు. అందుకే నియోజకవర్గం ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జయచంద్రారెడ్డిపై కూడా కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు సూచించారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా జయచంద్రారెడ్డి పెద్దిరెడ్డి కుటుంబానికి కోవర్ట్ అంటూ టీడీపీ సాగిస్తున్న దుష్ప్రచారం చూసి స్థానికులు నివ్వెర పోతున్నారు. 'జయచంద్రారెడ్డి కోవర్ట్ అయితే చంద్రబాబు ఆయనకు తంబళ్లపల్లె టీడీపీ టికెట్ ఎందుకిచ్చారు? రాజకీయాలకు కొత్త అయిన వ్యక్తికి పెద్దపీట ఎందుకు వేశారు?' అని స్థానిక టీడీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌తోపాటు నియోజకవర్గ సీనియర్లకు కనీస ప్రాధాన్యత లేకుండా చేసిన చంద్రబాబు.. కుల రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చానని అంగళ్లు ఎన్నికల సభలో స్వయంగా చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ & కొటేషన్ నోటీసు
Ref: 1. NIT No.:1.777/DB/D1/TUFIDC/Amangal/SWD/2025-26/9, Date: 07-10-2025, (ఎస్టీ కొరకు కేటాయించబడినది). I. టెండరు ప్రకటన (1 నం.): మొత్తం అంచనా వ్యయం రూ.50.00 లక్షలతో TUFIDC లోన్ అసిస్టెన్స్ క్రింద అమన్‌గల్ మున్సిపాలిటీలో వరద నీటి డ్రెయిన్ అభివృద్ధి (1 నం.) కొరకు దిగువ సంతకందారు టెండర్లు కోరుచున్నారు. టెండరు డాక్యుమెంట్లు 09-10-2025 నుండి 16-10-2025 తేదీల మధ్య ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభిస్తాయి మరియు అవి పై తేదీల మధ్య ప్రచురణ తేదీ నుండి (07) పని రోజుల పాటు లభిస్తాయి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పి.హెచ్. డివిజన్, రంగారెడ్డి
DIPR RO No.8900-PP/CL/Advt/1/2025-26, Dt: 08-10-2025

అంతా వారే చేశారట!

▶ మొదటి పేజీ తరువాయి

అమ్మకాల ద్వారా సులభంగా పెద్ద మొత్తంలో డబ్బు వస్తుండటంతో దానిపై కన్నేసిన కూటమి ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు.. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మరీ మద్యం దందా సాగించారు. ఈ దందా ద్వారా కమీషన్ల రూపంలో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఇందులో అత్యధిక భాగం డబ్బు కరకట్ట బంగ్లాకే చేరిందన్నది బహిరంగ రహస్యం. ఇప్పుడు ఈ నకిలీ మద్యం వ్యవహారాన్ని తక్కువ చేసి చూపేందుకు ప్రభుత్వ పెద్దలు ఎక్సైజ్ అధికారులకు దశా, దిశా నిర్దేశం చేశారు. పెద్ద తలకాయల ప్రస్తావన ఏదీ లేకుండా ఈ మొత్తం వ్యవహారాన్ని కింది స్థాయి నేతలపై నెట్టేసి చేతులు దులుపుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. తాజాగా విజయవాడ కోర్టులో దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. నకిలీ మద్యం తయారీ వెనుక అధికార తెలుగుదేశం పార్టీ పెద్దలకు సన్నిహితులైన అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహనరావులను ప్రధాన నిందితులుగా చేర్చిన ఎక్సైజ్ అధికారులు.. మొత్తం కథను వీరి చుట్టూనే తిప్పారు. ఇందులో ఎక్కడా ఈ మొత్తం నకిలీ మద్యం తయారీ వెనుక ఉన్న సూత్రధారులు, ప్రధాన పాత్రధారుల గురించి కనీస స్థాయిలో కూడా ప్రస్తావించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎక్సైజ్ అధికారులు తమ రిమాండ్ రిపోర్ట్‌లో మొత్తం 12 మందిని నిందితులుగా చేర్చారు. ఈ 12 మందిలో అద్దేపల్లి జగన్‌మోహనరావు (ఏ2), బాదల్ దాస్ (ఏ7) ప్రదీప్ దాస్ (ఏ8)లను మంగళవారం రాత్రి విజయవాడ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా దాఖలు చేసిన రిమాండ్ రిపోర్ట్‌లో పలు విషయాలను పొందు పరిచారు. నకిలీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకాల వ్యవహారంలో అద్దేపల్లి జనార్దనరావు (ఏ1), ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహనరావు (ఏ2)లు ప్రధాన పాత్ర పోషించినట్లు తెలిపారు. టీడీపీ పెద్దలకు సన్నిహితుడైన తన సోదరుడు జనార్దనరావుతో కలిసి నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నట్లు జగన్‌మోహనరావు అంగీకరించినట్లు పేర్కొన్నారు. నకిలీ మద్యం అమ్మకాల ద్వారా భారీగా లాభాలు వస్తుండటంతో ఆ దందాను విస్తరించినట్లు జగన్‌మోహనరావు చెప్పినట్లు రిపోర్ట్‌లో వివరించారు.



అక్కడి నుంచి ఇక్కడికి..

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా మద్యం విక్రయాలకు తెర లేపింది. దీన్నే అదునుగా భావించిన అద్దేపల్లి జనార్దనరావు, జగన్‌మోహనరావులు ప్రభుత్వ పెద్దల అండ, సలహాలు, సూచనలతో నకిలీ మద్యం తయారీని మొదలు పెట్టారు. మొదట ములకలచెరువు ప్రాంతంలో నకిలీ మద్యం తయారీ మొదలు పెట్టి అమ్ముతూ వచ్చారు. దీని ద్వారా వారు భారీగా డబ్బు ఆర్జించారు. ఇందులో పెద్ద మొత్తాన్ని ప్రభుత్వ పెద్దలకు కమీషన్ల రూపంలో ఇచ్చారు. వారి ప్రోత్సాహంతో ఈ నకిలీ మద్యం తయారీని భారీగా విస్తరించారు. ములకలచెరువు తరహాలో ఇబ్రహీంపట్నంలో డెన్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే విజయవాడతో పాటు వివిధ వైన్ షాపులు, బార్లు, బెల్ట్‌షాపులకు సరఫరా చేసి, అమ్మకాలు జరిపారు. బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ3) ఫేక్ సీల్‌లు, స్పిరిట్, కారమిల్, ఇతర పదార్థాలు కలిపి మద్యం తయారీ చేయడంలో ప్రధాన భూమిక పోషించారు. హైదారాబాద్‌కు చెందిన రవి (ఏ4) ఫేక్ లేబుల్స్ సరఫరా చేశారు. ఆరుగురు కూలీలు సయ్యద్ మాజి, కట్టారాజు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లు, మిథున్ దాస్, అనంత దాస్ ఈ నకిలీ మద్యం తయారీలో ఉన్నారు. వీరికి అధిక జీతాలు ఇస్తామని ఆశ చూపి, నకిలీ మద్యం తయారీలో వారిని వాడుకున్నారు. ఖాళీ పెట్ బాటిల్స్‌ను గన్నవరం మండలం సూరంపల్లెలో తయారు చేయించారు. దాని యజమాని శ్రీనివాసులరెడ్డిని ఏ11 నిందితునిగా, విజయవాడలోని శ్రీనివాస వైన్స్‌లో పనిచేసే అంగలూరి కళ్యాణ్‌ను ఏ12 నిందితునిగా చేర్చారు. కళ్యాణ్ ద్వారా నకిలీ మద్యాన్ని పెద్ద మొత్తంలో అమ్మినట్లు అధికారులు గుర్తించారు. అచ్చం ఒరిజనల్ బాటిల్స్ మాదిరి తయారు చేసి, అలాగే స్టిక్కర్లు అతికించి ఎలాంటి అనుమానం రాకుండా నకిలీ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మారు. ప్రధానంగా ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, క్లాసిక్ బ్లూ విస్కీ, కేరళ మాల్ట్ విస్కీ, మంజీరా విస్కీ.. బ్రాండ్లకు నకిలీ తయారు చేశారు. ఏకంగా విజయవాడలోనే పెద్ద డెన్‌ను ఏర్పాటు చేసి ధైర్యంగా నకిలీ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మారంటే ఇందుకు ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.

ఎన్నికల తర్వాత నుంచి నకిలీ మద్యం జోరు

2024 సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత గోవా మద్యం పేరుతో పలువురు అధికార పార్టీ నేతలు ఈ నకిలీ మద్యం దందాకు తెర లేపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే అద్దేపల్లి జనార్దనరావు పలు చోట్ల మద్యం సిండికేట్‌లో భాగస్వామిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలోని బ్రాందీ షాపులు, బార్లు, బెల్ట్ షాపులకు నకిలీ మద్యం సరఫరా జరినట్లు తేలడంతో మద్యం ప్రియుల్లో ఆందోళన మొదలైంది. అయితే నకిలీ మద్యం తయారీ విషయం ప్రజల్లోకి వెళ్లటంతో, ప్రభుత్వం దాని తీవ్రతను తక్కువ చేసి చూపించేందుకు నానా తంటాలు పడుతోంది. నామ మాత్రపు కేసులు పెట్టి ఈ నకిలీ మద్యం కేసు నుంచి టీడీపీ నాయకులను రక్షించేందుకు పడరాని పాట్లు పడుతోంది. ఇప్పటికే నకిలీ మద్యం తాగి పలుచోట్ల అనారోగ్యం పాలైన మందుబాబులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ఉదరగొట్టి, నకిలీ మద్యంతో ఆరోగ్యాలతో చెలగాటం ఆడుకోవటం సరికాదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నకిలీ మద్యం రాకెట్‌పై బాబు డైవర్షన్ గేమ్

గుట్టు రట్టవడంతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

- తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్సార్‌సీపీ కోవర్ట్ అని బుకాయింపు
- వైఎస్సార్‌సీపీ నేతల మాటలను వక్రీకరిస్తున్న వైనం
- ఈ వ్యవహారంపై ఇప్పటికీ నోరు మెదపని పెదబాబు, చినబాబు
- దీన్ని డైవర్ట్ చేయడానికి ఎదురు దాడికి దిగండంటూ సూచన

సాక్షి, అమరావతి: కళ్లు చెదిరే రీతిలో టీడీపీ నేతల నేతృత్వంలో నకిలీ మద్యం రాకెట్ బట్టబయలవ్వడంతో దాన్ని తప్పుదోవ పట్టించేందుకు సీఎం చంద్రబాబు ఎప్పటి మాదిరిగానే డైవర్షన్ గేమ్ మొదలు పెట్టారు. ప్రస్తుతం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా వర్ధిల్లుతున్న నకిలీ మద్యం బాగోతంపై సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నకిలీ మద్యం యూనిట్ నడుస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులే బట్టబయలు చేసినా, దాంతో తమకు సంబంధం లేదని కొందరు టీడీపీ నేతలతో మాట్లాడిస్తుండటం నివ్వెరపోయేలా చేస్తోంది. అంతటితో ఆగకుండా జయచంద్రారెడ్డి.. వైఎస్సార్‌సీపీ కోవర్ట్ అని, అందుకే టీడీపీలో చేరి నకిలీ మద్యం పరిశ్రమ నడిపి దాన్ని బయట పెట్టారనే అబద్ధపు వాదనను మొదలుపెట్టారు. రెండు రోజులుగా టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు, ఎల్లో మీడియా ఇదే వాదనను జనంలోకి తీసుకెళ్లేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

ఆయన టీడీపీ నేత కాదా?

జయచంద్రారెడ్డి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. తంబళ్లపల్లెలో అధికార పార్టీ వ్యవహారాలన్నీ ఆయనే నడిపిస్తున్నారు. బదిలీలు, కాంట్రాక్టులు, ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ఆయన ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. లోకేశ్‌కు జయచంద్రారెడ్డి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన హవా నడుస్తోంది. గత ఎన్నికల్లో శంకర్ యాదవ్ వంటి సీనియర్‌ను పక్కనపెట్టి మరీ ఆయనకు టికెట్ ఇవ్వడానికి లోకేశ్‌తో ఉన్న వ్యాపార ఒప్పందాలు, సాన్నిహిత్యమే కారణం. ఆ సంబంధాల నేపథ్యంలోనే తన నియోజకవర్గంలోని ములకలచెరువు సమీపంలో భారీగా నకిలీ మద్యం తయారు చేసి.. వైన్ షాపులు, బెల్టు షాపులకు సరఫరా చేసే పరిశ్రమను ప్రారంభించినట్లు స్థానిక టీడీపీ నేతలే చెబుతున్నారు. కట్టా సురేంద్రనాయుడు, అద్దేపల్లి జనార్దనరావు వంటి వారి ద్వారా నకిలీ మద్యం తయారీ, సరఫరా వ్యవహారాలను నడిపిస్తున్న విషయం బయట పడింది. అన్ని ప్రాంతాల్లోనూ ఈ తరహా నకిలీ మద్యం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి దందా నడిపిస్తున్నట్లు ఆయా ప్రాంతాల్లో దొరుకుతున్న నకిలీ మద్యం డంపులే నిదర్శనం. టీడీపీ పెద్దల ప్రమేయం లేకుండా ఇంత వ్యవస్థీకృత నకిలీ మద్యం దందా నిర్వహించడం అసాధ్యమని ఎన్నో ఏళ్లుగా లిక్కర్ వ్యాపారం చేస్తున్న వారు చెబుతున్నారు. వారి అండదండలు ఉండబట్టే ఏకంగా నకిలీ మద్యం కోసం పరిశ్రమను స్థాపించి, నకిలీ సరుకును అన్ని ప్రాంతాలకు.. కోరిన బ్రాండ్‌ల పేరుతో సరఫరా చేస్తున్నారు.

గుట్టు రట్టవడంతో గప్‌చుప్

గల్లీ నుంచి ఢిల్లీ వరకు, ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా రెప్పపాటు వ్యవధిలో స్పందించే చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్.. నకిలీ మద్యం వ్యవహారంపై మాత్రం ఇంత వరకు నోరు విప్పక పోవడం గమనార్హం. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాత్రం నకిలీ మద్యంతో తమకు సంబంధం లేదని ప్రకటించారు. అలాంటప్పుడు తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని ఎందుకు సస్పెండ్ చేసినట్లు? పట్టుబడుతున్న నకిలీ మద్యం బాటిళ్ల అన్నింటిలోనూ టీడీపీ ఆనవాళ్లే కనిపిస్తున్నాయి. అనేక చోట్ల నకిలీ మద్యం బయట పడుతుండటంతో ఏం మాట్లాడాలో తెలియక టీడీపీ నేతలు మొత్తం సైలెంట్ అయిపోయారు. రెడ్‌హ్యాండెడ్‌గా టీడీపీయే ఈ దందా చేస్తున్నట్లు అందరికీ తెలిసి పోవడంతో దీనిపై మాట్లాడేందుకు ఆ పార్టీ నాయకులు ముందుకు రావడంలేదు. ఇప్పుడు అన్నిచోట్లా తాము తాగుతున్న మద్యం కూడా నకిలీయేనా అనే అనుమానం టీడీపీ నేతలు, కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజానీకంలోనూ వ్యక్తమవుతోంది.

బాబు మార్కు డైవర్షన్

ఇదంతా టీడీపీయే చేస్తుందనే విషయం బయట పడడంతో చంద్రబాబు తన మార్కు యాక్షన్ ప్రారంభించారు. నకిలీ మద్యంపై తాను సీరియస్‌గా ఉన్నట్లు, ఎంతటి వారిపై అయినా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మీడియాకు లీకులిస్తున్నారు. అయినా నకిలీ మద్యం వ్యవహారం రాష్ట్రాన్ని షేక్ చేస్తుండడంతో తంబళ్లపల్లె పార్టీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, స్థానిక నేత సురేంద్ర నాయుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో వైపు సోషల్ మీడియాలో జయచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కోవర్టు అనే ప్రచారాన్ని పెద్దఎత్తున చేయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సతీష్‌రెడ్డి.. చంద్రబాబు ప్రభుత్వంలో జరుగుతున్న నకిలీ మద్యం వ్యవహారంపై మాట్లాడుతూ ములకలచెరువు యూనిట్ ద్వారా ఐదేళ్లలో రూ.500 కోట్లను అక్రమంగా దండుకునేందుకు స్కెచ్ వేశారని చెబితే దాన్ని వక్రీకరించారు. ఈ దుష్ప్రచారాన్ని ఏకంగా తెలుగుదేశం పార్టీ అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా చేయడాన్ని బట్టి వారు ఏ స్థాయికి దిగజారారో అర్థం చేసుకోవచ్చు.

డీహెచ్ కార్యాలయంలో మహిళా ఉద్యోగికి వేధింపులు

- మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేసిన మహిళ
- సీఎంవో, ఉమెన్ కమిషన్‌కు సైతం లేఖ... చర్యలకు మంత్రి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తి తనను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఓ మహిళ ఏకంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. మంత్రితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయానికి, మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు సదరు మహిళ లేఖలు పంపింది. జూనియర్ అసిస్టెంట్‌గా ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న సదరు మహిళా ఉద్యోగి డిప్యుటేషన్ కోసం డీహెచ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోగా, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా, తన అవసరాన్ని అసరాగా తీసుకొని లైంగిక వేధింపులకూ గురి చేశారంటూ ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు న్యాయపరమైన చర్యలకు కూడా దిగుతూ లీగల్ నోటీస్ పంపించినట్లు మంత్రికి తెలిపారు. ఆ మహిళా ఉద్యోగిని డీహెచ్ కార్యాలయం ఉద్యోగి రూ. 2 లక్షలు డిమాండ్ చేయగా, రూ. లక్ష ఇచ్చేందుకు ఒప్పుకొని రూ. 50 వేలు గూగుల్ పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు. అయినా డిప్యుటేషన్ చేయకుండా, వేధింపులకు గురి చేస్తుండటంతో ప్రభుత్వ పెద్దల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. కాగా డిప్యుటేషన్‌ల విషయంలో కీలకంగా వ్యవహరించే డీహెచ్ కార్యాలయంలోని ఓ మహిళా ఉద్యోగి కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో కలిసి ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో మహిళా ఉద్యోగి లేఖపై విచారణ జరపాలని మంత్రి దామోదర అధికారులను ఆదేశించారు.

నిమ్స్ నుంచి ఆరోగ్య మంత్రి దామోదర డిశ్చార్జి

సాక్షి, హైదరాబాద్: జ్వరంతో బాధపడుతూ మంగళవారం నిమ్స్‌లో చేరిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం డిశ్చార్జి అయ్యారు. నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఆయనకు చికిత్స అందించగా పూర్తిగా కోలుకున్నారు.

అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈగా ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖలోని అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం (ఐఎస్‌డబ్ల్యూఆర్) సీఈగా.. సీఈ (ఎంక్వైరీస్) కె.ప్రసాద్‌ను అదనపు బాధ్యతల్లో నియమిస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



చిన్న నగరాలకూ.. రెక్కలొచ్చాయి!

పెరిగిన ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల జోరు	చిన్న విమానాశ్రయాల నుంచీ ప్రయాణికులు	మెట్రోలతో పోటీపడుతున్న ఇతర పట్టణాలు

పెరుగుతున్న మధ్యతరగతి ఆదాయం, విశ్రాంతి, వ్యాపార ప్రయాణాలకు పెరిగిన డిమాండ్.. ఇవన్నీ దేశీయ విమానయానాన్ని నూతన శిఖరాలకు తీసుకువెళ్తున్నాయి. చిన్న నగరాలను అనుసంధానించడానికి ఉడాన్ పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాలు, తక్కువ–ధర క్యారియర్‌ల పోటీ, పాత విమానాశ్రయాల విస్తరణ, కొత్త ఎయిర్‌పోర్టుల రాక, మౌలిక సదుపాయాల కల్పన.. వెరసి భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. మెట్రోయేతర పట్టణాల నుంచి ప్యాసింజర్లు పెరుగుతుండడం ఇందుకు నిదర్శనం. - సాక్షి, స్పెషల్ డెస్క్

- 1995–96 నాటి మాట.. అప్పట్లో దేశీయంగా 2.56 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. అలాగే 1.14 కోట్ల మంది వివిధ దేశాలకు రాకపోకలు సాగించారు. మూడు దశాబ్దాలలో విమానయాన రంగం తీరుతెన్నులు మారిపోయాయి.
- దేశీయ ప్రయాణికుల సంఖ్య 13 రెట్లు, అంతర్జాతీయ ప్యాసింజర్ల సంఖ్య 7 రెట్లు దూసుకెళ్లింది. 2005–06 నుంచి 2024–25 మధ్య దేశీయంగా ప్రయాణికులు 5.1 కోట్ల నుంచి 33.5 కోట్లకు, అంతర్జాతీయ విమాన ప్రయాణికులు 2.2 కోట్ల నుంచి 7.7 కోట్లకు చేరారు.
- సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) నివేదిక ప్రకారం.. భారత విమానయాన రంగ వృద్ధిలో అధిక భాగం అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి కాకుండా దేశీయ ప్రయాణికుల నుంచి సమకూరడం విశేషం. కరోనా సమయంలో మాత్రమే పరిశ్రమ తిరోగమనం చెందింది.

ఆధిపత్యం తగ్గుతోంది

ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాలు ఎక్కువ మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. కానీ వీటి ఆధిపత్యం క్రమంగా తగ్గుతోంది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం.. 2006–07లో భారతీయ విమానాశ్రయాలు సేవలందిస్తున్న మొత్తం ప్రయాణికుల్లో నాలుగింట మూడొంతులకుపైగా వాటా (75 శాతానికి పైగా) ఈ మెట్రో నగరాలదే. అయితే 2024–25 వచ్చేసరికి ఈ వాటా మూడింట రెండొంతులకు (సుమారు 67 శాతం) పడిపోయింది. మొత్తంగా మెట్రోయేతర నగరాల్లోని విమానాశ్రయాల వాటా 55.87% వృద్ధి చెందడం విశేషం. ప్రయాణికుల రద్దీలో ప్రథమ శ్రేణి నగరాల వాటా 2006–07లో 78.46% నుంచి 2024–25లో 66.44%కి వచ్చి చేరింది. ద్వితీయ శ్రేణి నగరాల విషయానికి వస్తే వీటి వాటా 15 నుంచి 24.6%కి దూసుకెళ్లింది. తృతీయ శ్రేణిలో 9% మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి.

పదిలో నలుగురు..

దేశీయ విమానయానంలో మెట్రో, మెట్రోయేతర నగరాల మధ్య అంతరం తగ్గుతోంది. 2006–07లో మొత్తం దేశీయ ప్రయాణికులలో దాదాపు 73% మంది మెట్రో నగరాల్లోని విమానాశ్రయాల ద్వారా ప్రయాణించారు. 2024–25 నాటికి ప్రథమ శ్రేణి నగరాల వాటా దాదాపు 58%కి పడిపోయింది. ప్రతి పది మంది దేశీయ ప్రయాణికులలో నాన్-మెట్రో విమానాశ్రయాలు నలుగురికి సేవలు అందించాయి. ఇక అంతర్జాతీయ ప్రయాణం మెట్రో-కేంద్రీకృతంగా ఉంది. 2006–07లో అంతర్జాతీయ ప్రయాణికులలో వీటి వాటా 78 శాతానికిపైనే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది దాదాపు 73%కి వచ్చి చేరింది.

చిన్నవే.. కానీ!

భారత్‌లో 2015–16తో పోలిస్తే 2024–25 నాటికి చిన్న నగరాలు విమానయాన జోరుకు కారణమయ్యాయి. ప్రథమ శ్రేణి నగరాల్లోని విమానాశ్రయాలలో ప్రయాణికుల రద్దీ దశాబ్దంలో సగటున 84.4% పెరిగింది. కానీ ద్వితీయ శ్రేణి ఎయిర్‌పోర్టుల్లో 132%, తృతీయ శ్రేణిల్లో 159% పెరగడం విశేషం. ద్వితీయ శ్రేణి నగరాల విభాగంలో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ విమానాశ్రయం (చకేరి) ఏకంగా 1,63,479%, తృతీయ శ్రేణి నగరాల పరిధిలోకి వచ్చే కర్ణాటకలోని మైసూర్ విమానాశ్రయం 7,874% వృద్ధిని నమోదు చేశాయి. రెండు విమానాశ్రయాలు చాలాకాలం క్రితమే నిర్మించినప్పటికీ.. 2015 వరకు నామమాత్రంగా కార్యకలాపాలు సాగాయి. ఉడాన్ పథకం కింద వీటిని అభివృద్ధి చేశారు. 2015–16లో కాన్పూర్ విమానాశ్రయం నుంచి కేవలం 197 మంది, మైసూర్ నుంచి 1,190 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. గత ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య వరుసగా 3,22,252 మరియు 94,891కి పెరిగింది.

2015-16తో పోలిస్తే 2024-25 నాటికి నగరాలవారీగా విమానాశ్రయాల్లో ప్రయాణికుల వృద్ధి (శాతాల్లో)..

ప్రథమ శ్రేణి	84.4
ద్వితీయ శ్రేణి	132
తృతీయ శ్రేణి	159

బాలికపై మైనర్ లైంగిక దాడి

- గర్భవతి అయిన బాలిక
- పోక్సో కేసు నమోదు..
- బాలల కేంద్రానికి బాలుడి తరలింపు

ఫిలింనగర్ (హైదరాబాద్): ఏడో తరగతి చదువుతున్నప్పుడే 12 ఏళ్ల వయస్సులో బాలబాలికలిద్దరూ ఆకర్షితులయ్యారు. ఇద్దరూ ఒక్కటే తరగతి కావడంతో పదో తరగతి వరకు మూడేళ్ల పాటు చెట్టపట్టాలేసుకుని తిరిగారు. అయితే ప్రస్తుతం తనను గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడని, పెళ్లి మాట ఎత్తేసరికి ముఖం చాటేశాడంటూ బాధిత బాలిక ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్‌లోని ఓ బస్తీలో నివసించే బాలిక తన ఇంటి పక్కనే నివసిస్తున్న క్లాస్‌మేట్‌తో ప్రేమలో పడింది. టెన్త్ వరకు ఒకే స్కూల్లో చదువుకున్న ఇద్దరూ ప్రేమ పేరుతో షికార్లు కొట్టారు. 2023లో పదో తరగతి పరీక్షలు రాసిన అనంతరం బాలిక బాలుడి ఇంటికి రాగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరువాత కూడా పలుమార్లు బాధిత బాలిక బాలుడితో కలిసింది. దీంతో బాలిక గర్భం దాల్చడంతో టాబ్లెట్లు వేయించి గర్భస్రావం చేయించాడు. అయితే ఇటీవల బాలిక పెళ్లి మాట ఎత్తడంతో విషయం దాటవేస్తూ వచ్చాడు. అయితే బాలిక ఒత్తిడి పెంచడంతో రెండు రోజుల క్రితం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. పెళ్లి చేసుకోవడం కుదరదని, ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ బాలుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాలుడిని (17) బాలల సంరక్షణ కేంద్రానికి పంపించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ కోసం బీఆర్ఎస్ వార్ రూమ్



- ఇన్‌చార్జిలుగా కేటీఆర్, హరీశ్ సహా ఐదుగురు మాజీ మంత్రులు
- 12 నుంచి క్షేత్ర స్థాయిలో పార్టీ ప్రచారం షురూ
- వార్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వ్యూహాలకు పదును

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన ప్రచార వ్యూహం అమలు, పార్టీ నేతలు, ప్రచార బృందాల నడుమ సమన్వయం తదితరాల కోసం 'వార్ రూమ్' ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. వార్ రూమ్ ఇన్‌చార్జిలుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, మహమూద్ అలీ వ్యవహరిస్తారు. ఈ నెల 12 నుంచి క్షేత్ర స్థాయిలో పార్టీ ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. పండితుల సూచనల మేరకు మంచి ముహూర్తం చూసుకుని మాగంటి సునీతా గోపీనాథ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారు. బుధవారం కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, పార్టీ నేత రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులతో పాటు మాగంటి సునీత, మాగంటి గోపీనాథ్ సోదరుడు వజ్రనాథ్ కూడా హాజరయ్యారు.

నేడు, రేపు బూత్ కమిటీలతో భేటీలు

బీఆర్ఎస్ ప్రచార బృందాల పనితీరు, రోడ్ షోలు, రోజు వారీ ప్రచార షెడ్యూలు తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించారు. వార్ రూమ్ నుంచి అందే ఆదేశాలకు అనుగుణంగా ప్రచార వ్యూహానికి పదును పెట్టాలని నిర్ణయించారు. గురు, శుక్రవారాల్లో బూత్ కమిటీలతో డివిజన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలు నిర్వహించి ప్రచార వ్యూహాన్ని వివరిస్తారు. ఈ నెల 10వ తేదీలోగా బూత్‌కమిటీల సమావేశాలు పూర్తి చేసి 12వ తేదీ నుంచి ప్రచార పర్వంలో అడుగు పెట్టాలని కేటీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగని పక్షంలో ఇతర జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలను కూడా ఉప ఎన్నిక ప్రచారంలో భాగస్వాములను చేస్తారు. ప్రచారం ముగింపులో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోలో పాల్గొనే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

చేపపిల్లల పంపిణీకి 'కోడ్' బ్రేక్

సాక్షి, హైదరాబాద్: చేప పిల్లల ఉచిత పంపిణీకి గ్రహణం వీడడం లేదు. ఆది నుంచీ అన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి జూన్ నెలలో పంపిణీ చేయాల్సి ఉండగా, సెప్టెంబర్‌లో టెండర్లు పూర్తయ్యాయి. అక్టోబర్‌లో మొదటివారంలో అన్నీ ఫైనల్ చేసేసరికి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో మత్స్య శాఖ అధికారులు చేప పిల్లల పంపిణీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఇప్పుడు వదిలే చేప పిల్లల్లో వృద్ధి ఉండదు: అక్టోబర్ వచ్చినా చేప పిల్లల పంపిణీ జరగలేదు. సెప్టెంబర్, అక్టోబర్ తర్వాత వదిలే మీనాలకు వృద్ధి ఉండదు. మార్కెట్‌లో ధర రాదు. చేప పెరగడంలో పెద్దగా ఆకారం ఉన్న, మొత్తంగా బొక్కలు తేలి ఉంటాయి. జూన్-జూలై నెలల్లో వదిలే చేప పిల్లల్లో వృద్ధి ఉంటుంది. ఇవీ కేజీ నుంచి 5 కేజీల వరకు పెరుగుతాయి. మన మార్కెట్‌కే కాకుండా ఎగుమతి చేసే అవకాశం కూడా ఉంటుంది. ఇటు ప్రభుత్వానికి మంచి పేరు, అటు మత్స్యకారులకు లాభాలొస్తాయి. కానీ, ప్రతి ఏడాది చేప పిల్లల ఉచిత పంపిణీని ఆలస్యం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని చేప పిల్లలను పంపిణీ చేస్తుందా లేదా అనేదానిపై స్పష్టత లేదు.

నేడు బీఆర్ఎస్ 'చలో బస్ భవన్'

పలు బస్ రూట్లలో ధర్నాకు వెళ్లనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ పార్టీ గురువారం 'చలో బస్ భవన్' పేరిట ఆందోళనకు పిలుపునిచ్చింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సహా మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో బస్‌భవన్‌కు చేరుకుని ఆందోళన చేపడతారు. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్ స్టేషన్ నుంచి కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డి ఉదయం 9 గంటలకు బస్ భవన్‌కు బయలుదేరి వెళ్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మెహిదీపట్నం బస్టాప్ నుంచి 8.45కు ఆర్టీసీ బస్సుల్లో బస్ భవన్‌కు బయల్దేరి వెళ్తారు. ఎమ్మెల్యేలు ముఠా గోపాల్ ముషీరాబాద్, బండారు లక్ష్మారెడ్డి ఉప్పల్, మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజిగిరి, కేపీ వివేకానంద్ కుత్బుల్లాపూర్, మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి, కాలేరు వెంకటేశ్ అంబర్‌పేట, సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ బస్టాప్‌ల నుంచి ఆర్టీసీ బస్సుల్లో బస్‌భవన్‌కు చేరుకుంటారు.





అజేయంగా క్వార్టర్ ఫైనల్‌కు భారత్ అర్హత

సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు 'హ్యాట్రిక్' విజయంతో గ్రూప్ దశను ముగించింది. గువాహటిలో బుధవారం జరిగిన గ్రూప్ 'హెచ్' చివరి మ్యాచ్‌లో భారత్ 2–0 (45–37, 45–34)తో యూఏఈ జట్టును ఓడించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్ గ్రూప్ 'హెచ్'లో అగ్రస్థానం సంపాదించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మొత్తం ఎనిమిది గ్రూపుల్లో 'టాప్' ర్యాంక్‌లో నిలిచిన ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశిస్తాయి. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. భారత్, దక్షిణ కొరియా జట్లతోపాటు చైనా, జపాన్, అమెరికా, ఇండోనేసియా, మలేసియా, చైనీస్ తైపీ జట్లు కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి.


హర్మన్‌ప్రీత్

సఫారీతో సవాల్‌కు భారత్ సై

శ్రీలంకతో మ్యాచ్‌లో 124/6... పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో 159/5... అదృష్టవశాత్తూ ఈ రెండు సందర్భాలను అధిగమించి భారత జట్టు విజయాన్ని అందుకుంది. అయితే అవి రెండూ మనతో పోలిస్తే సహజంగానే బలహీన జట్లు. ఇలాంటి పొరపాటే పెద్ద జట్లతో జరిగితే కోలుకోవడానికి అవకాశం ఉండదు.
టోర్నీలో వరుసగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తలపడనుంది. వీటిలో మన ప్రదర్శనపైనే వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ చేరే అవకాశాలతో పాటు జట్టు అసలు సత్తా ఏమిటో తేలనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం వేదికగా సఫారీ టీమ్‌తో పోరుకు భారత్ 'సై' అంటోంది. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా టీమ్ కూడా అమితోత్సాహంతో బరిలోకి దిగుతోంది.

నేడు విశాఖపట్నంలో మహిళల వరల్డ్ కప్ మ్యాచ్

- దక్షిణాఫ్రికాతో టీమిండియా 'ఢీ'
- హ్యాట్రిక్ విజయంపై హర్మన్ బృందం గురి
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి క్రీడా ప్రతినిధి, విశాఖపట్నం: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో విశాఖపట్నం వేదికగా మ్యాచ్‌లకు రంగం సిద్ధమైంది. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు వైజాగ్ ఆతిథ్యం ఇవ్వనుండగా... భారత్ తొలి రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. ఇందులో భాగంగా నేడు ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో హర్మన్‌ప్రీత్ బృందం తలపడుతుంది. టోర్నీలో భారత్ ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలవగా... దక్షిణాఫ్రికా ఒకటి ఓడి, మరొకటి గెలిచింది.

బరిలోకి అమన్‌జోత్...
టోర్నీ తొలి రెండు మ్యాచ్‌లలో చూస్తే భారత బ్యాటింగ్ బలహీనత కనిపించింది. టాప్ బ్యాటర్లయిన స్మృతి, హర్మన్ విఫలం కాగా, లోయర్ ఆర్డర్ ఆదుకుంది. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలించేలా ఉంది. ఇలాంటి స్థితిలో వీరిద్దరు తమ స్థాయికి తగిన ప్రదర్శన కనబర్చడం కీలకం. ఈ ఏడాది అసాధారణ ఫామ్‌లో ఉన్న స్మృతి అసలు సమరంలో విఫలం కావడం ఆందోళన కలిగించే అంశం. మిడిలార్డర్‌లో జెమీమా శ్రీలంకపై డకౌట్ అయినా, పాక్‌పై మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించింది. గత రెండు మ్యాచ్‌లలో ఈ ముగ్గురి ఆటను కలిపి చూస్తే అత్యధిక స్కోరు 32 మాత్రమే. బౌలింగ్‌కు సంబంధించి గత మ్యాచ్‌లో ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతోనే ఆడింది. అయితే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తే ప్రత్యర్థిని నిలువరించేందుకు ప్రత్యామ్నాయంగా ఆరో బౌలర్ అవసరం. అనారోగ్యంతో గత మ్యాచ్‌కు దూరమైన అమన్‌జోత్ కోలుకుంది. దాంతో తుది జట్టులోకి రావడం ఖాయం. అయితే ఎవరి స్థానంలో ఆమె ఆడుతుందనేది ఆసక్తికరం. ఆమె స్థానంలో ఆడిన రేణుక పాక్‌పై సత్తా చాటింది. తొలి రెండు మ్యాచ్‌లలో మన ఫీల్డింగ్ ప్రదర్శన కూడా పేలవంగా ఉంది. దీనిని కూడా సరిదిద్దుకోవాల్సి ఉంది.


వోల్‌వార్ట్

ఆత్మవిశ్వాసంతో సఫారీ టీమ్...
ఇంగ్లండ్‌పై తొలి మ్యాచ్‌లో 69 ఆలౌట్ తర్వాత న్యూజిలాండ్‌పై దక్షిణాఫ్రికా ఆటతీరు చూస్తే ఆ జట్టు ఫామ్‌లోకి వచ్చినట్లు కనిపించింది. బ్రిట్స్ సెంచరీతో చెలరేగగా... లూస్ కీలక ఇన్నింగ్స్ ఆడింది. సీనియర్లు వోల్‌వార్ట్, మరిజాన్ కాప్ అనుభవం జట్టుకు కీలకం కానుంది. పేసర్లు ఖాకా, క్లాస్ కూడా ప్రభావం చూపగలరు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో దక్షిణాఫ్రికా జట్టులో తడబాటు కనిపిస్తున్నా... బ్యాటింగ్‌కు పిచ్ అనుకూలిస్తే భారీ స్కోరు సాధించగల సామర్థ్యం టీమ్‌కు ఉంది.

ఇద్దరు మాత్రమే...
మ్యాచ్ ముందు రోజు భారత జట్టు ఆప్షనల్ ప్రాక్టీస్ అవకాశం ఇచ్చారు. దాంతో ఇద్దరు మినహా జట్టు సభ్యులెవరూ మైదానానికి రాలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్ మాత్రమే సాధనలో పాల్గొన్నారు. టీమ్ కొలంబో నుంచి వచ్చిన తర్వాత మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు దూరంగా ఉన్న వీరిద్దరు మరుసటి రోజు ఆ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

5 విశాఖపట్నంలో భారత మహిళల జట్టు ఆడిన 5 వన్డేల్లోనూ విజయం సాధించింది. ఈ వేదికలో శ్రీలంకపై 3 మ్యాచ్‌ల్లో, ఇంగ్లండ్‌పై 2 మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది.

శ్రీచరణి సత్తా చాటేనా...



భారత్‌తో మ్యాచ్‌లో ఇనోకా రణవీరా అద్భుత బంతితో జెమీమాను బౌల్డ్ చేసింది. ఇది టోర్నీలోనే అత్యుత్తమ బంతని, తానే కాదు ఎవరూ ఆడలేరని జెమీమా స్వయంగా అంగీకరించింది. మ్యాచ్‌లో మొత్తం 4 వికెట్లతో ఇనోకా సత్తా చాటింది. దక్షిణాఫ్రికాపై ఇంగ్లండ్ బౌలర్ లిన్సీ స్మిత్ 7 పరుగులే ఇచ్చి 3 వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీ బౌలర్ ఎంలాబా 4 కీలక వికెట్లతో ప్రత్యర్థిని కట్టి పడేసింది. ఈ ముగ్గురూ లెఫ్టార్మ్ స్పిన్నర్లే కావడం విశేషం. టోర్నీలో వారి ప్రభావం ఎలా నడుస్తుందో ఇది చూపిస్తోంది. భారత జట్టులోని లెఫ్టార్మ్ స్పిన్నర్ శ్రీచరణి కూడా సొంతగడ్డపై ఇదే తరహా ప్రదర్శన కనబర్చాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. రెండో లెఫ్టార్మ్ స్పిన్నర్ రాధ యాదవ్‌కు ఇంకా మ్యాచ్ దక్కలేదు కానీ... లంకపై శ్రీచరణి ఫర్వాలేదనిపించగా, పాక్‌తో పెద్దగా ప్రభావం చూపలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీచరణి 11 వన్డేల స్వల్ప కెరీర్‌లో అందరినీ ఆకట్టుకుంది. అయితే తనకంటూ ప్రత్యేకంగా చెప్పుకునే ప్రదర్శన ఆమె నుంచి ఇంకా రాలేదు. దానిని చూపించేందుకు ఆమెకు సొంత రాష్ట్రానికి మించి సరైన వేదిక లభించదు. వరల్డ్‌కప్ మ్యాచ్‌లో అంచనాలకు తగినట్లుగా చెలరేగితే చరణికి ఇకపై తిరుగుండదు.

తుది జట్ల వివరాలు (అంచనా)
భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్, జెమీమా, దీప్తి, స్నేహ్, రిచా, శ్రీచరణి, క్రాంతి, రేణుక/అమన్‌జోత్.
దక్షిణాఫ్రికా: వోల్‌వార్ట్ (కెప్టెన్), బ్రిట్స్, లూస్, కాప్, బాష్, జాఫ్టా, ట్రైఆన్, డి క్లెర్క్, క్లాస్, ఖాకా, ఎంలాబా.

పిచ్, వాతావరణం
భారత్ ఆడిన గత రెండు మ్యాచ్‌లతో పోలిస్తే ఇది బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. జెమీమా పరిశీలన ప్రకారం కనీసం 270 స్కోరు చేయవచ్చు. బుధవారం నగరంలో వాన కురిసింది. మ్యాచ్ రోజు కూడా స్వల్పంగా అంతరాయం కలిగించే అవకాశం ఉంది.

20 భారత్, దక్షిణాఫ్రికా మధ్య 33 వన్డేలు జరిగాయి. 20 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గింది. 12 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా గెలిచింది. ఒక మ్యాచ్ రద్దయింది.


మూనీ

మూనీ మ్యాజిక్...

సూపర్ సెంచరీతో చెలరేగిన ఆసీస్ ప్లేయర్

- అలానా కింగ్‌తో తొమ్మిదో వికెట్‌కు ప్రపంచ రికార్డు భాగస్వామ్యం
- పాకిస్తాన్‌పై 107 పరుగులతో ఘనవిజయం


అలానా కింగ్

కొలంబో: క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఏమాత్రం బెదరకుండా ఎలా నిలవాలో... ప్రత్యర్థులు పరీక్ష పెడుతున్నా నమ్మకం కోల్పోకుండా ఎలా పోరాడాలో... ఓటమి మేఘాలు కమ్ముకున్నప్పుడు వెలుగుల బాట ఎలా వేసుకోవాలో... ఆస్ట్రేలియా క్రికెట్ జట్లకు బాగా తెలుసని మరోసారి నిరూపితమైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌తో పోరులో ప్రతికూల పరిస్థితులను తిప్పికొడుతూ ఆసీస్ ఘనవిజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (114 బంతుల్లో 109; 11 ఫోర్లు) ఆణిముత్యం అనదగ్గ సెంచరీతో కదంతొక్కడంతో... బుధవారం జరిగిన ఈ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా జట్టు 107 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. ఆసీస్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకటి వర్షం కారణంగా రద్దుకాగా... మిగిలిన రెండింట్లో గెలిచి 5 పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. బెత్ మూనీ అసాధారణ ఇన్నింగ్స్‌కు టెయిలెండర్ అలానా కింగ్ (49 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు హాఫ్‌సెంచరీ తోడవడంతో ఆసీస్ మెరుగైన స్కోరు చేయగలిగింది. ఒకదశలో 76 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ ఆసీస్‌ను మూనీ ఆదుకుంది. కిమ్‌గార్త్ (11)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 39 పరుగులు జోడించిన మూనీ... తొమ్మిదో వికెట్‌కు అలానాతో 106 పరుగులు జోడించి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. 77 పరుగులతో కిమ్ గార్త్–యాష్లే గార్డ్‌నర్ జోడీ పేరిట ఉన్న రికార్డును మూనీ–కింగ్ జంట సవరించింది. పాకిస్తాన్ బౌలర్లు బంతిబంతికి పరీక్ష పెడుతున్నా... ఏమాత్రం వెరవకుండా పోరాటం కొనసాగించింది. క్రీజులో కుదురుకున్నాక కింగ్ భారీ షాట్లతో సహచరిపై ఒత్తిడి తగ్గించింది. కెప్టెన్ అలీసా హీలీ (20), లిచ్‌ఫీల్డ్ (10), ఎలీస్ పెర్రీ (5), అనాబెల్ (1), యాష్లే గార్డ్‌నర్ (1), తహిలా మెక్‌గ్రాత్ (5) విఫలమయ్యారు. వన్డేల్లో ఐదో సెంచరీ పూర్తి చేసుకున్న మూనీ ఇన్నింగ్స్ చివరి బంతికి అవుటైంది. పాక్ బౌలర్లలో నష్రా సంధు 37 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఫాతిమా సనా, రమీన్ షమీమ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 36.3 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. సిద్రా అమీన్ (52 బంతుల్లో 35; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ ఫాతిమా సనా (11), సదాఫ్ (5), మునీబా అలీ (3), సిద్రా నవాజ్ (5), నటాలియా పర్వేజ్ (1), ఐమన్ ఫాతిమా (0) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్ 3... మేగన్ షుట్, అనాబెల్ సదర్లాండ్ చెరో 2 వికెట్లు తీశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పుణేకి పెద్ది


రామ్ చరణ్

ప్రేయసితో కలిసి పుణేలో ల్యాండ్ అయ్యాడు పెద్ది. అక్కడి అందమైన పరిసరాల్లో ఇద్దరూ ఆటా పాటా మొదలు పెట్టారు. రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా రూపొందుతున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించినదే ఈ ఆటా పాటా. ఈ స్పోర్ట్స్ డ్రామా మూవీకి బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ పుణేలో ఆరంభమైంది. ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్, జాన్వీ కపూర్ పై ఓ పాట చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. చిత్రసంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్. ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఒకవైపు షూటింగ్ జరుపుతూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: ఆర్ రత్నవేలు.

పక్కా మాస్ డ్యాన్స్


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు–ప్రియాంకా చోప్రాలతో పక్కా మాస్ డ్యాన్స్ చేయించడానికి ప్లాన్ చేశారట రాజమౌళి. ఇది ఫోక్ సాంగ్ అని, ట్యూన్ కూడా రెడీ అయిందని సమాచారం. ఈ పాట చిత్రీకరణ కోసం భారీ సెట్ కూడా వేయించారట. మహేశ్‌బాబు హీరోగా ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్‌లో రాజమౌళి దర్శకత్వంలో 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. దాదాపు రూ. వెయ్యి కోట్లతో కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని పాటల్లో ఓ ఫోక్ సాంగ్ కూడా ఉందని భోగట్టా. ఈ పాటకు ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. రాజు సుందరం పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఓ పెద్ద అప్‌డేట్‌ని నవంబరులో ఇవ్వనున్నామని మహేశ్‌బాబు బర్త్‌డే (ఆగస్ట్ 9) సందర్భంగా రాజమౌళి పేర్కొన్న విషయం తెలిసిందే. భారతీయ నటీనటులతో పాటు పలువురు హాలీవుడ్ నటీనటులు నటిస్తున్న ఈ చిత్రానికి హాలీవుడ్ సాంకేతిక నిపుణులు కూడా పని చేస్తున్నారు. ఈ చిత్రం 2027లో విడుదలయ్యే అవకాశం ఉంది. దాదాపు 120 దేశాల్లో విడుదల కానుంది.

డిసెంబరులో ఫిక్స్


కృతీ శెట్టి, కార్తీ

కార్తీ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వా వాత్తియార్' విడుదల తేదీ ఖరారు అయింది. డిసెంబరు 5న ఈ మూవీని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. నలన్ కుమారస్వామి రచన, దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో కృతీ శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ''కార్తీ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న 'వా వాత్తియార్' పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షించేలా ఉంటుంది. ఇప్పటికే రిలీజైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. కార్తీ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందనే అంచనాలున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

మటన్ సూప్ విజయం సాధించాలి
- దర్శకుడు వశిష్ట


రామచంద్ర, వశిష్ట

''మటన్ సూప్' టైటిల్, ట్రైలర్ బాగున్నాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అని డైరెక్టర్ వశిష్ట అన్నారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి 'బింబిసార' ఫేమ్ దర్శకుడు వశిష్ట ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మటన్ సూప్'ను ఎంతో ఇష్టపడి తీశాం'' అని తెలిపారు. ''మా అమ్మగారి కలను 'మటన్ సూప్' రూపంలో ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. అందరూ ఆదరించాలి'' అని మల్లికార్జున ఎలికా పేర్కొన్నారు. ''మన చుట్టూ జరిగే కథల్నే ఈ సినిమాలో రామచంద్ర అద్భుతంగా చూపించారు'' అని రామకృష్ణ సనపల తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, మ్యూజిక్ డైరెక్టర్ వెంకీ వీణ తదితరులు మాట్లాడారు.

కాంబినేషన్ రిపీట్


యదు వంశీ, నిహారిక

పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లు పరిచయం అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిన్న చిత్రంగా విడుదలై, విజయంపరంగా పెద్ద సినిమా అయింది. యదు వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై నిహారిక కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ దర్శక–నిర్మాతల కాంబినేషన్ రిపీట్ కానుంది. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. వచ్చే ఏడాది షూటింగ్ ఆరంభం కానుంది. ఇక 'కమిటీ కుర్రోళ్లు' తర్వాత పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా ఫ్యాంటసీ, కామెడీ జానర్‌లో ఈ చిత్రం రూపొందుతోంది.


రష్మికా మందన్నా

ఆ స్ఫూర్తితో అరి చేశాను
- దర్శకుడు జయశంకర్



''అరి' రెగ్యులర్ మూవీ కాదు. ఇలాంటి సినిమా చేయాలంటే నిర్మాతలకు అభిరుచితో పాటు ధైర్యం ఉండాలి. అలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టం'' అని డైరెక్టర్ జయశంకర్ తెలిపారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ నటించిన చిత్రం 'అరి'. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఈ సినిమా ఏషియన్–సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో జయశంకర్ విలేకరులతో మాట్లాడుతూ– ''మన పురాణాల్లో అరిషడ్వర్గాలను జయించాలని చెప్పారే కానీ, ఎలా జయించాలో చెప్పలేదు. హిమాలయాలకు వెళ్లి కొందరు యోగులను కలిసి, అరిషడ్వర్గాలను జయించేందుకు మార్గాలు, సూచనలు తెలుసుకున్నాను. వాటి ఆధారంగానే ప్రేక్షకులకు సులువుగా అర్థమయ్యేలా 'అరి' రూపొందించాను. ఉపేంద్రగారి సినిమాలంటే నాకు బాగా ఇష్టం. ఆయన సినిమాలు కమర్షియల్‌గా ఉంటూనే ఒక సందేశం ఉంటాయి. అదే స్ఫూర్తితో 'అరి' తెరకెక్కించాలనే ఆలోచన కలిగింది. మన దేశంలో పబ్బులకు వెళ్లేవాళ్లు ఎంతమంది ఉన్నారో, గుడికి వెళ్లేవారు అంతకంటే ఎక్కువే ఉన్నారు. అలా స్పిరిచ్యువల్ ఆలోచనలు ఉన్నవారు మా సినిమా చూసినా చాలు అనుకుంటున్నాం. మా చిత్రాన్ని హిందీలో ఒక పెద్ద హీరో, కన్నడలో ఒక స్టార్ చూశారు. వారికి బాగా నచ్చింది. అన్నీ కుదిరితే వారితో ఆయా భాషల్లో 'అరి' రీమేక్ చేస్తాను. నా తర్వాతి సినిమా జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌తో ఉంటుంది'' అని చెప్పారు.

గ్రామర్‌కే ప్రాధాన్యం


సంధ్య, వంశీ

''క' సినిమాతో చింతా గోపాలకృష్ణా రెడ్డిగారు మంచి విజయాన్ని అందుకున్నారు. 'శ్రీ చిదంబరం' పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని హీరో సత్యదేవ్ చెప్పారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. చింతా వరలక్ష్మీ సమర్పణలో చింతా రాజశేఖర్ రెడ్డి సహనిర్మాతగా చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి హీరో సత్యదేవ్, దర్శకులు వశిష్ఠ, వెంకటేశ్ మహా అతిథులుగా హాజరయ్యారు. ''టీజర్ బాగుంది. సినిమా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు వశిష్ఠ. ''నా రైటర్స్ క్లబ్ నుంచి వినయ్ రత్నం దర్శకుడిగా మారి, ఇలాంటి ఓ మంచి సినిమా తీయడం గర్వంగా ఉంది'' అని చెప్పారు వెంకటేశ్. ''గ్లామర్ కంటే గ్రామర్‌కే ప్రాధాన్యం ఇచ్చి కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం'' అన్నారు గోపాలకృష్ణా రెడ్డి. ''ఈ జర్నీలో నాకు తోడుగా నిలిచిన నా స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు'' అని వినయ్ రత్నం పేర్కొన్నారు.

అబద్ధపు ప్రచారాలు మానాలి

''ఓ సినిమా రిలీజ్ అయిన రెండు, మూడు రోజుల్లో చూడటం నాకు సాధ్యం కాదు. అదే విధంగా 'కాంతార చాప్టర్ 1' చిత్రం విడుదలయ్యాక రెండు మూడు రోజులకు చూసి, సినిమా చాలా బాగుందంటూ చిత్ర బృందాన్ని అభినందిస్తూ మెసేజ్ పంపాను. వాళ్లు నాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని నేను బహిర్గతం చేయలేదు. తెర వెనక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. వాళ్లకు ఏదనిపిస్తే అది మాట్లాడతారు'' అని రష్మికా మందన్నా పేర్కొన్నారు. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా జంటగా నటించిన తాజా చిత్రం 'థామా'. ఆదిత్యా సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ– ''ఓ కన్నడ అమ్మాయిగా 'కాంతార చాప్టర్ 1' సినిమా విజయంపై స్పందించలేదంటూ నాపై విమర్శలు చేస్తున్నారు. కానీ, నేను ఎప్పుడో స్పందించాను. అలాగే కన్నడ ఇండస్ట్రీ నన్ను బ్యాన్ చేసిందని మాట్లాడుతున్నారు. అవి పుకార్లు మాత్రమే. మన వ్యక్తిగత జీవితాన్ని కెమెరా ముందుకు తీసుకురాలేం కదా? అలాగే ప్రతి విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకోను. ఈ విషయంలో ప్రజలు నన్ను ఏమనుకున్నా పట్టించుకోను. అయితే నా నటన గురించి వారు ఏం మాట్లాడతారు? అన్నదే నాకు ముఖ్యం. నా వ్యక్తిగత విషయాలపై అబద్ధపు ప్రచారం చేయడం మానాలి'' అని చెప్పారు.

వర్ణమాలా...


దుష్యంత్, ఆషికా రంగనాథ్

''హిస్టరీ, మైథాలజీ, సనాతన ధర్మం వంటి అంశాలన్నీ అద్భుతంగా కుదిరిన స్క్రిప్ట్‌తో 'గత వైభవ'ని రూపొందించాం. నవంబరు 14న కన్నడ, తెలుగులో మా సినిమా రిలీజ్ కానుంది. తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం ఉండాలి'' అని ఎస్ఎస్ దుష్యంత్ కోరారు. సింపుల్ సుని దర్శకత్వంలో ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్న ఈ సినిమా కన్నడ, తెలుగు భాషల్లో నవంబరు 14న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'వర్ణమాలా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో నాలుగు వినూత్న కథలు ఉన్నాయి'' అని ఆషికా రంగనాథ్ తెలిపారు. ''ఫ్యాంటసీ మైథలాజికల్ మూవీ ఇది'' అన్నారు సింపుల్ సుని. ''ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం... ప్రేక్షకులు సపోర్ట్ చేయాలి'' అని దీపక్ తిమ్మప్ప పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
153	62
81,774	25,046

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,993	▲	204
డోజోన్స్	46,710	▲	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,558	▲	75
డాక్స్	24,632	▲	246
షాంఘై (గత మంగళవారం ముగింపు)	3,883	▲	20
నికాయ్	47,734	▽	216

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	[illegible]	118.27	121.25
€	యూరో	[illegible]	102.60	105.40
¥	జపాన్ యెన్ (100)	[illegible]	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	57.69	59.84
S$	సింగపూర్ డాలర్	[illegible]	66.35	70.07
SAR	సౌదీ రియాల్	[illegible]	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	23.29	24.54
¥	చైనా యువాన్	[illegible]	11.59	13.42

బంగారం@ 1,26,600

- మరో రూ.2,600 పెరుగుదల
- రూ.1,57,000కు చేరిన వెండి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బలమైన సానుకూలతల అండతో బంగారం ధరలు మరో సరికొత్త రికార్డు స్థాయిని నమోదు చేశాయి. ఢిల్లీ మార్కెట్లో బుధవారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,600 పెరగడంతో రూ.1,26,600కు చేరుకుంది. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతుండడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల ర్యాలీ కొనసాగుతోంది. బంగారం కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా 10 గ్రాములకు రూ.6,000 పెరగడం గమనార్హం. ఇక వెండి ధర బుధవారం కిలోకి రూ.3,000 లాభపడి రూ.1,57,000కు చేరుకుంది. గత సోమవారం నమోదైన రూ.1,57,400 వెండికి ఆల్‌టైమ్ గరిష్టంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పుత్తడి సరికొత్త గరిష్టాలకు చేరింది. ఔన్స్ బంగారం స్పాట్ మార్కెట్లో 2 శాతం మేర పెరిగి 4,050 డాలర్ల స్థాయికి చేరగా, కామెక్స్ ఫ్యూచర్స్‌లోనూ 1.5 శాతానికి పైగా ఎగసి 4,080 డాలర్ల నూతన గరిష్టాన్ని నమోదు చేసింది. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతుండడం, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల అండతో పసిడి 4,000 డాలర్లను దాటినట్టు కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు. సురక్షిత సాధనంగా ఉన్న డిమాండ్‌కుతోడు సెంట్రల్‌బ్యాంక్‌ల కొనుగోళ్ల అండతో ధరలు పెరుగుతున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ చెప్పారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

సులభమైన ప్రోడక్టులను తీసుకురండి: మల్హోత్రా	భారత్‌ను ఏ శక్తీ ఆపలేదు: గోయల్



కప్పు టీ కన్నా చౌకగా డేటా!

- భారత్‌లో డిజిటల్ విప్లవానికి నిదర్శనం
- దేశంలో వ్యాపారాలకు అనువైన పాలసీలు
- మరింత వేగవంతంగా సంస్కరణలు
- సెమీకండక్టర్లు, మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీకి అపార అవకాశాలు
- పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: డిజిటల్ రంగంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఓ కప్పు టీ రేటు కన్నా 1 జీబీ డేటా చౌకగా లభిస్తుండటం దీనికి నిదర్శనమని తెలిపారు. ఒకప్పుడు 2జీ టెలికం సర్వీసుల లభ్యత కూడా కష్టంగా ఉండేదని, ప్రస్తుతం దానికి అనేక రెట్లు మెరుగైన 5జీ సర్వీసులు దేశవ్యాప్తంగా దాదాపు ప్రతి జిల్లాలోనూ లభిస్తున్నాయని పేర్కొన్నారు. డేటా వినియోగంలో ప్రస్తుతం ప్రపంచంలోనే టాప్ దేశాల్లో ఒకటిగా భారత్ నిలుస్తోందని తెలిపారు. డిజిటల్ మౌలికసదుపాయాల కల్పనపై ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)ని ప్రారంభించిన సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విధానాలు, వ్యాపారాలకు అనువైన పరిస్థితులు మొదలైన అంశాల దన్నుతో భారత్.. పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలుస్తోందని ప్రధాని చెప్పారు. సంస్కరణలను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. సెమీకండక్టర్లు, మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ మొదలైన వాటి తయారీకి భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయని మోదీ వివరించారు. మరింతగా పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని ఆయన చెప్పారు. దీన్ని అందిపుచ్చుకునేందుకు పరిశ్రమలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ''తయారీ కార్యకలాపాలు మొదలుకుని సెమీకండక్టర్లు, మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వరకు అన్నింటా దేశం పురోగమిస్తోంది. వివిధ రంగాల్లో స్టార్టప్‌ల సందడితో దేశీయంగా పరిస్థితులు చాలా ఆశావహంగా ఉన్నాయి. భారత్‌లో తయారీ కార్యకలాపాలకు, పెట్టుబడులు పెట్టేందుకు, నవకల్పనలను ఆవిష్కరించేం

స్టార్టప్ వ్యవస్థకు దన్ను ..

టెలికం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్, డిజిటల్ కమ్యూనికేషన్స్ ఇన్నోవేషన్స్ స్క్వేర్ మొదలైన వాటితో స్టార్టప్ వ్యవస్థకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ప్రధాని చెప్పారు. అలాగే 5జీ, 6జీ, అధునాతన ఆప్టికల్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీలను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు ఉపయోగపడే టెస్ట్ బెడ్స్‌కి నిధులు కూడా సమకూరుస్తోందన్నారు. సైబర్ సెక్యూరిటీకి గణనీయంగా ప్రాధాన్యం ఇస్తున్నామని, సైబర్ మోసాలను కట్టడి చేసేందుకు కఠినతరమైన చట్టాలు చేశామని ప్రధాని చెప్పారు. మొబైల్, టెలికం, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ వ్యవస్థలవ్యాప్తంగా నెలకొన్న సరఫరా సమస్యలకి తగిన పరిష్కారాలను అందించేందుకు మన ముందు చక్కని అవకాశం ఉందని తెలిపారు. సెమీకండక్టర్ల తయారీలాంటి విభాగాల్లో భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటోందని ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 సెమీకండక్టర్ తయారీ యూనిట్ల పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు.



ఎలక్ట్రానిక్స్ తయారీ విషయంలో గ్లోబల్ కంపెనీలు భారీ స్థాయిలో విశ్వసనీయంగా, భారీ స్థాయిలో సరఫరా చేయగలిగే భాగస్వాముల కోసం అన్వేషిస్తున్నాయని .. ఆ అవకాశాలను భారతీయ కంపెనీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. చిప్‌సెట్లు, బ్యాటరీలు, డిస్‌ప్లేలు, సెన్సార్లను దేశీయంగానే మరింతగా తయారు చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. 2014 నుంచి ఎలక్ట్రానిక్స్ తయారీ ఆరు రెట్లు, మొబైల్ ఫోన్ల తయారీ ఇరవై ఎనిమిది రెట్లు, ఎగుమతులు 127 రెట్లు పెరిగాయని ప్రధాని చెప్పారు. గత దశాబ్దకాలంలో మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో భారీ స్థాయిలో ప్రత్యక్ష ఉద్యోగాలను కల్పించిందన్నారు. డేటా ప్రకారం ఓ దిగ్గజ స్మార్ట్‌ఫోన్ కంపెనీకి అవసరమైన ఉత్పత్తులను 45 భారతీయ సంస్థలు సరఫరా చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి ఒక్క కంపెనీతో దాదాపు 3.5 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు.

రూ. 900 కోట్లతో శాట్‌కామ్ పర్యవేక్షణ వ్యవస్థ: సింధియా

దేశ స్పెక్ట్రం అసెట్స్‌ను, డేటా వనరులను పరిరక్షించే దిశగా నేషనల్ శాట్‌కామ్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ. 900 కోట్లు కేటాయించిందని టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. టెలికం, బ్రాడ్‌కాస్టింగ్ కలిపి భారతీయ శాట్‌కామ్ మార్కెట్ గతేడాది 4.3 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2033 నాటికి 14.8 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు చెప్పారు. 6జీ పేటెంట్లకు సంబంధించి 10 శాతం వాటా దక్కించుకోవాలని నిర్దేశించుకున్నట్లు సింధియా వివరించారు.

పేమెంట్ యాప్‌లతో రూ. 200 కోట్ల మోసాల నివారణ

టెలికం శాఖ రూపొందించిన ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్‌ఆర్‌ఐ) ప్లాట్‌ఫాంని ఉపయోగించి అనుమానాస్పద లావాదేవీలని బ్లాక్ చేయడం ద్వారా ఫోన్‌పే, పేటీఎంలాంటి పేమెంట్ యాప్‌లు సుమారు రూ. 200 కోట్ల ఆర్థిక మోసాలను నివారించాయి. ఎఫ్‌ఆర్‌ఐ డేటా ప్రకారం ఈ రెండు సంస్థలు 10 లక్షలకు పైగా ఖాతాలు, వాలెట్లను ఫ్రీజ్ చేశాయి. ఫోన్‌పే సహ వ్యవస్థాపకుడు రాహుల్ చారి ఈ విషయాలు తెలిపారు.

త్వరలో శాట్‌కామ్ సర్వీసులు..: మిట్టల్

శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులను ప్రారంభించడంపై యూటెల్‌శాట్ వన్‌వెబ్ కసరత్తు చేస్తోందని భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్ తెలిపారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే సర్వీసులు మొదలవుతాయని పేర్కొన్నారు. మరో వైపు, సురక్షితమైన విధంగా అత్యంత నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడంపై ఆసక్తిగా ఉన్నట్లు స్టార్‌లింక్ ఇండియా మార్కెట్ యాక్సెస్ డైరెక్టర్ పర్నిల్ ఊర్ధ్వరేషే తెలిపారు. ఈ విషయంలో టెలికం శాఖతో పాటు విభాగాలన్నీ చక్కటి సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. అటు, కొత్త ఆవిష్కరణలపై మరింతగా దృష్టి పెడుతూ, డిజిటల్ విప్లవంలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ చెప్పారు.

బ్యాంకులు, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ

- నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ 153 పాయింట్ల పతనం
- 25,050 దిగువకు నిఫ్టీ



ముంబై: బ్యాంకులు, ఆటో, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సెన్సెక్స్ 153 పాయింట్లు నష్టపోయి 81,774 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62 పాయింట్లు కోల్పోయి 25,046 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (-1.25%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (-0.50%) పతనమై సూచీల నష్టాలకు కారణమయ్యాయి.

■ బీఎస్‌ఈలో రంగాల వారీగా రియల్టీ ఇండెక్సు 2%, విద్యుత్ 1.5%, ఆటో 1.35%, యుటిలిటీ 1.29 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.75%, స్మాల్ క్యాప్ సూచీ 0.5% పతనమయ్యాయి.

■ టీసీఎస్ క్యూ2 ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు నెలకొన్నాయి. ఇన్ఫోసిస్ 2.5%, టీసీఎస్ 2%, కోఫోర్జ్, ఎల్‌టీఐఎం, హెచ్‌సీఎల్‌టెక్ 1.5% లాభపడ్డాయి.

■ ఆగ్రో కెమికల్ సంస్థ అడ్వాన్స్ అగ్రోలైఫ్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.100)తో పోలిస్తే 13% ప్రీమియంతో రూ.113 వద్ద లిస్టయ్యింది. చివరికి 8% లాభంతో రూ.108 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.696 కోట్లుగా నమోదైంది.

■ ఓమ్ ఫ్రైట్ ఫార్వార్డర్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.135)తో పోలిస్తే 39% డిస్కౌంటుతో రూ.82.50 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ ముగిసేసరికి 36% నష్టపోయి రూ.87 వద్ద స్థిరపడింది.

సెంబ్‌కార్ప్ చేతికి రెన్యూ యూనిట్

- సన్ బ్రైట్‌లో 100% వాటాకు రెడీ
- ఒప్పందం విలువ రూ. 1,700 కోట్లు



న్యూఢిల్లీ: రెన్యూ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన సోలార్ పవర్ ప్లాంటు కొనుగోలుకి తాజాగా సింగపూర్ సంస్థ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ఒప్పందం కుదుర్చుకుంది. సొంత అనుబంధ సంస్థ సెంబర్‌కార్ప్ గ్రీన్ ఇన్‌ఫ్రా ద్వారా రెన్యూ సన్ బ్రైట్ ప్రయివేట్ లిమిటెడ్‌లో 100% వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సెంబ్‌కార్ప్ వెల్లడించింది. ఇందుకు 24.6 కోట్ల సింగపూర్ డాలర్లు (రూ.1,700 కోట్లు) చెల్లించనున్నట్లు తెలియజేసింది. రెన్యూ సన్ బ్రైట్ రాజస్తాన్‌లోని ఫతేగఢ్‌లో ఏర్పాటు చేసిన 300 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటును నిర్వహిస్తోంది. ఈ ప్లాంటు 2021 నవంబర్‌లో వాణిజ్య ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభించింది. జాతీయ గ్రిడ్‌కు అనుసంధానమైన ఈ యూనిట్ మహారాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థతో 25 ఏళ్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కలిగి ఉంది. కొనుగోలుకి నిధులను అంతర్గత వనరులు, విదేశీ రుణాల ద్వారా సమకూర్చుకోనుంది. 2026 తొలి అర్ధభాగానికల్లా కొనుగోలు పూర్తికాగలదని అంచనా. దీంతో దేశీయంగా సెంబ్‌కార్ప్ మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 6.9 గిగావాట్లకు చేరనుంది. ప్రపంచవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కొనుగోళ్లతో కలిపి 19.3 గిగావాట్లను తాకనుంది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- సోషల్ మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం - రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఉద్యోగాలు

రిషికేశ్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసిస్టెంట్-01, ల్యాబొరేటరీ టెక్నీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా,ఎమ్మెస్సీ, ఎంపీహెచ్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ. 20,000, ల్యాబొరేటరీ టెక్నీషియన్‌కు 15,000
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.10.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 13.10.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsrishikesh.edu.in

ఎయిమ్స్ ఢిల్లీలో వివిధ పోస్టులు

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్2(మెడికల్)-01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్3-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, బీవీఎస్సీ, బీడీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** starncdharyana@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.aiims.edu

డీఆర్‌డీవో బాలాసోర్‌లో 49 అప్రెంటిస్‌లు

బాలాసోర్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) ప్రూఫ్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ ఎస్టాబ్లిష్‌మెంట్(పీఎక్స్‌ఈ)లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 49.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-09,టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు-40.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.10,900.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** training.pxe@gov.in
» **దరఖాస్తులకు చివరితేది:** 19.10.2025.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

ఆర్‌ఆర్‌సీ-నార్త్ వెస్ట్రన్ రైల్వేలో 2,094 యాక్ట్ అప్రెంటిస్‌లు

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్‌ఆర్‌సీ)-నార్త్ వెస్ట్రన్ రైల్వే(ఎన్‌డబ్ల్యూఆర్) పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,094.
» **వర్క్‌షాప్‌లు/యూనిట్‌లు:** డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(అజ్‌మేర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జైపూర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జోధ్‌పూర్), బీటీసీ క్యారేజ్(అజ్‌మేర్), బీటీసీ లోకో(అజ్‌మేర్), క్యారేజ్ వర్క్‌షాప్(బికనీర్), క్యారేజ్ వర్క్‌షాప్(జోధ్‌పూర్).
» **ట్రేడులు:** ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్, డీజిల్ మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 02.11.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.11.2025
» **వెబ్‌సైట్:** http://rrcjaipur.in

వీఐటీఎం, బెంగళూరులో 12 పోస్టులు

బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం(వీఐటీఎం) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిబిషన్ అసిస్టెంట్ ఏ-01, టెక్నీషియన్ ఏ-06, ఆఫీస్ అసిస్టెంట్ (గ్రేడ్-3)-05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిగ్రీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:**25ఏళ్ల నుంచి 35ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.10.2025
» **వెబ్‌సైట్:** www.vismuseum.gov.in

ఐసీడీఎస్ విశాఖపట్నం జిల్లాలో 53 అంగన్వాడీ హెల్పర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తాత్కాలిక ప్రాతిపదికన అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 53.
» **డివిజన్‌ల వారీగా ఖాళీలు:** భీమునిపట్నం-11, పెందుర్తి-21, విశాఖపట్నం-21.
» **అర్హత:** అభ్యర్థులు తప్పనిసరిగా ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 21 ఏళ్ల నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.7000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హులైన మహిళా అభ్యర్థులు సంబంధిత శిశు అభివృద్ధి పథకపు అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 03.10.2025.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.10.2025.
» **వెబ్‌సైట్:** https://visakhapatnam.ap.gov.in

బి.డిజైన్ కోర్సులకు యూసీడ్

» యూసీడ్ 2026 నోటిఫికేషన్ విడుదల చేసిన ఐఐటీ బాంబే
» ఏదైనా విభాగంలో 10+2/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు



యూసీడ్ (సీఈఈడీ).. అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ డిజైన్! ప్రముఖ విద్యాసంస్థలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో .. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష!! ఐఐటీ బాంబే ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఫలితాలు విడుదలైనప్పటి నుంచి ఒక ఏడాది పాటు యూసీడ్ స్కోర్ పరిగణనలో ఉంటుంది. సంబంధిత ఐఐటీలతోపాటు పలు ఇతర ఇన్‌స్టిట్యూట్స్ సైతం యూసీడ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూసీడ్ 2026 పూర్తి వివరాలు..

ప్రవేశం కల్పించే ఇన్‌స్టిట్యూట్స్

పలు ఐఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా యూసీడ్(అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్) పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐటీ-బాంబే, ఐఐటీ-ఢిల్లీ,ఐఐటీ-గువహటి,ఐఐటీ-హైదరాబాద్,ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-రూర్కీ,ఐఐఐటీడీఎం-జబల్‌పూర్ లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

అర్హతలు

- ఏదైనా విభాగంలో(సైన్స్, కామర్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్) 10+2/ ఇంటర్మీడియెట్ 2025లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులైన వారు లేదా 2026లో 10+2/ ఇంటర్ ఫైనల్ పరీక్షలు రాసే విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- మూడేళ్ల డిప్లొమా కోర్సుల విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- యూసీడ్ 2026 ర్యాంకు ఆధారంగా 2026-27 విద్యాసంవత్సరంలో మాత్రమే అడ్మిషన్ పొందే వీలుంటుంది.
- యూసీడ్ పరీక్షకు కేవలం రెండుసార్లు మాత్రమే హాజరయ్యేందుకు అవకాశం ఉంటుంది. అది కూడా వరుసగా రెండు విద్యాసంవత్సరాల్లోనే రాసేందుకు అనుమతిస్తారు.

వయసు

2001, అక్టోబర్1వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే యూసీడ్ 2026కు దరఖాస్తుకు అర్హులు.

పరీక్ష విధానం

యూసీడ్ పరీక్షను రెండు విభాగాలుగా 300 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-ఎకు 200 మార్కులు, పార్ట్-బికు 100 మార్కులు కేటాయిస్తారు. ఒకటే ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది. పార్ట్ ఏ, బీ.. ఇలా రెండు విభాగాలకు సంబంధించిన ప్రశ్నలను అటెంప్ట్ చేయడం తప్పనిసరి.

పార్ట్ ఏలో మూడు సెక్షన్‌లు

- పార్ట్ ఏ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో 200 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మూడు సెక్షన్‌లు (సెక్షన్1,2,3) ఉంటాయి.
- సెక్షన్1లో 14 న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. ఎలాంటి నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. వీటికి సమాధానాల్ని వర్చువల్ కీ బోర్డు ద్వారా కంప్యూటర్ స్క్రీన్‌పై ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఉండదు.
- సెక్షన్ 2లో 15 మల్టిపుల్ సెలక్ట్ ప్రశ్నలు(ఎంఎస్‌క్యూ) అడుగుతారు. వీటికి ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. మార్కింగ్ విధానం భిన్నంగా ఉంటుంది. నిబంధనలకు అనుగుణంగా సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. సరైన ఆప్షన్లను గుర్తించిన విధానం ఆధారంగా 4, 3, 2, 1,0 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.
- సెక్షన్ 3లో 26 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (ఎంసీక్యూ) అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 0.71 మార్కు తగ్గిస్తారు.

వంద మార్కులకు పార్ట్ బి

పార్ట్-బిలో స్కెచింగ్ 50 మార్కులకు, డిజైన్ అప్టిట్యూడ్ 50 మార్కులకు ఉంటాయి. ఇందులో రెండు ప్రశ్నలు ఒక్కోటి 50 మార్కులకు చొప్పున ఉంటాయి. స్కెచింగ్ నుంచి 1 ప్రశ్న, డిజైన్ అప్టిట్యూడ్ నుంచి ఒక ప్రశ్న అడుగుతారు. ఈ పరీక్ష సమయం ఒక గంట. ప్రశ్నలు కంప్యూటర్ స్క్రీన్‌పై డిస్‌ప్లే చేస్తారు. వాటికి సమాధానాలను ఆన్సర్ బుక్‌లెట్‌లో రాయాల్సి ఉంటుంది.

ఎంపిక ఇలా

ఐఐటీల్లో జాయింట్ సీట్ అలకేషన్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులో అడ్మిషన్ కల్పిస్తారు. యూసీడ్‌లో అర్హత సాధించిన వారు ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల అడ్మిషన్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా దరఖాస్తు ప్రత్యేకంగా చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా విద్యాసంస్థలు తమ ప్రవేశ విధానానికి అనుగుణంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 01.10.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 31.10.2025
- **ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరి తేది:** 07.11.2025
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రారంభం:** 02.01.2026
- **సీడ్ 2026 పరీక్ష తేది:** 18.01.2026(ఆదివారం)
- **వెబ్‌సైట్:** www.uceed.iitb.ac.in

‘పొగ తాగడం’ తగ్గింది

ప్రపంచవ్యాప్తంగా ధూమపానం తగ్గింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ధూమపానం చేసేవారి సంఖ్య 2000 సంవత్సరంలో 138 కోట్లు. 2024 వచ్చేసరికి ఈ సంఖ్య 120 కోట్లకు పడిపోయింది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 15 ఏళ్ల పైబడినవారిలో ప్రతి ఐదుగురులో ఒకరు పొగతాగుతున్నారు. నివారించగల ముప్పు అయినప్పటికీ ధూమపానం ఏటా కోట్లాది మంది ప్రాణాలు తీస్తోందని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది.

అంతర్జాతీయంగా 2000–2024 మధ్య.. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న జనాభాలో ధూమపానం చేసేవారు, అలాగే 2030 నాటికి దీని వినియోగం ఎలా ఉండబోతోంది అన్న అంచనాతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక నివేదిక రూపొందించింది. మొదటిసారిగా డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచవ్యాప్తంగా ఈ–సిగరెట్ వినియోగాన్ని అంచనా వేసింది. ఈ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది.

2000లో ధూమపాన ప్రియుల సంఖ్య 138 కోట్లు
2024లో 120 కోట్లకు తగ్గిన వినియోగదారులు
గణనీయంగా పెరిగిన ఈ-సిగరెట్స్ వాడకం
ముఖ్యంగా మైనర్లకూ వ్యసనంగా మారిన వైనం
ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ



ముప్పుగా ఈ-సిగరెట్స్

ప్రపంచవ్యాప్తంగా 10 కోట్ల మందికిపైగా ప్రజలు వేపింగ్ చేస్తున్నారు. ఈ–సిగరెట్స్, వేప్ పెన్స్, మోడ్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఏరోసోల్ (ఆవిరి) పీల్చడాన్ని వేపింగ్ అంటారు. వేపింగ్ ప్రక్రియలో పొగాకుకు బదులు నికోటిన్, ఫ్లేవర్లు, ఇతర రసాయనాలు కలిగి ఉన్న ద్రవం (ఈ–లిక్విడ్) వాడతారు. క్యాన్సర్ కారకాలతో సహా హానికర రసాయనాలు ఏరోసోల్‌లో ఉంటాయి. వేపింగ్‌తో శ్వాస సమస్యలు, అవయవ నష్టం వంటి తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. భారత్‌లో ఈ–సిగరెట్ తయారీ, వాడకం నిషేధం. నికోటిన్ వ్యసనంగా మారడానికి ఈ–సిగరెట్లు కారణమని డబ్ల్యూహెచ్‌ఓ చెబుతోంది. పిల్లలు నికోటిన్‌కు బానిసలవుతున్నారని, ఇవి దశాబ్దాల పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

సాక్షి, స్పెషల్ డెస్క్

మహిళలే ముందంజలో..

2000–24 మధ్యకాలంలో అన్ని వయసుల వారిలో ధూమపానంలో స్థిరమైన తగ్గుదల ఉన్నప్పటికీ.. పురుషులతో పోలిస్తే మహిళలు ముందంజలో ఉన్నారు. 2025 సంవత్సరానికిగాను నిర్దేశించుకున్న ప్రపంచ తగ్గింపు లక్ష్యాన్ని ఐదేళ్లకు ముందే మహిళలు చేరుకున్నారని నివేదిక తెలిపింది. పురుషులు ఈ లక్ష్యాన్ని 2031 వరకు చేరుకోలేరని డబ్ల్యూహెచ్‌ఓ అంచనా. మహిళల్లో ధూమపానం వ్యాప్తి 2010లో 11% నుంచి 2024లో 6.6%కి తగ్గింది. పొగతాగే మహిళల సంఖ్య 2010లో 27.7 కోట్లు ఉండగా.. 2024లో 20.6 కోట్లకు తగ్గిపోవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా పొగతాగేవారిలో ప్రతి ఐదుగురిలో నలుగురికి పైగా పురుషులే. మగవారిలో ధూమపానం చేసేవారి సంఖ్య 2010లో 41.4% నుంచి 2024లో 32.5%కి తగ్గినప్పటికీ మార్పు వేగం చాలా నెమ్మదిగా ఉందని డబ్ల్యూహెచ్‌ఓ వివరించింది.

ప్రాంతాలవారీగా ధూమపాన ప్రియుల శాతం

యూరప్	ఆగ్నేయాసియా	పశ్చిమ పసిఫిక్ దేశాలు	అమెరికా	ఆఫ్రికా
24.1	23.4	22.9	14	9.5

భారత్‌లో ఇలా..

15 ఏళ్లు, ఆపై వయసున్న వారిలో పొగ తాగుతున్నవారు	పురుషులు	స్త్రీలు
24.35 కోట్లు	19.4 కోట్లు	4.93 కోట్లు

2025లో ప్రపంచ జనాభాలో ధూమపానం వ్యాప్తి అంచనా	21.9%
2000లో వ్యాప్తి అంచనా	49.8%
2030 నాటికి పొగ తాగేవారి వ్యాప్తి అంచనా	18.8%

ప్రపంచవ్యాప్తంగా ఈ-సిగరెట్స్ వాడుతున్నవారు	13-15 ఏళ్ల వయసున్న ఈ-సిగరెట్ వినియోగదారులు
10 కోట్లు	1.5 కోట్లు

ప్రపంచవ్యాప్తంగా 15 ఏళ్లు ఆపై వయసువారిలో పొగ తాగుతున్నవారు..

సంవత్సరం	స్త్రీలు	పురుషులు
2010	11%	41.4%
2024	6.6%	32.5%

క్లుప్తంగా...



ఒకే విద్యార్థి.. ఒకే ఉపాధ్యాయుడు

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని రావూరు ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి, ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఐదుగురు విద్యార్థులు ఉండే విధంగా ఉపాధ్యాయుడు చూడాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈఓ ఆదేశించారు. అయినా ఆ పాఠశాలకు ఐదుగురు విద్యార్థులు రాలేకపోయారు. పాఠశాలను తీసేద్దామనుకున్న క్రమంలో ఒక విద్యార్థి చేరగా ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. పాఠశాలను గ్రామంలో ఉంచే విధంగా గ్రామస్తులు తీర్మానం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులను పెంచే విధంగా కృషి చేస్తామని గ్రామస్తులు తెలిపారు.



పాముకు కరెంట్ షాక్..

జడ్చర్ల టౌన్: విద్యుదాఘాతంతో గాయపడిన జెర్రిపోతుకు సర్ప రక్షకుడు సదాశివయ్య బుధవారం చికిత్స చేసి కాపాడారు. జడ్చర్లలోని శ్రీలక్ష్మి రాజేంద్రనగర్ ఇండస్ట్రీలో పవర్ బోర్డులోకి జెర్రిపోతు చేరడంతో విద్యుదాఘాతానికి గురైంది. ఇది గమనించిన ఇండస్ట్రీ యజమాని సర్ప రక్షకుడు సదాశివయ్యకు సమాచారం అందించాడు. దీంతో ఆయన బూర్గుల రామకృష్ణారావు డిగ్రీ కళాశాలలోని జీవవైవిధ్య సంరక్షణ కేంద్రంలో చికిత్స చేశారు. ప్రస్తుతం జెర్రిపోతు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు.

‘కేజీబీవీలకు ప్రత్యేక సొసైటీ అవసరం’

సాక్షి, హైదరాబాద్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు (కేజీబీవీ) ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేసి, సరిపడా నిధులు ఇవ్వాలని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మధ్యాహ్న భోజనం పథకం నిధులు పెంచాలని కోరారు. కేంద్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు కాలపరిమితి ముగుస్తున్న నేపథ్యంలో ఈ పథకాన్ని సమూలంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు వివిధ రాష్ట్రాల పాఠశాల విద్య డైరెక్టర్లతో ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన నికోలస్ కేంద్రానికి కొన్ని సూచనలు చేశారు.

సకుటుంబ సమేతంగా..

హింస, అశ్లీలం స్థానంలో కామెడీ, కుటుంబ కథలు, షోలపై ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల దృష్టి

ప్రజల సంస్కృతి, భాషలను ప్రతిబింబించేలా కార్యక్రమాల రూపకల్పన

దక్షిణాది సహా దేశంలోని చిన్న పట్టణాల వీక్షకులను ఆకర్షించే యత్నం



ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అంటే... ఓటీటీ ప్లాట్‌ఫామ్ అనేది మీడియా ప్రసార మాధ్యమం. ఇందులో ఇంటర్నెట్ ద్వారా కంటెంట్‌ను అందిస్తారు. వీక్షకులు సంబంధిత యాప్‌లను నిర్ణీత రుసుము చెల్లించి సబ్‌స్క్రైబ్ చేసుకొని వాటిల్లోని సినిమాలు, సిరీస్‌లు సహా ఆయా యాప్‌లలో ఉండే కంటెంట్‌ను ఎన్ని సార్లయినా చూడొచ్చు.

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రముఖ ఓవర్ ది టాప్ (ఓటీటీ) స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు అందించే కంటెంట్‌లో సరికొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో నేరప్రవృత్తితో కూడిన, అశ్లీల సంబంధ వెబ్ సిరీస్‌లను రూపొందించి ప్రసారం చేయడం ద్వారా వీక్షకులను ఆకర్షించిన ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు.. ఇటీవల కాలంలో మాత్రం కుటుంబ సమేతంగా చూడదగ్గ విభిన్న ఇతివృత్తాలతో ముందుకొస్తున్నాయి. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడంపై తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో దక్షిణాదితో పాటు ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు, పట్టణాలపై ఓటీటీలు ప్రత్యేక దృష్టిపెట్టి ఈ మేరకు మార్పుచేర్పులకు శ్రీకారం చుడు తున్నాయి. ఇందులో భాగంగా దక్షిణాది భాషలకు సంబంధించిన కంటెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కుటుంబ, స్నేహపూర్వక డ్రామాలు, ప్రేమకథలు, కామెడీలతో కూడిన కంటెంట్‌ను అందించడంపై దృష్టి పెట్టాయి.

స్థానిక భాషల కంటెంట్‌కు డిమాండ్..

ఓటీటీల్లో గతంలో ప్రసారమైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఆంగ్లం లేదా హిందీకే పరిమితమవగా ఇటీవల కాలంలో స్థానిక భాషల్లో కంటెంట్‌ను వీక్షించేందుకే ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తమ సొంత సంస్కృతి, భాషను ప్రతిబింబించే షోలు, సినిమాలను వీక్షించాలని సబ్‌స్క్రైబర్లు కోరుకుంటున్నారు. దీంతో తెలుగు, తమిళం, మరాఠీ, బెంగాలీ సహా ఇతర భాషల్లో భిన్నమైన కంటెంట్‌ను అందించడానికి ఓటీటీ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇందుకోసం కంటెంట్ సృష్టికర్తలతో జతకడుతున్నాయి. అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, జీ5, ఆహా, హోయిచాయ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు ప్రాంతీయ భాషల్లో స్థానిక కంటెంట్‌తో షోలు, సినిమాలను అందించడంలో ముందువరసలో నిలుస్తున్నాయి. బెంగాలీ షోలకు ప్రసిద్ధి చెందిన హోయిచోయ్ భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన బెంగాలీలను కూడా తన సరికొత్త కంటెంట్‌తో వీక్షకులను ఆకర్షించడం ద్వారా సబ్‌స్క్రైబర్ల సంఖ్యను పెంచుకుంది. చౌపాల్ పంజాబీ, హర్యాన్వీ, భోజ్‌పురి ప్రేక్షకులకు ప్రాంతీయ అభిరుచులతో లోతుగా ప్రతిధ్వనించే కథలను అందిస్తోంది. అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ స్థానిక భాషల్లో సినిమాలను నిర్మించడంతోపాటు సెలబ్రిటీలతో ఇంటర్వ్యూలు, టాక్ షోలను అందిస్తున్నాయి. ఈటీవీ విన్, సన్ నెక్ట్స్, ఆహా వంటి ఓటీటీలు తెలుగు, తమిళ కంటెంట్‌ను రూపొందించి విడుదల చేయడంపై దృష్టిపెడుతున్నాయి. ఇక జియో హాట్‌స్టార్, సోని లివ్ తదితర ఓటీటీలు సినిమాలు, డ్రామాలు, వెబ్ సిరీస్‌లతోపాటు క్రికెట్ సహా వివిధ క్రీడలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. వచ్చే 12–18 నెలల్లో దక్షిణాది భాషల్లో ఒరిజినల్ స్ట్రీమింగ్ టైమింగ్‌ను జియో హాట్‌స్టార్ డబుల్ చేయనుంది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ సైతం దక్షిణాది సంబంధ కంటెంట్‌ను మరింతగా అందించడంపై దృష్టిసారిస్తోంది. బిగ్‌బాస్ సౌత్ ఓటీటీని నాలుగు దక్షిణాది భాషల్లో ప్రజలు 400 కోట్ల గంటలకుపైగా వీక్షించారంటే ప్రాంతీయ భాషల్లో షోలకు ఎంత ఆదరణ లభిస్తోందో స్పష్టమవుతోంది.

రెండు దగ్గు మందులపై నిషేధం

- రిలీఫ్, రెస్పిఫ్రెష్ –టీఆర్ వాడొద్దు
- ప్రజలకు డీసీఏ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రమాదకరమైన రెండు దగ్గు మందులను ప్రభుత్వం నిషేధించింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో పలువురు చిన్నారుల మరణానికి కారణమైన రెండు దగ్గు మందులను ఉపయోగించకూడదని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ప్రజలకు స్పష్టం చేసింది. ‘రిలీఫ్’, ‘రెస్పిఫ్రెష్ – టీఆర్’అనే ఈ దగ్గు మందుల్లో ‘డైఎథిలీన్ గ్లైకోల్’అనే విషపదార్థం ఉన్నట్లు మధ్యప్రదేశ్ భోపాల్‌లోని డ్రగ్ టెస్టింగ్ ల్యాబొరేటరీల్లో నిర్వహించిన పరీక్షల్లో తేలిందని డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం తెలిపారు. ఈ దగ్గు మందులను ఉపయోగించడం వెంటనే ఆపాలని ప్రజలను కోరారు. డిసెంబర్ 2026 వరకు గడువు కలిగిన ఈ దగ్గు మందుల్లో ఒకటైన ‘రిలీఫ్’లో అంబ్రాక్సాల్, గ్వాయిఫెనెసిన్, టెర్బ్యుటాలిన్ సల్ఫేట్, మెంథాల్ సిరప్ ఉన్నట్లు పేర్కొన్నారు. గుజరాత్‌లోని షేప్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ దగ్గు మందును తయారు చేసింది. అలాగే రెస్పిఫ్రెష్ దగ్గు మందులో బ్రోమ్హెక్సిన్, టెర్బ్యుటాలిన్ సల్ఫేట్, గ్వాయిఫెనెసిన్, మెంథాల్ సిరప్ ఉంటుందని, గుజరాత్ అహ్మదాబాద్‌లోని రెడ్నెక్స్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ సిరప్‌ను రూపొందించినట్లు డీసీఏ డీజీ తెలిపారు. ఈ దగ్గు మందులు కలిగి ఉన్నవారు సమీపంలోని డ్రగ్ కంట్రోల్ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, రిటైలర్లు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు..ఈ సిరప్‌ల విక్రయాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



సైకిల్ కొంటాం.. రుణం ఇవ్వండి

- బ్యాంకు మేనేజర్‌ను కోరిన చిన్నారులు

ఝరాసంగం(జహీరాబాద్): సైకిల్ కొనుక్కుంటాం.. మాకు రుణం ఇవ్వండి. తాకట్టుగా తమ వద్ద ఉన్న బంగారం పెడుతామని చిన్నారులు బ్యాంకు మేనేజర్‌ను కోరారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో జరిగిన ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. మండల పరిధిలోని బర్దీపూర్‌కు చెందిన దేవాన్ష్, రహస్య తల్లి సునీతతో కలిసి దసరా సెలవులలో అదే గ్రామంలోని కెనరా బ్యాంకుకు వెళ్లారు. వారి తల్లి.. బ్యాంకులో మహిళా సంఘం డబ్బులు తీసుకునేందుకు వచ్చారు. బ్యాంకులో డబ్బులు ఇస్తారన్న విషయం తెలుసుకున్న చిన్నారులు.. బ్యాంకు మేనేజర్ దగ్గరకు వెళ్లి.. ఆడుకునేందుకు సైకిల్ కొనుక్కుంటాం.. డబ్బులు ఇవ్వండని అడిగారు. ఆశ్చర్యానికి గురైన మేనేజర్.. తాకట్టుగా ఏం పెడతారని ప్రశ్నించగా.. తమ దగ్గర భూమి ఉంది.. బంగారం కూడా ఉందని సమాధానం ఇచ్చారు. మేనేజర్ నవ్వుతూ చిన్నారులను తిరిగి ఇంటికి పంపించారు.

పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్

ఈనెల 12న రాష్ట్రంలోని 6 జిల్లాల్లో నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఈనెల 12న పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు కాగా, మన దేశంలో 2011 తరువాత పోలియో కేసులు నమోదు కాలేదు. కాగా, గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి మనదేశానికి రాకపోకలు జరుగుతున్న జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హనుమకొండ) ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఆరు జిల్లాల పరిధిలో 0–5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు ఇప్పటికే అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ ‘టీ-ఫైబర్’ దేశానికే ఆదర్శం

ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో రాష్ట్రానికి ప్రశంసలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ‘టీ–ఫైబర్’కు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయి. టీ–ఫైబర్ గ్రామాలు దేశానికే ఆదర్శమని కేంద్ర ప్రభుత్వం కొనియాడింది. బుధవారం ఢిల్లీలోని యశోభూమి ఐఐసీసీలో ‘ఇండియా మొబైల్ కాంగ్రెస్–2025’జరిగింది. ఐటీ మంత్రుల రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోచైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. తెలంగాణ టీ–ఫైబర్ గ్రామాలను జాతీయ మోడల్‌గా అభివర్ణిస్తూ ప్రశంసించారు. టీఫైబర్ మోడల్‌ను దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. లాస్ట్ మైల్ బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

భారత్‌నెట్ అమలుకు కట్టుబడి ఉన్నాం

తెలంగాణ రాష్ట్రంలో భారత్ నెట్‌ను మరింత వేగవంతంగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రైట్–టు–వే , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి సంబంధించిన సమస్యలను పరిష్కరించడం, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను పటిష్టం చేయడం వంటి విషయాలపై తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోందని వివరించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా.. గ్రామీణ స్థాయిలో ప్రతీ ఇంటికి ఫైబర్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రజలకు ఈ గవర్నెన్స్, విద్య, వైద్యం, డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు.

మరో రెండ్రోజులు మోస్తరు వర్షాలు

- కొనసాగుతున్న రుతుపవనాల ఉపసంహరణ
- ఈ నెల 16 వరకు పూర్తి కానున్న ప్రక్రియ
- ఈ సీజన్‌లో సాధారణం కంటే 32 శాతం అధికంగా వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 16వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలో రుతుపవనాల కదలికలు వేగంగా ఉండటంతో వర్షాలకు అనుకూల వాతావరణం ఉంటుందని చెబుతున్నారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, అంతర్గత తమిళనాడుల మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీంతో రానున్న రెండు రోజులు చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుసాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్1 నుంచి)లో రాష్ట్రవ్యాప్తంగా 77.32 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 102.37 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 32 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 7 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. 16 జిల్లాల్లో అధిక వర్షపాతం, 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గతేడాది సీజన్‌తో పోలిస్తే ఈసారి 4 శాతం అధికవర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

యాచారం/మాడ్గుల: వేర్వేరు ఘటనల్లో పిడుగుపాటుకు గురై రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. యాచారం మండలం నల్లవెల్లికి చెందిన జోగు మనీశ్ (12) ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తర్వాత ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

- మాడ్గుల మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లికి చెందిన బుచ్చయ్య (56) పశువులకు మేత వేయడానికి వెళ్లి పిడుగుపాటుకు గురై మృతిచెందాడు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కటకటాలు కిటకిట!

రద్దీగా కారాగారాలు


వరంగల్ సెంట్రల్ జైలు (ఫైల్)

పెరుగుతున్న నేరాలు, నేరస్తుల సంఖ్య

- సామర్థ్యాన్ని మించి జైళ్లలో ఖైదీలు
- అగ్రస్థానంలో ఢిల్లీ, మేఘాలయ, ఉత్తరాఖండ్ సహా ఆరు రాష్ట్రాలు
- దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి..
- తెలంగాణలో 72.8% మాత్రమే ఖైదీలు
- జిల్లా జైళ్ల ఎత్తివేత, ఉన్న జైళ్లకే తరలింపు
- నేషనల్ క్రైం రికార్డు బ్యూరో
- 2023 నివేదిక వెల్లడి

సాక్షి ప్రతినిధి, వరంగల్: సామర్థ్యానికి మించిన ఖైదీల రద్దీతో దేశవ్యాప్తంగా జైళ్లు కిటకిటలాడుతున్నాయి. నేరాలు, నేరస్తులు రోజురోజుకూ పెరుగుతుండటంతో కటకటాల్లోకి వెళ్లే వారి సంఖ్యా అదేస్థాయిలో ఉంటోంది. దీంతో సెంట్రల్, జిల్లా, సబ్, ఓపెన్, ఉమెన్ తదితర కారాగారాలన్నీ సామర్థ్యాన్ని మించిన నేరస్తులు, విచారణ, శిక్ష పడిన ఖైదీలతో కిక్కిరిసిపోతున్నాయి. వంద నుంచి 202 శాతం ఖైదీల అక్యుపెన్సీ ఉన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 22 ఉన్నాయి. అరవై శాతం వరకు ఖైదీలున్నవి ఐదుంటే.. 60 నుంచి 100 శాతమున్నవి తొమ్మిది. దేశవ్యాప్తంగా ఉన్న జైళ్ల పరిస్థితిపై నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) రూపొందించిన తాజా ప్రిజన్స్ స్టాటిస్టిక్స్ ఇండియా – 2023 తాజా రిపోర్టులో పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది.

సగటున ఆక్యుపెన్సీ రేటు 120.8 శాతం.. అగ్రస్థానంలో ఆ ఆరు రాష్ట్రాలు..

ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2021, 2022లతో పోలిస్తే 2023లో ఖైదీల అక్యుపెన్సీ రేటు తగ్గినా.. దేశ మొత్తంగా సగటు 120.8 శాతంగా ఉంది. 2021లో 1,319 సెంట్రల్, జిల్లా, సబ్, మహిళ, ఓపెన్.. తదితర జైళ్లలో సామర్థ్యం 4,25,609లుగా ఉంటే 5,54,034 (130.2 శాతం) మంది చేరారు. 2022లో 11 జైళ్లు పెరిగి 1,330గా ఉండగా, 4,36,266 మంది సామర్థ్యమున్న ఆ జైళ్లలో 5,73,220 (131.4 శాతం) ఖైదీలున్నారు. 2023లో డిసెంబర్ 31 నాటికి 1,332 జైళ్లలో 4,39,119లకు 5,30,333 (120.8 శాతం) మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కాగా, ఖైదీల అక్యుపెన్సీ రేటు వరుసగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మేఘాలయ, ఢిల్లీలలో జైళ్లలో 150.1 శాతం నుంచి 200.2 శాతంగా ఉంది. మరో 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 100కు మించిన 150 శాతం అక్యుపెన్సీలో ఉన్నాయి.

తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లోనే తక్కువ..

తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో ఖైదీల సామర్థ్యం కన్నా తక్కువ సంఖ్యలో ఖైదీలు ఉంటున్నారు. నాగాలాండ్‌లో 39.7 శాతమే ఖైదీలుగా అక్కడి జైళ్లలో ఉంటుండగా మణిపూర్‌లో 46.1, త్రిపురలో 56.6, తెలంగాణలో 72.8, తమిళనాడులో 81.1, ఆంధ్రప్రదేశ్‌లో 89.3 శాతంగా అక్యుపెన్సీ ఉంది. కొన్ని రాష్ట్రాల్లో జైళ్లను ఎత్తివేసి.. ఉన్న జైళ్లకే ఖైదీలను పంపడం, రోజురోజుకూ నేరాలు పెరగడం, విచారణలో ఉన్న ఖైదీల సంఖ్య.. జైళ్లు కిటకిటలాడటానికి కారణంగా అధికారులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు నియమించిన జైలు సంస్కరణల కమిటీ నివేదిక కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించింది. ఖైదీల రద్దీ కారణంగా.. ఆ జైళ్లలో నెలకొన్న దయనీయమైన పరిస్థితులపై ఆందోళన కూడా వ్యక్తం చేసింది. కొన్ని సందర్భాల్లో అవసరం లేకున్నా నిర్బంధం.. ఆ కేసుల దర్యాప్తులో జాప్యం వల్ల కూడా జైళ్లు కిటకిటలాడటానికి కారణాలుగా కమిటీ నివేదించింది. చెరసాలల్లో రద్దీ నివారణకు తక్షణమే భారీ చర్యలు చేపట్టాలని కోరింది.

వరంగల్ సెంట్రల్ జైలు ఎత్తివేత ప్రభావం

ఖైదీలను ఇతర జైళ్లకు తరలించి 2021 జూన్ 14న వరంగల్ సెంట్రల్ జైలును కూల్చివేశారు. 256 ఎకరాల్లో హెల్త్ సిటీ నిర్మాణంలో భాగంగా కూల్చివేసిన సెంట్రల్ జైలు స్థానంలో.. 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నారు. అయితే మామునూరు 4వ బెటాలియన్ ప్రాంతంలో వంద ఎకరాల్లో చేపడతామన్న సెంట్రల్ జైలు నిర్మాణం.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో వివిధ ప్రాంతాల్లోని రిమాండ్ ఖైదీలను వరంగల్ కోర్టుకు తీసుకురావడానికి ఎస్కార్ట్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములాఖత్ కోసం వచ్చే ఖైదీల బంధువులకు తిప్పలు తప్పడం లేదు. వంద ఎకరాల్లో అన్ని హంగులతో నిర్మాణం చేపడతామన్న సెంట్రల్ జైలు నిర్మాణం అతీగతీ లేదు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ సెంట్రల్ జైలును ఆగమేఘాల మీద కూల్చివేసిన ప్రభుత్వం, నిర్మాణంలో ఆ చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 680 నుంచి 1,000 మంది ఖైదీలుండే ఈ జైలును ఎత్తివేసి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకపోవడం వల్ల.. రాష్ట్రంలోని జైళ్లపై ఈ ఖైదీల ప్రభావం పడుతోందన్న చర్చ జరుగుతోంది.

మూడేళ్లలో జైళ్లు, ఖైదీల సంఖ్య, అక్యుపెన్సీ రేటు తదితర వివరాలు...

సంవత్సరం	మొత్తం జైళ్ల సంఖ్య	ఖైదీల వాస్తవ సామర్థ్యం	సంవత్సరం చివరి నాటికి ఖైదీల సంఖ్య	సంవత్సరం చివరలో అక్యుపెన్సీ రేటు
2021	1,319	4,25,609	5,54,034	130.2 శాతం
2022	1,330	4,36,266	5,73,220	131.4 శాతం
2023	1,332	4,39,119	5,30,333	120.8 శాతం

2023 (డిసెంబర్ 31 వరకు)లో సామర్థ్యం మించి అత్యధిక ఖైదీలున్న ఆరు రాష్ట్రాలు..

రాష్ట్రం	మొత్తం జైళ్లు	ఖైదీల సామర్థ్యం	ఖైదీల సంఖ్య	ఖైదీల శాతం
ఢిల్లీ	16	10,026	20,077	200.2
మేఘాలయ	05	680	1,283	188.7
ఉత్తరాఖండ్	11	3,761	6,885	183.1
మహారాష్ట్ర	60	26,281	40,805	155.3
మధ్యప్రదేశ్	132	29,875	45,543	152.4
ఉత్తరప్రదేశ్	77	65,866	98,849	150.1

2023 (డిసెంబర్ 31 వరకు)లో సామర్థ్యం కంటే తక్కువ ఖైదీలున్న ఆరు రాష్ట్రాలు..

రాష్ట్రం	మొత్తం జైళ్లు	ఖైదీల సామర్థ్యం	ఖైదీల సంఖ్య	ఖైదీల శాతం
నాగాలాండ్	12	1,490	591	39.7
మణిపూర్	04	1,160	535	46.1
త్రిపుర	14	2,348	1,329	56.6
తెలంగాణ	38	8,037	5,853	72.8
తమిళనాడు	142	24,342	19,738	81.1
ఆంధ్రప్రదేశ్	106	8,831	7,889	89.3

జైళ్ల గురించి మరింత సమాచారం..

- దేశంలోని 1,332 జైళ్లలో 549 సబ్ జైళ్లు, 436 జిల్లా జైళ్లు, 152 సెంట్రల్ జైళ్లు, 101 ఓపెన్ జైళ్లు, 47 ప్రత్యేక జైళ్లు, 35 మహిళా జైళ్లు, 10 బోర్‌స్టల్ పాఠశాలలు ఉన్నాయి. పైన పేర్కొన్న జైళ్లు కాకుండా 2 ఇతర జైళ్లు ఉన్నాయి.
- అత్యధిక సంఖ్యలో జైళ్లు రాజస్తాన్ (155), తరువాత తమిళనాడు (142), మధ్యప్రదేశ్ (132), ఆంధ్రప్రదేశ్ (106), ఒడిశా (92), ఉత్తరప్రదేశ్ (77)లలో నమోదయ్యాయి. ఈ ఆరు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం జైళ్లలో 52.9% ఉన్నాయి
- డిసెంబర్ 31, 2023 నాటికి దేశంలో అత్యధిక సంఖ్యలో సెంట్రల్ జైళ్లు (14) ఢిల్లీలో ఉన్నాయి.

అరుణాచల్‌పదేశ్, మేఘాలయ, అండమాన్ నికోబార్ దీవులు, డామన్ డయ్యూ, లద్దాఖ్, లక్షద్వీప్ వంటి రాష్ట్రాలు/యూటీలలో సెంట్రల్ జైళ్లు లేవు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో జిల్లా జైళ్లు (64) ఉన్నాయి. అత్యధిక ఖైదీల సంఖ్య జిల్లా జైళ్లలో (136.6%), తరువాత సెంట్రల్ జైళ్లలో (120.7%), స్పెషల్ జైళ్లలో (92.3%) ఉన్నాయి. మహిళా జైళ్లలో 60.6% అక్యుపెన్సీ రేటు ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని జైళ్లలో అత్యధిక ఖైదీల సంఖ్య (98,849) 18.6% ఉండగా, ఆ తర్వాత బిహార్ (53,076), మధ్యప్రదేశ్ (45,543), మహారాష్ట్ర (40,805), పంజాబ్ (31,529), హరియాణా (25,833) ఉన్నాయి. దేశంలోని మొత్తం ఖైదీలలో ఈ రాష్ట్రాలు కలిసి 55.7% వాటా ఇస్తున్నాయి.



సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు

ఈఎస్ఐ భరోసా

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం ఈఎస్‌ఐ భరోసా కల్పిస్తోంది. ఈమేరకు సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. సంస్థవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు ఎంప్లాయ్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్‌ఐ) సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. సంస్థలో సుమారు 36 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. కొత్తగూడెంలో పనిచేసే వారికి ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించింది. సివిల్, సివిక్, డ్రైవర్లు, తోటమాలి, బెల్ట్‌క్లీనింగ్, హౌస్ కీపింగ్, టింబర్‌యార్డు, స్టోర్స్, బొగ్గు రవాణా, నర్సరీలు, ఓబీ, భూగర్భ గనుల్లోని రూఫ్ బోల్టింగ్, సపోర్టింగ్ లాంటి కీలక విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరితోనే సంస్థకు అధిక లాభాలు వస్తున్నాయని చెబుతున్నా.. వేతనాలు, సౌకర్యాల విషయంలో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు.

యాజమాన్యం ప్రత్యేక దృష్టి

కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే సింగరేణి ఆస్పత్రుల్లో ప్రాథమిక వైద్యానికి అనుమతించగా, క్యాంటీన్ సౌకర్యం కల్పించింది. ప్రమాదంలో మరణిస్తే రూ.25 లక్షల బీమా కల్పిస్తోంది. ఏడాది నుంచి లాభాల్లో వాటా కూడా చెల్లిస్తోంది. గతంలో రూ.5వేలు ఇవ్వగా, ఈసారి రూ.5,500 చెల్లించింది.

వైద్యంతోపాటు ఈఎస్ఐ ప్రయోజనాలు

- కాంట్రాక్టు కార్మికుడు అస్వస్థతకు గురైతే దినసరి వేతనంలో 70 శాతం జీతం ఈఎస్‌ఐ నుంచి పొందవచ్చు. రోజువారీ జీతం రూ.500 వస్తే అందులో రూ.350.. ఇలా రెండు సార్లు 91 రోజుల పాటు అందిస్తుంది.
- వేసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్‌కు 14 రోజుల పాటు వందశాతం జీతం పొందవచ్చు
- 34 దీర్ఘకాలిక వ్యాధులకు దినసరి వేతనంలో 80 శాతం 124 నుంచి 309 రోజుల వరకు వేతనం పొందే వీలుంటుంది.
- విధులకు వెళ్తున్న, విధుల్లో ఉన్న సమయంలో తాత్కాలిక వైకల్య ప్రయోజనం కింద సగటు దినసరి వేతనంలో 90% పొందే వీలుంటుంది.
- శాశ్వత వైకల్యం కలిగితే జీవితాంతం మెడికల్ బోర్డు నిర్ణయించిన రేటు ప్రకారం వేతనం అందజేస్తారు.
- దీర్ఘకాలిక వ్యాధులు, ఉద్యోగపరంగా మరణం సంభవిస్తే భార్యకు జీవితాంతం, అతని కొడుక్కి 25ఏళ్ల వయసు వచ్చేంత వరకు కూతురుకు పెళ్లయ్యేంత వరకు సగటు దినసరి వేతనంలో 90 శాతం చెల్లించనున్నారు.
- ప్రసవానికి 26 వారాలు మొదటి రెండు కాన్పులకు, గర్భస్రావానికి ఆరువారాలు వందశాతం జీతం చెల్లిస్తారు
- చనిపోతే అంత్యక్రియల ఖర్చు రూ.15వేల వరకు అందిస్తారు.
- ఉద్యోగంలో గాయం ద్వారా 40 శాతం కన్నా 45ఏళ్ల లోపు వ్యక్తికి తగ్గని వైకల్యం వల్ల గుర్తింపు కేంద్రంలో శిక్షణ కోసం రోజుకు రూ.123, వాస్తవంగా వసూలు చేసిన ఫీజు ఏది ఎక్కువైతే అది చెల్లిస్తారు.
- ఈఎస్‌ఐ పథకం అమలులో ఉన్న ప్రదేశాల్లో ప్రసూతి సౌకర్యం లేనిచోట ప్రసవిస్తే రూ.7,500 చెల్లించనున్నారు.

పకడ్బందీగా అమలు



సంస్థవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐ వర్తించేలా ముందుకు సాగుతున్నాం. మొదటి దఫాగా కొత్తగూడెంలో ఆన్‌లైన్ చేస్తున్నాం. మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో ప్రారంభిస్తాం. సంస్థ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు కార్మికులకు అన్ని విధాలా మేలు చేయడంపై యాజమాన్యం ఆలోచిస్తోంది. ఇప్పటికే సంస్థ సాధించిన లాభాల్లో కూడా కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లిస్తున్నాం.

– ఎన్.బలరాం, సీఅండ్ఎండీ, సింగరేణి

కృష్ణమ్మ ఒడిలోనే.. సంగమేశ్వరుడు


సంగమేశ్వర ఆలయం గర్భగుడి (ఫైల్) (ఇన్‌సెట్‌లో) వేపదారు శివలింగం (ఫైల్)

సప్తనదుల సంగమ స్థానంలో కొలువైన శైవక్షేత్రం

కొల్లాపూర్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ప్రవహించే కృష్ణానది తీరం ఎన్నో ఆలయాలకు నిలయమైంది. వీటిలో ప్రత్యేకమైనది సంగమేశ్వరాలయం. సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వపు కర్నూలు జిల్లా నంద్యాల పరిధిలోకి వస్తుంది. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే **ఈ గుడి వేసవి కాలంలో మాత్రమే భక్తులకు దర్శనమిస్తుంది. మిగతా రోజుల్లో కృష్ణానది గర్భంలో మునిగిపోతుంది. శ్రీశైలం జలాశయంలో బ్యాక్** వాటర్ తగ్గితేనే మళ్లీ తేలుతుంది.

సప్తనదుల సంగమ ప్రాంతం

నంద్యాల జిల్లా ఆత్మకూరు నుంచి కపిలేశ్వరం మీదుగా సంగమేశ్వర ఆలయానికి రోడ్డు **మార్గం గుండా చేరుకోవచ్చు. తెలంగాణ ప్రాంత ప్రజలు మాత్రం నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మీదుగా సోమశిలకు చేరుకొని అక్కడి** నుంచి మరబోట్లలో నది మార్గం గుండా వెళ్లి ఆలయాన్ని దర్శించుకుంటారు. సప్తనదులు కలిసే చోట ఈ ఆలయం కొలువై ఉండటంతో సంగమేశ్వరుడిని దర్శించుకునేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, **మలప హారిణి, భీమా, భవనాశిని నదులు ఇక్కడ సంగమం అవుతాయి. అందుకే ఈ ప్రాంతాన్ని సప్తనదుల సంగమ స్థానం అంటారు. సంగమేశ్వరం నుంచి శ్రీశైలం వరకు సప్తనదుల ప్రవాహం కొనసాగుతుంది.**

వేసవిలో మాత్రమే దర్శనం..

సంగమేశ్వరాలయం ప్రతి సంవత్సరం నాలుగు నెలలు మాత్రమే కనిపిస్తుంది. మిగతా రోజుల్లో కృష్ణానది గర్భంలో మునిగి ఉంటుంది. వర్షాకాలంలో కృష్ణానదికి వరద ప్రవాహం ప్రారంభమైతే ఆలయం నీటిలో మునుగుతుంది. సాధారణంగా జూన్ నెలాఖరు నుంచి ఆగస్టు ప్రారంభంలోగా ప్రతి యేడు నీటిలో పూర్తిగా మునిగిపోతుంది. మళ్లీ మార్చి నెలలో తేలుతుంది. నదిలో నీటి మట్టం తగ్గిన వెంటనే గుడి పరిసర ప్రాంతాల భక్తులు ఆలయాన్ని శుభ్రం చేసి పూజలు ప్రారంభిస్తారు. అర్చకులు తెలకపల్లి రఘురామశర్మ నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. ఈయన కృషి వల్లనే **ఆలయానికి ప్రాచుర్యం** లభించింది అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఆలయం పూర్తిగా నీటిలో మునిగి ఉంది.

- ఏడాదిలో నాలుగు నెలలే స్వామివారి దర్శనం, నిత్యపూజలు
- మిగతా కాలమంతా నదీ గర్భంలోనే..
- వేపదారు శివలింగం ఇక్కడి ప్రత్యేకత

ఇదీ ఆలయ చరిత్ర..

సంగమేశ్వర ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో దక్షయజ్ఞం జరిగిందని, దక్షుడు సతీదేవిని అవమానించడంతో ఆమె యజ్ఞ వాటికలో పడి మరణించిందని, సతీదేవి నివృత్తి చెందిన ప్రాంతం కాబట్టి దీన్ని నివృత్తి సంగమేశ్వరాలయం అని కూడా అంటారు. పాండవులు వనవాస సమయంలోనూ ఈ ప్రాంతం గుండా వెళ్తున్నప్పుడు ధర్మరాజు శివలింగాన్ని ప్రతిష్ఠించాలని అనుకుంటాడు. కాశీకి వెళ్లి శివలింగాన్ని తీసుకురావాలని భీముడికి చెబుతాడు. కాశీకి వెళ్లిన భీముడు ప్రతిష్ఠ సమయానికి శివలింగాన్ని తీసుకురాలేకపోతాడు. దీంతో రుషుల సూచన మేరకు వేప మొద్దును శివలింగంగా ప్రతిష్ఠించి ధర్మరాజు పూజలు చేస్తాడు. విషయం తెలిసి భీముడు తాను తీసుకొచ్చిన శివలింగాన్ని పక్కకు విసిరి పారేస్తాడు. భీముని కోపాన్ని గమనించి ఆయన తెచ్చిన శివలింగాన్ని ధర్మరాజు సంగమేశ్వర ఆలయం సమీపంలోనే ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తాడు. దీన్ని భీమలింగం అంటారు. సంగమేశ్వర ఆలయంలో ధర్మరాజు ప్రతిష్ఠించిన శివలింగం వేపమొద్దు ఆకారంలోనే ఉండటం ఇక్కడి ప్రత్యేకత. సంగమేశ్వరాలయాన్ని 200 సంవత్సరాల కిందట భారీ ప్రాకారంతో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీశైలం డ్యాం నిర్మాణంతో ఈ ఆలయం కృష్ణానదిలో మునిగిపోయి పూర్తిగా శిథిలమైంది. తర్వాతి కాలంలో భక్తులు కొంతమేరకు పునరుద్ధరణ పనులు చేపట్టారు.


కృష్ణానదిలో సంగమేశ్వరాలయం మునిగిన ప్రాంతం ఇదే..


జూన్‌లో క్రమంగా కృష్ణమ్మ ఒడిలోకి చేరుతున్న ఆలయం (ఫైల్)


కృష్ణానది తీరంలోని సంగమేశ్వరాలయం (ఫైల్)

ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: అమరావతి జర్నలిస్టులు రూపొందించిన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను సీఎం చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించి అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు సీఎంను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు.

రోడ్ల మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రహదారుల మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రహదారుల్లో 771 కిలోమీటర్లకు సంబంధించిన 108 పనులకు రూ.400 కోట్లు, జిల్లా కేంద్రాలను కలిపే ప్రధాన రోడ్లలో 1,332 కిలోమీటర్ల పరిధిలో 166 పనులకు రూ.600 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది.

ఆగిపోయిన కన్నడ బిగ్‌బాస్ షో

సాక్షి బెంగళూరు: బిగ్‌బాస్ షో ఆగిపోయింది. బిస్‌బాస్ జరుగుతున్న జాలీవుడ్ స్టూడియోకు కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి (కేఎస్‌పీసీబీ) ఇచ్చిన నోటీసులకు సంబంధిత స్టూడియో యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అధికారులు దాన్ని మూసేశారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి తీసుకోకపోవడంతో మంగళవారం రాత్రి రామనగర తహశీల్దార్ స్టూడియోకు తాళాలు వేశారు. ఈ క్రమంలో జాలీవుడ్ స్టూడియోలో జరుగుతున్న కన్నడ బిగ్‌బాస్-12 హఠాత్తుగా ఆగిపోయింది. బిగ్‌బాస్ ఇంటిలో ఉంటున్న పోటీదారులను వేరేవేరే రిసార్టులకు స్టూడియో యాజమాన్యం తరలించింది. జాలీవుడ్ స్టూడియోకు తాళాలు వేయడంపై సంబంధిత యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. జిల్లా కలెక్టర్‌ను కలిసి నోటీసులకు బదులిచ్చేందుకు, తప్పు సరిచేసుకునేందుకు పది రోజుల సమయం ఇవ్వాలని కోరింది.

బెంగళూరులో రూ.23.84 కోట్ల డ్రగ్స్ సీజ్

బనశంకరి: భారతీయ సిలికాన్ రాజధాని బెంగళూరులో పోలీసులు భారీ మొత్తంలో డ్రగ్స్‌ను పట్టుకున్నారు. నగరవ్యాప్తంగా మత్తుపదార్థాల విక్రయాలు, సరఫరాకు పాల్పడుతున్న ఇద్దరు ఆఫ్రికన్లు, నలుగురు స్థానికులను అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.23.84 కోట్ల విలువచేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ బుధవారం తెలిపారు. పట్టుబడిన మాదక ద్రవ్యాల్లో 7.17 కేజీల హైడ్రోగంజాయి, 1.39 కేజీల ఎండీఎంఏ క్రిస్టల్స్, 2.30 కేజీల హషీం, ఇతరత్రా డ్రగ్స్ ఉన్నట్లు చెప్పారు.

పల్లెల్లో పులి పంజా

దట్టమైన అడవుల్లో సంచరించే పెద్దపులులు, చిరుతలు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఆహారం, నీటి కోసం అటవీ సమీప గ్రామాల్లో, కొండ కింద శివారు గ్రామాల్లో వన్యప్రాణుల సంచారం అధికమైంది. నల్లమల అటవీ ప్రాంతంతో పాటు, వెలిగొండ రిజర్వ్ ఫారెస్టు సమీప గ్రామాల్లో చిరుతలు, పెద్దపులులు తరచూ స్థానికుల కంటపడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. పొలాల్లో పనులకు వెళ్లేందుకు రైతులు, పశువులను మేపేందుకు అడవిలోకి వెళ్లేందుకు పశుపోషకులు జంకుతున్నారు.

- కొండకింద, అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులులు, చిరుతల అలజడి
- నీరు, ఆహారం కోసం గ్రామాల్లోకి వన్య ప్రాణులు
- పులులను ప్రత్యక్షంగా చూడటంతో వణుకుతున్న రైతులు
- పొలాలకు సైతం వెళ్లేందుకు వెనకాడుతున్న అన్నదాతలు
- వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని గ్రామాల్లో ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- కనిగిరి ఫారెస్ట్ పరిధిలో 15 నుంచి 20 వరకు చిరుతలు







1. నల్లమలలో సంచరిస్తున్న పెద్ద పులి (ఫైల్)
2. భైరవకోన రిజర్వ్‌ఫారెస్ట్ ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత
3. పులి కనిపించిన ప్రాంతంలో పులి పాదముద్రలు

కనిగిరిరూరల్/పెద్దదోర్నాల: నల్లమలలో కొన్ని రోజులుగా వన్యప్రాణుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇటీవల జరిగిన పులుల గణనలో పులుల సంతతి పెరిగిన విషయం తేలింది. ప్రస్తుతం నల్లమల అభయారణ్యంలో 85 వరకు పెద్దపులులు, లెక్కకు మించిన చిరుత పులులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వర్షాకాలం ఆరంభమైన నాటి నుంచి భారీ స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో నల్లమలలో కొంత మేర నీటికి ఇబ్బందులతో పాటు పులుల ఆహార సమస్యలను తీర్చే సాంబార్, కణుతుల వంటి భారీ వన్యప్రాణుల సంచారం లేకపోవటంతో పులులకు ఆహార కొరత ఏర్పడింది. నీరు, ఆహారాన్ని వెతుక్కుంటూ పులులు అటవీ సమీప గ్రామాలకు వస్తుండటంతో స్థానికుల కంటపడుతున్నాయి. కొన్నిసార్లు పశువులపై దాడి చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సుమారు 48,500 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. 7 సెక్షన్‌లు, 16 బీట్‌లు ఉన్నాయి. ప్రధానంగా భైరవకోన, వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని ప్రాంతాల్లో సుమారు 15 నుంచి 20 వరకు చిరుత పులులు సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్‌లోని నాగిరెడ్డిపల్లి, వెదుళ్లచెరువు, గుడిపాటిపల్లి బీట్‌ల పరిధిలోని కొండ కింద శివారు గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తోంది. వారం రోజుల క్రితం మరపగుంట్లలో పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్రలు సేకరించి 3, 4 ఇంచుల పొడవు ఉన్నట్లు తెలిపారు. పాద ముద్రలను బట్టి అది పెద్దపులి కాదని నిర్ధారించారు. పెద్దపులి పాద ముద్రలు 7, 8 ఇంచుల పొడవు ఉంటాయన్నారు. అక్కడ ఉన్న పాదముద్రల నమూనాలను బట్టి చిరుత పులి, లేదా జంగు పిల్లి అయి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. తాజాగా గత శనివారం రాత్రి ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి మధ్య ప్రాంత పొలాల్లో, గ్రామ శివార్లలో బైక్‌పై వెళ్తున్న ఒకరు పులిని చూసినట్లు చెప్పాడు. దీంతో ఆదివారం ఫారెస్ట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి పాదముద్రల నమూనాలను సేకరించారు. ఆ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల తుంగోడు, చెన్నపునాయునిపల్లి, మైలుచర్ల బొంత వారిపల్లి, పిల్లిపల్లి బీట్‌లలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో వన్య ప్రాణులతో పాటు చిరుత పులులు కనిపించినట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.

యర్రగొండపాలెం రేంజ్ పరిధిలోనూ..

యర్రగొండపాలెం రేంజి పరిధిలోని కొలుకుల బీట్‌లో పెద్దపులి కనబడటంతో రైతులు భయంలో వణికిపోతున్నారు. గత ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులకు పెద్దపులి కనిపించింది. దీంతో పొలాలకు వెళ్తున్న రైతులతో పాటు రైతు కూలీలు సైతం భయాందోళనతో వణికిపోతున్నారు. కొలుకుల బీటులోని అటవీ ప్రాంతంలో పెద్దదోర్నాల మండల పరిదిలోని పెద్దబొమ్మలాపురం రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఎక్కువగా ఉండటంతో తరచూ వన్యప్రాణులతో సమస్యలు ఎదురవుతున్నాయి. పెద్దపులి సంచారం ఉన్న దేవలూడు ప్రాంతంలో గతంలోనే అటవీశాఖ బేస్ క్యాంపును ఏర్పాటు చేసింది. పులులకు ఆహారం దొరక్క పశువుల మందలు ఉన్న పెద్దదోర్నాల మండలం గండిచెరువు సమీప ప్రాంతాల్లో పెద్దపులుల సంచారం ఎక్కువగా ఉందని పశువుల కాపరులు పేర్కొంటున్నారు. దీనికి తోడు దేవలూడు ప్రాంతంలో నీటి నిల్వలు అధికంగా ఉండటం కూడా పులుల సంచారానికి మరో కారణమని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పాలుట్లలో తన పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతు బాలునాయక్‌పై పెద్దపులి దాడి చేసి గాయపర్చగా, బొమ్మలాపురానికి చెందిన ఓ రైతు ఎద్దును సైతం పులి హతమార్చింది. గ్రామానికి చెందిన దేవలూడు, గండి చెరువు ప్రాంతాల్లోనే ఎక్కువ వ్యవసాయ భూములు ఉండటంతో బొమ్మలాపురం వాసులు ఆందోళన చెందుతున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలోనూ..

అర్ధవీడు మండలంలోని కొత్తూరు, దొనకొండ, వెలగలపాయ, బొల్లుపల్లి, అచ్చంపేట, మాగుటూరు, మోహిద్దీన్‌పురం గ్రామాల పరిధిలో తరచూ పులి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెలగలపాయ, దొనకొండ, మాగుటూరు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపేసిన ఘటనలు ఉన్నాయి. మొహిద్దీన్‌పురం వద్ద కారులో వెళ్తున్న కొందరికి పులి రోడ్డు దాటుతూ కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. కంభం మండలంలోని దర్గా కొండ సమీపంలో నెల రోజుల క్రితం పులి అడుగులు కనిపించడంతో ఫారెస్టు అధికారులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని సూరేపల్లి సమీపంలో కొండవద్ద పులి అడుగులు ఉన్నాయని స్థానికులు చెప్పగా ఫారెస్టు అధికారులు ట్రాప్ కెమెరాలు బిగించి పరిశీలించారు. వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా అటవీ శాఖాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, అటవీ ప్రాంతాల్లో నీటివనరులు ఏర్పాటు చేయాలని అటవీ సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఇమ్మడి చెరువు, మరపగుంట్ల పొలాల్లో పాదముద్రల నమూనాలను సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు



పులులు సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పులి సంచారంపై వివరాలు సేకరించాం

పులి సంచారానికి సంబంధించిన వివరాలను సేకరించాం. ఆ ప్రాంతంలో పులి కాలి గుర్తులు లభించాయి. దేవలూడు అటవీ ప్రాంతం కాబట్టి పులుల సంచారం ఉంది. పెద్దబొమ్మలాపురంలో పులి సంచారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టాం. రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– హరి, ఫారెస్టు రేంజి అధికారి, పెద్దదోర్నాల

ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం

కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పెద్ద పులులు లేవు. భైరవకోన, వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో సుమారు 15 నుంచి 20 వరకు చిరుత పులులు ఉన్నాయి. వారం రోజుల నుంచి నాగిరెడ్డిపల్లి, వెదుళ్లచెరువు, గుడిపాటిపల్లి బీట్ పరిధిలోని గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మన ప్రాంతంలో పెద్ద పులులు లేవు. అయినా కొండ కింద గ్రామాల ప్రజలు ఆరుబయట రాత్రి వేళ నిద్రించవద్దు. పొలాలకు వెళ్లే రైతులు, మేతకు అడవుల్లోకి వెళ్లే వారు ఒంటరిగా పోవద్దు. గ్రామ మొదట్లోనే పశువులను మేపుకోండి. నీటి కోసం, ఆహారం కోసం రాత్రిపూట వన్య ప్రాణులు అడవి నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది.

– తుమ్మా ఉమా మహేశ్వరరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కనిగిరి

ఫ్యాక్షన్ గతిని మార్చిన కరివేపాకు

కరివేపాకు వల్ల ఉపయోగం ఏముందని ప్రశ్నిస్తే.. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని, జీర్ణక్రియ దోహదపడుతుందని, మధుమేహాన్ని నియంత్రిస్తుందని, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందని ఠక్కున సమాధానమిస్తారు. అయితే అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి వాసులు మాత్రం కరివేపాకును చూసి ఫ్యాక్షన్ పారిపోయిందని అంటున్నారు. వ్యక్తుల మధ్య అనుబంధాలను పెంచిందని, ప్రశాంత జీవనానికి దోహదపడిందని అంటున్నారు. ఇంతకూ కరివేపాకు దెబ్బకు ఫ్యాక్షన్ ఎలా తోకముడిచిందో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే యర్రగుంటపల్లిని సందర్శించి తీరాల్సిందే.



యర్రగుంటపల్లి వద్ద సాగులో ఉన్న కరివేపాకు పంట

- కరివేపాకు సాగుతో ఫ్యాక్షనిస్టుల జీవితాల్లో వెలుగు
- పిల్లలకు ఉన్నత చదువులు

తాడిపత్రి రూరల్: అనంతపురం జిల్లా తాడిపత్రి రూరల్ మండలంలోని యర్రగుంటపల్లి చుట్టూ పచ్చని పంట పొలాలతో ఆకట్టుకుంటోంది. 3,066 మంది జనాభా ఉన్న ఈ గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఎక్కువగా ఎర్ర నేలలు ఉన్నాయి. కరివేపాకు పంటతోపాటు మొక్కజొన్న, కంది, అరటి, నిమ్మ, దానిమ్మ తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ గ్రామం ఒకప్పుడు ఫ్యాక్షన్ పడగ నీడలో ఎన్నో ఆటుపోట్లకు గురైంది.


ఆధిపత్య పోరుతో రాజుకున్న ఫ్యాక్షన్

మూడు దశాబ్దాల క్రితం యర్రగుంటపల్లిలోని కాటన్ మిల్లులో కార్మికుల మధ్య చోటు చేసుకున్న విభేదాలు గ్రామంలో చీలికలకు కారణమయ్యాయి. రెండు వర్గాలుగా గ్రామస్తులు విడిపోయారు. ఇదే అదనుగా ఓ వర్గానికి టీడీపీ ఆజ్యం పోస్తూ వచ్చింది. అడ్డుకునేందుకు మరో వర్గానికి కాంగ్రెస్ మద్దతు పలికింది. ఈ రెండు పార్టీలకు చెందిన ప్రధాన నేతలు తమ స్వార్థం కోసం గ్రామాన్ని రెండుగా చీల్చారు. చివరకు గ్రామంలో ఫ్యాక్షన్‌కు బీజం పడింది. హత్యలు, గృహ.. గడ్డివాముల దహనాలు, ఆస్తుల విధ్వంసం, బాంబుల మోతతో గ్రామం అట్టుడికిపోయింది. వేటకొడవండ్ల స్వైర విహారానికి నెత్తురు ఏరులై పారింది. పచ్చని పంట పొలాలు బీళ్లుగా మారాయి. రిమాండ్ పేరుతో జైళ్లల్లో కుమిలిపోయారు. కేసు వాయిదాలకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసుకుని తిరిగారు. దాడులు, ప్రతిదాడుల నుంచి ఎలా రక్షించుకోవాలలో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. పిల్లల చదువులు అటకెక్కాయి.

కరివేపాకు సాగుతో మార్పు

ఫ్యాక్షన్ ప్రభావంతో అట్టుడికిపోతున్న సమయంలో యర్రగుంటపల్లిలోని భూములను గుంటూరుకు చెందిన కొందరు రైతులు గుత్తకు తీసుకుని కరివేపాకు సాగు చేపట్టారు. అప్పటి వరకూ వర్గ కక్షలతో నలుగుతూ పంటల సాగుపై సరైన దృష్టి సారించలేక ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న స్థానికుల చూపు కరివేపాకు సాగుపై పడింది. గుంటూరు ప్రాంత రైతులు లాభాలు గడిస్తుండడంతో ఒక్కసారిగా గ్రామ రైతులందరూ కరివేపాకు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వర్గ కక్షలకు స్వస్తి పలికి కరివేపాకు సాగుపై దృష్టి సారించారు. దీంతో చూస్తుండగానే ఫ్యాక్షన్ మటుమాయమైంది. అప్పటి వరకూ కత్తులు దూసుకున్న వారు బంధుత్వ వరుసలు కలుపుకుని ఆప్యాయంగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. ఒకరి తర్వాత ఒకరు చొప్పున పంటల సాగుపై మనసు పెట్టడంతో 800 ఎకరాల్లో కరివేపాకు సాగు అందుబాటులోకి వచ్చింది. తొలుత యర్రగుంటపల్లికి మాత్రమే పరిమితమైన కరివేపాకు పంట ఆ తర్వాత ఇతర మండలాలకు విస్తరించింది. ప్రస్తుతం పెద్దపప్పూరు మండలంలో 780 ఎకరాలు, యాడికి మండలంలో 100 ఎకరాలు, పుట్లూరు మండలంలో 50 ఎకరాల్లో కరివేపాకు సాగులో ఉంది. యర్రగుంటపల్లికి చెందిన కొందరు రైతులు గుంతకల్లు మండలంలో పొలాలను లీజుకు తీసుకుని అక్కడ కూడా కరివేపాకు సాగు చేపట్టారు. రైలు మార్గంలో ముంబయి, చెన్నై నగరాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా...



ఆధిపత్య పోరుతో ఫ్యాక్షన్‌కు బీజం పడి గ్రామం రెండు వర్గాలుగా విడిపోయింది. ఫ్యాక్షన్ కారణంగా సర్వమూ కోల్పోయాను. పేదరికంతో కొట్టుమిట్టాడాను. పిల్లలను చదివించుకోలేక పోయా. ఆ సమయంలో గుంటూరు ప్రాంతంలోని వడ్లపూడికి చెందిన రైతులు మా గ్రామంలోని భూములను గుత్తకు తీసుకుని కరివేపాకు సాగు చేపట్టారు. దీంతో కరివేపాకు సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. అయితే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నా భార్యకు వివాహ సమయంలో పుట్టింటి వారు తాడిపత్రిలో ఇచ్చిన స్థలాన్ని అమ్మగా వచ్చిన డబ్బుతో గ్రామంలో ఐదు ఎకరాల పొలం కొనుగోలు చేసి, కరివేపాకు సాగు చేపట్టాను. లాభాలు రావడంతో ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించాను. ప్రస్తుతం నా కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కరివేపాకు పంట నా ఒక్కడి జీవితాన్నే కాదు గ్రామంలో అందరి జీవితాలను మార్చింది.

– సూర్యనారాయణ, యర్రగుంటపల్లి

పతాక స్థాయికి ప్రచార పిచ్చి

ఆస్పత్రుల్లో సూపర్ జీఎస్టీ కార్యక్రమం నిర్వహణ
జనాలను తీసుకురావాలని సిబ్బందిపై ఒత్తిడి

సాక్షి, అమరావతి: ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వాస్పత్రులను కూటమి ప్రభుత్వం ప్రచారానికి వేదికలుగా మార్చేసింది. వ్యాధులు, జబ్బుల వ్యాప్తి, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేయాల్సిన సిబ్బందిపై ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు చేయాలంటూ ఒత్తిడి చేస్తోంది. జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అన్ని శాఖలను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలంటూ వైద్య శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాల యంత్రాంగాలకు హుకుం జారీ చేశారు. ఈ ఆదేశాలను అమలు చేయడంలో భాగంగా ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు జనాలను తరలించాలని ఆశా వర్కర్‌లు, ఏఎన్‌ఎంలపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. గురువారం పీహెచ్‌సీల్లో నిర్వహించే పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమానికి గర్భిణులతో పాటు, వారి సహాయకుల కింద ఒకరిని అదనంగా ఆస్పత్రికి తీసుకురావాలని ఆశ, ఏఎన్‌ఎంలకు ఆదేశాలిచ్చారు. ప్రతి నెల 9న పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ రోజున పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సాయం అందిస్తారు. కాగా, ఈ కార్యక్రమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది ప్రభుత్వ ప్రచారంపై దృష్టి పెట్టాల్సి వస్తోందని వైద్య సిబ్బంది అంటున్నారు. గత నెల 26 నుంచి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఇప్పటికే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అనారోగ్య బాధితులకు నాడి పట్టే నాథుడే లేకుండా పోయారు. సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా, బోధనాస్పత్రులకు వచ్చే రోగులకు కూడా జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించాలని సూచించడంతో రోగులకు వైద్యం చేయాల్సిన తమతో ప్రచారాలు చేయించడం ఏంటని వైద్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



నర్సాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యులు తయారు చేసిన పోస్టర్



పశ్చిమగోదావరిలో ఆశ, ఏఎన్‌ఎంలకు అధికారులు పెట్టిన మేసేజ్

అడవిలో అగ్నిశిఖ



బండినాయిని పాలెం గ్రామ సమీపంలోని పొలాల్లో వికసించిన అగ్నిశిఖ మొక్క

ఆయుర్వేద వైద్యంలో అడవి నాభిగా ప్రసిద్ధి చెందిన అగ్నిశిఖ మొక్కలు నల్లమలలోని కనువిందు చేస్తున్నాయి. కర్నూలు జిల్లా కొత్తపల్లి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం, గువ్వలకుంట్ల, పాలెంచెరువు, బండినాయిని పాలెం సమీపంలోని వరి పంట పొలాల్లో, ఆత్మకూరు మండలంలోని కొట్టాల చెరువు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మొక్కలు విరివిగా ఉన్నాయి. దీనినే నాగేటిగడ్డ, నీరుపిప్పిలి మొక్క అని పిలుస్తుంటారు. ఈ తీగ జాతి మొక్క పక్కనున్న మొక్కలను ఆధారం చేసుకుని పైకి ఎగబాకుతుంటాయి. ఈ పుష్పాలు ఎరుపు, నారింజ, తెలుపు, పసుపు రంగుల కలబోతగా దర్శనమిస్తాయి. ఈ పుష్పాలను ఆయుర్వేదంలో దివ్య ఔషధంగా భావిస్తారు. దీని కాండం, ఆకులు, విత్తనాలు, పండ్లు, పూలు, దుంపలన్నీ విషపూరితం. పాము కాటు, తేలు కాటుకు విరుగుడుగా, పలు రోగాల నివారణగా ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైద్యుల సూచనలు, సలహాల మేరకు వాడుకోవాలని చెబుతున్నారు.

– కొత్తపల్లి



● పర్వం

ఆరోగ్యం... ఆనందం.. ఆచారం

అట్లతద్దె

ఆశ్వయుజ మాసం వచ్చిందంటే తద్దెనోము నోచని పల్లెపడచులు తెలుగు నాట ఉండరంటే అతిశయోక్తి కాదు. పల్లెటూళ్లలో అయితే యువతీ యువకులందరూ అట్లతద్దె ఎప్పుడు వస్తుందా అని కాచుకుని కూచుంటారు. ఇంతకీ ఈ అట్ల తద్దెనోము ముందుగా ఎవరు నోచారో, వారికి కలిగిన ఫలమేమిటో తెలుసుకుంటూ, ఆ నోము నోచే విధానం కూడా చెప్పుకుందాం.

‘అట్లతద్దోయ్ ఆరట్లోయ్, ముద్దపప్పోయ్ మూడట్లోయ్’ అంటూ ఆడపడుచులకు, బంధువులకు, ఇరుగు పొరుగువారికి అట్లు వాయనంగా ఇవ్వటం ఆచారం. సాయంత్రం వాయనాలు, నైవేద్యాలు పూర్తిచేసుకుని గోమాతను పూజిస్తారు. అక్కడ నుంచి దీపాలను వదలడానికి చెరువులు, కాలువల దగ్గరకు వెడతారు. అన్నీ పూర్తయిన తరవాత చెట్టుకు ఉయ్యాలలు కట్టి ఊగుతారు.

ఈ నోము ఇందుకోసం

ఆశ్వయుజ బహుళ తదియనాడు చేసుకునే ఈ పూజ ప్రధానంగా చంద్రుని ఆరాధనకు సంబంధించినది. చంద్రకళల్లో కొలువై ఉన్న శక్తి అనుగ్రహం చేత స్త్రీ సౌభాగ్యం పెరుగుతుందని, కుటుంబంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని శాస్త్రం చెబుతోంది. ఈ నోములో అమ్మవారికి అట్లు నైవేద్యంగా పెట్టడంలో ఒక అంతరార్థం ఉంది. నవగ్రహాలలో ఒకడైన కుజునికి అట్లంటే ప్రీతి. వీటిని ఆయనకు నైవేద్యంగా పెడితే కుజుని వలన కలిగే దోషాలు పరిహారమై, సంసారసుఖంలో ఎటువంటి అడ్డంకులు రావనేది ఒక విశ్వాసం. అంతేకాక కుజుడు రజోదయానికి కూడా కారకుడు కనుక ఋతుచక్రం సరిగా ఉంచి ఋతుసమస్యలు రానివ్వకుండా కాపాడతాడు. అందువల్ల గర్భధారణలో ఎటువంటి సమస్యలుండవు. మినుముల పిండి, బియ్యప్పిండి కలిపి అట్లను తయారుచేస్తారు. మినుములు రాహువుకి, బియ్యం చంద్రునికి









సంబంధించిన ధాన్యాలు. గర్భదోషాలు పోవడం కోసం, గర్భస్రావం కాకుండా సుఖప్రసవం అయ్యేందుకు ముత్తయిదువులకు అట్లను వాయనంగా ఇస్తారు. అట్లతద్దిలో ఇంతటి వైద్య విజ్ఞానం ఉంది. ఈ పండుగను ఉత్తరభారతదేశంలో కరవా చౌత్ అనే పేరుతో జరుపుకుంటారు.

వ్రతవిధానం: ఈ రోజు తెల్లవారుఝామునే స్త్రీలు మేల్కొని స్నానం చేయాలి. పగలంతా ఉపవాసం ఉండాలి. ఇంట్లో తూర్పుదిక్కున గౌరీదేవికి మంటపం ఏర్పాటు చేయాలి. ధూప, దీప, నైవేద్యాలు పెట్టి ముందుగా గణపతిపూజ చేయాలి. పిదప శాస్త్రోక్తంగా గౌరీదేవికి పూజచేసి, ఆ తరవాత గౌరీ స్తోత్రం, శ్లోకాలు చదవడంతో పాటు, పాటలు పాడాలి. సాయంత్రం చంద్రదర్శనం అయిన తరవాత శుచిగా స్నానం చేసి మళ్లీ గౌరీపూజ చేయాలి. 11 అట్లు నైవేద్యంగా పెట్టాలి. ముత్తయిదువులకు అలంకారం చేసి 11 అట్లు, 11 ఫలాలు వాయనంగా ఇచ్చి అట్లతద్ది నోము కథ చెప్పుకుని అక్షతలు వేసుకోవాలి. పేరంటానికి వచ్చిన ముత్తయిదువులకు నల్లపూసలు, లక్కకోళ్లు, రవికలగుడ్డలు, దక్షిణ తాంబూలాలు ఇచ్చి భోజనాలు పెట్టి, తామూ భోజనం చేయాలి. 11 రకాల ఫలాలను తినడం, తాంబూలం వేసుకోవడం, 11 సార్లు ఊయల ఊగడం, గోరింటాకు పెట్టుకోవడం, ఇందులో విశేషం. (ఈ సంఖ్య ఇంటిని బట్టి, ప్రాంతాలను బట్టి మారచ్చు).

ఇవన్నీ చేయడం వలన గౌరీదేవి అనుగ్రహం లభిస్తుందని, కన్యలకు గుణవంతుడైన భర్త లభిస్తాడని, పెళ్లయిన వారికి పిల్లలు కలుగుతారని, ఐదవతనంతో పాటు పుణ్యం లభిస్తుందని నమ్మకం.

అట్లతద్దెలో ఆరోగ్యం

ఇది కన్నెపిల్లలంతా ఎంతో సంతోషంగా చేసుకునే పండుగ. తెల్లవారు ఝామునే లేవటం, పిల్లలతో కలిసి ఆడుకోవటం, పేరంటం చేస్తూ అందరితో సరదాగా ఉండటం పిల్లలకు అలవాటవుతాయి.

చలికాలం దగ్గర పడే సమయం కావడంతో పొద్దున్నే లేవలేకపోతారు. ఈ పండగ కారణంగా ఉత్సాహం కొద్దీ ఉదయమే లేవడం అలవాటు చేసుకుంటారు. అలాగే చలి నుంచి శరీరానికి వేడి పుట్టే ఆహారం కూడా ఆ రోజున తీసుకోవడం వల్ల ఆరోగ్యపుష్టికి దోహదపడుతుంది. నువ్వుల పొడి, గోంగూర పచ్చడి, పెరుగు వంటివి శరీరానికి వేడి చేస్తే ఉల్లిపాయపులుసు చలవ చేస్తుంది. అంతేకాక అన్నీ చద్దివి తినడం వల్ల అరగదనే భయం కూడా లేకుండా తాంబూల సేవనం కూడా జరుగుతుంది. ఈ పండుగ ఆనంద, ఆరోగ్యాలను కలుగచేస్తుంది. ఆటపాటల వల్ల పిల్లలకి మంచి వ్యాయామం కూడా అవుతుంది.

(నేడు అట్ల తద్ది)

గౌరీదేవి శివుని పతిగా పొందాలనే కృత నిశ్చయంతో ఉందని త్రిలోక సంచారి అయిన నారదుడు తెలుసుకున్నాడు. ఆమె కోరిక ఫలించాలంటే అట్లతద్ది వ్రతం చేయమని నారదుడు సూచించాడు. ఆయన ప్రోద్బలంతో పార్వతీదేవి చేసిన వ్రతమే అట్లతద్ది. ఇది స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే వ్రతం కన్నెపిల్లలు పడుచువాణ్ణి పతిగా పొందాలనుకుంటే తప్పక ఆచరించవలసిన వ్రతమిది.

అసలైన అనుసరణ

బుద్ధుడు అనారోగ్యం పాలయ్యాక ‘ఇక నేను ఎక్కువకాలం జీవించలేను’ అని ప్రకటించాడు. దాంతో ధర్మంలో పరిపూర్ణత సాధించలేకపోయినవారు ఆవేదన చెందారు. ‘అంత గొప్ప మానవీయ ధర్మాన్ని ప్రబోధించిన బుద్ధుడు ఇక మనకు ఆట్టే కాలం కనిపించడా?’ అని కలవరపడ్డారు. ఇక తాము చేయాల్సిన విధులన్నీ దాదాపుగా మాని ఆయన వెంటే పడి తిరుగుతూ ఉండేవారు. ఆయనకు సేవ చేయడానికి పోటీపడేవారు. ఆ మహనీయుని సేవలో గడపడం గొప్ప కార్యంగా భావించేవారు.

వారిలో అత్తదత్తుడు అనే వాడు మాత్రం బుద్ధుని చూడ్డానికీ, సేవకూ ఎప్పుడూ రాలేదు. బుద్ధుని విషయం తెలిసినప్పటినుంచి బుద్ధుని దగ్గరకు రావడమే మానుకున్నాడు. నిరంతరం ధ్యాన సాధనలో లీనమై పోయి ఉండేవాడు.

ఒకరోజున భిక్షువులందరూ అతని మీద నింద మోపి బుద్ధుని ముందుకు తీసుకొచ్చి- ‘భగవాన్! చూశారా! మేమందరం మీ వెంతే ఉంటున్నాం. ఈ అత్తదత్తుడు మాత్రం ఈ ఛాయలకే రావడం లేదు’’ అని చెప్పారు. ‘‘భిక్షూ! వీరి ఆరోపణ నిజమేనా? నీవు ఏం చేస్తున్నావు?’’ అని అడిగాడు బుద్ధుడు చిరునవ్వుతో.



‘‘నిజమే భగవాన్! నేను ధ్యానంలో పరిపూర్ణత సాధించలేదు. అర్హంతుడను కాలేదు. మీరు జీవించి ఉండగానే నేను అర్హంతుడను కావాలని నిశ్చయించుకున్నాను. అందుకే నిరంతరం ఆ మార్గంలోనే ఉంటున్నాను’’ అని చెప్పాడు. అప్పుడు బుద్ధుడు- ‘‘భిక్షువులారా! అత్తదత్తుడు చెప్పిందే సత్యం. మీరు ధర్మాన్ని అనుసరించడమ అంటే నన్ను అనుసరించడం కాదు. నా మార్గాన్ని అనుసరించడం. అర్హంతులు కావడం ఇకనైనా మీరు అర్హంత సాధనకు మళ్లండి’’ అని ప్రబోధించాడు.

మిగిలిన భిక్షువులు అత్తదత్తుణ్ణి అనుసరించారు. వ్యక్తి మీద గౌరవం చూపడం కంటే ఆ వ్యక్తి నిర్దేశించిన మార్గంలో పయనించడమే అసలైన ఆదర్శం అని తెలియజెప్పే ఈ కథ ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినది, అనుసరించవలసిందీనూ.

(అర్హంతుడు -అర్హుడు, అర్హంత- అర్హత)

– డా. బొర్రా గోవర్ధన్



దేశంలో మరెక్కడా లేని విధంగా ఒకే పానవట్టం పై అయిదు లింగాలు వెలసిన దివ్యధామం కర్నూలులోని పంచలింగాల క్షేత్రం. పరీక్షిన్మహారాజు కుమారుడు జనమేజయుడి చేతుల మీదుగా ప్రతిష్ఠితమైన ఈ ఆలయ సందర్శనం సర్పదోషాలను పరిహరించడంలో ప్రసిద్ధి గాంచింది.


సర్పదోషాలను పరిహరించే పంచలింగాల క్షేత్రం

స్థల పురాణం ఏం చెబుతోందంటే... పూర్వం సర్పయాగాన్ని నిర్వహించిన జనమేజయ మహారాజు సర్పదోష నివారణ కోసం దేశ నలుమూలల కోటి లింగాలను ప్రతిష్ఠించారు. ఆ కోటి లింగాలలో చిట్టచివర ప్రతిష్ఠించినదే ఈ పంచలింగాల క్షేత్రం. ఇక్కడ జనమేజయుడు అనేకమంది యోగులు, మంత్ర సిద్ధుల చేత పంచలింగాలను ప్రతిష్ఠించి సర్పదోషం నుండి విముక్తి పొందినట్టుగా గంగా పురాణంలో ప్రస్తావించబడినది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఈ ఆలయం విరూపాక్ష ముఖ ద్వారంగా విలసిల్లింది. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయులు దర్శించారని అక్కడి ఆలయం ముందు ఉండే శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ శాసనాలలో విజయ నగర సామ్రాజ్యానికి సంబంధించిన చిహ్నాలు కూడా నేటికీ కనిపిస్తాయి. రాయల సీమ కూడా ఈ ప్రాంతం నుండే ఆరంభం అయినట్టు ఇక్కడ లభించే శిలాశాసనాల ద్వారా తెలియవస్తుంది. ఈ ఆలయంలో శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ప్రతిష్ఠించబడిన వీరభద్రుడు, సకల కోరికలు తీర్చేటువంటి చాముండి మాతను కూడా మనం దర్శించుకోవచ్చు. ఇంకా ఈ ఆలయం చుట్టు అనేక శివాలయాలు వెలిశాయి. కానీ కాలక్రమేణా ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ గదాధరుడు అయినటువంటి గయా నారాయణుడిని కూడా దర్శించుకోవచ్చు.

పూర్వం ఈ క్షేత్రాన్ని దక్షిణ గయగా కూడా పిలిచేవారట. ఈ క్షేత్రాన్ని దర్శించిన భక్తులకు సర్పదోషం, నవగ్రహ దోషం, మృత్యుదోషం, కుజ దోషం వంటి అనేక దోషాలు కూడా నివృత్తి అవుతాయని ఆలయ అర్చకుడు తెలిపారు. ఆలయానికి తూర్పు ముఖంగా ప్రవహిస్తున్న తుంగాతీరాన్ని ఆనుకుని వెలసిన ఈ క్షేత్రం ప్రముఖ శైవ క్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయాల నిర్వహణ బాధ్యతలను ప్రస్తుతం దేవాదాయ శాఖ వారు చూస్తున్నారు.

పంచభూతాల స్వరూపమే పంచలింగాల

ఆకాశం, గాలి, నీరు, నిప్పు, వాయువు, భూమి ఈ పంచభూతాల స్వరూపమే ఇక్కడి పరమశివుడి స్వరూపంగా భక్తులు భావిస్తారు. ఇక్కడి ఆలయం ఎంతో ప్రశాంతంగా ఉండి భక్తుల మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ఎంతోమంది ఋషులు ఇక్కడ తపస్సు ఆచరించి పరమశివుడి అనుగ్రహాన్ని పొందినట్టు ఆలయ పండితులు, చారిత్రక పరిశోధకులు చెబుతున్నారు.





ఎలా వెళ్లాలంటే..?

కర్నూలు నుంచి కేవలం 5కి.మీ దూరంలో ఈ పంచలింగాల గ్రామం ఉంది. తుంగభద్ర నది తీరాన్ని ఆనుకుని ఈ గ్రామం ఉంది. ఈ ప్రాంతానికి సమీపంలో కాల్వబుగ్గ బుగ్గరామలింగేశ్వర స్వామి క్షేత్రం ఉంటుంది. అలాగే కర్నూలులో కొండారెడ్డి బురుజు, కొమ్మచెరువు ఆంజనేయ స్వామి ఆలయం, సమీపంలో అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయాలు చూడదగ్గ సందర్శనీయ ప్రదేశాలు.

● నిర్మల వాణి

మూడు నాడులు

మన శరీరంలోని అంతర్గత సూక్ష్మ నాడీ వ్యవస్థలో ఆరోగ్యాన్ని సంరక్షించే ఇడ, పింగళ, సుషుమ్న నాడులు, అలాగే వాటికి అనుసంధానంగా ఉన్న మూడు గ్రంథులు బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంథుల పాత్ర చాలా కీలకమైనది. ఇవి శారీరకంగా, ఆధ్యాత్మికంగా చాలా విధులు నిర్వహిస్తాయి. ఈ నాడులు, గ్రంథులు శ్రీ లలితా సహస్ర నామాలలో ప్రస్తావింపబడ్డాయని మనకు తెలుసు.

మానవ శరీర సూక్ష్మ వ్యవస్థలో కుండలినీ జాగతి, చైతన్యం ద్వారా వ్యక్తీకరింపబడుతుంది. కాని ఆ దైవిక శక్తి మానవులలో నిర్మితమై ఉన్నంతమాత్రాన అది అన్ని సమస్యలను అన్నివేళలా పరిష్కరించాలని ఏమీ లేదు.



మానవుల స్వభావాన్ని, తీరును బట్టి, వారు మూడువిధాలైన చిక్కు సమస్యలలో ఉంటారు. మానవులుగా జన్మించినప్పటినుండి వారిలో ఈ మూడు చిక్కుముడులు ప్రారంభమవుతాయి. మనం తెలుసుకోవలసినది ఏమిటంటే, అటువంటి చిక్కులనుండి బయటపడాలంటే మీరు ఆ చిక్కులకున్న ముడులను తప్పక ఛేదించుకోవాలి. ఆ ముడులను సంస్కృతంలో గ్రంథులు అని అంటారు. ఆ ముడులే మీకు అసంబద్ధమైన, అసత్యమైన భ్రమలను కలిగిస్తాయి. లలితా సహస్ర నామాలలో లలితాదేవిని బ్రహ్మ గ్రంధి విభేదిని, విష్ణు గ్రంధి విభేదిని, రుద్ర గ్రంధి విభేదిని అని స్తుతించడం జరిగింది.

ఈ ప్రపంచంలో ప్రతిదీ శాస్త్రీయంగా ఏర్పడినదనీ, అలాగే మనకు కనిపించే, లేదా కనిపించని ప్రతి విషయమూ వాస్తవం కాదు. కేవలం అపోహ మాత్రమే. మీరు సత్యం తెలుసుకోనంత వరకు అటువంటి అసత్యమైనవి నమ్ముతుంటారు. అసలు భగవంతుడు అంటే ఎవరు? ఈ మతాలన్నీ ఏమిటి? అవి బోధిస్తున్నదేమిటి? మీరు ఎల్లప్పుడూ అటువంటివాటిని గురించిన అసత్యమైన వాటినే నమ్ముతుంటారు. సత్యమైన దానికంటే అసత్యమైన దాని వైపు ఎక్కువగా మొగ్గు చూపుతారు. ఒకవేళ మీరు సత్యసాధకులుగా, సత్యాన్వేషణ కాంక్షతో జన్మించినప్పుడు మీరు అసత్యానికి అతీతంగా ఏదైనా ఉందేమోనని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. అతీతమైనది మరేదో ఉందని, ఏదో జరగవలసి ఉందని మీరు అర్థం చేసుకుంటారు. అయినప్పటికీ, మీరు జీవితంలో ఇంకా ఆ మూడు చిక్కు సమస్యల వలయంలో చిక్కుకుని ఉంటారు. ఆ మూడు గ్రంథుల సమస్యల వలయంలో పడి మనం ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగానే చూస్తాము. ఎందుచేతనంటే మనకు ఇంకా యథార్థం తెలియదు కనుక. యథార్థం తెలియకపోవటమే అసలు సమస్య.

(ఆ మూడు నాడుల గురించి వచ్చేవారం)

– డాక్టర్ పి. రాకేష్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ ప్రవచనాల ఆధారంగా)

● సువార్త

ప్రేమించడం ఒక కళ



‘నేను నిన్ను ప్రేమించడం కల’ అంది ఆమె కోపంగా అరుస్తూ.

‘ప్రేమించడం ఒక కళ’ అన్నాడు అతను నింపాదిగా నవ్వుతూ.

అతనిలోని నిండైన ఆత్మ విశ్వాసాన్ని ఆమె గమనించలేదు. నిర్లక్ష్యంగా చిన్న చూపు చూసింది.

కట్ చేస్తే–

తనదైన ప్రేమతో ఆమె కళ్ళు తెరిపించాడు.

ఇంకేముంది?! ‘నిన్ను ప్రేమించకుండా ఇక నేను ఉండలేను’ అంది.

అతడి సానుకూల శక్తి, ప్రేమ, వ్యూహాలకు ఆమె తలవంచక తప్పలేదు.

నా కలలో కూడా నిన్ను ప్రేమించను అందామె.

నా కలలో కూడా ఇది జరగదంటివే అన్న ఆమె తిరస్కృతిని సవాలుగా స్వీకరించి విధేయతతోనే అతడు అరితేరిన నిశ్శబ్ద విజయుడయ్యాడు.

అపజయాల పాలిట అనుకూలంగా స్పందించేలా ఇలా ఆరోజే ఆత్మ సంబంధ ప్రేమికులకు సరికొత్త బాట సిద్ధం చేసి ఏర్పరిచాడు. తలవంచిన వినమ్రతతోనే తప్ప అనుకూల ఆలోచనలు, శరీర భాష ద్వారా అవి బయటపడే చేష్టలతో ప్రేమను సాధించడం అసాధ్యం.

•••

పైన ‘అతడు’గా చెప్పబడిన ఆయన పేరు ‘యేసు క్రీస్తు’. ‘ఆమె’ పేరు సర్వ మానవాళిగా చెప్పబడే ‘సంఘమనే స్త్రీమూర్తి’. ప్రేమలోని తెగువ ప్రదర్శన మానవాళిని అలరిస్తుంది. ‘వధువు సంఘము’ అనే తన ప్రియురాలిని అమితంగా ప్రేమించి ఆమె కోసం బాహటంగా చేతులు చాచి అసాధారణ రీతిలో ఆయన చేసిన కంటికింపైన చేతలపరమైన దృశ్య ప్రధాన సాహసాలు కడు రమణీయం.

వారపు ప్రప్రథమ దినమైన ఆదివారపు ఆరాధనలో, మరీ ముఖ్యంగా ఆరాధన ముగిశాక ఎక్కడ పడితే అక్కడ ఇదే చర్చ జరుగుతుంటుంది. యేసు సిలువ ప్రేమ గూర్చి ఒక్క మాటలో చెప్పాలంటే, యేసు ప్రేమించే కళకు ప్రాణంపోసి చరిత్రకెక్కాడు. యేసు ప్రేమ గాథ మరణంతో ముగించబడలేదు. ఈ యావత్ విశ్వంలోనే దీన్ని మించిన విజయ ప్రేమగాథ మరొకటి ఎక్కడా మనకు కనబడదు.

ప్రేమలో యేసు కనబరచిన నైపుణ్యం అసాధారణం. ఆయన ప్రేమ తిరుగులేనిది. అది ఎన్నడూ అపజయం ఎరుగదు. ప్రమాదాలను పసికట్టి ఆహ్వానిస్తూ సృజనాత్మకంగా సాహసించడం ఎలాగో అనగా ఉన్నతంగా వైవిధ్యంగా ప్రేమించడం అనేది యేసు వద్దనే మనం నేర్చుకోగలుగుతాము. ఆత్మ సంబంధ ప్రేమ పాఠాలు యేసు వద్ద నేర్చుకొంటేనే పరమార్థం దిశలో ఈ జీవితాన్ని సార్థకం చేసుకోగలిగే ప్రేమకళలో మెరుగ్గా రాణించ గలుగుతాము.

తనదే సరియైన మార్గం అనునదే క్రీస్తు వైవిధ్య బోధనావిధానం. నిజమే, ఇందులో ఎలాంటి అనుమానం లేదు. మన అజ్ఞానం గూర్చి ఆయనకు బాగా తెలుసు. మనం కాదు అంటే ఆయన ఔను అంటాడు. మనం ఔను అంటే ఆయన కాదు అనగల సమర్థుడు. ఎందుకంటే ఆయన భవిష్యత్ ఎరిగినవాడు గనుక! ఊహించని రీతులలో ఆయన ప్రేమ ఎప్పుడూ మనలను కట్టిపడేస్తుంటుంది. ఏవిధంగానైనా మనలను ఒప్పించి తన దారికి తెచ్చుకోవడానికి ఆయన ఎంతకైనా తెగిస్తాడు అన్న ఆయన సమర్థతే సిలువ ప్రేమ. మన మనో నేత్రాలు వెలిగించబడి ఈ వాస్తవం తెలిశాక మనం ఔను అన్న మాటతో పాటు మేము నిన్ను ప్రేమించకుండా ఇక ఉండలేము అని చెప్పక తప్పని పరిస్థితి మనదే.

– జేతమ్

● ఇస్లాం వెలుగు

సాకులు వెతికితే సానుకూలత రాదు

అల్లాహ్ స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చు పెడుతున్నందువల్ల పురుషులు స్త్రీలపై వ్యవహార కర్తలవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడుచుకుంటారు. పురుషులు ఇంటిపట్టున లేనప్పుడు దేవుని రక్షణలో వారి హక్కులు కాపాడుతుంటారు. మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయం ఉన్న స్త్రీలకు నయానా భయానా నచ్చజెప్పండి. అంతేకాని వారిని వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన అల్లాహ్ ఉన్నాడని గుర్తుంచుకోండి.



వివరణ: భార్య విననప్పుడు నచ్చజెప్పడం (2) పడకగదికి దూరంగా ఉండటం (3) విధేయత కనబరిస్తే ఆమెను మనసారా స్వీకరించడం (4) కొట్టడం అంటే కర్ర తీసుకొని బాదడం కాదు రక్తం చిందించేలా హింసించడం కాదు.

ఎలాంటి పరిస్థితుల్లోనూ భార్య ముఖం మీద కొట్టకూడదని, శరీరం కందిపోయేలా నిర్దయగా కొట్టకూడదని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. ఏమైనా ఆయన భార్యని కొట్టే వారిని అభిమానించేవారు కాదు.

35 వ ఆయత్ (వాక్యం)లో అల్లాహ్ ఎంతోమంచి పరిష్కారం చూపాడు. భార్యాభర్తల మధ్య పొసగనపుడు అటువైపు నుండి ఒక మధ్యవర్తి ఇటు వైపు నుండి ఒక వ్యక్తి మధ్యవర్తిత్వం వహించి వారిద్దరి మధ్య సమాధానం కుదిరిస్తే ఆ దంపతులు కూడా సమాధాన పడితే ఇద్దరి మధ్య అల్లాహ్ సానుకూలత కలిగిస్తాడు.

మనిషికి దేవుడు మంచి చెడుల విచక్షణ జ్ఞానం, స్వేచ్ఛ స్వాతంత్రాలు ఇచ్చాడు. కాబట్టి వాటిని ఆయన అడ్డుకోకుండా స్వయంగా మనిషి సంకల్పించుకుంటే అల్లాహ్ దానిని పరిపూర్ణం చేస్తాడు. ఏ విషయంలోనూ ఎవరికీ బలవంతం పెట్టడు. మనిషి విచక్షణను బట్టి అల్లాహ్ ఆ మనిషితో వ్యవహరిస్తాడు. కాబట్టి మనుషుల మైన మనం మంచిని ఆలోచిస్తూ మంచినే కాంక్షిస్తూ మంచి చేస్తుంటే దేవుడు కూడా సహకరిస్తాడు. అంతా మంచే జరుగుతుంది అల్లాహ్ మనందరినీ మంచి చేసే భాగ్యాన్ని కలుగజేయుగాక ఆమీన్ (తథాస్తు)

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సాక్షి ప్లస్
గురువారం । 9-10-2025

బిజినెస్ రీల్

హోండా మోటార్‌సైకిల్ లాభం జూమ్

2024-25లో రూ. 3,727 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నికర లాభం గతేడాది (2024-25) 38 శాతం జంప్‌చేసి రూ. 3,727 కోట్లకు చేరింది. ఇది గత ఐదేళ్లలోనే అత్యధికంకాగా.. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం అంతక్రితం ఏడాది (2023-24)లో రూ. 2,705 కోట్లు మాత్రమే ఆర్జించింది. నిర్వహణ ఆదాయం సైతం 23 శాతం ఎగసి రూ. 39,238 కోట్లను తాకింది. అంతక్రితం రూ. 31,945 కోట్ల టర్నోవర్ సాధించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. జపనీస్ ఆటో రంగ దిగ్గజం హోండా మోటార్‌కు చెందిన దేశీ అనుబంధ అన్‌లిస్టెడ్ సంస్థ ఇది. ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ (ఎఫ్ఏడీఏ) వివరాల ప్రకారం గతేడాది రిటైల్‌గా 1,88,77,812 ద్విచక్ర వాహనాలు విక్రయమయ్యాయి. వీటిలో హోండా మోటార్‌సైకిల్ రిటైల్ అమ్మకాలు 47,89,283 యూనిట్లుగా నమోదయ్యాయి. వెరసి హీరో మోటోకార్ప్(54,45,251 యూనిట్లు) తదుపరి ద్వితీయ ర్యాంకులో నిలిచింది. కాగా.. 2030కల్లా దేశీ ద్విచక్ర వాహన మార్కెట్లో 30 శాతం వాటాపై హోండా మోటార్‌సైకిల్ కన్నేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి.

హైదరాబాద్‌లో అవాంటెల్ రెండో యూనిట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థ అవాంటెల్ తాజాగా హైదరాబాద్‌లో తమ రెండో ప్లాంటును ప్రారంభించింది. ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ డైరెక్టర్ సిద్ధార్థ అబ్బూరి తెలిపారు. రూ. 56 కోట్ల పెట్టుబడితో 76 వేల చ.అ. విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇది ప్రధానంగా సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోస్ (ఎస్‌డీఆర్), రాడార్ సిస్టమ్స్ డిజైన్, తయారీ, ఉపగ్రహాల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ (ఏఐటీ)కి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 300 పైగా ప్రత్యక్షంగా, 1,000కి పైగా పరోక్షంగా ఉద్యోగాల కల్పనకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-10-2025

విశాఖ	525-00
చిత్తూరు	528-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,565.00	4.29
INFY	1,492.00	2.3
TCS	3,031.50	1.94
HCLTECH	1,452.50	1.33
TECHM	1,456.10	1.2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	680.3	-2.54
M&M	3,425.00	-1.94
JIOFIN	304.7	-1.68
ULTRACEMCO	11,980.00	-1.67
BEL	403.6	-1.63

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,644
ఎన్ఎస్ఈ	89,603
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,44,038
ఎఫ్ఐఐ	+ 181
డీఐఐ	+ 329

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.73 (రాత్రి 11.30కు)	$ 61.73 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.41 (రాత్రి 11.30కు)	$ 65.45 (క్రితం ముగింపు)

భారత్ అభివృద్ధిని ఏ శక్తీ నిలువరించలేదు

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తాం: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ముంబై: భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, భూమిపై ఏ శక్తి దీన్ని అడ్డుకోలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దేశీ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఎన్నో చర్యలను ప్రభుత్వం తీసుకుందన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు అంతర్జాతీయ వాణిజ్య విస్తరణకు చేపడుతున్న చర్యలను ప్రస్తావించారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 6వ ఎడిషన్‌ను ఉద్దేశించి మంత్రి గోయల్ మాట్లాడారు. ''నేడు ప్రపంచం భారత్‌ను విశ్వసిస్తోంది. అత్యున్నత నాణ్యమైన నిపుణులు, వస్తు, సేవలకు భారత్ హామీ ఇస్తోంది. 100 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాల నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుంది. టెక్నాలజీతో కలిసి సాగకుంటే ఇది సాధ్యం కాదు. 2047 నాటికి 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని భారత్ ఆకాంక్షిస్తున్నప్పుడు ఆర్థిక ప్రపంచంలో మన మిత్రులు తమదైన అంచనాలు వేసుకుంటారు. కానీ, ఇది సాధ్యమేనని మీరు చూస్తారు. మనందరం సమిష్టిగా ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉన్నాం''అని మంత్రి పేర్కొన్నారు. వినియోగంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను ఉరకలెత్తించేందుకు ప్రభుత్వం తన వంతుగా కీలక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ విదేశీ వాణిజ్యం విస్తరణకు కట్టుబడి ఉన్నట్టు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 4-5% మేర పెరుగుతాయన్న అంచనాను వ్యక్తం చేశారు.

భారత్, యూకే వాణిజ్య బంధం మరింత పటిష్టం



కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, బ్రిటన్ వాణిజ్య మంత్రి పీటర్ కైలే బుధవారం ముంబైలో సమావేశమై రెండు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యం, పెట్టుబడుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై సంప్రదింపులు నిర్వహించారు. ప్రధాని మోదీ ఈ ఏడాది జూలై పర్యటనలో భాగంగా రెండు దేశాలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడం తెలిసిందే. వీలైనంత త్వరగా ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుకుంటున్నట్టు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించిన రోజే ఈ భేటీ చోటుచేసుకోవడం గమనార్హం. ఒప్పందాన్ని సమన్వయంతో, వేగంగా అమలు చేయాలని నిర్ణయించినట్టు వాణిజ్య శాఖ ప్రకటించింది.

సౌర ఇంధనంలో మూడో స్థానానికి భారత్

- 125 గిగావాట్లకు చేరిన సామర్థ్యం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ: సోలార్ విద్యుదుత్పత్తి పరంగా భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంది. ఉత్పాదక సామర్థ్యం 125 గిగావాట్ల సామర్థ్యాన్ని అధిగమించినట్టు కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. అంతర్జాతీయ సోలార్ కూటమి (ఐఎస్ఏ) కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. ''కాప్28 అంగీకారం మేరకు ప్రపంచ పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యం మూడు రెట్లు పెరిగి 2030 నాటికి 11,000 గిగావాట్లకు చేరుకోవాలి. ఈ లక్ష్య సాధనలో సోలార్ విద్యుత్ అన్నది కీలక పాత్ర పోషిస్తుంది. నేడు 125 గిగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద సోలార్ విద్యుదుత్పత్తిదారుగా ఉంది'' అని మంత్రి తెలిపారు. దేశ ఆకాంక్ష క్షేత్రస్థాయిలో ఎంత ప్రభావం చూపించగలదన్నది దానికి ఈ పురోగతి నిదర్శనమని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజ్లీ యోజన పథకం కింద ఇప్పటికే 20 లక్షలకు పైగా గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వసతులు సమకూర్చినట్టు చెప్పారు. ఈ నెల 27 నుంచి 30 వరకు అంతర్జాతీయ సోలార్ కూటమి సదస్సు ఢిల్లీలో జరగనుంది. సోలార్ ఇంధన పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత్, ఫ్రాన్స్ సంయుక్తంగా ఐఎస్ఏని ఏర్పాటు చేయడం గమనార్హం.

సులభమైన ప్రోడక్టులను తీసుకురండి



- అందరికీ అందుబాటులో ఉండేలా చూడండి
- ఫిన్‌టెక్ సంస్థలకు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా సూచన

ముంబై: అందరూ సులభంగా ఉపయోగించగలిగే, అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రోడక్టులు, సర్వీసులను డిజైన్ చేయాలని ఫిన్‌టెక్ సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. సంపన్నులకు సర్వీసులు అందించడం లాభసాటి వ్యాపారమే అయినప్పటికీ, అంతగా సేవలందని వారిపైనా చిన్న కంపెనీలు దృష్టి పెట్టాలని చెప్పారు. తద్వారా ఆర్థిక సమ్మిళితత్వం సాధించేందుకు, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదిగేందుకు తమ వంతు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. 'కస్టమర్ల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, వారు సులభంగా ఉపయోగించగలిగేలా ఉత్పత్తులు, సర్వీసులను డిజైన్ చేయాలి. అవి అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. సీనియర్ సిటిజన్లు, డిజిటల్ అక్షరాస్యత అంతగా లేని వారు, దివ్యాంగులు కూడా ఉపయోగించగలిగేలా అసిస్టివ్ టెక్నాలజీలను పొందుపర్చాలి' అని మల్హోత్రా చెప్పారు. విశ్వసనీయత, నిబంధనలను పాటించడానికి భారతీయ ఫిన్‌టెక్‌లు అత్యంత ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ప్రతి ప్రోడక్టు, సర్వీసులోను వినియోగదారుల డేటా గోప్యతను పరిరక్షిస్తూ, పారదర్శకతకు పెద్ద పీట వేయాలని పేర్కొన్నారు.

గ్లోబల్ రేంజ్‌లో...

లోకల్‌గా ఉంటూనే గ్లోబల్ స్థాయిలో ఆలోచించాలని, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పని చేయాలని, ఉత్తమ విధానాలను అమలు చేయాలని మల్హోత్రా సూచించారు. ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ తారతమ్యాలను చెరిపివేయగలవని, నవకల్పనలకు ఊతమివ్వగలవని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సేవలను తక్కువ ఖర్చులతో భారీ స్థాయిలో అందించడాన్ని ఫిన్‌టెక్ సాధ్యం చేసిందని తెలిపారు. ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న డిజిటల్ మోసాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మల్హోత్రా తెలిపారు. ఈ దిశగా ఆర్‌బీఐ విభాగం రూపొందించిన మ్యూల్‌హంటర్ సొల్యూషన్‌ని ప్రస్తుతం 21 బ్యాంకులు ఉపయోగిస్తున్నాయని చెప్పారు. మోసగాళ్లు ఉపయోగించే ఖాతాలను ట్రాక్ చేయడంలో 90 శాతం సక్సెస్ రేటు ఉంటోందని తెలిపారు. కస్టమర్లను చేర్చుకునే ప్రక్రియలను, యూజర్ ఇంటర్‌ఫేస్‌లను మెరుగుపర్చేందుకు, డేటా భద్రతను పటిష్టం చేసేందుకు నిర్దిష్ట ప్రమాణాలను ప్రవేశపెట్టడంపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోందని మల్హోత్రా వివరించారు.

పదేళ్లలో 40 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..

గత దశాబ్దకాలంగా సుమారు 10,000 ఫిన్‌టెక్ సంస్థలు 40 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులను దక్కించుకున్నాయని మల్హోత్రా వివరించారు. రాబోయే రోజుల్లోనూ ఈ రంగం గణనీయంగా వృద్ధి చెందనుందని చెప్పారు. సుశిక్షితులైన టెక్నాలజీ నిపుణుల లభ్యత, చెల్లింపులు.. బీమా .. మొదలైన విభాగాలవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ క్రియాశీలకంగా ఉండటం ఫిన్‌టెక్‌లో కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతున్నాయని ఆయన చెప్పారు. ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు కూడా పరిశ్రమకు చేయూతనిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాయని మల్హోత్రా తెలిపారు. మరోవైపు, తాను కొన్నాళ్లుగా ప్రస్తావిస్తున్న 'ఫిన్‌టర్నెట్' వ్యవస్థ వచ్చే ఏడాది అందుబాటులోకి వస్తుందని ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నందన్ నీలేకని చెప్పారు. స్థలాలు, ప్రాపర్టీలు, బాండ్లు, ఆర్థిక పెట్టుబడులు మొదలైన అసెట్స్ అన్నీ ఒకే ప్లాట్‌ఫాంపైకి తెచ్చేందుకు, లావాదేవీలను సులభతరం చేసేందుకు ఉపయోగపడేలా ఇది ఉంటుంది.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి గోల్డెన్ పీకాక్ అవార్డు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియాకి 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక 'గోల్డెన్ పీకాక్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' పురస్కారం లభించినట్లు లభించింది. కార్పొరేట్ గవర్నెన్స్‌లో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్నందుకు గాను ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపింది. పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో కూడుకున్న వ్యా పార విధానాలను పాటించడంపై తమకున్న నిబద్ధతకు ఇది గుర్తింపని సంస్థ సీఈవో జనమేజయ మహాపాత్ర తెలిపారు. నవంబర్ 4న జరిగే గోల్డెన్ పీకాక్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ (ఐపీపీ) దిగ్గజంగా కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోంది.


ఐఓసీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ



న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) మార్కెటింగ్ డైరెక్టర్‌గా సౌమిత్ర పీ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. కంపెనీలో ఈయనకు 30 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఐఐటీ రూర్కెలా నుంచి సివిల్ ఇంజినీరింగ్, ముంబైలోని ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. తొలుత ఐఓసీ ఎల్‌పీజీ వ్యాపార విభాగంలో నాలుగేళ్లు పనిచేసిన తర్వాత శ్రీవాస్తవ సేల్స్ విభాగంలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. ముంబై, ఢిల్లీ డివిజన్ కార్యాలయాలను నడిపిన అనుభవం ఉంది. అంతే కాకుండా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లోనూ సేల్స్ విభాగంలో పనిచేశారు.

ప్రతీ కార్మికుడికి ఏఐ ఫలాలు


- తద్వారా ఉత్పాదకత పెంచుకోవచ్చు
- నీతి ఆయోగ్ ప్రతిపాదన



న్యూఢిల్లీ: 'మిషన్ డిజిటల్ శ్రమసేతు' కార్యక్రమం కింద కృత్రిమ మేధ (ఏఐ) ప్రతీ కార్మికుడికి అందుబాటు ఉండేలా తగిన కార్యాచరణను రూపొందించాలని నీతి ఆయోగ్ పిలుపునిచ్చింది. 'సమ్మిళిత సామాజికాభివృద్ధికి ఏఐ' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. ఏఐ, బ్లాక్‌చైన్, ఇమ్మర్సివ్ లెర్నింగ్ (వీఆర్, ఏఆర్ సాధనాల సాయంతో), ఇతర టెక్నాలజీల ద్వారా.. ఆర్థిక అభద్రత, పరిమిత మార్కెట్ అవకాశాలు, నైపుణ్యాలలేమి వంటి వాటిని అధిగమించొచ్చని పేర్కొంది. అసంఘటిత రంగ కార్మికులు పరికరాలు, ప్లాట్‌ఫామ్‌ల సాయంతో తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు, అధిక ఉత్పాదకతకు మిషన్ డిజిటల్ శ్రమసేతు వీలు కల్పిస్తుందని తెలిపింది. ఈ కార్యక్రమం ప్రభుత్వం, విద్యా సంస్థలు, పౌర సమాజం మధ్య సహకారాన్ని పెంచుతుందని వివరించింది. తద్వారా లక్షలాది మందిని దేశ అభివృద్ధి పథకంలో భాగస్వాములను చేయడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ ఆకాంక్షను సాధించడం సాధ్యపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత మాదిరే కొనసాగితే అసంఘటిత రంగంలో ప్రతీ కార్మికుడి వార్షిక ఆదాయం 2047 నాటికి 6,000 డాలర్లకు మించకపోవచ్చని, 14,500 డాలర్ల లక్ష్యానికి ఇది ఎంతో తక్కువని పేర్కొంది. కనుక దేశ అభివృద్ధికి లక్షలాది మంది దూరంగా ఉండకుండా వెంటనే సమిష్టి చర్యలు అవసరమని నివేదికలో సూచించింది. ''దేశంలోని 49 కోట్ల అసంఘటిత రంగ కార్మికుల జీవితాల్లో మార్పులు తీసుకురావడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకునేట్టు అయితే సహకారం అన్నది తప్పనిసరి''అని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణియన్ తెలిపారు.

వేతనాల పెంపు @ 9 శాతం

2026పై ఏఆన్ నివేదిక



ముంబై: అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధిపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ పటిష్టమైన వినియోగం, పెట్టుబడులు, పాలసీపరమైన మద్దతు కారణంగా 2026లో భారత్‌లో వేతనాల పెంపు 9 శాతం స్థాయిలో ఉండొచ్చని గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఏఆన్ ఒక నివేదికలో పేర్కొంది. 2025లోని 8.9 శాతం స్థాయికన్నా ఇది స్వల్పంగా ఎక్కువని పేర్కొంది. ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ గట్టిగా నిలదొక్కుకుందని వివరించింది. 45 పరిశ్రమలవ్యాప్తంగా 1,060 సంస్థల నుంచి సేకరించిన వివరాల ప్రాతిపదికన వార్షిక వేతన పెంపు, టర్నోవర్ సర్వే 30వ ఎడిషన్‌ను ఏఆన్ రూపొందించింది. దీని ప్రకారం రియల్ ఎస్టేట్/ఇన్‌ఫ్రాలో అత్యధికంగా 10.9 శాతం మేర, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో 10 శాతం మేర వేతన పెంపు ఉండొచ్చు. తర్వాత స్థానాల్లో ఆటోమోటివ్ (9.6 శాతం) ఇంజినీరింగ్ డిజైన్ సర్వీస్‌లు (9.7 శాతం), రిటైల్, (9.6 శాతం), లైఫ్ సైన్సెస్ (9.6 శాతం) రంగాలు ఉంటాయి. 2023లో 18.7 శాతంగా ఉన్న అట్రిషన్ రేటు 2024లో 17.7 శాతానికి, 2025లో 17.1 శాతానికి తగ్గినట్లు సర్వే పేర్కొంది.

తిలక్‌నగర్‌కు సీసీఐ గ్రీన్‌సిగ్నల్

ఇంపీరియల్ బ్లూ కొనుగోలుకి సై

న్యూఢిల్లీ: ఆల్కహాలిక్ తయారీ దేశీ కంపెనీ తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనకు తాజాగా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఫ్రెంచ్ లిక్కర్ దిగ్గజం పెర్నాడ్ రిచర్డ్ నుంచి ఇంపీరియల్ బ్లూ విస్కీ బిజినెస్ కొనుగోలుకి వీలు చిక్కనుంది. ఈ ఏడాది జూలైలో పెర్నాడ్ రిచర్డ్ దేశీ ఇండియా నుంచి ఇంపీరియల్ బ్లూ విస్కీ బిజినెస్‌ను సొంతం చేసుకునేందుకు తిలక్‌నగర్ తప్పనిసరి ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు రూ. 4,150 కోట్లు(ఎంటర్‌ప్రైజ్ విలువ) చెల్లించనుంది. వెరసి ఇంపీరియల్ బ్రాండ్ల ఉత్పత్తి, బాట్లింగ్, మార్కెటింగ్, విక్రయం తదితరాలు తిలక్‌నగర్‌కు బదిలీకానున్నాయి. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్‌కు మేన్షన్ హౌస్, కొరియర్ నెపోలియన్ బ్రాందీ బ్రాండ్లతోపాటు.. మేన్షన్ హౌస్ గోల్డ్ విస్కీ, బ్లూ లాగూన్ జిన్ బ్రాండ్లను కలిగి ఉన్న సంగతి తెలిసిందే.

TILAKNAGAR

వాహన అమ్మకాలకు పండుగ జోష్

- కలిసొచ్చిన జీఎస్‌టీ ధరల తగ్గింపు, నవరాత్రుల కొనుగోళ్లు
- సెప్టెంబర్‌లో 18.27 లక్షల సేల్స్
- నవరాత్రుల 9 రోజుల్లోనే 11.56 లక్షల విక్రయాలు
- ఆటో డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడి



న్యూఢిల్లీ: పండుగ సీజన్ ప్రారంభం భారత ఆటోమొబైల్ రంగానికి తిరుగులేని ఉత్సాహాన్ని అందించింది. ముఖ్యంగా నవరాత్రి తొమ్మిది రోజుల పండుగ సందర్భంగా ప్యాసింజర్ వాహన రిటైల్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే ఏకంగా 34% పెరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) వెల్లడించింది. సెప్టెంబర్ 22 వరకు మందకొడిగా సాగిన అమ్మకాలు, జీఎస్‌టీ 2.0 అమల్లోకి వచ్చాక విక్రయాలు అనూహ్య రీతిలో పెరిగాయి. వెరసి సెప్టెంబర్‌లో అన్ని విభాగాలు కలిపి మొత్తం 18,27,337 వాహన విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే నెల 17,36,760 యూనిట్లతో పోలిస్తే ఇవి 5.22% అధికంగా ఉన్నాయి. నవరాత్రుల పండుగ తొమ్మిది రోజుల్లో వాహన విక్రయాలు 34% పెరిగి 11,56,935 యూనిట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో 8,63,327 వాహనాలు అమ్ముడయ్యాయి.

''భారతీయ ఆటోమొబైల్ రిటైల్ పరిశ్రమకు 2025 సెప్టెంబర్ అత్యంత ప్రత్యేకమైన నెల నిలిచింది. కొత్త జీఎస్‌టీ అమల్లోకి వస్తే ధరలు దిగివస్తాయని అంచనాలతో కస్టమర్లు మూడో వారం వరకూ కొనుగోళ్ల జోలికెళ్లలేదు. అయితే సెప్టెంబర్ 22 తర్వాత జీఎస్‌టీ 2.0 రేట్లు అమల్లోకి రావడం, నవరాత్రి ఉత్సవాలు ఒకేసారి రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అన్ని విభాగాల్లో విక్రయాలు, డెలివరీలు వేగంగా పుంజుకున్నాయి'' అని ఫాడా ఉపాధ్యక్షుడు సాయి గిరిధర్ తెలిపారు.

విభాగాల వారీగా వృద్ధి ఇలా...

- ప్యాసింజర్ విక్రయాలు గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2,82,945 యూనిట్ల నుంచి ఏకంగా 5.80% పెరిగి 2,99,396 కు చేరాయి. భారీ కొనుగోళ్లు, అందుబాటు ధరల కారణంగా నవరాత్రుల్లో 2,17,744 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గతేడాది ఇదే నవరాత్రి విక్రయాలు 1,61,443తో పోలిస్తే ఇవి 35% అధికం.
- ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు 7% పెరిగాయి. ఈ సెప్టెంబర్‌లో మొత్తం 12,87,735 అమ్మకాలు జరిగాయి. గతడాది ఇదే నెలలో విక్రయాలు 12,08,996 యూనిట్లుగా ఉన్నాయి. ఈ విభాగపు ఎంక్వైరీలు ఇప్పట్టికీ బలంగా ఉన్నాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, పండుగ ఆఫర్లు, డిమాండ్ పెరగడంతో నవరాత్రిలో అమ్మకాలు 36% పెరిగి 8,35,364 యూనిట్లకు చేరాయి.
- త్రి చక్రవాహన రిటైల్ అమ్మకాలు 7% క్షీణించి 98,866కు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే సెప్టెంబర్ అమ్మకాలు 1,06,534 యూనిట్లుగా ఉన్నాయి. అయితే నవరాత్రి అమ్మకాల్లో 25% వృద్ధి నమోదైంది. మొత్తం 46,204 యూనిట్లు అమ్ముడయ్యాయి. గతేడాది దసరా సీజన్ విక్రయాలు 37,097గా ఉన్నాయి.
- వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు సెప్టెంబర్‌లో 70,254 యూనిట్ల నుంచి 3% పెరిగి 72,124 యూనిట్లకు చేరుకున్నాయి. రుణవితరణ పెరగడంతో నవరాత్రి అమ్మకాల్లో 15% వృద్ధి సాధించి మొత్తం 33,856 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇదే సెప్టెంబర్‌లో ట్రాక్టర్ అమ్మకాలు 64,785 యూనిట్లుగా ఉన్నాయి. ఒక్క నవరాత్రుల్లోనే 21,604 ట్రాక్టర్ల విక్రయాలు జరిగాయి.

అక్టోబర్ అమ్మకాలపై మరింత ఆశాభావం

''జీఎస్‌టీ 2.0 రేట్ల తగ్గింపు అన్ని ఆదాయ వర్గాలలో కొనుగోలు శక్తిని గణనీయంగా పెంచింది. సానుకూల వర్షాలు, బలమైన ఖరీఫ్ పంటలు గ్రామీణ ఆదాయాలను మెరుగుపరిచాయి. ధంతేరాస్, దీపావళి పండుగల సీజన్‌లో ఇదే సానుకూల వాతావరణం కొనసాగొచ్చు. తగ్గిన ధరలు, ఆకట్టుకునే ఆఫర్‌లు కొత్త కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. భారతీయ చరిత్రలోనే ఈ పండుగ సీజన్ అత్యుత్తమ రిటైల్ సీజన్‌గా నిలిచే అవకాశం ఉంది'' అని ఫాడా విశ్వాసం వ్యక్తం చేసింది.

ఈవీ కార్ల అమ్మకాలు రెండింతలు

ఎలక్ట్రిక్ కార్ల రిటైల్ విక్రయాలు ఈ ఏడాది సెప్టెంబర్‌లో 15,329 గా నమోదయ్యాయి. గతేడాది (2024) ఇదే నెలలో నమోదైన 6,191 ఈవీ కార్ల విక్రయాలతో పోలిస్తే ఈ సంఖ్య రెండింతలు అధికమని వాహన డీలర్ల సమాఖ్య (ఫాడా) తెలిపింది. ఈవీ రేసులో టాటా మోటార్స్ అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ ఈవీ కార్ల అమ్మకాలు 62% వృద్ధి చెంది 3,833 నుంచి 6,216 కు చేరాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ 3,912 ఈవీ కార్లను అమ్మింది. గతేడాది సెప్టెంబర్‌లో విక్రయించిన 1,021 యూనిట్లతో పోలిస్తే ఇవి మూడింతలు అధికం. మహీంద్రా అమ్మకాలు 475 యూనిట్ల నుంచి ఏకంగా 3,243కు చేరాయి. అలాగే బీవైడీ ఇండియా 547 యూనిట్లు, కియా ఇండియా 506 యూనిట్లు, హ్యుందాయ్ మోటార్ ఇండియా 349 యూనిట్లు, బీఎండబ్ల్యూ ఇండియా 310 యూనిట్లు, మెర్సిడెస్ బెంజ్ 97 యూనిట్లను విక్రయించాయి. ఇటీవల భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టిన టెస్లా సైతం 64 కార్లను విక్రయించింది.



హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 15 నుంచి మొదలయ్యే దేశవాళీ రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన హైదరాబాద్ జట్టుకు అంతర్జాతీయ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ నాయకత్వం వహిస్తాడు. హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను సొంతగడ్డపై ఈనెల 15 నుంచి ఢిల్లీ జట్టుతో ఆడుతుంది. గ్రూప్ 'డి'లో ఉన్న హైదరాబాద్... ఢిల్లీ, రాజస్తాన్, ముంబై, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ జట్లతో పోటీపడుతుంది. హైదరాబాద్ స్టార్ సిరాజ్ ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కావడంతో రంజీ ట్రోఫీకి అందుబాటులో ఉండటం లేదు.

హైదరాబాద్ రంజీ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రాహుల్ సింగ్ (వైస్ కెప్టెన్), సీవీ మిలింద్, తన్మయ్ అగర్వాల్, అభిరత్ రెడ్డి, హిమతేజ, వరుణ్ గౌడ్, తనయ్ త్యాగరాజన్, రోహిత్ రాయుడు, నిశాంత్ శరణు, పున్నయ్య, అనికేత్ రెడ్డి, కార్తికేయ కక్, అలీ డైమండ్, రాహుల్ రాదేశ్. స్టాండ్‌బై: పి.నితీశ్ రెడ్డి, సాయి ప్రజ్ఞయ్ రెడ్డి, రక్షణ్ రెడ్డి, నితేశ్ కనాలా, మిఖిల్ జైస్వాల్.

తరుణ్ సంచలనం

ప్రపంచ 14వ ర్యాంకర్ టోమా పాపోవ్‌పై విజయం



వాంటా (ఫిన్‌లాండ్): అర్క్‌టిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 46వ ర్యాంకర్ తరుణ్ 11-21, 21-11, 22-20తో ప్రపంచ 14వ ర్యాంకర్ టోమా జూనియర్ పాపోవ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో తరుణ్ ఏకంగా నాలుగు మ్యాచ్ పాయింట్లు కాచుకోవడం విశేషం. నేడు జరిగే ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)తో తరుణ్ ఆడతాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి, కిరణ్ జార్జి, శంకర్ ముత్తుస్వామి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్య సేన్ 15-21, 17-21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో, ఆయుశ్ శెట్టి 15-21, 16-21తో ప్రపంచ మాజీ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో, శంకర్ 17-21, 11-21తో క్రిస్టో పాపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు. రస్‌మస్ గెమ్కే (డెన్మార్క్)తో ఆడాల్సిన కిడాంబి శ్రీకాంత్ 'వాకోవర్' ఇవ్వగా... వతనాబె (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను 10-21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 1-4తో వెనుకబడిన దశలో గాయం కారణంగా కిరణ్ జార్జి వైదొలిగాడు.

యువ భారత్ క్లీన్‌స్వీప్

- ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై 2-0తో టెస్టు సిరీస్ కైవసం
- రెండో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో విజయం

మకాయ్: భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియా పర్యటనను అజేయంగా ముగించింది. ఈ టూర్‌లో భాగంగా మొదట మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన యంగ్‌ఇండియా... టెస్టు సిరీస్‌లోనూ అదే పునరావృతం చేసింది. రెండు రోజుల్లోనే ముగిసిన చివరిదైన రెండో టెస్టులో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని భారత అండర్-19 జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా అండర్-19 జట్టు 135 పరుగులకు ఆలౌట్ కాగా... ఓవర్‌నైట్ స్కోరు 144/7తో బుధవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత అండర్-19 జట్టు చివరకు 51.4 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. తద్వారా యువ భారత జట్టుకు 36 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినట్టైంది. దీపేశ్ దేవేంద్రన్ (38 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో బార్డన్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా అండర్-19 జట్టు... 40.1 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ అలెక్స్ లీ యాంగ్ (78 బంతుల్లో 38; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మరో ముగ్గురు ప్లేయర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. భారత బౌలర్లలో హెనిల్ పటేల్, నమన్ పుష్పక్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... ఉధవ్ మోహన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 81 పరుగుల లక్ష్యఛేదనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన యువభారత్ 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (0) 'గోల్డెన్ డక్'గా వెనుదిరగ్గా... వేదాంత్ త్రివేది (35 బంతుల్లో 33 నాటౌట్; 6 ఫోర్లు) అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. విహాన్ మల్హోత్రా (21; 5 ఫోర్లు), ఆయుశ్ మాత్రే (13; 3 ఫోర్లు), రాహుల్ కుమార్ (13 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బార్డన్ 2 వికెట్లు తీశాడు.

తెలుగు టైటాన్స్ జోరు



చెన్నై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్-12) సాగే కొద్దీ తెలుగు టైటాన్స్ జోరు పెరుగుతోంది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టు వరుసగా ఐదో విజయాన్ని సాధించింది. బుధవారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 46-29తో డిఫెండింగ్ చాంపియన్ హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్ భరత్ హుడా (20 పాయింట్లు) అదరగొట్టాడు. పీకేఎల్‌లో వందో మ్యాచ్ ఆడుతున్న భరత్ 18 సార్లు కూతకెళ్లి 16 పాయింట్లు తెచ్చిపెట్టాడు. ప్రత్యర్థి ఆటగాళ్లు రెయిడింగ్‌కు వస్తే నలుగుర్ని టాకిల్ చేశాడు. మరో ఆల్‌రౌండర్, కెప్టెన్ విజయ్ మలిక్ (8) కూడా టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంకిత్ 3, చేతన్ సాహు, అవి దుహన్, అజిత్ పవార్, శుభమ్ షిండే తలా 2 పాయింట్లు చేశారు. హరియాణా ఆటగాళ్లు ప్రత్యర్థి జట్టుకు దీటుగా పాయింట్లు సాధించడంలో విఫలమయ్యారు. రెయిడర్ మయాంక్ సైని 5, కెప్టెన్ జైదీప్, వినయ్ చెరో 4 పాయింట్లు చేశారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37-27తో యూ ముంబాపై జయభేరి మోగించింది. పుణేరి రెయిడర్ ఆదిత్య షిండే (14) రాణించాడు. మిగతా వారిలో కెప్టెన్ అస్లామ్ (5), పంకజ్ మోహితే (4) మెరుగ్గా ఆడారు. యూ ముంబా తరఫున రెయిడర్లు అజిత్ చౌహాన్ (10), సందీప్ (7) చక్కగా పోరాడారు. గురువారం జరిగే పోటీల్లో బెంగాల్ వారియర్స్‌తో దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయంట్స్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.



నీరజ్ చోప్రా

'మిశ్రమ ఫలితాలు వచ్చాయి'

- ఈ సీజన్‌పై స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా
- వచ్చే ఏడాది మెరుగైన ప్రదర్శన చేస్తానని ఆశాభావం
- స్విట్జర్లాండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నట్లు వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో కాస్త వెనుకబడ్డ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... వచ్చే ఏడాది మెరుగైన ప్రదర్శన చేస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన నీరజ్... ఈ ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడంలో విఫలమయ్యాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన నీరజ్... రిక్తహస్తాలతో వెనుదిరిగాడు. ఈ ఏడాదే 90 మీటర్ల మార్క్ అందుకున్న నీరజ్ చోప్రాకు ఈ సీజన్ మిశ్రమ ఫలితాలనిచ్చింది. ప్రస్తుతం జ్యూరిక్‌లో శిక్షణ పొందుతున్న 27 ఏళ్ల నీరజ్ చోప్రా... ఈ ఏడాది తన ప్రదర్శన... రానున్న టోర్నీలకు సన్నద్ధతపై ప్రత్యేకంగా మాట్లాడాడు. యూరప్‌లో శిక్షణ, స్విట్జర్లాండ్‌తో ఉన్న అనుబంధం... ఆ దేశ పర్యాటక శాఖ తనను 'ఫ్రెండ్‌షిప్ అంబాసిడర్'గా నియమించడం వంటి వాటిపై నీరజ్ అభిప్రాయాలు అతడి మాటల్లోనే...

- ఈ సీజన్‌లో చాలా సవాళ్లు ఎదురయ్యాయి. వాటి నుంచి ఎంతో నేర్చుకున్నా. ప్రతీ టోర్నమెంట్ నా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. ఆ అనుభవం భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.
- ప్రతి అంశంలో మెరుగయ్యేందుకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు ప్రేరణ పొందుతూ ముందుకు సాగడమే మన పని.
- తదుపరి సీజన్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేసి బలంగా తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నా. ప్రపంచ చాంపియన్‌షిప్ సమయంలో వెన్నునొప్పితో ఇబ్బందిపడ్డా. ఇప్పుడు శరీరం ఫిట్‌గా ఉంది. రానున్న టోర్నీల్లో దాని ఫలితం తెలుస్తుంది.
- తిరిగి లయ అందుకునేందుకు ఉసానే అనువైన ప్రదేశం. ఇక్కడి ప్రకృతి అంటే ఇష్టం. పర్వతాలు, లోయలు మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి. అవి శిక్షణ సమయంలో ఉల్లాసంగా ఉండేందుకు ఉపయోగపడతాయి.
- మండు వేసవిలో సైతం ఇక్కడి పచ్చని వాతావరణం... శీతాకాల భావన కల్పిస్తుంది. ఇక్కడ నాకు ఎన్నో అనుభవాలు ఉన్నాయి. 2022లో జ్యూరిక్‌లో గెలిచిన డైమండ్ లీగ్ ట్రోఫీ నాకెంతో ప్రత్యేకం. ఆ తర్వాత 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం కూడా ఇక్కడే సాధన చేశా... అప్పుడు పసిడి గెలుచుకున్నా.
- డైమండ్ లీగ్ ట్రోఫీ గెలిచిన తర్వాత నా కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడి ప్రదేశాలు సందర్శించా. ఆ అనుభవం ఎన్నో మధురానుభూతులను అందించింది.
- జీవితంలో ప్రతీది అనుకున్నట్లు సాగదని 'కోవిడ్-19' మహమ్మారితో తెలిసొచ్చింది. అప్పటి నుంచి ఆలోచన దృక్పథంలో మార్పు వచ్చింది. పరిస్థితులకు తగ్గట్లు మనల్ని మనం మార్చుకోక తప్పదు.
- స్విట్జర్లాండ్‌లో సమయ పాలన తప్పనిసరి. మనకు నచ్చిన సమయంలో నచ్చిన చోటకు వెళ్లాలంటే కష్టం. ప్రజారవాణా వ్యవస్థ చాలా పకడ్బందీగా ఉంటుంది. అందుకే వీలు ఉన్నప్పుడు పర్యటించేందుకు అనుగుణంగా రైలు పాస్‌ల విషయంలో సహాయం చేయమని స్విట్జర్లాండ్ పర్యాటక శాఖను అడుగుతుంటా.
- స్విట్జర్లాండ్‌తో ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైంది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నా. నాకు ఇక్కడ చాలా మంది తెలుసు. నా ప్రపంచ అథ్లెటిక్స్ ఏజెంట్లు కూడా స్విస్‌కు చెందిన వారే. యూరప్‌లో ఉంటే ఎక్కువగా స్విట్జర్లాండ్‌లోనే ఉంటాను. దీన్ని రెండో ఇల్లు అని పిలవలేను కానీ... తరచుగా వెళ్లేందుకు ఇష్టపడే ప్రదేశం అని మాత్రం చెప్పగలను.



కీలకపోరుకు భారత్ రెడీ

ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్‌లో నేడు సింగపూర్‌తో మ్యాచ్

సింగపూర్: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) **ఆసియా కప్ క్వాలి**ఫయర్స్‌లో భారత **ఫుట్‌బాల్ జట్టు క్లిష్టమైన స**మరానికి సిద్ధమైంది. **మూడో రౌండ్‌లో భాగంగా** నేడు గ్రూప్ 'సి'లోనే **పటిష్టమైన సింగపూర్‌తో భారత్** తలపడుతుంది. **ఈ క్వాలిఫయర్స్ కోసం ఏర్పా**టు చేసిన జాతీయ **శిక్షణ శిబిరానికి తొలిదశలో** చాలా మంది ఆటగాళ్లు **'క్లబ్' జట్లు విడుదల** చేయకపోవడంతో **గైర్హాజరయ్యారు. తర్వాత అం**దరూ కలిసిరావడం **జట్టుకు కాస్త ఊరటనిచ్చింది.** 'సీఏఎఫ్ఏ నేషన్స్ **కప్'కు దూరమైన భారత స్టా**ర్ స్ట్రయికర్, మాజీ **కెప్టెన్ సునీల్ ఛెత్రి తిరిగి జట్టు**లోకి రావడం జట్టు **బలాన్ని కూడా పెంచింది. ఖాలిద్ జమీల్** కోచింగ్‌లోని **భారత జట్టుకు ఈ మ్యాచ్** అత్యంత కీలకమైంది. **నాలుగు జట్లు పోటీ**లో ఉన్న గ్రూప్ **'సి'లో ప్రస్తుతం భారత్ అట్ట**డుగున నిలిచింది. **గత నెలలో జరిగిన పోటీల్లో** తమకన్నా తక్కువ **స్థాయి బంగ్లాదేశ్‌తో 0-0తో** డ్రా చేసుకున్న భారత్... తదుపరి హాంకాంగ్‌తో మ్యాచ్‌లో 0-1తో ఓటమి పాలైంది. దీంతో ఒకే ఒక్క పాయింట్‌తో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మరోవైపు సింగపూర్ 4 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది.

సొంతగడ్డపై సింగపూర్‌దే పైచేయి

'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో 134వ ర్యాంకుతో భారత్... 158 ర్యాంకర్ సింగపూర్ కంటే మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ ఫామ్‌లో, ఫలితాల్లో చిన్నజట్ల కంటే వెనుకబడే ఉంది. ముఖాముఖి పోరులోనూ భారత్ 12-11తో సింగపూర్‌పై పైచేయిగా కనబడుతోంది. అయితే సొంతగడ్డపై సింగపూర్ జోరు కొనసాగిస్తోంది. ఇక్కడ 15 మ్యాచ్‌లాడితే సింగపూర్ జట్టు 8 గెలిచింది. భారత్ ఆరు విజయాలతోనే సరిపెట్టుకుంది. ఒక మ్యాచ్ మాత్రం 'డ్రా'గా ముగిసింది. ఇలాంటి పరిస్థితుల్లో... సొంతగడ్డపై బెబ్బులిలా గర్జిస్తోన్న సింగపూర్‌లాంటి గ్రూప్ టాపర్‌తో భారత్ గెలవాలంటే మాత్రం సర్వశక్తులు ఒడ్డాల్సిందే!

క్యాన్సర్‌లా మొదలై... పతనమైంది!

- మా 'టెస్టు'కు ఏళ్ల క్రితమే ఈ దుస్థితి
- వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ స్యామీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌నే శాసించిన వెస్టిండీస్ ఇప్పుడు మాత్రం క్రికెట్ కూనల కంటే కూడా దిగజారింది. ఇప్పటికీ విశ్వవ్యాప్త లీగ్‌లలో మెరిపిస్తుంది కరీబియన్ క్రికెటర్లే! కానీ సంప్రదాయ క్రికెట్‌నే మాకు పట్టనే పట్టదన్నట్లు పూర్తిగా గాలికొదిలేశారు విండీస్ క్రికెటర్లు. అయితే తమ జట్టు పతనం ఈనాటిది కాదని అదెప్పుడో మొదలైందని వెస్టిండీస్ కోచ్ డారెన్ స్యామీ కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశాడు. భారత పర్యటనకు వచ్చిన విండీస్ తొలి టెస్టును మూడు రోజుల్లోనే ఓడింది. కరీబియన్ క్రికెట్ దీనావస్థపై, జట్టు ప్రదర్శన హీనావస్థపై స్యామీ మాట్లాడుతూ 'మేం భారత్‌లో చివరిసారి 1983లో టెస్టు సిరీస్ గెలిచాం. అప్పటికీ నేను పుట్టనేలేదు. గత 42 ఏళ్లుగా మళ్లీ ఏనాడూ గెలవనేలేదు. జట్టు ఫలితాల నేపథ్యంలో నేనిప్పుడు విమర్శకుల కంట్లో పడ్డానని నాకు బాగా తెలుసు. అయితే దీన్నుంచి తప్పించుకోవాలని గానీ, వైఫల్యాలపై కప్పిపుచ్చాలని గానీ నాకు లేదు. ఈ వైఫల్యం నేనొచ్చాకే మొదలవ్వలేదు. రెండేళ్ల క్రితం నుంచే లేదు. చాలా ఏళ్ల క్రితమే వెస్టిండీస్ టెస్టు క్రికెట్ పతనం మొదలైంది. చెప్పాలంటే క్యాన్సర్ వ్యాధిలా మొదలై... క్రమంగా మా విండీస్ క్రికెట్ మొత్తానికి వ్యాపించింది. కేవలం బోర్డులోనో లేదంటే జట్టులోనో కాదు... సర్వత్రా మహమ్మారి విస్తరించింది. మొత్తం క్రికెట్ సిస్టమ్‌లోనే పాతుకుపోయింది. చివరకు పతనానికి చేరింది' అని అన్నాడు. వెస్టిండీస్ గెలిచిన రెండు టి20 ప్రపంచకప్‌లకు స్యామినే విజయసారథి. ఇతని నేతృత్వంలోనే 2013లో భారత పర్యటనకు వచ్చిన వెస్టిండీస్ టెస్టు సిరీస్‌లో ఓడింది. 'మా ఆటగాళ్లంతా తమ చేతుల్లో ఉన్నది... తమ చేతనైనదే చేస్తున్నారు. అంటే ఏది బాగా ఆడగలమో అదే ఆడుతున్నారు. దీనికి విశ్వవ్యాప్త ఫ్రాంచైజీ క్రికెట్ కూడా కారణం' అని టి20 క్రికెట్‌పై తమ ఆటగాళ్లకున్న మోజును స్యామీ నిజాయితీగా అంగీకరించాడు. అయితే దీనికి కారణం లేకపోలేదని చెప్పాడు. ఇతర దేశాలు, జట్లతో పోల్చుకుంటే వసతులు, ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత, నిష్ణాతులైన కోచింగ్ సిబ్బంది మన కంటే మిగతా జట్ల వద్దే ఎక్కువగా ఉంటే ఆ జట్లే మాకంటే మేటిగా ఉంటాయన్నాడు. ఇది బహిరంగ సత్యమన్నాడు. విండీస్ కొన్నేళ్లుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతోందన్నాడు. ఒకప్పుడు వెస్టిండీస్ ప్రపంచ క్రికెట్‌లో మేటి జట్టుగా ఉన్నప్పుడు ఇప్పటి భారత్‌లా ఏనాడు ఆలోచించలేకపోయిందని, ఎదగలేకపోయిందని స్యామీ విశ్లేషించాడు. ముఖ్యంగా ఆర్థిక కష్టాలు దూరమైతేనే ఎదైనా మొదలవుతుందన్నాడు. చెప్పుకోదగ్గ స్పాన్సర్లు దొరికితేనే జట్టు పరిస్థితి మారుతుందని లారా, చందర్‌పాల్ తదితర దిగ్గజాలు ఇదివరకే పేర్కొన్నారు.




చైనాలో 8 రోజుల 'నేషనల్ డే' సెలవులు ముగియనుండగా ఇళ్లకు తిరిగి మళ్లిన జనంతో అన్హుయి ప్రావిన్స్‌లోని వుఝువాంగ్ టోల్ ప్లాజా వద్ద వాహనాల బారులు..అనంతరం ఎక్స్‌ప్రెస్ వే లైన్లపైకి చేరిన వాహనాలు..



ఇళ్లకు తిరిగి వెళ్తున్న జనంతో కిక్కిరిసిన ఝెజియాంగ్ ప్రావిన్స్‌లోని హాంగ్‌యిూ రైల్వే స్టేషన్

దివ్యాంగ ఉద్యోగులకు అత్యుత్తమ సహాయక పరికరాలు

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులైన ఉద్యోగులకు అత్యుత్తమ సహాయక పరికరాలను అందించాలని నిర్ణయించింది. దివ్యాంగ ఉద్యోగులు బాధ్యతలను సరైన విధంగా నిర్వహించలేరనే అపోహతో వారికి కీలకమైన బాధ్యతలను అప్పగించేందుకు కొన్ని విభాగాలు వెనుకాడుతున్నాయి. అదేసమయంలో, దివాంగులైన ఉద్యోగుల్లో తమను చిన్నచూపు చూస్తున్నారన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీరికి సరైన అత్యుత్తమ, నాణ్యమైన సహాయక పరికరాలను అందించాలని నిర్ణయించింది. వీటితో, వీరి ఉత్పాదకత మరింత పెరుగుతుందని ఆశిస్తోంది. అందించిన ఈ పరికరాలను ఉద్యోగులు తమ వంతు బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఉపయోగించుకోవాలని, ఇతరులతో సమానంగా విధులు నిర్వర్తించాలని సామాజిక న్యాయం, సాధికారిత శాఖ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్(డీఈపీడబ్ల్యూడీ) విభాగం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు జారీ చేసిన ఆదేశాల్లో కోరింది. దృష్టి లోపం ఉన్న ఉద్యోగుల కోసం జాస్ (జాబ్ యాక్సెస్ విత్ స్పీచ్), ఎన్‌వీడీఏ (నాన్-విజువల్ డెస్క్‌టాప్ యాక్సెస్), మాగ్నిఫికేషన్ టూల్స్‌ను, చదువలేని వారికి టెక్స్ట్-టు-స్పీచ్ అప్లికేషన్ వంటివి ఇందులో ఉన్నాయి. రూ.10 లక్షలకు మించకుండా ఉద్యోగులు వీటిని మూడేళ్లకోసారి కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని అందులో పేర్కొంది. అంతకుమించిన ఖరీదు కలిగినవి, మూడేళ్లలోపు అవసరమైన వాటికి సంబంధిత విభాగం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అందులో వివరించింది. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసేందుకు వివిధ మంత్రిత్వ శాఖలు డీఈపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థలను సంప్రదించాలని సూచించింది. సరైన పరికరాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలకు అర్థవంతమైన తోడ్పాటునందించాలని దివ్యాంగ ఉద్యోగులను కోరింది.

మరణశిక్షలపై మార్గదర్శకాలకు సుప్రీం నో

కేంద్ర ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: హేయమైన నేరాలకు మరణశిక్ష విధించే సందర్భాల్లో బాధితులు, సమాజానికి ప్రాముఖ్యతనిస్తూ మార్గదర్శకాలు రూపొందించాలన్న కేంద్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మరణ శిక్ష విధించే కేసుల్లో ప్రస్తుతమున్ననిబంధనలు కేవలం ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు, నిందితుల కేంద్రంగానే ఉన్నాయంటూ కేంద్ర ప్రభుత్వం 2020 జనవరిలో వేసింది. దారుణ నేరాలకు పాల్పడిన వారు చట్టాన్ని అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించింది. న్యాయస్థానం సమష్టిగా భావించిన సందర్భాల్లో మాత్రమే మరణ శిక్షలు పడుతున్నాయని కేంద్రం అందులో పేర్కొంది. 'మరణ శిక్ష పడిన దోషికి అందుబాటులో ఉన్న చట్టపరమైన, రాజ్యాంగ పరిష్కారాలను పొందడానికి ఎటువంటి కాలపరిమితి లేదు. బాధితులు, సమాజ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూ ఇప్పటికే నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించాలి'అని కేంద్రం వాదించింది. మరణ శిక్షను ప్రకటించిన వారం రోజుల్లోగా శిక్షను అమలు చేయాలనే నిబంధనను తీసుకురావాలని కోరింది. గతంలో 2012 నాటి నిర్భయ గ్యాంగ్‌రేప్-హత్య కేసులో దోషికి విధించిన ఉరిశిక్ష అమలు నాలుగు పర్యాయాలు వాయిదా పడిన విషయాన్ని గుర్తు చేసింది. సమీక్ష, క్షమాభిక్షల కోసం వేసిన పిటిషన్లపై విచారణ కొన్ని నెలలపాటు సాగిందని తెలిపింది. పిటిషన్‌పై బుధవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. పరిగణనలోకి తీసుకోదగ్గ అంశాలేవీ తమకు కనిపించడం లేనందున కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

పూరీలో మ్యూజియంగా ఠాగూర్ ఇల్లు

భువనేశ్వర్: పూరీలోని.. నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ నివాసాన్ని పునరుద్ధరించి, మ్యూజియంగా మార్చాలని ఒడిశా ప్రభుత్వం నిర్ణయించింది. ఒడియా భాష, సాహిత్యం సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 'పూరీలోని రవీంద్రనాథ్ ఠాగూర్ 'పథేర్ పూరీ' నివాసాన్ని పునరుద్ధరించి, ఆయన జ్ఞాపకార్థం మ్యూజియంగా మార్చాలని నిర్ణయించాం'.. అని మంత్రి తెలిపారు.

భారత రాయబారిగా సెర్గియో గోర్

వాషింగ్టన్: భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియో గోర్(38) నియామకం ఖరారైంది. అమెరికా సెనేట్‌లో మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 51 మంది బలపర్చగా, 47 మంది వ్యతిరేకించారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతున్న వేళ గోర్ నియామకానికి ఓకే చెప్పడం గమనార్హం. గోర్‌ను బలపర్చిన వారిలో కాలిఫోర్నియాకు చెందిన విదేశాంగ శాఖలో దక్షిణాసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి పాల్ కపూర్, ఫ్లోరిడాకు చెందిన సింగపూర్‌లో అమెరికా రాయబారి అంజనీ సిన్హా ఉన్నారు. భారత్‌లో తదుపరి రాయబారికి సెర్గియో గోర్ పేరును ఆగస్టులో అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించడం తెల్సిందే. ప్రత్యేక రాయబారిగా దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాలను కూడా ఈయనే చూసుకుంటారు. గోర్ నియామకాన్ని అమెరికాలో భారత్ రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా స్వాగతించారు.

'జోహో మెయిల్'కు అమిత్ షా

న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన ఈ మెయిల్ చిరునామాను.. దేశీయ సేవలందించే 'జోహో మెయిల్'కు మార్చినట్లు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో తన కొత్త ఈమెయిల్ చిరునామాను పోస్టు చేశారు. 'అందరికీ నమస్కారం. నేను జోహో మెయిల్‌కు మారాను. దయచేసి నా ఈమెయిల్ చిరునామా మార్పును గమనించగలరు. నా కొత్త ఈమెయిల్ చిరు నామా amitshah.bjp@zohomail.in. భవిష్యత్తులో ఉత్తర ప్రత్యుత్తరాల కోసం, దయచేసి ఈ చిరునామాను ఉపయోగించండి. ధన్యవాదాలు..' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

11 రోజులపాటు మృత్యువుతో పోరాడి..

పంజాబ్ గాయకుడు రాజ్‌వీర్ తుదిశ్వాస

చండీగఢ్: పంజాబ్ నటుడు, గాయకుడు రాజ్‌వీర్ జవాండా(35) బుధవారం ఉదయం మొహాలీలోని ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గత 11 రోజులుగా ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. కీలకమైన అవయవాలు విఫలమవడంతో ఆయన కన్నుమూశారని ఫోర్టిస్ ఆస్పత్రి తెలిపింది. సెప్టెంబర్ 27వ తేదీన బైక్‌పై వెళ్తూ హిమాచల్ ప్రదేశ్‌లోని సాలన్‌లో కిందపడ్డారు. ప్రమాదంలో ఆయన తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. లూధియానాలోని జగ్రావన్‌కు చెందిన రాజ్‌వీర్ జవాండా 2014లో ముండా లైక్ మె పాటతో కెరీర్‌ను ప్రారంభించారు. 2016లో కాలి జవాన్‌దే డి పాటతో పాపులర్ అయ్యారు. సుబేదార్ జోగీందర్ సింగ్, జింద్ జాన్, మిండో తసీల్దార్నీ తదితర సినిమాల్లోనూ కనిపించారు. జవాండా అకాల మరణంపై సీఎం భగవంత్ సింగ్ మాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసులో ఈడీ సోదాలు

- దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్‌పై ఆరోపణలు
- కేరళ, చెన్నైలో 17 చోట్ల సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు
- భూటాన్ నుంచి అక్రమంగా లగ్జరీ కార్లు దిగుమతి చేసుకున్నట్లు కేసు

కోచి: భూటాన్ నుంచి లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసులో మాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటుల కార్యాలయాలు, ఇళ్లల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. కేరళ, తమిళనాడుల్లో ఏకకాలంలో 17 చోట్ల ఈ సోదాలు జరిగాయి. ప్రముఖ మాలీవుడ్ నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చక్కలకల్ తోపాటు పలువురు లగ్జరీ వాహనాల యజమానుల ఇళ్లు, ఆటో వర్క్‌షాప్‌లు, వ్యాపారుల ఆస్తుల్లో ఈ సోదాలు నిర్వహించారు. కేరళలోని ఎర్నాకులం, త్రిస్సూరు, కోజికోడ్, మలప్పురం, కొట్టాయం, తమిళనాడులోని కోయంబత్తూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. చెన్నైలో మాలీవుడ్ సూపర్‌స్టార్ మమ్ముట్టికి చెందిన ఓ ప్రాపర్టీలో కూడా సోదాలు నిర్వహించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. మమ్ముట్టి కుమారుడే దుల్కర్ సల్మాన్ అన్న విషయం తెలిసిందే.

ఏమిటి కేసు?

భూటాన్‌లో ఖరీదైన లగ్జరీ కార్లను సెకండ్‌హ్యాండ్‌లో కొందరు స్మగ్లర్లు తక్కువ ధరకు కొని, వాటిని అక్రమంగా భారత్‌కు తీసుకొచ్చి.. ఇక్కడే తయారైనట్లు పత్రాలు సృష్టించి అధిక ధరకు విక్రయించారు. ఈ క్రమంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)తోపాటు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)ను ఉల్లంఘించారని ఇటీవల ఆరోపణలు వచ్చాయి. ఇలా అక్రమంగా దిగుమతి చేసుకున్న కార్లను మాలీవుడ్ నటులు కొన్నట్లు ఈడీ విచారణలో తేలటంతో సోదాలు నిర్వహించింది. ఈ అంశంలో పీఎంఎల్ఏ కింద ఈడీ త్వరలో కేసు నమోదుచేసి మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం. కోయంబత్తూర్‌కు చెందిన స్మగ్లింగ్ ముఠా తీసుకొచ్చిన కార్లలో ఒకదానికి దుల్కర్ సల్మాన్ కొనుగోలు చేయగా, దానిని కస్టమ్స్ అధికారులు ఇటీవల సీజ్ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆయన కేరళ హైకోర్టుకు వెళ్లటంతో కారు కోసం అర్జీ పెట్టుకుంటే వారంలోగా పరిశీలించాలని కస్టమ్స్ విభాగాన్ని కోర్టు మంగళవారం ఆదేశించింది.

పాక్‌లో 19 మంది మిలిటెంట్లు హతం

లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది సైనికులు కూడా..

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లో నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)తో జరుగుతున్న పోరులో ఆర్మీకి భారీ నష్టం వాటిల్లింది. అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న ఒరాక్జాయ్ జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ స్థాయి అధికారులు సహా 11 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనలో 19 మంది మిలిటెంట్లు కూడా హతమైనట్లు ఆర్మీ తెలిపింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)పై గతేడాది పాకిస్తాన్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో, ఆ సంస్థ ఉగ్రవాదులు 'ఫట్నా-అల్- ఖవార్జి'పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఉగ్రవాదుల స్థావరంపై దాడి జరిపామని, ఘటనలో దాడికి నేతృత్వం వహించిన లెఫ్టినెంట్ కల్నల్ జునాయిద్ తారిఖ్(39), మేజర్ తయ్యబ్ రాహత్(33) ప్రాణాలు కోల్పోయారని తెలిపింది.

సమర్థతను చాటాం

ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

హిండన్: తక్కువ రోజుల్లోనే సానుకూల ఫలితాలను రాబట్టుకునేందుకు వైమానిక శక్తిని ఎంత ప్రభావవంతంగా ఉపయోగించుకోవచ్చనేది ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి నిరూపించి చూపామని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ చెప్పారు. శత్రువు లక్ష్యాలపై గురి తప్పని దాడులు జరిపిన వైమానిక దళం దేశ ప్రజల గుండెల్లో తన స్థానాన్ని పదిలం చేసుకుందన్నారు. హిండన్ వైమానిక స్థావరంలో బుధవారం జరిగిన 93వ వైమానిక దళ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. కొత్త వ్యవస్థలు, ఆయుధాలు, పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో వైమానిక దళం విజయవంతమైందన్నారు. రక్షణ, భద్రతలకు సంబంధించిన అంశాల్లో ఎయిర్ వారియర్లలో జవాబుదారీతనం పెరుగుతున్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదాలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేషన్ సిందూర్‌లో అసమాన పనితీరు కనబరిచిన రఫేల్ స్క్వాడ్రన్ తదితర విభాగాలకు అవార్డులను ప్రదానం చేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధులై ఉండాలని ఎయిర్ వారియర్లకు పిలుపునిచ్చారు. పథక రచన సరికొత్తగా, ఆచరణీయంగా ఉండాలన్నారు. శిక్షణ సైతం పోరాటం మాదిరిగానే సాగాలని పిలుపునిచ్చారు.

వింటేజ్ ఫోర్డ్ కారు నడిపిన ఎయిర్ చీఫ్

హిండన్ వైమానిక స్థావరంలో జరిగిన భారత వైమానిక దళం 93వ వార్షికోత్సవానికి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ 1960లనాటి ఫోర్డ్ కారు నడుపుకుంటూ వచ్చారు. 'ఐఏఎఫ్ 1'అనే నంబర్ ప్లేటును కలిగిన ఈ కారు ఫోర్డ్ సెలూన్ అనే లగ్జరీ వెర్షన్‌కు చెందింది. 1969 జూన్ 30వ తేదీన ఐఏఎఫ్‌లో చేరిన ఈ కారు ప్రస్తుతం పాలంలోని ఎయిర్ ఫోర్స్ మ్యూజియంలో ఉంది. అరుదైన సందర్భాల్లోనే దీనికి బయటకు తీస్తుంటారు. 1969లో అప్పటి ఎయిర్ చీఫ్ మార్షల్ పీసీ లాల్ మొదలు 1992 వరకు ఎయిర్ చీఫ్స్ ఈ ఫోర్డ్ కారును వాడుకున్నారు. 1993లో అప్పటి ఎయిర్ చీఫ్ ఎస్‌సీ సూరి దీనిని మ్యూజియంకు కానుకగా అందజేశారు.



ఎయిర్‌ఫోర్స్ డేలో పాల్గొన్ని సెల్యూట్ చేస్తున్న సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

ఎమ్మెల్యే పదవికి రాజీనామా

పట్నా: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్ మాజీ మంత్రి మురారి ప్రసాద్ గౌతమ్ బుధవారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన బీజేపీలో చేరవచ్చనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. గౌతమ్ రాజీనామాతో రోహ్తాస్ జిల్లా చెనారి రిజర్వుడు అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని బిహార్ అసెంబ్లీ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 'శాసన సభ్యత్వానికి రాజీనామా వెనుక ప్రత్యేక కారణమేమీ లేదని గౌతమ్ పీటీఐకి స్పష్టం చేశారు. ఆయన కాంగ్రెస్ టికెట్‌పై అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్రంలో మహాకూటమి అధికారంలో ఉన్నప్పుడు నితీశ్ కుమార్ ప్రభుత్వంలో గౌతమ్ మంత్రిగా పనిచేశారు. జేడీ(యూ) మళ్లీ ఎన్‌డీఏలోకి వచ్చిన తర్వాత, ఆయన ట్రెజరీ బెంచ్ సభ్యులతో కలిసి కూర్చోవడం ప్రారంభించారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆయన అనర్హత కోరుతూ దాఖలైన పిటిషన్ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్ ముందు పెండింగ్‌లో ఉంది. నవంబర్ 6, 11 తేదీల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరగనుండటం తెలిసిందే.

ఎవరెస్టు సాహసికులు సురక్షితం

850 మందిని కాపాడిన గ్రామస్తులు

బీజింగ్: ఎవరెస్ట్ టిబెటన్ సానువులలో సంభవించిన తీవ్ర మంచు తుపానులో మూడు రోజులుగా చిక్కుకుపోయిన 850 మందికి పైగా హైకర్లు, గైడ్‌లు, పోర్టర్లను వందలాది మంది గ్రామస్తులు సహాయక బృందాలు రక్షించినట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. నైరుతి టిబెట్ అటానమస్ రీజియన్‌లోని జిగాజే నగరంలోని డింగ్రి కౌంటీలో భారీ హిమపాతం వల్ల చిక్కుకుపోయిన హైకర్లు, స్థానిక సేవా సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారని స్థానిక అధికారులు మంగళవారం రాత్రి ఆలస్యంగా ప్రకటించారు. వారి తిరుగు ప్రయాణాల కోసం అక్కడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. టిబెట్ వైపున్న ఎవరెస్ట్‌పై 1,000 మందికి పైగా యాత్రికులను ఆకస్మికంగా చుట్టుముట్టిన ఈ మంచు తుపానులో.. ఒక హైకర్ మరణించినట్లు జిన్హువా సోమవారం ప్రకటించింది.

రాజస్థాన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పశువుల్ని ఢీకొనడంతో ప్రమాదం

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లోని న్యూ శ్రీ మాధోపూర్ స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి 11.05 గంటలకు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలుకు చెందిన 38 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మొత్తం పశ్చిమ ప్రత్యేక సరుకు రవాణా కారిడార్‌లో సరుకు రవాణా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ సంఘటనపై డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం, పట్టాలపైకి అడ్డంగా వచ్చిన పశువులను గూడ్స్ రైలు ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు

- 22 మంది నిందితులకు విముక్తి సమ్మతమే
- బాంబే హైకోర్టుకు తెలిపిన సీబీఐ

ముంబై: 2005 నాటి గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్, అతడి అనుచరుడు తుల్సీరామ్ ప్రజాపతి నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఆరోపణలున్న మొత్తం 22 మంది నిందితులను స్పెషల్ కోర్టు విడుదల చేయడాన్ని తాము అంగీకరిస్తున్నామని సీబీఐ తెలిపింది. నిందితుల విడుదలను సవాల్ చేస్తూ సొహ్రాబుద్దీన్ షేక్ సోదరులు వేసిన పిటిషన్‌ను బుధవారం బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ సారథ్యంలోని ధర్మాసనం విచారించింది. స్పెషల్ కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా తామెలాంటి అప్పీల్ వేయాలనుకోవడం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ సింగ్ ధర్మాసనానికి నివేదించారు. అయితే, ఈ కేసులో సాక్ష్యుల వాంగ్మూలాలను సీబీఐ సరిగ్గా నమోదు చేయలేదని సొహ్రాబుద్దీన్ సోదరుల తరపు లాయర్ వాదించారు. మళ్లీ విచారణ చేపట్టాలని కోరారు. వాంగ్మూలాలు సరిగ్గా నమోదు కాని సాక్ష్యుల వివరాలను తమకు తెలిపాలంటూ ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

మరణ శిక్ష పడిన ఖైదీని వదిలేసిన సుప్రీంకోర్టు

పోలీసులు అతడిని బలిపశువును చేశారని వ్యాఖ్య

న్యూఢిల్లీ: 2017నాటి ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న వ్యక్తిని సుప్రీంకోర్టు విడిచిపెట్టింది. దిగువ కోర్టులో ఈ కేసు విచారణ ఏకపక్షంగా జరిగిందని, పోలీసులు అతడిని బలిపశువును చేశారని వ్యాఖ్యానించింది. నిందితుడికి తనను తాను రక్షించుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఇదేమీ బ్రాంతి కాదని తెలిపింది. ఈ హక్కుకు భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత న్యాయస్థానంతోపాటు ప్రభుత్వానికి ఉందని పేర్కొంది. మరణ శిక్ష విధించాల్సిన కేసయినా నిందితుడికి తనను తాను కాపాడుకునే అవకాశం కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది. దిగువ కోర్టు తనకు మరణ శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును 2018లో మద్రాస్ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ నిందితుడు దశ్వంత్‌వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ సేథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. 'ఎఫ్ఎస్ఎల్ నివేదికలతో సహా ముఖ్యమైన పరిస్థితులను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైంది. పిటిషనర్‌ను కోర్టు దోషిగా నిర్ధారించింది. ఆరోపణలకు సంబంధించిన పత్రాలను నిందితుడికి అందించలేదు. మరణ శిక్ష పడే కేసులో ఇటువంటి వాటిని రాజ్యాంగం తప్పనిసరిచేసింది'అని ధర్మాసనం తన 71 పేజీల తీర్పులో పేర్కొంది. 2018 ఫిబ్రవరి 19వ తేదీన పిటిషనర్‌కు దోషిగా నిర్ధారించిన కోర్టు, అదే రోజు మరణ శిక్ష విధిస్తూ తీర్పునివ్వడాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. ఈ తీర్పును వెలువరించేందుకు కోర్టు అనవసర ఉత్సాహం చూపినట్లుగా భావిస్తున్నామంది. ఈ కేసులో దిగువ కోర్టు, మద్రాస్ హైకోర్టు వెలువరించిన తీర్పులను పక్కనబెడుతున్నామని తెలిపింది. ఇతరత్రా కేసులు ఏవీ లేనట్లయితే నిందితుడిని కారాగారం నుంచి విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది.

కరూర్ విషాదంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి

సుప్రీంకోర్టులో తమిళనాడు బీజేపీ నేత పిటిషన్

న్యూఢిల్లీ: తమిళనాడులోని కరూర్‌లో సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన తొక్కిసలాటపై సీబీఐతో దర్యాప్తునకు ఆదేశించాలంటూ రాష్ట్రానికి చెందిన బీజేపీ నేత ఒకరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. నటుడు, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ పాల్గొన్న ఆ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోగా, 60 మందికి పైగా గాయాలపాలయ్యారు. తమిళనాడు బీజేపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు, సుప్రీంకోర్టు లాయర్ అయిన జీఎస్ మణి ఈ పిటిషన్ వేశారు. కరూర్ ఘటనపై తమిళనాడు పోలీసులు చేపట్టిన దర్యాప్తుపై స్టే విధించాలని కూడా ఆయన అందులో కోరారు. విచారణ బాధ్యతలను సీబీఐకి లేదా సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా రిటైర్డు న్యాయమూర్తి సారథ్యంలోని స్వతంత్ర సిట్‌కు అప్పగించాలన్నారు. విషాదంపై స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాల్సిన అవసరముందన్నారు. బాధితులకు మరింత పరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఇదే అంశంపై దాఖలైన పలు పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 10వ తేదీన విచారణ చేపట్టనుంది.

హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకు టీవీకే: కరూర్ విషాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేయాలంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ టీవీకే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. సిట్‌లో కేవలం తమిళనాడు పోలీసు అధికారులే ఉండాలనడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరింది. టీవీకే కార్యదర్శి ఆధవ్ అర్జున వేసిన పిటిషన్ విచారణకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అంగీకరించారు.

కశ్మీర్‌లో కూంబింగ్.. ఇద్దరు జవాన్లు అదృశ్యం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదుల కోసం చేపట్టిన కూంబింగ్ సమయంలో ఇద్దరు సైనికులు కనిపించకుండా పోయారు. కొకెర్‌నాగ్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. ఉగ్రవాదుల ముఠా సంచరిస్తోందనే సమాచారం మేరకు రెండు రోజులుగా ఇక్కడ గాలింపు కొనసాగుతోంది. ఎలైట్ పారా యూనిట్‌కు చెందిన ఇద్దరు జవాన్లు అదృశ్యమవడం, వారితో సంబంధాలు తెగిపోయిన నేపథ్యంలో హెలికాప్టర్లతో గాలింపు చేపట్టామని అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి కిష్త్వార్ ప్రాంతంలో భారీ మంచు కురిసిందని, అప్పటి నుంచి వీరి ఆచూకీ తెలియడం లేదని శ్రీనగర్‌లోని చినార్ కార్ప్స్ విభాగం తెలిపింది.

నియమావళి కేంద్రానికీ వర్తిస్తుంది:ఈసీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సోమవారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషన్(ఈసీ) తెలిపింది. ఇందులోని నిబంధనలు బిహార్‌కు సంబంధించి కేంద్రం ప్రకటించే అన్ని పథకాలు, కార్యక్రమాలకు కూడా వర్తిస్తుందని స్పష్టతనిచ్చింది. అంతేకాదు, పౌరుల గోప్యతను గౌరవించాలని, ప్రైవేట్ నివాసాల వద్ద ఎలాంటి ప్రదర్శనలు చేపట్టరాదని పేర్కొంది. యజమాని అనుమతి లేకుండా భూమి, భవనాలు, గోడలను జెండాలు, బ్యానర్లు, పోస్టర్ల కోసం ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రజల, ప్రైవేట్ ఆస్తులపై రాతల తొలగింపు, ఎన్నికలకు సంబంధించిన ఏ రాజకీయ పార్టీ, అభ్యర్థి, ఇతరులు ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ వసతి గృహాలను దుర్వినియోగం కాకుండా చూడటం, ప్రభుత్వ ఖర్చుతో ప్రకటనల జారీపై నిషేధించడం వంటి విషయాలపై బిహార్ ముఖ్య కార్యదర్శికి కూడా ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

జీవించే హక్కును వివరించే అధికరణ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు

వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాథమిక హక్కులు పెట్టని కోట. భారత ప్రజాస్వామ్యానికి ఇవి పునాదిరాళ్లు. ప్రాథమిక హక్కులను మన రాజ్యాంగానికి మాగ్నాకార్టాగా పేర్కొంటారు. వీటికి, ఆదేశిక సూత్రాలకు మధ్య సంబంధం విషయంలో.. న్యాయ శాస్త్రవేత్తలకు, రాజ్యాంగ నిపుణులకు, రాజనీతిజ్ఞులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయ సంరక్షణ లేని హక్కులుగా బి.ఎన్.రావు వర్ణించిన ఆదేశిక సూత్రాల స్థితిగతులపై అనేక వాదనలున్నాయి. రాజ్యాధికార దుర్వినియోగం, నియంతృత్వ చట్టాల నుంచి పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే బాధ్యతను మన రాజ్యాంగం సుప్రీం కోర్టు, హైకోర్టులకు అప్పగించింది. తద్వారా ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ లభించింది. వీటి రక్షణ కోసం సుప్రీంకోర్టు 32వ అధికరణ ప్రకారం, హైకోర్టులు 226వ అధికరణ ప్రకారం రిట్లను జారీ చేస్తాయి. రాజ్యాంగంలోని 37వ అధికరణను అనుసరించి ఎలాంటి న్యాయ సంరక్షణ లేని ఆదేశిక సూత్రాలు అంతగా పట్టించుకోదగినవి కావని కె. సంతానం వ్యాఖ్యానించడం గమనార్హం. నిర్దేశిక నియమాలకు న్యాయసంరక్షణ లేకపోయినప్పటికీ సామాజిక మద్దతు ఉందని డా.బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఈ విషయాన్ని విస్మరించడానికి అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం

ప్రాథమిక హక్కులు– ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యాలు, తేడాలు మాత్రమే ఉన్నాయని, ఎలాంటి సంబంధం, సమన్వయం లేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. 19(1)(ఎ) అధికరణ వ్యక్తి భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాల గురించి పేర్కొంటోంది. 21వ అధికరణ వ్యక్తి స్వేచ్ఛను తెలుపుతోంది. సాధారణంగా అన్ని రకాల ఆర్థిక వనరులను కలిగి రాజ్యాంగం, హక్కుల గురించి అవగాహన ఉన్నవారు వాటిని పొందడం పెద్ద సమస్య కాదు. కానీ పేదలు, నిరక్షరాస్యులు, ప్రాథమిక హక్కుల గురించి అవగాహనలేనివారు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడానికి ఆదేశిక సూత్రాల్లోని 39–ఎ అధికరణ ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. పేదలకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉచిత న్యాయసేవా సహాయం అందించడానికి 1987లో లీగల్ ఎయిడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కును వివరిస్తోంది. 41వ అధికరణ, 48ఎ అధికరణలు ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య అవినాభావ సంబంధాన్ని తెలుపుతున్నాయి. రాజ్యాంగంలోని 46వ అధికరణ వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగపరంగా ప్రత్యేక అవకాశాలను కల్పించాలని పేర్కొంటోంది. రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను 15(4), 15(5), 16(4), 16(4ఎ) అధికరణలు సమర్థిస్తాయి. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అమలులో ఒకదానికి మరొకటి సహకరించడంతో



పాటు ఒక అంశాన్ని మరొక అంశం పటిష్టపరిచేందుకు దోహదపడడం గమనార్హం.

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య భిన్నత్వం

ప్రాథమిక హక్కులు ప్రధానంగా వ్యక్తి ప్రాతిపదికపై రూపొందించినవి. ఆదేశిక సూత్రాలు సమాజ సమష్టి ప్రయోజనం కోసం ఉద్దేశించినవి. హక్కులు వ్యక్తి స్వేచ్ఛను, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయి. ప్రాథమిక హక్కుల సంరక్షణ, అమలు కోసం పౌరులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా, వాటి సంరక్షణ కోసం న్యాయస్థానాలు కూడా ఆజ్ఞలు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. ఆదేశిక సూత్రాలకు అలాంటి న్యాయ సంరక్షణ లేకపోవడం గమనార్హం. ప్రాథమిక హక్కులు ఎల్లప్పుడూ పౌరులకు అందుబాటులో ఉంటాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన సందర్భంలో మాత్రమే భారత రాష్ట్రపతి వాటిని తాత్కాలికంగా సస్పెండ్ చేయొచ్చు. కానీ నిర్దేశిక నియమాలు ఎల్లప్పుడూ సుప్తచేతనావస్థలో ఉంటాయి. అంటే వాటికి జీవం పోయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేసి అమలు పర్చాలి. ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యత న్యాయస్థానాలపై, నిర్దేశిక నియమాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు సకారాత్మక దృక్పథాన్ని కల్పిస్తాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాన్ని చూపుతాయి. ప్రాథమిక హక్కులు ప్రధానంగా ఏ పనులు చేయకూడదో తెలుపుతాయి. అంటే కొన్ని హక్కులు తప్ప మిగతావన్నీ నకారాత్మక దృక్పథాన్ని తెలుపుతాయి.

ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ సంక్షేమ లక్ష్యాలను తెలిపితే... ప్రాథమిక హక్కులు ఆ లక్ష్యాలను సాధించే సాధనాలు, మార్గాలుగా ఉపయోగపడతాయి.

సంక్షేమ రాజ్యస్థాపనలో నిమగ్నమైన మన దేశంలో నిర్దేశిక నియమాలు.. ప్రభుత్వ శాసనాల రూపకల్పనలో, పరిపాలనా విషయంలో మాత్రమే కాకుండా న్యాయస్థానాల న్యాయ నిర్వహణలోనూ అధిక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి.

ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యం:

ఆదేశిక సూత్రాలను అమలు పర్చాల్సిన బాధ్యత కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఆదేశిక సూత్రాల అమలుకు ప్రభుత్వాలు రూపొందించే చట్టాలు... ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నప్పుడు ఉన్నత న్యాయస్థానాలు న్యాయ సమీక్ష నిర్వహించి ఆ చట్టాలు చెల్లవని ప్రకటిస్తున్నాయి.

- ★ 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంలో మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం 46వ అధికరణను అమలు జరపడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. సమానత్వపు హక్కుకు రిజర్వేషన్లు విరుద్ధమని పేర్కొంటూ చంపకం దొరై రాజన్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ల చట్టం 13వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు విరుద్ధమని తీర్పునిచ్చింది.
- ★ 1950 లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 39(బి), 39 (సి) అధికరణలను అమలు పర్చడంలో భాగంగా భూ సంస్కరణల చట్టాలను రూపొందించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టులు భూ సంస్కరణల చట్టాలను సమర్థించగా... బీహార్,పశ్చిమబెంగాల్ హైకోర్టులు ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాయి. కారణం అప్పట్లో ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుగా ఉండడమే. అంతేకాకుండా దేశంలోని వివిధ హైకోర్టుల్లో వందలాది కేసులు విచారణలో ఉన్నాయి.
- ★ రిజర్వేషన్లు, భూ సంస్కరణల చట్టాల విషయంలో ఉన్నత న్యాయస్థానాలిచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని 1951 లో నెహ్రూ ప్రభుత్వం మొదటి రాజ్యాంగ సవరణను చేసింది. ఈ సవరణ ద్వారా భూ సంస్కరణల చట్టాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. ప్రైవేట్ ఆస్తులను చట్టబద్ధంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ 31(ఎ), 31(బి) అధికరణలను మన రాజ్యాంగంలో పొందుపర్చారు.
- ★ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధతను కల్పిస్తూ 15 (4) అనే అధికరణను కూడా చేర్చారు. మొదటి రాజ్యాంగ సవరణ కూడా ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉందనే కారణంతో శంకరీ ప్రసాద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.
- ★ 1951లో శంకరీ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... మొదటి రాజ్యాంగ సవరణను, తద్వారా రాజ్యాంగంలో చేర్చిన అంశాలను సమర్థించింది. ఈ కేసులో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించింది. 13వ అధికరణ ప్రకారం సాధారణ చట్టాలను మాత్రమే న్యాయ సమీక్షకు గురిచేయొచ్చని, 368 అధికరణ ప్రకారం చేసిన రాజ్యాంగ సవరణలను న్యాయ సమీక్షకు గురిచేసే అవకాశం లేదని పేర్కొంది.
- ★ బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్, కామేశ్వరీ సింగ్ వర్సెస్ బీహార్ మధ్య జరిగిన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు... ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తులను సమాజ ప్రయోజనం కోసం జాతీయం చేసినప్పుడు వారికి నష్టపరిహారం న్యాయబద్ధంగా చెల్లించాలని, అంటే మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో పార్లమెంట్ 4వ రాజ్యాంగ సవరణ చేసింది. వ్యక్తులకు చెల్లించే నష్టపరిహారాన్ని చట్టబద్ధంగా మాత్రమే చెల్లించాలని పేర్కొంది.
- ★ సజ్జన్‌సింగ్ వర్సెస్ రాజస్థాన్ మధ్య జరిగిన వ్యాజ్యంలో కూడా సుప్రీంకోర్టు 1965లో 4వ సవరణను సమర్థించింది. కానీ, 1967లో గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... గత తీర్పులకు భిన్నమైన తీర్పునిచ్చింది. ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ప్రాథమిక హక్కులను సవరించినట్లయితే.. ఆ సదరు సవరణలను కూడా న్యాయసమీక్షకు గురిచేస్తామని కోర్టు పేర్కొంది.
- ★ 1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 బ్యాంకులను జాతీయం చేసిన అంశాన్ని, 1970లో రాజభరణాలను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్స్‌లు కూడా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పులనిచ్చింది. దీంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 24, 25, 26వ రాజ్యాంగ సవరణలను చేపట్టింది.
- ★ 24వ సవరణ ప్రకారం... ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ★ 25వ సవరణ ప్రకారం ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారం అనే పదానికి బదులుగా కొంత మొత్తం చెల్లించాలని, ఈ అంశాన్ని ఏ న్యాయస్థానంలో కూడా సవాల్ చేసే అవకాశం లేదని పేర్కొంటూ 'సి' క్లాజును చేర్చారు.
- ★ 26వ సవరణ ప్రకారం రాజభరణాల రద్దుకు రాజ్యాంగబద్ధతను కల్పించారు.
- ★ పై మూడు రాజ్యాంగ సవరణలను 1973లో కేశవానంద భారతి వర్సెస్ కేరళ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 24వ రాజ్యాంగ సవరణను సమర్థిస్తూ ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం సవరించే అధికారం లేదని పేర్కొంది.
- ★ 25వ సవరణను సమర్థించినప్పటికీ అందులోని సి క్లాజు చెల్లదని తీర్పునిచ్చింది.
- ★ 26వ రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సమర్థించింది.
- ★ 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా పార్లమెంట్ సవరిస్తుందని, అలా సవరించిన అంశాన్ని ఏ న్యాయస్థానం ముందు ప్రశ్నించొద్దని, ఆ అంశాన్ని న్యాయ సమీక్షకు గురిచేసే అధికారం కూడా న్యాయస్థానాలకు లేదని పేర్కొంది.
- ★ 42వ సవరణ ద్వారా చేర్చిన అంశాలను 1980 లో జరిగిన మినర్వా మిల్స్ కేసులో ప్రశ్నించారు. మినర్వామిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ పరస్పరం విరుద్ధమైనవి కావు, భారత ప్రజాస్వామ్యానికి రెండు రథచక్రాల వంటివి, ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆదేశిక సూత్రాలన్నింటికీ కాకుండా 39(బి), 39(సి) అధికరణలకు మాత్రమే న్యాయ సంరక్షణ ఉంటుందని పేర్కొంది. ప్రాథమిక హక్కులు మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని వెల్లడిస్తూ ఆదేశిక సూత్రాలపై ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను చాటి చెప్పింది.
- ★ ఎం.హెచ్. హోస్‌కాట్ వర్సెస్ మహారాష్ట్ర మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఉచిత న్యాయ సేవా సహాయాన్ని అందించడం కూడా ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పునిచ్చింది.
- ★ 1992లో మోహినీజైన్ కేసులో, ఉన్నికృష్ణన్ కేసులో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. ఇందిరాసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య వ్యాజ్యంలో సంక్షేమ స్వభావం కూడా మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.
- ★ ఆదేశిక సూత్రాల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని కూడా సమర్థిస్తూ ఎం.సి.మెహతా కేసులో తాజ్‌మహల్ చుట్టూ కాలుష్యాన్ని వెదజల్లే 18 రకాల పరిశ్రమలను మూసివేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- ★ 2006లో భారత పార్లమెంట్ 93వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని అశోక్‌కుమార్ ఠాకూర్ కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ రూర్కీలో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) రూర్కీ ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం ఖాళీల సంఖ్య: 01.

- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ (మెకానికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.61,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- » **ఈమెయిల్:** pradeep.jha@me.iitr.ac.in
- » **దరఖాస్తులకు చివరితేది:** 12.10.2025.
- » **వెబ్‌సైట్:** https://iitr.ac.in

గెయిల్(ఇండియా) లిమిటెడ్, న్యూఢిల్లీలో చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) తాత్కాలిక ప్రాతిపదికన చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 01.


- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎల్ఎల్‌బీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 52 ఏళ్లకు మించకూడదు.
- » **వేతనం:**నెలకు రూ.1,20,000 నుంచి 2,80,000
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.09.2025
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.10.2025
- » **వెబ్‌సైట్:** https://gailonline.com

ఐఐటీ బీహెచ్‌యూలో జేఆర్ఎఫ్‌లు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).. బెనారస్ హిందూ యూనివర్శిటీ (బీహెచ్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఎంటెక్(ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, జియోఇన్ఫర్మేటిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- » **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రొఫెసర్. రాజేంద్ర ప్రసాద్(ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్), ఫిజిక్స్ విభాగం, ఐఐటీ(బీహెచ్‌యూ), వారణాసి చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2025.
- » **వెబ్‌సైట్:** https://iitbhu.ac.in

రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?



బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వచించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మన దేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపానాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్‌సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమయంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలిగే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు
    2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయోగించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దేపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి
    4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

ఆరోగ్యకరమైన చర్మానికి అవసరమయ్యే విటమిన్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీవ రసాయనాలు

జీవుల్లో మాత్రమే తయారయ్యే రసాయనాలను జీవ రసాయనాలు (Biochemicals) అంటారు. వీటి అంతర చర్యల ద్వారా మాత్రమే జీవి మనుగడ సాధ్యమవుతుంది. ప్రస్తుతం మానవుడు వీటిని కృత్రిమంగా తయారు చేయగలుగుతున్నాడు. పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, కేంద్రకామ్లాలు ముఖ్యమైన జీవ రసాయనాలు.

పిండి పదార్థాలు

పిండి పదార్థాలు(Carbohydrates) జీవులకు ప్రధాన శక్తి వనరులు. ఇవి C, H, D లాంటి పదార్థాలతో నిర్మితమై ఉంటాయి. వీటి ని సాధారణంగా చక్కెరలు (Sugars) అంటా రు. అన్ని చక్కెరలు తియ్యగా ఉండవు. అత్యంత సరళమైన పిండి పదార్థాలు మోనోశాకరైడ్స్.

ఉదా: గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్.

ఈ మూడింటిలోనూ ఆరు కార్బన్లు ($C_6H_{12}O_6$) ఉంటాయి. కాబట్టి వీటిని హెక్సోజ్‌లు అంటారు. రెండు మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా డై శాకరైడ్ తయారవుతుంది.

ఉదా: సుక్రోజ్, లాక్టోజ్, మాల్టోజ్.

సుక్రోజ్ చెరకురసంలో ఉంటుంది. దీన్ని కేన్ షుగర్ అంటారు. దీన్ని Invert Sugar and Table Sugar అని కూడా అంటారు. అనేక మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా లభించేది పాలీశాకరైడ్.

ఉదా: స్టార్చ్, సెల్యులోజ్, గ్లైకోజన్.

సాధారణంగా పాలీశాకరైడ్‌లు తియ్యగా ఉండవు. మోనో, డై శాకరైడ్‌లు తియ్యగా ఉంటాయి.

ప్రోటీన్లు

శరీర అభివృద్ధికి కీలకమైన జీవ రసాయనాలు ప్రోటీన్లు. వీటినే మాంసకృత్తులు అంటారు. ఇవి అమైనో ఆమ్లాలు అనే ప్రమాణాల పాలిమర్లు. అమైనో ఆమ్లాల మధ్య పెప్టైడ్ బంధాలు ఏర్పడటం ద్వారా ప్రోటీన్ తయారవుతుంది. ప్రోటీన్లు మానవ శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తాయి. శరీరంలో అత్యధిక ప్రోటీన్లు ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. శరీరంలో జరిగే రసాయనిక చర్యల్లో ఇవి ఉత్ప్రేరకాలుగా వ్యవహరించి, చర్యలు తక్కువ శక్తి వద్ద వేగంగా జరిగేలా తోడ్పడతాయి. జీర్ణక్రియ, శ్వాసక్రియ, కండర సంకోచం, రక్తస్కంధనం లాంటి శరీర క్రియలన్నీ రసాయనిక చర్యల ద్వారానే సాధ్యమవుతాయి. ఎంజైమ్‌లు ఈ రసాయనిక చర్యలను నిర్వహిస్తూ, శరీర పెరుగుదలకు దోహదపడతాయి.

ఉదా: పెప్సిన్, ట్రిప్సిన్.

కొన్ని ప్రోటీన్లు హార్మోన్‌లుగా కూడా వ్యవహరించి, శరీర జీవక్రియలను నియంత్రిస్తాయి.

ఉదా: పెరుగుదల హార్మోన్.

ఇది పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఇన్సులిన్, గ్లూకగాన్ రెండూ కలిసి రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తాయి. మరికొన్ని ప్రోటీన్లు నిర్మాణ ప్రమాణాలుగా వ్యవహరిస్తాయి.

ఉదా: కెరాటిన్. ఇది గోర్లు, రోమాలు, కొమ్ములు లాంటి నిర్మాణాల్లో ఉంటుంది.



కొవ్వులు

కొవ్వులు శక్తి వనరులుగా, రిజర్వు ఆహారంగా ఉపయోగపడతాయి. సరళ కొవ్వులను ట్రై గ్లిసరైడ్స్ అంటారు. ఒక ట్రై గ్లిసరైడ్‌లో ఒక గ్లిసరాల్ అణువుకు మూడు కొవ్వు ఆమ్లాలు ప్రత్యేక ఎస్టర్ బంధాల ద్వారా బంధితమై ఉంటాయి. అన్ని రకాల వంట నూనెల్లో ఈ ట్రై గ్లిసరైడ్‌లు ఉంటాయి. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్లన్నింటి మధ్య ఏకబంధాలు ఉంటే దాన్ని సంతృప్త(Saturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్ల మధ్య కనీసం ఒక ద్వి బంధం లేదా త్రి బంధం ఉన్నట్లయితే దాన్ని అసంతృప్త (Unsaturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఇలాంటి ద్వి బంధాలు, త్రి బంధాలు ఎక్కువగా ఉంటే దాన్ని Poly Unsaturated Fatty Acids (PUFA) అంటారు. ఇవి ఆరోగ్యానికి, ముఖ్యంగా గుండె పనితీరును మెరుగుపరచడానికి తోడ్పడతాయి. సంక్లిష్ట కొవ్వులకు కొలెస్టరాల్ మంచి ఉదాహరణ. శరీరంలో కొవ్వు నిల్వ ఉన్న కణజాలం అడిపోజ్. స్టీరాయిడ్‌లు, మైనం (Waxes) కూడా కొవ్వు పదార్థాలే.

విటమిన్లు

మానవుడికి పోషణలో కేవలం స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలనే విటమిన్లు అంటారు. ఇవి శక్తి వనరులు కావు. ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని భాగం లేదా దాని ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యల్లో ఎంజైమ్‌లకు దోహదం చేస్తాయి. ఇవి ముఖ్యంగా శక్తి విడుదలయ్యే ప్రక్రియల్లో సహ ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. రసాయనిక స్వభావం ఆధారంగా విటమిన్లను రెండు రకాలుగా విభజిస్తారు. అవి..

1. కొవ్వులో కరిగేవి: A, D, E, K
2. నీటిలో కరిగేవి: బి-కాంప్లెక్స్, C.

ఆరోగ్యకరమైన దృష్టికి విటమిన్ A అవసరం. B_1 (థయామిన్), B_2 (రైబోఫ్లేవిన్), B_3 (నియాసిన్) లాంటివి ప్రధానంగా శక్తి విడుదల ప్రక్రియకు, ప్రోటీన్, పిండి పదార్థం, కొవ్వుల జీవక్రియల్లో అవసరమవుతాయి. B_9 (ఫోలిక్ ఆమ్లం), B_{12} (సయనకోబాలమిన్) విటమిన్లు హిమోగ్లోబిన్ ఏర్పడటానికి, ఎర్ర రక్త కణాల పరిపక్వతకు తోడ్పడతాయి. బలమైన ఎముకలు, దంతాలకు, కాల్షియం, ఫాస్ఫరస్ జీవక్రియ నియంత్రణకు విటమిన్ D అవసరమవుతుంది. ఇది సూర్యరశ్మి నుంచి లభిస్తుంది. విటమిన్ K ఒక అనుబంధ రక్తస్కంధన కారకంగా వ్యవహరిస్తుంది.

విటమిన్	రసాయనిక నామం	దాని లోపం ద్వారా వచ్చే వ్యాధులు
A	రెటినాల్	రేచీకటి, కెరటోమలేసియా, జీరాప్తాల్మియా
D	కాల్సిఫెరాల్	రికెట్స్, ఆస్టియోమలేసియా
E	టోకోఫెరాల్	లోపం అరుదు. పక్షుల్లో వ్యంధ్యత్వం, నవజాత శిశువుల్లో హీమోలైటిక్ అనీమియా
K	ఫిల్లోక్వినోన్/ మినాక్వినోన్	డయాథెసిస్, ఆలస్యంగా రక్తస్కంధనం
B_1	థయామిన్	బెరిబెరి, పాలీ న్యూరిటిస్, వెర్నికె-కోర్సకాఫ్ సిండ్రోమ్
B_2	రైబోఫ్లేవిన్	ఎరైబోఫ్లేవినోసిస్, గ్లాసిటిస్, కీలోసిస్
B_3	నియాసిన్/ నికొటినమైడ్	పెల్లాగ్రా/ 4డి సిండ్రోమ్
B_5	పాంటోథెనిక్ ఆమ్లం	పారెస్తీసియా
B_6	పైరిడాక్సిన్/ పైరిడాక్సామైన్	న్యూరోపతి
B_7	బయోటిన్	డెర్మటైటిస్, ఎంటిరైటిస్
B_9	ఫోలిక్ ఆమ్లం/ ఫొలాసిన్	మెగలోబ్లాస్టిక్ అనీమియా
B_{12}	సయనకోబాలమిన్	పెర్నీసియస్ అనీమియా
C	ఆస్కార్బిక్ ఆమ్లం	స్కర్వీ

ఆరోగ్యకరమైన చర్మానికి, ప్రత్యుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి విటమిన్ E అవసరం. నోటి ఆరోగ్యానికి, బలమైన చిగుళ్లకు విటమిన్ C అవసరం. విటమిన్ E, విటమిన్ C యాంటీ ఆక్సిడెంట్లుగా వ్యవహరిస్తాయి.

కేంద్రకామ్లాలు

కేంద్రకామ్లాలు అనే జీవ రసాయనాలు జన్యు పదార్థంగా వ్యవహరిస్తాయి. ఇవి రెండు రకాలు. 1) డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్ (DNA), 2) రైబో న్యూక్లిక్ యాసిడ్ (RNA). వీటిలో ప్రధాన జన్యు పదార్థం DNA. కేవలం కొన్ని వైరస్‌లలో RNA ప్రధాన జన్యు పదార్థంగా ఉంటుంది. జీవుల లక్షణాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుచుకోవడమే కాకుండా వాటిని కొత్త తరానికి సంక్రమింపజేసే విధులను DNA నిర్వర్తిస్తుంది. DNA, RNA రెండూ న్యూక్లియోటైడ్ అనే ప్రమాణాల పాలిమర్లు.

మాదిరి ప్రశ్నలు

1. చెరకురసం నుంచి ప్రత్యేకంగా తయారుచేసే మత్తు పానీయం?
ఎ) విస్కీ బి) వోడ్కా
సి) రమ్ డి) ఫెన్నీ
2. డీఎన్ఏలో ఏ రకమైన చక్కెర ఉంటుంది?
ఎ) హెక్సోజ్ బి) పెంటోజ్
సి) టెట్రోజ్ డి) ట్రయోజ్
3. సహజ చక్కెరల్లో తియ్యనిది ఏది?
ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
సి) స్టార్చ్ డి) ఫ్రక్టోజ్
4. మధుమేహ రోగుల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే కృత్రిమ తీపి రసాయనం?
ఎ) సుక్రలోజ్ బి) ఆస్పర్టేం
సి) శాకరిన్ డి) అన్నీ
5. ఒక గ్రాము ఆల్కహాల్ ద్వారా ఎన్ని కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది?
ఎ) 4 బి) 7 సి) 9 డి) 12
6. ఖడ్గమృగం కొమ్ముల్లో ప్రధానంగా కన్పించే ప్రోటీన్?
ఎ) కెరాటిన్ బి) సెరిసిన్
సి) ఫైబ్రోమిన్ డి) కొల్లాజెన్
7. కిందివాటిలో ఆవశ్యక అమైనో ఆమ్లం?
ఎ) ఫినైల్ అలనిన్ బి) ఆస్పర్టిక్ ఆమ్లం
సి) గ్లుటమిక్ ఆమ్లం డి) గ్లైసిన్
8. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు ఏ చేపలో లభిస్తాయి?
ఎ) హిల్సా బి) సాల్మన్
సి) మెకరల్ డి) అన్నీ
9. కిందివాటిలో స్యాచురేటెడ్ కొవ్వు ఆమ్లం?
ఎ) పామిటిక్ ఆమ్లం
బి) లినోలిక్ ఆమ్లం
సి) లినోలెనిక్ ఆమ్లం
డి) అరాకిడోనిక్ ఆమ్లం
10. ఆహారంలో ప్రోటీన్ల లోపం వల్ల పిల్లల్లో అభివృద్ధి కుంటుపడటాన్ని ఏమంటారు?
ఎ) మరాస్మస్ బి) క్వాషియోర్కర్
సి) మరుగుజ్జుతనం డి) విల్సన్ డిసీజ్
11. ప్రోటీన్ కర్మాగారాలు ఏవి?
ఎ) మైటోకాండ్రియా బి) లైసోజోమ్‌లు
సి) రైబోజోమ్‌లు డి) గాల్జీ సంక్లిష్టం
12. మనిషి కండరాల్లో అత్యధిక మోతాదులో కన్పించే ప్రోటీన్ ఏది?
ఎ) ఆక్టిన్ బి) మయోసిన్
సి) కొల్లాజెన్ డి) కెరాటిన్
13. బ్రౌన్ ఫ్యాట్ అంటే?
ఎ) రక్త సరఫరా లేని కొవ్వు
బి) రక్త సరఫరా ఉన్న కొవ్వు
సి) కుళ్లుతున్న కొవ్వు
డి) పిండి పదార్థంతో కలిసిన కొవ్వు
14. కిందివాటిలో ఎంజైమ్ కానిది ఏది?
ఎ) పెప్సిన్ బి) టయలిన్
సి) గ్యాస్ట్రిన్ డి) స్టియాప్సిన్
15. ఆంగ్ల అక్షరాల ఆధారంగా విటమిన్లను సంబోధించే విధానాన్ని ప్రవేశపెట్టిందెవరు?
ఎ) కాసిమర్ ఫంక్ బి) జె.సి.డ్రామండ్
సి) జేమ్స్ లిండ్ డి) ఐజక్‌మన్
16. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
ఎ) రెటినాల్ బి) రైబోఫ్లేవిన్
సి) బయోటిన్ డి) నియాసిన్
17. ఏ విటమిన్ లోపం ద్వారా నోటి అంచుల వద్ద పగుళ్లు ఏర్పడే కీలోసిస్ అనే వ్యాధి వస్తుంది?
ఎ) B_1 బి) B_2 సి) B_3 డి) B_5

సమాధానాలు

1) సి 2) బి 3) డి 4) డి 5) బి
6) ఎ 7) ఎ 8) డి 9) ఎ 10) బి
11) సి 12) బి 13) ఎ 14) సి 15) బి
16) బి 17) బి.

How many steps will be...

BANK EXAMS

REASONING

INPUT-OUTPUT

In Input-Output problems an aspirant is asked to imagine a kind of computer or a word processing machine which performs some operations repeatedly on a given input as per a pre-fixed manner and subsequently different output are given in different steps.

Arrangement: The words or the numbers are arranged as per a fixed order.

Generally the order can be alphabetical order incase of words, incre- asing or decreasing order of numbers. Arrangement ends as soon as the desired order is achieved.

In case of arrangement a word that comes alphabetically first (or last) in a dictionary will go to first (or last) place, in the first step. Similarly a word which comes second (or second last) in alphabetical order which go to second (or second last) place and so on.

If the input consists of numbers, the smallest (or largest) number going to the first (or last) place in first step. Similarly the second smallest (or second largest) will go to second (or second last) place in the second step.

Directions (Q.No: 1-5): ***Study the following information carefully and answer the questions given below:***

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and various steps of rearrangement. (All the numbers are two digit numbers).

Input: plan more vacation 35 56 92 nice holiday tours 84 61 12
Step I: 92 plan more vacation 35 56 nice tours 84 61 12 holiday
Step II: 92 84 plan vacation 35 56 nice tours 61 12 more holiday
Step III: 92 84 61 plan vacation 35 56 tours 12 nice more holiday
Step IV: 92 84 61 56 vacation 35 tours 12 plan nice more holiday
Step V: 92 84 61 56 35 vacation 12 tours plan nice more holiday
Step VI: 92 84 61 56 35 12 vacation tours plan nice more holiday

And Step VI is the last step of the rearrangement as the desired arrangement is obtained.

As per the rules followed in the above steps, find out in each of the questions the appropriate step for the given input.

Analysis: On observing the last step it can be concluded that numbers are arranged in the descending order from left end and the words are arranged in the alphabetical order from the right end. The first five steps reveal that one number and one word are arranged in the respective order in each step. Each time the remaining numbers are pushed to the right.

Questions:

Input: hard work pays 96 42 in 79 long run 18 25 57

1. Which step number is the following output?
96 79 57 42 work run 18 25 pays long in hard
1) Step II 2) Step III
3) Step IV 4) Step V
5) There is no such step
A: 3
As four numbers 96, 79, 57 and 42 are arranged in descending order from left and four words viz. hard, in, long and pays are arranged in alphabetical order from right end, it can be established that the given step is the fourth step of the arrangement.

2. How many elements (words/ numbers) are there between "work" and "in" as they appear in Step III?
1) Six 2) Five
3) Seven 4) Four
5) Three
A: 1
In the III step the elements 96, 79 and 57 will take the first three positions and the word 'work' will take the fourth position from the left end. Similarly the word 'in' will occupy the second position from right end (i.e. eleventh position from the left end). Therefore there are 11- 4- 1 = 6 elements (words/numbers) between 'work' and 'in'.



3. Which of the following represents the positions of "pays" in the Step II?
1) Seventh from right
2) Sixth from left
3) Eighth from right
4) Fourth from left
5) Fifth from left
A: 4
In II step 96 and 79 will occupy the first and second positions respectively followed by the words 'work' and 'pays' in the next two positions. Therefore the word 'pays' represents the fourth position from the left end in step II.

4. Which word/ number would be at the seventh position from the right in the Step IV?
1) work 2) run
3) long 4) 18
5) 25
A: 2
In Q. No. 1, the IV step is given. It can be seen that the word 'run' takes seventh position from the right end.

5. Which word/number would be third to the left of the fourth element from the right in the Step III?
1) pays 2) 42
3) run 4) 18
5) work
A: 2;
The element third to the left of fourth element from the right will be 4+3=7th element from the right.Therefore the same element will occupy13–7=6th position from the left end. In step III 96, 79 and 57 will occupy the first three positions followed by 'work', 'pays' and 42 in the subsequent three positions. Therefore the number 42 will take the sixth position from the left end in step III.

Directions (Q.No: 6-10): ***Study the given information and answer the following questions:***

When a word and number arrangement machine is given an input line of words and numbers, it arranges them following a particular rule. The following is an illustration of input and rearrangement. (All the numbers are two digit numbers).

Input: 40 made butter 23 37 cookies salt extra 52 86 92 fell now 19
Step I: butter 19 40 made 23 37 cookies salt extra 52 86 92 fell now
Step II: cookies 23 butter 19 40 made 37 salt extra 52 86 92 fell now
Step III: extra 37 cookies 23 butter 19 40 made salt 52 86 92 fell now
Step IV: fell 40 extra 37 cookies 23 butter 19 made salt 52 86 92 now
Step V: made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 86 92 now
Step VI: now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 92
Step VII: salt 92 now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19

Step VII is the last step of the above arrangement as the intended arrangement is obtained. As per the rules followed in the given steps, find out the appropriate steps for the given input.

Analysis: It is observed from the last step, numbers and words are arranged alternately, words in the reverse dictionary order and numbers in the descending order from the left end or the words in the dictionary order and the numbers in the ascending order from the right end. From the first six steps it can be concluded that every time a word and a number are arranged in dictionary order and ascending order respectively from the left end but they are pushed to right in the subsequent steps.

Questions:

Input: 32 proud girl beautiful 48 55 97 rich family 61 72 17 nice life

6. How many steps will be requi- red to complete the given input?
1) Five 2) Six
3) Seven 4) Eight
5) Nine
A: 3
There are fourteen elements in the given input. In each step a word and a number (two elements) are arranged in the respective order, it will take 14 by 2 i.e. 7 steps to complete the arrangement.

7. Which of the following is the third element from the left end of Step VI?
1) beautiful 2) life
3) 61 4) nice
5) 17
A: 4
In V step, the word 'nice' will take the first position and the number 61 will take the second position. In the subsequent VI step they are pushed towards right taking third and fourth positions respectively. Therefore the word 'nice' will take the third position from the left end in the VI step.

8. Which of the following is Step III of the given input?
1) proud 72 girl 48 family 32 beautiful 17 55 97 rich 61 nice life
2) life 55 girl 48 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
3) girl 48 family 32 beautiful 17 proud 55 97 rich 61 72 nice life
4) family 32 beautiful 17 proud girl 48 55 97 rich 61 72 nice life
5) girl 48 life 55 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
A: 3
In III step, the word 'girl' will take the first position and the number 48 will take the second position. Since the word 'family' and the number 32 take the first and second positions in the previous step, will occupy the third and fourth positions respectively in Step III. Only option 3 will satisfy the above two conditions.

9. What is the position of nice from the left end in the final step?
1) Fifth 2) Sixth
3) Seventh 4) Eighth
5) Ninth
A: 1
The word 'nice' takes the first position in Step V and in each of subsequent VI and VII steps two elements precede this word. Therefore a total of four elements precede the word 'nice' that means the word 'nice' will take the fifth position from the left end in the final step.

10. Which element is third to the right of 'family' in Step V?
1) beautiful 2) 17
3) proud 4) 97
5) 32
A: 2
In step II the word 'family' takes the first position, the number 32 the second position, the word 'beautiful' the third position and the number 17 the fourth position from the left end. In every subsequent steps the elements 'family 32 beautiful 17' will be pushed to the right with no element coming in between them. Therefore the element third to the right of 'family' will be 17 in each of the steps from II to VI.